

'రాష్ట్రాన్ని, దేశానికే అన్నం పెట్టే అన్నపూర్ణగా తీర్చిదిద్దాలనేది నా స్వప్నం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 15 సంచిక: 325

బుధవారం 15-2-2023



ఎన్ఆర్ఐ భర్తల మోసం చెల్లదు

ఎన్ఆర్ఐ బాధిత మహిళలకు న్యాయం జరిగేలా చేస్తోంది సత్వీందర్ కౌర్ -11లో



సెన్సెక్స్ లాభం 600 పాయింట్లు

రెండు రోజుల నష్టాలకు చెక్.. 17,900 పైకి నిఫ్టీ -13లో

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



బాల్యం.. శిథిలం

తుర్కియే, సిరియాలో సంభవించిన భూకంపం.. 70 లక్షల మంది బాలలపై ప్రభావం చూపనుంది.

- వివరాలు 6లో ▶



మిషిగన్ వర్సిటీలో కాల్పులు

అమెరికాలోని మిషిగన్ స్టేట్ యూనివర్సిటీలో సోమవారం రాత్రి జరిగిన కాల్పుల్లో ముగ్గురు మరణించారు.


- వివరాలు 6లో ▶



రిపబ్లికన్ అభ్యర్థిత్వ బరిలో నిక్కీ

భారతీయ మూలాలున్న నిక్కీ హేలీ అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ తరఫున అధ్యక్ష అభ్యర్థిత్వ పోటీలో నిలిచారు.

- వివరాలు 6లో ▶



హత్యచేసి రిఫ్రిజిరేటర్‌లో దాచేసి..

తనను ప్రేమించి మరో యువతిని ఎందుకు పెళ్లాడుతున్నావని నిలదీసిన ప్రేమికురాలిని చంపి.. ఫ్రిజ్‌లో దాచాడో దుర్మార్గుడు.

- వివరాలు 6లో ▶

న్యూస్‌రీల్

నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్



బుధవారం నుంచి ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు జరగనున్నాయి. గతంలో మాదిరి ప్రైవేటు కాలేజీలతో లావాదేవీలు జరిపితే సహించేది లేదని ఇంటర్ విద్య కమిషనర్ నవీన్ మిత్తల్ హెచ్చరించారు. రాష్ట్ర వ్యాప్తంగా 3,65,931 మంది విద్యార్థులు హాజరవుతున్నారు.

- వివరాలు 14లో ▶

అజహర్ ఆట ముగిసింది..



హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్(హెచ్‌సీఏ) అధ్యక్షుడుగా అజహరుద్దీన్ తప్పుకోనున్నారు. అజహర్ అధికారాలను సుప్రీంకోర్టు తొలగించింది.హెచ్‌సీఏ రోజువారీ కార్యకలాపాల పర్యవేక్షణ, ఎన్నికల నిర్వహణకు కొత్తగా ఏక సభ్యకమిటీని ఎంపిక చేసింది.

- వివరాలు 12లో ▶

'హంగ్' కలకలం


అసెంబ్లీ ఎన్నికలపై కోమటిరెడ్డి వెంకటరెడ్డి వ్యాఖ్యలతో సరికొత్త చర్చ

- రాష్ట్రంలో ఏ పార్టీకీ మెజార్టీ రాదన్న కోమటిరెడ్డి వెంకటరెడ్డి
- ఎన్నికల అనంతరం కాంగ్రెస్, బీఆర్ఎస్ కలుస్తాయని వ్యాఖ్య
- దీనిని రాజకీయ అస్త్రంగా వాడుకునేందుకు బీజేపీ యత్నం
- అధికారికంగా స్పందించకున్నా బీఆర్ఎస్‌లోనూ లోతుగా చర్చ
- కోమటిరెడ్డి వ్యాఖ్యలపై కాంగ్రెస్‌లో మరోమారు 'రచ్చ'
- తీవ్రంగా ఖండించిన పలువురు నేతలు.. పార్టీ కేడర్ మనోస్థైర్యం దెబ్బతీయొద్దంటూ హితవు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై కాంగ్రెస్ ఫైర్ బ్రాండ్, ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి సరికొత్త చర్చకు తెరలేపారు. ఎన్నికల్లో 'హంగ్' వస్తుందని.. ఫలితాల తర్వాత కాంగ్రెస్, బీఆర్ఎస్ కలుస్తాయని ఢిల్లీ వేదికగా ఆయన చేసిన వ్యాఖ్యలు కలకలం రేపాయి. అసలే ఊపుమీద ఉన్న బీజేపీ ఈ వ్యాఖ్యలను రాజకీయ అస్త్రంగా వాడుకుని విమర్శలకు దిగింది. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ వెంటనే అందుకుని.. కాంగ్రెస్–బీఆర్ఎస్ ఒక్కటేనని, పోరాడుతున్నట్టుగా నాటకాలు ఆడుతున్నాయని తాము ముందు నుంచే చెప్తున్నామని చెప్పుకొచ్చారు. ఇదే సమయంలో కాంగ్రెస్ పార్టీలో మరోమారు రచ్చ మొదలైంది. బీఆర్ఎస్‌తో పొత్తు ప్రసక్తే లేదని పార్టీ నేతలు వరుసగా ప్రకటనలు చేయాల్సి వచ్చింది. మరోవైపు బీఆర్ఎస్ నుంచి అధికారికంగా ఎలాంటి స్పందన రాకున్నా.. ఆ పార్టీ కేడర్‌లో జోరుగా చర్చలు జరుగుతున్నాయి. కాంగ్రెస్ పాలనను మెచ్చుకుంటూ, ప్రధాని మోదీ పాలనను తూర్పారబడుతూ అసెంబ్లీ వేదికగా గణాంకాలతో సహా సీఎం కేసీఆర్ ప్రసంగించిన అంశం ప్రస్తావనకు వస్తోంది. మొత్తంగా 'హంగ్, పొత్తు'ల అంశం ఏ పరిణామాలకు దారితీస్తుందన్నది ఆసక్తిగా మారింది.

'హంగు'.. కాంగ్రెస్ 'కంగు'!

ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేసిన హంగ్ వ్యాఖ్యలతో కాంగ్రెస్ పార్టీ శిబిరం ఒక్కసారిగా కంగుతిన్నది. ఈ నెల ఆరో తేదీ నుంచి హాథ్ సే హాథ్ జోడో పేరుతో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి జోరుగా పాదయాత్రలు చేస్తున్నారు. ఈ యాత్రలతో రాష్ట్రంలో కాంగ్రెస్ గ్రాఫ్ పెరుగుతోందనే అంచనాలో రాష్ట్ర కాంగ్రెస్ నేతలు ఉన్నారు. రేవంత్ యాత్రలో సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్కతోపాటు సీనియర్ నేత వీహెచ్, మరికొందరు కూడా పాల్గొంటుండటంతో కాంగ్రెస్ శ్రేణుల్లో కాస్త ఉత్సాహం కనిపిస్తోంది. అంతా సవ్యంగా సాగుతోందని అనుకుంటున్న వేళ ఒక్కసారిగా వెంకటరెడ్డి చేసిన హంగ్ వ్యాఖ్యలతో ఆ పార్టీలో కలవరం మొదలైంది. తాము అధికారంలోకి రాలేమని పార్టీ ఎంపీ, సీనియర్ నాయకుడే చెప్పడాన్ని మిగతా 2వ పేజీలో ▶



పొత్తుల్లేవ్.. అవగాహనే!

ఒంటరిగానే అసెంబ్లీ ఎన్నికల బరిలోకి బీఆర్ఎస్

పెద్దల సభలోనే 'లెఫ్ట్ మిత్రులకు' చాన్స్ ఇవ్వాలని కేసీఆర్ యోచన

- పనితీరు ఆధారంగానే సిట్టింగ్ ఎమ్మెల్యేలకు టికెట్లు
- సర్వేలు, నివేదికల ద్వారా గెలుపు గుర్రాల గుర్తింపు
- అవసరమైనచోట ఎంపీలు, ఎమ్మెల్సీలకూ అవకాశం
- యువత, నాన్ రెసిడెంట్ ఓటర్లపై కసరత్తు
- పట్టణ ప్రాంతాల్లో కొత్తగా నమోదైన ఓటర్లపై ఆరా



సాక్షి, హైదరాబాద్: భారత్ రాష్ట్ర సమితి కార్యకలాపాలను జాతీయ స్థాయిలో విస్తరించడంపై దృష్టి సారించిన ఆ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు.. ఈ ఏడాది చివరలో జరిగే రాష్ట్ర శాసనసభ ఎన్నికలపై ప్రత్యేక కసరత్తు చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో హ్యాట్రిక్ విజయంతో మూడోసారి అధికారంలోకి వచ్చేందుకు అవసరమైన ఎత్తుగడలకు పదును పెడుతున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఉభయ కమ్యూనిస్టు పార్టీలతో బీఆర్ఎస్ పొత్తు కుదుర్చుకుని, పోటీ చేస్తుందనే వార్తల నేపథ్యంలో.. సీఎం కేసీఆర్ మాత్రం ఒంటరిగానే ఎన్నికల బరిలోకి దిగాలని భావిస్తున్నట్టు తెలిసింది. గత ఏడాది జరిగిన మునుగోడు ఉప ఎన్నికలో సీపీఎం, సీపీఐ మద్దతు తీసుకున్న తరహాలోనే.. ఈ ఏడాది చివరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఆ రెండు పార్టీలతో అవగాహనతో ముందుకు వెళ్లాలనే ఆలోచనలో ఉన్నట్టు తెలిసింది. ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం జిల్లాలతోపాటు మరికొన్ని అసెంబ్లీ సెగ్మెంట్లలో రెండు కమ్యూనిస్టు పార్టీలకు ఉన్న సంప్రదాయ ఓట్లు.. వచ్చే ఎన్నికల్లో కీలకంగా మారుతాయని భావిస్తున్నట్టు సమాచారం.

లెఫ్ట్ పార్టీలు సీట్లు కోరుతాయనే ప్రచారమున్నా..

సీపీఐ, సీపీఎం పార్టీలు పొత్తులో భాగంగా కనీసం రెండేసి అసెంబ్లీ స్థానాలను కోరే అవకాశం ఉందనే ప్రచారం జరుగుతోంది. కానీ తెలంగాణ ఏర్పాటు తర్వాత జరిగిన 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఒంటరిగానే బరిలోకి దిగిన బీఆర్ఎస్ (గతంలో టీఆర్ఎస్).. మూడోసారి కూడా ఒంటరిగానే మిగతా 5వ పేజీలో ▶

ఒంటరి పోరాటమా? ప్రత్యామ్నాయ మార్గమా?

బీఆర్ఎస్ సీట్లు ఇవ్వకుంటే ఏంచేద్దాం? సీపీఐ, సీపీఎం తర్జనభర్జన

- వివరాలు 5లో ▶



'పోలీస్' అభ్యర్థులకు నేటి నుంచి

దేహదారుఢ్య పరీక్షలు

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్, సైబరాబాద్, వరంగల్, కరీంనగర్, మహబూబ్‌నగర్, నల్లగొండ, ఆదిలాబాద్‌లో ఫిజికల్ ఈవెంట్స్ నిర్వహించనున్నారు. బుధవారం నుంచి మొత్తం పది పనిదినాల్లో వీటిని పూర్తి చేసేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. ముందస్తుగా ఆన్‌లైన్ ద్వారా పార్ట్–2 దరఖాస్తును నింపిన అర్హులైన అభ్యర్థులకు మాత్రమే దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించనున్నారు. వ్యక్తిగతంగా అభ్యర్థనలు రాసి తెచ్చే వారిని ఫిజికల్ ఈవెంట్స్‌కు అనుమతించబోమని బోర్డు అధికారులు ఇప్పటికే స్పష్టం చేశారు.

టీచర్ల బదిలీలపై స్టే



- తదుపరి ఆదేశాలిచ్చే వరకు అమల్లో..
- హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు
- విచారణ మార్చి 14కు వాయిదా
- సర్కారు జీవో రద్దు కోరుతూ ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించిన కొందరు ఉపాధ్యాయులు
- సంఘాలకు, స్పౌజ్ కేటగిరీకి పాయింట్లు ఇవ్వకుండా బదిలీలు చేపట్టాలని విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఉపాధ్యాయ బదిలీలపై హైకోర్టు స్టే విధించింది. తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు ఈ మధ్యంతర ఉత్తర్వులు అమల్లో ఉంటాయని స్పష్టం చేసింది. విచారణను మార్చి 14కు వాయిదా వేసింది. బదిలీలకు సంబంధించి వారం క్రితం ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 9 చట్ట వ్యతిరేకమని, రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంటూ రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం ఫోల్ కట్టకు చెందిన సక్కుబాయితో పాటు మరికొందరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పాఠశాల విద్యా శాఖ కార్యదర్శి జారీ చేసిన జీవోను కొట్టివేయాలని విజ్ఞప్తి చేశారు. లేదా.. ప్రత్యామ్నాయంగా టీచర్స్ అసోసియేషన్ ఆఫీస్ బేరర్లకు, జీవిత భాగస్వామి కేటగిరీ కింద కొందరికి ఎలాంటి అదనపు పాయింట్లు ఇవ్వకుండా బదిలీలను చేపట్టేలా ప్రతివాదులను ఆదేశించాలని కోరారు. ప్రతివాదులుగా పాఠశాల విద్యా శాఖ కార్యదర్శి, పాఠశాల విద్యా శాఖ కమిషనర్, డైరెక్టర్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో పాటు పీఆర్‌టీయూ, టీఎస్‌యూటీఎఫ్ సంఘాలను చేర్చారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫున పీవీ కృష్ణయ్య వాదనలు వినిపించారు. జీవోలో పేర్కొన్న తెలంగాణ టీచర్స్ రూల్స్ 2023 ప్రకారం బదిలీలు చేపట్టాలంటే వాటికి అసెంబ్లీ ఆమోదం అవసరమని చెప్పారు. ఆర్టికల్ 309 ప్రకారం చేయాలన్నా గవర్నర్ ఆమోదించాల్సి ఉంటుందని వెల్లడించారు. ఎలాంటి ఆమోదం లేకుండా నేరుగా ప్రభుత్వం జీవోలు విడుదల చేయడం చట్టవిరుద్ధమని నివేదించారు. ఉపాధ్యాయ సంఘాలకు, స్పౌజ్ కేటగిరీకి అదనపు పాయింట్లు ఇవ్వకుండా బదిలీలు చేపట్టేలా ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. వాదనలు విన్న ధర్మాసనం.. పిటిషనర్ల వాదనను పరిగణనలో తీసుకుని బదిలీలపై స్టే ఇస్తూ, విచారణను వాయిదా వేసింది.



జాగా ఉంటే నిధులు ..లేదంటే స్థలం!

- పేదల ఇళ్ల కోసం సర్కారు కసరత్తు
- త్వరలో సీఎం స్థాయిలో భేటీ.. విధివిధానాలు ఖరారు
- 'డబుల్ బెడ్ రూమ్'పై గందరగోళంతో నిర్ణయం!

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పేదలకు ఇంటి వసతి కల్పించేందుకు ప్రభుత్వం భారీ ప్రణాళికను సిద్ధం చేస్తోంది. సొంత జాగా ఉన్నవారితో పాటు లేని పేదలకు కూడా గృహ వసతి కల్పించే అంశంపై కసరత్తు ప్రారంభించింది. సొంత జాగా ఉంటే ఇళ్ల నిర్మాణానికి నిధులు, భూమి లేని వారికి నిర్ధారిత పరిమాణంలో స్థలాల కేటాయింపు దిశగా ఆలోచన చేస్తోంది. దీనిపై త్వరలోనే ముఖ్యమంత్రి స్థాయిలో సమావేశమై విధివిధానాలను ఖరారు చేయనున్నారు. సొంత జాగా ఉన్న వారికి రూ.3 లక్షల ఆర్థిక సాయం అందించటం ద్వారా వారే ఇళ్లను నిర్మించుకునే పథకానికి గతేడాది బడ్జెట్‌లో శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. అయితే విధివిధానాలు ఖరారు చేయకపోవటంతో ఆ బడ్జెట్ కాలంలో నిధులు విడుదల చేయలేదు. తాజా బడ్జెట్‌లో 4 లక్షల ఇళ్లను మళ్లీ ప్రతిపాదించారు.

ఎమ్మెల్యేల ఒత్తిడి నేపథ్యంలో..

దేశంలో మరే రాష్ట్రంలో లేనివిధంగా తెలంగాణ ప్రభుత్వం పేదలు నయా పైసా చెల్లించాల్సిన అవసరం లేకుండా డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను నిర్మించి ఇచ్చే పథకాన్ని అమలు చేస్తున్న విషయం తెలిసిందే. ఆ పథకం రూపురేఖలు గొప్పగా ఉన్నప్పటికీ, ముందుకు సాగని పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇళ్ల కోసం ఎదురుచూస్తున్న వారు లక్షల్లో ఉండగా, ఈ ఇళ్లు తక్కువ సంఖ్యలో ఉండటంతో ఒకరికి ఇస్తే వంద మంది గొడవకు దిగే పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలోనే ఈ పథకం ద్వారా ప్రభుత్వానికి ఆశించిన ప్రయోజనం లభించడం లేదని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు చాలామంది ప్రభుత్వం దృష్టికి తెస్తున్నారు. పేదల ఇళ్ల విషయంలో వెంటనే దిద్దుబాటు అవసరమంటూ ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో పలువురు ఎమ్మెల్యేలు మంత్రులు కేటీఆర్, హరీశ్‌లకు వివరించారు. దీంతో దీనిపై ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ఇందుకోసం మిగతా 3వ పేజీలో ▶

'డబుల్ బెడ్' డీలా..

పేదల కోసం 2.92 లక్షల రెండు పడకల గదుల ఇళ్లను నిర్మించాలని ప్రభుత్వం భావించినా కేవలం 2.28 లక్షల ఇళ్లకే టెండర్లు ఖరారయ్యాయి. వాటిల్లో ఇప్పటివరకు పూర్తయినవి కేవలం 1.37 లక్షల ఇళ్లే. అందులోనూ గృహప్రవేశాలు జరుపుకొన్నవి కేవలం 36 వేలే. మరో 60 వేల ఇళ్లు తుది దశకు చేరుకున్నాయి. వెరసి ప్రస్తుతం పంపకానికి 1.60 లక్షల ఇళ్లు సిద్ధంగా ఉంటే.. ఇటీవల ఇళ్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తే లక్షల్లో వచ్చిపడ్డాయి. వాటిని క్లియర్ చేయడం డబుల్ బెడ్ రూమ్ పథకంతో అసాధ్యమన్న అభిప్రాయానికి ప్రభుత్వం వచ్చింది. ఈ నేపథ్యంలోనే సొంత జాగా ఉన్న వారికి రూ.3 లక్షలు అందించి, వారే ఇళ్లు నిర్మించుకునేలా పథకంలో మార్పులు చేసింది.



సేంద్రియ సాగు 'డబుల్'

- మూడేళ్లలో తెలంగాణలో భారీగా పెరిగిన సేంద్రియ వ్యవసాయం
- 2019లో 56 వేల ఎకరాలు... 2020–21లో 1.32 లక్షలు
- దేశంలో 12వ స్థానంలో తెలంగాణ: కేంద్ర వ్యవసాయ శాఖ వెల్లడి




5లో

విద్యుత్ వినియోగదారులపై సర్దు'బాదుడు'

ఏప్రిల్ 1 నుంచే అమల్లోకి ఇంధన సర్దుబాటు చార్జీలు

- జూలై నుంచి ప్రజలపై భారం
- 12న అసెంబ్లీలో గెజిట్ ప్రకటన ప్రవేశపెట్టిన సర్కారు
- కేంద్రం ఆదేశాలతో వసూలుకు గత నెలలో ఈఆర్సీ అనుమతి
- యూనిట్‌పై 30పైసల వరకు వసూలు
- మోతమోగనున్న విద్యుత్ బిల్లులు

సాక్షి, హైదరాబాద్: విద్యుత్ వినియోగదారుల నుంచి ఇంధన సర్దుబాటు చార్జీల (ఎఫ్ఎస్ఏ)ను వసూలు చేసేందుకు రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లు కసరత్తు ప్రారంభించాయి. ఏప్రిల్ ఒకటి నుంచి ఎఫ్ఎస్ఏ చార్జీలు అమల్లోకి రానుండగా వినియోగదారులపై మాత్రం జూలైలో అందుకొనే బిల్లుల్లో ఈ చార్జీల ప్రభావం కనిపించనుంది. ఒక నిర్దిష్ట నెలకు సంబంధించిన ఎఫ్ఎస్ఏ చార్జీలను ఆ తర్వాతి మూడో నెలలో వసూలు చేయాల్సి ఉండటమే మిగతా 2వ పేజీలో ▶



'ఎయిర్ ఇండియా'కు 470 కొత్త విమానాలు

ఎయిర్‌బస్, బోయింగ్ నుంచి కొనుగోలు



- టాటా గ్రూప్ ఆధ్వర్యంలోని ఎయిర్ ఇండియా సంస్థ ఫ్రాన్స్‌కు చెందిన ప్రఖ్యాత ఎయిర్‌బస్ సంస్థ నుంచి 250, బోయింగ్ నుంచి 220 కొత్త విమానాలను కొనుగోలు చేయనుంది. ఈ విమానాలను కొనడానికి లెటర్ ఆఫ్ ఇంటెంట్‌పై సంతకాలు చేశామని 'టాటా సన్స్' చైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ చెప్పారు. కాగా, ఈ ఒప్పందంపై ప్రధాని నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఇది చరిత్రాత్మక ఒప్పందమని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ అభివర్ణించారు. బ్రిటన్ ఏరోస్పేస్ రంగంలో ఇది కీలక ఘట్టమని బ్రిటన్ ప్రధాని అన్నారు.

- వివరాలు 6లో ▶

బీబీసీపై ఐటీ 'సర్వే'

ఢిల్లీ, ముంబై ఆఫీసుల్లో సోదాలు



- బీబీసీ–మోదీ డాక్యుమెంటరీ వివాదం కొత్త మలుపు తిరిగింది. పన్ను ఎగవేత ఆరోపణలపై దర్యాప్తులో భాగంగా ఢిల్లీ, ముంబైల్లోని బీబీసీ కార్యాలయాల్లో ఆదాయ పన్ను శాఖ మంగళవారం 'సర్వే' జరిపింది! అయితే ఇవి దాడులు కావని, బీబీసీ సబ్సిడరీ కంపెనీలకు చెందిన అంతర్జాతీయ పన్ను విధానాలు తదితరాలకు సంబంధించిన సర్వే మాత్రమేనని అధికార వర్గాలు పేర్కొన్నాయి. కాగా దాడులపై ఎడిటర్స్ గిల్డ్ ఆందోళన వ్యక్తం చేసింది. బీబీసీ కార్యాలయాల్లో ఐటీ సర్వేలను కాంగ్రెస్ ఖండించగా, బీబీసీ, కాంగ్రెస్ కుమ్మక్కయ్యాయని బీజేపీ ఆరోపించింది.

- వివరాలు 6లో ▶

అదానీపై దాచేది ఏమీ లేదు: అమిత్ షా

కేసు సుప్రీం పరిధిలో ఉందని వ్యాఖ్య..



- పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ ఆస్తులకు సంబంధించి హిండెన్‌బర్గ్ నివేదిక రాజకీయంగా ప్రకంపనలు సృష్టిస్తున్న నేపథ్యంలో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా తొలిసారిగా పెదవి విప్పారు. అదానీ అంశంలో తాము భయపడుతున్నది కానీ, దాస్తున్నది కానీ ఏమీ లేదని అన్నారు. అదానీ వ్యవహారం సుప్రీంకోర్టు పరిధిలో ఉండడంతో ఒక కేంద్ర మంత్రిగా ఇప్పుడు తానేమీ మాట్లాడకూడదని అన్నారు. క్రోనీ కేపిటలిజాన్ని బీజేపీ ప్రోత్సహిస్తోందని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ చేస్తున్న ఆరోపణల్ని అమిత్ షా కొట్టిపారేశారు.

- వివరాలు 6లో ▶

క్లుప్తంగా...

హంగ్ ఊసే ఉండదు బీజేపీకి అధికారం ఖాయం



సాక్షి, హైదరాబాద్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో హంగ్ ప్రస్తావనే రాదని బీజేపీ పార్లమెంటరీ బోర్డ్ సభ్యుడు కె. లక్ష్మణ్ స్పష్టం చేశారు. రాష్ట్రంలో రాజకీయంగా శక్తివంతంగా తయారైన బీజేపీని ఎదుర్కోలేక కాంగ్రెస్, బీఆర్ఎస్ పొత్తులు కుదుర్చుకునేందుకు ఎదురు చూస్తున్నాయన్నారు. ఇప్పటికే ఈ పార్టీల మధ్య లోపాయికారీ ఒప్పందం ఉందని.. ముందైనా, తర్వాతైనా ఆ రెండు పార్టీలు కలుస్తాయని జోస్యం చెప్పారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో లక్ష్మణ్ మీడియాతో మాట్లాడారు. పొత్తులు, పోటీలపై ఎవరు ఎన్ని ప్రయత్నాలు చేసినా తెలంగాణలో బీజేపీ సింగిల్‌గానే పోటీ చేసి అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ విషయంలో ప్రజలు ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చేశారని లక్ష్మణ్ అభిప్రాయపడ్డారు. దేశ వ్యాప్తంగా విపక్షాలు ఏకమైనా కేంద్రంలో మూడోసారి బీజేపీ గెలుపును, మోదీ ప్రధాని కాకుండా ఆపలేవని ఆయన పేర్కొన్నారు.

బీఆర్ఎస్-కాంగ్రెస్ పొత్తు ఖాయం: డీకే అరుణ



సాక్షి, హైదరాబాద్: వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల పొత్తు ఖాయమని తాము చెబుతున్నది నిజమని రూఢీ చేసేలా కాంగ్రెస్ నేత ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి వ్యాఖ్యలున్నాయని బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ పేర్కొన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పొత్తు పెట్టుకుంటాయన్న బీజేపీ వాదన నిజమని ఇవాళ మరోసారి తేలిపోయిందని ఆమె మంగళవారం ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. తెలంగాణలో బలోపేతమవుతున్న బీజేపీని దెబ్బతీయాలన్న ఎజెండాతో బీఆర్ఎస్, కాంగ్రెస్ కలి సి పని చేస్తున్నాయని ఆరోపించారు. ఇటీవలి అసెంబ్లీ సమావేశాల్లోనూ కాంగ్రెస్ పార్టీపై కేసీఆర్ ప్రశంసలు కురిపించారని గుర్తుచేశారు.

'కోమటిరెడ్డిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి '



భద్రాచలం: కాంగ్రెస్ కార్యకర్తలను అయోమయానికి గురి చేయడమే కాక ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ ఆదేశాలను ధిక్కరిస్తూ పార్టీకి నష్టం జరిగేలా వ్యాఖ్యలు చేస్తున్న ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని మాజీ ఎంపీలు మల్లు రవి, పి.బలరాంనాయక్, సురేశ్ శెట్కార్, సిరిసిల్ల రాజయ్య డిమాండ్ చేశారు. భద్రాచలంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం వారు మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొందని, పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి చేపట్టిన యాత్రకు జనం పెద్దసంఖ్యలో రావడమే ఇందుకు నిదర్శనమని అన్నారు. ఈ తరుణంలో కోమటిరెడ్డి చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీకి తీరని నష్టం కలగజేసే అవకాశముందని పేర్కొన్నారు. బీజేపీకి అనుకూలంగా వెంకట్‌రెడ్డి వ్యవహరిస్తున్నట్లు అనుమానం ఉందని, మునుగోడు ఉపఎన్నిక సమయంలో కూడా ఆయన బీజేపీకి అనుకూలంగా మాట్లాడారని గుర్తుచేశారు.

మాజీ ఎమ్మెల్యే అనిల్‌కు షోకాజ్

సాక్షి, హైదరాబాద్: మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్‌కు కాంగ్రెస్ పార్టీ షోకాజ్ నోటీసు జారీ చేసింది. రెండు నెలల క్రితం టీపీసీసీ మాజీ అధ్యక్షుడు, ఎంపీ ఉత్తమ్, మరికొందరు నేతలనుద్దేశించి ఆయన చేసిన వ్యాఖ్యలపై ఈ నోటీసులు జారీ చేశారు. అప్పట్లో ఉత్తమ్‌తో పాటు పలువురు కాంగ్రెస్‌లో కోవర్టులుగా పనిచేస్తూ పార్టీకి నష్టం కలిగిస్తున్నారని అనిల్ ఆరోపించారు. ఈ వ్యాఖ్యలు పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించడమేనని.. ఐదు రోజుల్లో సమాధానం ఇవ్వాలని టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ జి.చిన్నారెడ్డి ఈనెల ఏడో తేదీన జారీ చేసిన నోటీసుల్లో ఆదేశించారు.

ఎంత చదివినా అర్థం కావట్లేదని **చిర్రెత్తుకొస్తోందా?**
మీ కలల కొలువు ఉన్నట్టుండి ఊడిందేమిటని **పిచ్చెక్కుతోందా?**
ఆఫీస్‌లో గొడ్డులా చాకిరీ చేసినా బాస్ ఏమాత్రం పట్టించుకోవట్లేదని మనసు **రగులుతోందా?**
ప్రేయసి హ్యాండ్ ఇచ్చిందని తెగ **ఫీలవుతున్నారా?**

అయితే వెంటనే టీవీ, ఫ్రిజ్, వాషింగ్ మెషీన్, గాజు గ్లాసులు, ట్యూబ్‌లైట్ల వంటి వస్తువులను విరగ్గొట్టండి!! ఏమిటీ పిచ్చి సలహా అనుకుంటున్నారా? ప్రపంచవ్యాప్తంగా నడుస్తున్న ట్రెండ్ ఇదే మరి.. అదేమిటో తెలుసుకోవాలంటే ఈ స్టోరీ చదవండి.

కోపం తగ్గించే రేజ్‌రూమ్!

కోపాన్ని చల్లార్చుకొనేందుకు నయా ట్రెండ్ ఇదే | ఆగ్రహావేశాల నుంచి సాంత్వనకు యువత సరికొత్త మార్గం | భారత్‌లోనూ 'చితక్కొట్టే గదులు'.. హైదరాబాద్ సహా పలు నగరాల్లో ఏర్పాటు



సాక్షి, హైదరాబాద్: మనలో ఎవరికైనా ఏదో ఒక సందర్భంలో ఏదైనా విషయంపై పట్టలేని ఆగ్రహావేశాలు, కసి, కోపం వంటివి కలిగే సందర్భాలు ఎదురవుతుంటాయి. అలాంటప్పుడు ఎవరికీ చెప్పుకోలేక, ఏం చేయాలో అర్థంకాక చాలా మంది కుమిలిపోయే పరిస్థితులే ఎక్కువగా ఉంటాయి. అయితే ఇలాంటి కోపం, ఫ్రస్ట్రేషన్‌ను తీర్చుకొనేందుకు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేకంగా అందుబాటులోకి వచ్చిన గదులే రేజ్ రూమ్స్. వీటిని రేజ్ రూమ్స్, బ్రేక్ రూమ్స్, యాంగర్ రూమ్స్, డిస్ట్రక్షన్ రూమ్స్, స్మాష్ రూమ్స్... ఇలా రకరకాల పేర్లతో పిలుస్తున్నారు. ఇలాంటి గదులు ఆవేశంతో రగిలిపోతున్న వారికి సాంత్వన చేకూర్చి శాంతపరుస్తున్నాయి.

అసలేమిటీ రేజ్ రూమ్‌లు...?

కోపం, కసి, ఫ్రస్ట్రేషన్ వంటి వాటితో బాగా ఇబ్బంది పడుతున్న వారిలో కొందరుఏదైనా పగులగొట్టడమో, ధ్వంసం చేయడమో చేస్తే ప్రశాంతత వస్తుందని అనుకోవడం పరిపాటి. ఎలాంటి వస్తువులను ధ్వంసం చేయడం ద్వారా స్థిమిత పడతామని భావిస్తారో అలాంటి వాటిని ఒక గదిలో ఉంచి ధ్వంసం చేయించడమే ఈ రేజ్ రూమ్‌ల ఏర్పాటు ఉద్దేశం. ఈ జాబితాలో హాళ్లలోని వస్తువులు, వంటిగది వస్తువుల నమూనాలు, ఫర్నీచర్, టీవీలు, ల్యాప్‌టాప్‌లు, డెస్క్‌లు, ఫోన్లు మొదలైనవి ఉంటాయి.

ఎప్పుడు మొదలైందీ ట్రెండ్...

2008 ప్రారంభంలో జపాన్, అమెరికాలోని టెక్సాస్‌లలో ఇది మొదలైంది. ముఖ్యంగా జపాన్‌లో 2008లో ఆర్థిక మాంద్య పరిస్థితులు ఏర్పడటంతో ప్రజల్లో పెరిగిన ఒత్తిళ్లు, ఫ్రస్ట్రేషన్‌ను తగ్గించేందుకు ఈ పద్ధతిని కనుగొన్నారు. అమెరికా, జపాన్‌తోపాటు సెర్బియా, యూకే, అర్జెంటీనా వంటి దేశాల్లో వందలాది రేజ్‌రూమ్‌లు ఇప్పటికే ఏర్పాటయ్యాయి.

మన దేశంలోనూ షురూ...

2017లో ఢిల్లీ శివార్లలోని గుర్‌గ్రామ్‌లో 'బ్రేక్‌రూమ్' పేరుతో ప్రారంభం. అదే ఏడాది మధ్యప్రదేశ్ ఇండోర్‌లో 'భద్దాస్'-యాంగర్ రూమ్ అండ్ కేఫ్ ఏర్పాటైంది. తాజాగా ఈ నెలలోనే బెంగళూరులోని బసవనగుడిలో రేజ్‌రూమ్‌ను ఐఐటీ మద్రాస్ పట్టభద్రుడు అనన్యశెట్టి ప్రారంభించాడు. 2022 అక్టోబర్ హైదరాబాద్‌లో తొలి రేజ్‌రూమ్‌కు 25 ఏళ్ల సూరజ్ పూసర్ల శ్రీకారం చుట్టాడు.

పాడైపోయిన లేదా పనికిరాని వస్తువులను సేకరించి రేజ్ రూమ్‌లో ఉంచుతారు. తమ కోపాన్ని తీర్చుకోవాలనుకొనే వ్యక్తులు ఈ గదిలోకి వెళ్లి వారి ఆవేశం చల్లారే దాకా

గదిలో ఏముంటాయి?

వస్తువులను చితక్కొట్టొచ్చన్నమాట. అయితే ఇదేమీ ఊరికే కాదండోయ్... వస్తువులను విరగ్గొట్టడమో లేదా పగలగొట్టడమో చేయాలంటే డబ్బు ముట్టజెప్పాల్సిందే.

ఇవీ ప్యాకేజీలు...

ఉదాహరణకు హైదరాబాద్‌లోని రేజ్ రూమ్‌లో 'క్వికీ'ప్యాకేజీ కింద రూ.1,300 చెల్లిస్తే గాజు సీసాలు పెట్టే ఒక ఫైబర్ బుట్ట (బాటిల్ క్రేట్), ఓ కంప్యూటర్ కీ బోర్డు, మౌస్, స్పీకర్లు ధ్వంసం చేయొచ్చు. అలాగే 'రఫ్ డే'కి రూ.1,500 కడితే రెండు క్రేట్లలో 15 బాటిళ్లు, ప్లాస్టిక్, ఎలక్ట్రానిక్ వస్తువులు విరగ్గొట్టొచ్చు. అదే 'రేజ్ మోడ్'కు అయితే రూ. 2,800 చెల్లించి ఓ మైక్రోవేవ్ ఓవెన్, వాషింగ్ మెషీన్, టీవీ సెట్, రిఫ్రిజిరేటర్, ప్రింటర్, ల్యాప్‌టాప్‌లను విరగ్గొట్టొచ్చు. ఇవేకాకుండా పంచింగ్ బ్యాగ్, బాక్సింగ్ ఉపకరణాలు, గురిచేసి కొట్టే డార్ట్‌లు ఇంకా రేజ్ బాల్స్ ఉన్నాయి. ఈ ప్యాకేజీలు ఉపయోగించుకొనే వారికి ఇండస్ట్రియల్ సూట్, హెల్మెట్, గ్లోస్, షూస్ వంటివి ఇస్తారు. ఒక్కొక్కరూ లేదా ఏడుగురు సభ్యులతో కూడిన బృందం 20 నిమిషాలపాటు ఆ గదిలో ఉండి వస్తువులను ధ్వంసం చేయొచ్చు.

పనికి రానివే..

పనికి రాని వస్తువులు, పాడైన వస్తువులను తుక్కు వ్యాపారుల నుంచి కొనుగోలు చేసి రేజ్ రూమ్‌లో ఉంచుతాం. కోపంతో ఉన్న వారు విరగ్గొట్టిన వివిధ వస్తువులను రీసైక్లింగ్ కేంద్రాలకుతరలిస్తాం.
-నిర్వాహకులు

తాత్కాలిక ఉపయోగమే...

కోపంతో ఉన్న వారికి సాంత్వన కల్పనకు, ప్రతికూల భావనల నుంచి బయటపడేందుకు ఆయా వస్తువుల ధ్వంసం ద్వారా ఓ 'థెరపీ'మాదిరిగా ఉపయోగపడొచ్చు. కానీ ఇది తాత్కాలికంగానే ఉపయోగపడుతుంది. దీన్ని సరైన పద్ధతిలో నిర్వహించలేకపోతే దీర్ఘకాలిక ప్రభావాలు పడొచ్చు.
-ఆశిష్ సెహగల్, యాంగర్ మేనేజ్‌మెంట్ స్పెషలిస్ట్ (గురుగ్రామ్)

తర్వాతి పరిణామాల సంగతేంటి?

డిస్ట్రాక్షన్ థెరపీ స్ఫూర్తితో రేజ్ రూమ్స్ విధానాన్ని రూపొందించారు. అయితే దీని వల్ల తర్వాతి పరిణామాలు ఎలా ఉంటాయన్న దానిపై ఎవరూ ధ్యాస పెట్టినట్టు కనిపించట్లేదు. ఏదైనా ఉద్రేకం, ఒత్తిళ్లలో ఉన్నప్పుడు మెల్లగా నీటిని తాగడం, 20 నుంచి ఒకటి వరకు అంకెలను వెనక నుంచి లెక్కించడం వంటి చర్యల ద్వారా ఆ పరిస్థితిని అధిగమించొచ్చు.
-శివాని సాధు, కౌన్సెలర్ (ఢిల్లీ)

'హంగ్' కలకలం

మొదటి పేజీ తరువాయి

నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. కోమటిరెడ్డి వెంకటరెడ్డి చెప్పిన విషయాలు ఎన్నికల తర్వాతకు సంబంధించినవే అయినా.. అటు పార్టీ కేడర్‌కు, ఇటు ఓటర్లకు తప్పుడు సంకేతాలను తీసుకువెళతాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో వెంకటరెడ్డి వ్యాఖ్యలను హుటాహుటిన ఖండించే పనిలో పడ్డారు టీపీసీసీ నేతలు. మాజీ ఎంపీ వి.హనుమంతరావు, టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ మల్లు రవి, వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్, ప్రధాన కార్యదర్శులు అద్దంకి దయాకర్, ఈరవత్రి అనిల్, ఉపాధ్యక్షుడు చామల కిరణ్ కుమార్‌రెడ్డి తదితరులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండించారు. ఎన్నికల ముందు, ఆ తర్వాత కూడా కాంగ్రెస్‌కు ఏ పార్టీతోనూ పొత్తు ఉండబోదని, కచ్చితంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని వారు ప్రకటించారు. కేడర్ మనోస్థైర్యాన్ని దెబ్బతీసేలా, గందరగోళంలో పడేసేలా సీనియర్లు వ్యాఖ్యలు చేయడం మంచిది కాదని హితవు పలికారు. కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆంతర్యం ఏమైనా సరే.. ఈ వైఖరి పార్టీకి నష్టం కలిగిస్తుందని, ఆయనపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కొందరు నేతల నుంచి డిమాండ్ వినిపించడం గమనార్హం.

ఆ రెండు పార్టీల్లోనూ ఇదే 'ముచ్చట'!

రాష్ట్రంలోని ప్రధాన రాజకీయపక్షాలైన బీఆర్ఎస్, బీజేపీల్లోనూ మంగళవారమంతా కోమటిరెడ్డి వెంకటరెడ్డి వ్యాఖ్యలపై చర్చ జరిగింది. అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఈ విషయంలో అధికారికంగా ఎక్కడా స్పందించలేదు. కానీ టీవీల్లో జరిగిన చర్చా కార్యక్రమాల్లో పాల్గొన్న బీఆర్ఎస్ నేతలు, ఎమ్మెల్యేలతోపాటు ఆ పార్టీ క్షేత్రస్థాయి నాయకులు ఈ విషయంపై మాట్లాడుకున్నారు. నిజంగానే అలాంటి పరిస్థితి ఉందా? అని కొందరు ఆరా తీయడం కనిపించింది. ఇక బీజేపీ మాత్రం కోమటిరెడ్డి వెంకటరెడ్డి వ్యాఖ్యలు మంచి అవకాశం అనుకుంటూ అందిపుచ్చుకుంది. బీఆర్ఎస్, కాంగ్రెస్ ఒకటేనని, ఈ విషయాన్ని తాము ముందునుంచీ చెప్తున్నామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ వ్యాఖ్యానించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ ఎమ్మెల్యేలను గెలిపించినా వారు బీఆర్ఎస్‌లోకే వెళ్తారని కామెంట్ చేశారు.

విమానాశ్రయంలో ఠాక్రే, కోమటిరెడ్డి భేటీ


మూడు రోజుల పర్యటన కోసం కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే మంగళవారం హైదరాబాద్‌కు వచ్చారు. ఆయనకు స్వాగతం పలకడానికి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అక్కడికి చేరుకున్నారు. అయితే అప్పటికే వెంకటరెడ్డి వ్యాఖ్యల దుమారంపై సమాచారం అందిన ఠాక్రే.. శంషాబాద్ విమానాశ్రయంలోనే కోమటిరెడ్డితో భేటీ అయ్యారు. ఆ తర్వాత మీడియాతో మాట్లాడిన ఈ ఇద్దరు నేతలు.. కాంగ్రెస్‌తో మరే పార్టీతో పొత్తుపెట్టుకునే ప్రసక్తే లేదని వ్యాఖ్యానించారు. అంతేకాదు తన వ్యాఖ్యలను వక్రీకరించారని, దీనిపై రాద్ధాంతం చేయాల్సిన పనిలేదని కోమటిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొనడం గమనార్హం.

బీఆర్ఎస్‌తో పొత్తు ప్రసక్తే లేదు

సొంతంగానే కాంగ్రెస్ అధికారంలోకి..: మాణిక్‌రావ్ ఠాక్రే

శంషాబాద్

తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ సొంతంగానే అధికారంలోకి వస్తుందని, బీఆర్ఎస్‌తో పొత్తు ప్రసక్తే లేదని ఆ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే స్పష్టం చేశారు. మంగళవారం సాయంత్రం ఢిల్లీ నుంచి హైదరాబాద్‌కు చేరుకున్న ఆయన మీడియాతో మాట్లాడారు. సీనియర్ నేత, ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి పొత్తులపై చేసిన వ్యాఖ్యలను మీడియా ప్రస్తావించగా.. ''ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకునే ప్రసక్తే లేదు. బీఆర్ఎస్ పొత్తు ముమ్మాటికీ ఉండదు. కోమటిరెడ్డి వ్యాఖ్యలను నేను పరిశీలించలేదు. పరిశీలించాక మాట్లాడుతాను. ఏదేమైనా వరంగల్ సభలో రాహుల్‌గాంధీ చెప్పిన విషయాలకు పార్టీ కట్టుబడి ఉంటుంది''అని మాణిక్‌రావ్ ఠాక్రే చెప్పారు. అంతకుముందు ఠాక్రేతో ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఏఐసీసీ కార్యదర్శులు నదీమ్ జావేద్, బోసురాజు, వేణుగోపాల్ తదితరులు ఎయిర్‌పోర్టులోని వీఐపీ లాంజ్‌లో కాసేపు సమావేశం కావడం గమనార్హం.



ఒకే ప్రాజెక్టుగా సీతమ్మ, సీతారామ

అనుమతుల కోసం సీడబ్ల్యూసీకి డీపీఆర్ పంపిన సర్కారు

సాక్షి, హైదరాబాద్: ఇప్పటి వరకు వేర్వేరుగా ఉన్న సీతారామ ఎత్తిపోతల, సీతమ్మ సాగర్ ప్రాజెక్టులను ఒకే ప్రాజెక్టుగా రాష్ట్ర ప్రభుత్వం కలిపివేసింది. సీతారామ ఎత్తపోతల- సీతమ్మ సాగర్ బహుళార్థక సాధక ప్రాజెక్టు పేరుతో సవివర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్)ను సిద్ధం చేసి తాజాగా అనుమతుల కోసం కేంద్ర జల సంఘానికి పంపించింది. గతంలో రెండు వేర్వేరు ప్రాజెక్టులుగా పరిగణించిన నేపథ్యంలో సీతారామ ఎత్తిపోతల డీపీఆర్‌ను అనుమతుల కోసం సీడబ్ల్యూసీకి పంపించింది. ఆ తర్వాత సీతారామ ఎత్తిపోతల, సీతమ్మసాగర్‌లను ఒకే ప్రాజెక్టుగా చూపుతూ సత్వర పర్యావరణ అనుమతుల కోసం కేంద్ర పర్యావరణ శాఖకు దరఖాస్తు చేసుకోగా, సీడబ్ల్యూసీ అభ్యంతరం వ్యక్తం చేసింది. తమకు వేర్వేరు పథకాలుగా ప్రతిపాదించి, కేంద్ర పర్యావరణ శాఖకు మాత్రం ఒకే ప్రాజెక్టుగా ప్రతిపాదించడం సరికాదని స్పష్టం చేసింది. దీంతో ఈ రెండు ప్రాజెక్టులను ఒకే ప్రాజెక్టుగా చూపుతూ కొత్త డీపీఆర్‌ను సిద్ధం చేసి గత నెలలో సీడబ్ల్యూసీకి అనుమతుల కోసం రాష్ట్ర నీటిపారుదల శాఖ పంపించింది.

రూ.18,918 కోట్ల అంచనాలతో...

ఈ ప్రాజెక్టును రూ.18,918 కోట్ల అంచనాలతో నిర్మిస్తున్నట్టు కొత్త డీపీఆర్‌లో పేర్కొంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సీతారామ ఎత్తిపోతల, సీతమ్మ బ్యారేజీ ప్రాజెక్టులను నిర్మిస్తున్నారు. 37 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో సీతమ్మ బ్యారేజీని, 6.74లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో సీతారామ ఎత్తిపోతల నిర్మాణాన్ని ప్రభుత్వం చేపట్టింది. 70.4 టీఎంసీల గోదావరి జలాలను సీతారామకు కేటాయించింది. రూ.13,384 కోట్లతో సీతారామా ఎత్తిపోతలను నిర్మిస్తుండగా, ఇప్పటి వరకు రూ.7167 కోట్లను ఖర్చు చేసింది. సీతమ్మ బ్యారేజీ నిర్మాణానికి ఇప్పటి వరకు రూ.547 కోట్లను వ్యయం చేసింది. సీతారామ ఎత్తిపోతలో భాగంగా 114 కి.మీల మేర కాల్వల నిర్మాణంతో పాటు మూడు పంప్‌హౌజ్‌ల ఏర్పాటు పూర్తయింది. సీతమ్మ బ్యారేజీలో జలవిద్యుత్ కేంద్రాన్ని సొంత విద్యుత్ అవసరాలకు నీటిపారుదల శాఖ వినియోగించుకోనుంది.

... సర్దు'బాదుడు

మొదటి పేజీ తరువాయి

దీనికి కారణం. ఎఫ్ఎస్‌పీఏ చార్జీలకు అనుమతిస్తూ గత నెల 18న రాష్ట్ర ఈఆర్సీ ప్రకటించిన 'మూడో సవరణ నిబంధన, 2023'ను నోటిఫై చేస్తూ అదే నెల 20న జారీ చేసిన గెజిట్ నోటిఫికేషన్‌ను ఈ నెల 12న రాష్ట్ర శాసనసభలో ప్రభుత్వం ప్రవేశపెట్టింది. దీంతో ఎఫ్ఎస్‌పీఏ చార్జీల వసూళ్లకు మార్గం సుగమమైంది. దీంతో ప్రజలపై విద్యుత్ బిల్లులు మరింత భారంగా మారనున్నాయి.

కేంద్రం ఆదేశాల నేపథ్యంలో...

ఇంధన/విద్యుత్ కొనుగోలు వ్యయంలో హెచ్చుతగ్గుల భారాన్ని ఎఫ్ఎస్‌పీఏ చార్జీల రూపంలో ఆటోమెటిక్‌గా విద్యుత్ బిల్లుల్లో చేర్చాలని ఆదేశిస్తూ కేంద్ర ప్రభుత్వం 2021 అక్టోబర్ 22న ఎలక్ట్రిసిటీ (టైమ్లీ రికవరీ ఆఫ్ కాస్ట్ డ్యూ టు ఛేంజ్ ఇన్ లా) రూల్స్ 2021ను ప్రకటించింది. బొగ్గు, ఇతర ఇంధనాల ధరల పెరుగుదలతో పెరిగిపోతున్న విద్యుత్ కొనుగోలు వ్యయాన్ని ఎప్పటికప్పుడు వినియోగదారుల నుంచి వసూలు చేసేందుకు కేంద్రం ఈ నిబంధనలను తీసుకొచ్చింది. దీని ఆధారంగానే ఎఫ్ఎస్‌పీఏ చార్జీల వసూళ్లకు ఈఆర్సీ అనుమతిచ్చింది. ఈఆర్సీ ప్రకటించిన ప్రత్యేక ఫార్ములా ఆధారంగా ఎఫ్ఎస్‌పీఏ చార్జీలను లెక్కించి వసూలు చేయనున్నారు.

యూనిట్‌పై 30 పైసల దాకా వడ్డన

యూనిట్ విద్యుత్‌కి గరిష్టంగా 30 పైసల వరకు ఎఫ్ఎస్‌పీఏ చార్జీలను ఈఆర్సీ అనుమతి లేకుండా డిస్కంలు విధించవచ్చు. ఒకవేళ ఎఫ్ఎస్‌పీఏ చార్జీలు యూనిట్‌కి 30 పైసలకు మించితే.. ఈఆర్సీ నుంచి అనుమతి పొందాలి. ఒకవేళ ఎఫ్ఎస్‌పీఏ చార్జీలను లెక్కించాక రుణాత్మకంగా తేలితే ఆ మేరకు చార్జీలను వినియోగదారులకు రిఫండ్ చేయాలి. ఎల్టీ-5 కేటగిరీలోని వ్యవసాయం మినహా అన్ని కేటగిరీల వినియోగదారులపై ఈ చార్జీలు విధించనున్నారు. వ్యవసాయ వినియోగదారుల ఇంధన సర్దుబాటు చార్జీలను రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సి ఉండనుంది. ఎఫ్ఎస్‌పీఏ చార్జీలను లెక్కించే సమయంలో ట్రాన్స్‌మిషన్, డిస్ట్రిబ్యూషన్ నష్టాలను సైతం పరిగణనలోకి తీసుకోనున్నారు.

45 రోజుల్లోగా పత్రికల్లో ప్రకటన...

నిర్ణీత కాల వ్యవధిలోపు ఎఫ్ఎస్‌పీఏ చార్జీలను విధించడంలో డిస్కంలు విఫలమైతే తర్వాతి కాలంలో వసూలు చేసేందుకు అనుమతి ఉండదు. నెలవారీ ఇంధన సర్దుబాటు చార్జీలను నిబంధనల ప్రకారం డిస్కంలు లెక్కించి సంబంధిత నెల ముగిసిన 45 రోజుల్లోగా పత్రికల్లో ప్రచురించాల్సి ఉంటుంది. విద్యుత్ బిల్లుల్లో ఎఫ్ఎస్‌పీఏ చార్జీలను ప్రత్యేకంగా చూపించడంతోపాటు వసూలైన ఎఫ్ఎస్‌పీఏ చార్జీలను ప్రత్యేక ఖాతా కింద నమోదు చేస్తారు. ప్రతి త్రైమాసికం ముగిశాక 60 రోజుల్లోగా ఆ త్రైమాసికంలోని నెలలకు సంబంధించిన ఎఫ్ఎస్‌పీఏ చార్జీల వివరాలను ఈఆర్సీకి సమర్పించాలి. డిస్కంలు విధించిన ఎఫ్ఎస్‌పీఏ చార్జీలను ఈఆర్సీ క్షుణ్ణంగా పరిశీలించి ఆమోదించనుంది.

ఇక ట్రూఅప్ ప్రతిపాదనలు కీలకం..

ఏటా నవంబర్ ముగిసేలోగా వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక ఆదాయ అవసరాల నివేదిక (ఏఆర్ఆర్)తోపాటు వినియోగదారుల నుంచి వసూలు చేసిన ఎఫ్ఎస్‌పీఏ చార్జీల వివరాలు, ట్రూఅప్ చార్జీల ప్రతిపాదనలను ఈఆర్సీకి డిస్కంలు సమర్పించాల్సి ఉంటుంది. ముందే వసూలు చేసిన ఎఫ్ఎస్‌పీఏ చార్జీలను పరిగణనలోకి తీసుకొని ట్రూఅప్ చార్జీల రూపంలో వినియోగదారులకు పంచాల్సిన లాభనష్టాలపై ఈఆర్సీ నిర్ణయం తీసుకుంటుంది. ట్రూఅప్ ప్రతిపాదనలు సమర్పించే వరకు ఎఫ్ఎస్‌పీఏ చార్జీల వసూళ్లకు ఈఆర్సీ అనుమతించదు.

వాళ్లు కలిసే పోటీ చేస్తారు

కాంగ్రెస్ నేతలు ఈ వాస్తవాలను బయటపెట్టారు: బండి సంజయ్

- బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం, కమ్యూనిస్టులు కలిసే ముందుకు..
- ప్రజలను మోసం చేసేందుకే కొట్లాడుకుంటున్నట్టు నాటకాలు
- కేసీఆర్ గడీలు బద్దలవుతాయనే బీజేపీని టార్గెట్ చేస్తున్నారు
- ఓటమి తప్పదని తెలిసీ కాంగ్రెస్ యాత్రలెందుకని వ్యాఖ్య



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో రోజురోజుకు బలపడుతున్న బీజేపీ ఒంటరిగానే అధికారంలోకి వస్తుందన్న ఆందోళనతోనే.. బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం, కమ్యూనిస్టులు కలిసి పోటీ చేసేందుకు సిద్ధమయ్యారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ పేర్కొన్నారు. తెలంగాణ ప్రజలను మోసం చేసేందుకు ఎన్నికల వరకు ఈ పార్టీలన్నీ కొట్లాడుకుంటున్నట్టు నటిస్తున్నాయని విమర్శించారు. వాళ్లంతా దండుపాళ్యం ముఠా అని.. ఒకరు దేశాన్ని దోచుకుంటే, మరొకరు కొన్ని రాష్ట్రాలను దోచుకున్నారని, బీఆర్ఎస్ తెలంగాణను దోచుకుంటోందని ఆరోపించారు. మంగళవారం ఢిల్లీలో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ తరుణ్ ఛుగ్‌తో భేటీ అనంతరం బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు.

''తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ క్షేత్రస్థాయికి ఎప్పుడో దూరమైంది. ఇప్పుడు కాంగ్రెస్ నాయకులు వాస్తవాలు బయటపెట్టారు. కాంగ్రెస్ ఎలాగూ అధికారంలోకి రాదు. కాంగ్రెస్-బీఆర్ఎస్ కలిసి ఉంటాయన్న విషయాన్ని పరోక్షంగా చెప్పేశారు. బీఆర్ఎస్-కాంగ్రెస్ కలిసి పోటీ చేస్తాయన్న విషయాన్ని మేం ఎప్పుడో చెప్పాం. ప్రజలు కాంగ్రెస్-బీఆర్ఎస్‌ను ప్రజలు వేరుగా చూడట్లేదు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి ప్రజలు ఓటేస్తే.. వాళ్లు గెలిచి చివరికి వెళ్లేది బీఆర్ఎస్ పార్టీలోకే. గతంలో ఇదే జరిగింది. తెలంగాణ కాంగ్రెస్ నాయకులకు బీఆర్ఎస్‌తో కొట్లాడే దమ్ము లేదని.. కొట్లాడి గెలిపించినా వాళ్లు ఎలాగూ బీఆర్ఎస్ పార్టీలోకే వెళ్తారని కాంగ్రెస్ అధిష్టానం కూడా భావిస్తోంది. అందుకే తెలంగాణలో పార్టీని కాపాడుకునేందుకు బీఆర్ఎస్‌తో కలిసి ఉండాలని కాంగ్రెస్ పెద్దలు అనుకుంటున్నారు. ఈ అంశంపై గతంలో ఢిల్లీలో చర్చలు జరిగాయి. ఎన్నికల ముందే కలిస్తే.. తెలంగాణలో బీజేపీ మరింత బలపడుతుందని కొందరు కాంగ్రెస్ నాయకులు అధిష్టానానికి చెప్పారు. అందుకే ఎన్నికల వరకు బీఆర్ఎస్‌తో కొట్లాడినట్టు నటిద్దామన్న ఆలోచనలో కాంగ్రెస్ ఉంది''అని ఆరోపించారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వచ్చి, తమ గడీలు బద్దలవుతాయని సీఎం కేసీఆర్ భయపడుతున్నారని.. అందుకే బీజేపీని టార్గెట్ చేస్తున్నారని బండి సంజయ్ ఆరోపించారు.

ప్రజలను నమ్మించి మోసం చేయడమేంటి?

''తెలంగాణలో అధికారంలోకి వచ్చే పరిస్థితులు లేవని కాంగ్రెస్ నాయకులే చెప్తున్నప్పుడు.. ఆ పార్టీ పాదయాత్రలు ఎందుకు? అప్పుడప్పుడు చేసే ఆందోళనలు ఎందుకు? ప్రజలను నమ్మించి మోసం చేయడం ఎందుకు?''అని సంజయ్ ప్రశ్నించారు. గతంలో బీజేపీ-బీఆర్ఎస్ ఒకటేనని ప్రచారం చేశారని.. అసలు బీఆర్ఎస్-కాంగ్రెస్ ఒక్కటేననే వాస్తవం బయటికి వచ్చిందని చెప్పారు. గతంలోనూ తాము 119 స్థానాల్లో పోటీ చేశామని.. ఈసారి ప్రజల ఆశీర్వాదంతో తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. వయసు మీదపడుతుండటంతో కేసీఆర్ ఈ మధ్య అన్నీ మర్చిపోతున్నారని, బీజేపీ పెరుగుదలను చూసి డిప్రెషన్‌లోకి వెళ్లారని సంజయ్ వ్యాఖ్యానించారు.

కేసీఆర్-కాంగ్రెస్ కలవడం ఖాయం

అసెంబ్లీ ఎన్నికల్లో ఏ పార్టీకీ మెజార్టీ రాదు: కోమటిరెడ్డి వెంకటరెడ్డి

- బీఆర్ఎస్‌కు కాంగ్రెస్ తప్ప ప్రత్యామ్నాయం లేదు
- కానీ ఎన్నికలకు ముందు మాత్రం పొత్తులకు ఒప్పుకోం.. అలా చేస్తే బీజేపీకే లాభం
- కాంగ్రెస్ సీనియర్లంతా కష్టపడితే 40-50 స్థానాల్లో గెలిచే చాన్స్ అని వ్యాఖ్య
- వచ్చే నెల మొదటివారం నుంచి పాదయాత్ర, మోటార్ సైకిల్ యాత్ర చేస్తానని వెల్లడి

సాక్షి, న్యూఢిల్లీ

తెలంగాణలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో హంగ్ ఫలితాలు వస్తాయని.. ప్రస్తుత పరిస్థితుల్లో ఏ పార్టీకి కూడా స్పష్టమైన మెజార్టీ వచ్చే అవకాశం లేదని కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కె.చంద్రశేఖర్‌రావు కాంగ్రెస్‌తో కలవడం ఖాయమని పేర్కొన్నారు. మంగళవారం ఢిల్లీలోని తన నివాసంలో కోమటిరెడ్డి వెంకటరెడ్డి మీడియాతో మాట్లాడారు. ''తెలంగాణలో ఏమైనా జరగొచ్చు. రాష్ట్రంలో వచ్చేది హంగ్ అసెంబ్లీ. ఏ పార్టీకి కూడా 60 స్థానాలు వచ్చే పరిస్థితి లేదు. హంగ్ అసెంబ్లీ వచ్చినప్పుడు సెక్యులర్ పార్టీ అయిన కాంగ్రెస్‌తోనే కేసీఆర్ కలుస్తారు. కాంగ్రెస్‌తో కలవడం తప్ప కేసీఆర్‌కు వేరే ప్రత్యామ్నాయం లేదు. కేసీఆర్‌కే కాదు కాంగ్రెస్ పార్టీకి సైతం ప్రత్యామ్నాయం లేదు. ఎట్టి పరిస్థితుల్లోనూ కాంగ్రెస్ బీజేపీతో కలవదు. కాంగ్రెస్ ఒంటరిగా అధికారంలోకి రాదు. ఈ పరిస్థితుల్లో హంగ్ తప్పదు'' అని వ్యాఖ్యానించారు. అయితే ఎన్నికలకు ముందు ఇతర పార్టీలతో పొత్తుల ప్రసక్తే లేదని, కాంగ్రెస్‌ది ఒంటరి పోరాటమేనని చెప్పారు. ఒకవేళ ఎన్నికల ముందు కాంగ్రెస్-బీఆర్ఎస్ మధ్య పొత్తు ఉంటే.. అది బీజేపీకి లాభిస్తుందని పేర్కొన్నారు.

పార్టీని సింగిల్‌గా గెలిపించే లీడరెవరూ లేరు!

సీనియర్లంతా ఒక్కతాటిపైకి వచ్చి కష్టపడితే కాంగ్రెస్ పార్టీ 40-50 అసెంబ్లీ స్థానాలు గెలిచే అవకాశం ఉందని కోమటిరెడ్డి వెంకటరెడ్డి పేర్కొన్నారు. ''కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో సానుభూతి ఉంది. తెలంగాణ ఇచ్చిన పేరుంది. కానీ వివిధ కారణాలతో పార్టీ సీనియర్లు అందరూ ఒకే వేదికపైకి రాలేకపోతున్నారు. 60-70 స్థానాల్లో అభ్యర్థులను ముందుగానే ప్రకటించాలని వరంగల్ సభ సమయంలో రాహుల్ గాంధీకి చెప్పాను. ఇప్పటికీ దీనిపై ఎలాంటి చర్చ లేదు. అయినా సీనియర్లంతా కలసి కష్టపడితే కాంగ్రెస్‌కు కచ్చితంగా 40-50 సీట్లు వస్తాయి. ఒక్కరే తన భుజాలపై తీసుకెళ్లి పార్టీని గెలిపిస్తామంటే అయ్యేది కాదు. కాంగ్రెస్‌లో అంతపెద్ద లీడర్ ఎవరూ లేరు. ఇప్పటినుంచి ఆరు నెలలపాటు ఒక్కొక్క సీనియర్ వారి ప్రాంతాల్లో కష్టపడితే ఒక్కొక్కరు నాలుగైదు స్థానాలు గెలిపించగలుగుతారు''అని వ్యాఖ్యానించారు. తనతోపాటు పార్టీలోకి వచ్చారంటూ అనర్హులకు టికెట్లు ఇస్తే మునగడం ఖాయమని పరోక్షంగా పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు.

వచ్చే నెల నుంచి పాదయాత్ర..: తాను వచ్చే నెల తొలివారం నుంచి నల్గొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల్లో పాదయాత్ర, మోటర్‌సైకిల్ యాత్ర చేపడతానని కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. ఎలాంటి విభేదాలు లేకుండా యాత్ర చేయాలన్నది తన అభిమతమని చెప్పారు. యాదగిరిగుట్ట నుంచి యాత్ర మొదలుపెట్టి ఆలేరు-జనగాం-తుంగతుర్తి-సూర్యాపేట-నకిరేకల్-నల్గొండ-మిర్యాలగూడ-దేవరకొండ-అచ్చంపేట-నాగర్‌కర్నూల్‌తోపాటు ఎంత ఎక్కువ వీలైతే అన్ని ఎక్కువ నియోజకవర్గాల్లోని గ్రామాల్లో పర్యటిస్తానని వివరించారు. యాత్ర రూట్‌మ్యాప్‌పై పార్టీ ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రేతో చర్చించి ముందుకు వెళ్తానని చెప్పారు.



రాహుల్ చెప్పిన మాటలనే రిపీట్ చేశా..

శంషాబాద్: బీఆర్ఎస్‌తో కాకుండా సెక్యులర్ పార్టీలతో పొత్తు ఉంటుందని వరంగల్ సభలో రాహుల్‌గాంధీ చెప్పిన మాటలనే తాను రిపీట్ చేశానని.. బీఆర్ఎస్‌తో పొత్తు ఉంటుందని వ్యాఖ్యానించలేదని ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి చెప్పారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టులో మాణిక్‌రావ్ ఠాక్రేతో భేటీ తర్వాత ఆయన మీడియాతో మాట్లాడారు. తన మాటలను బీజేపీ ఉద్దేశపూర్వకంగా రాజకీయం చేస్తోందని మండిపడ్డారు. తాను కొన్ని సర్వేల ఆధారంగా మాట్లాడానని చెప్పారు. సొంత పార్టీలో చిన్న చిన్న పిల్లలు కూడా తనపై ఇష్టమొచ్చినట్టుగా విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

హంగ్ కాదు.. బీజేపీనే వస్తుంది: తరుణ్ ఛుగ్



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో హంగ్ ప్రభుత్వం కాదు ఏకపక్షంగా బీజేపీ ప్రభుత్వమే వస్తుందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి తరుణ్ ఛుగ్ పేర్కొన్నారు. తెలంగాణలో బీజేపీ బలపడటంతో సీఎం కేసీఆర్ డిప్రెషన్‌లో మునిగిపోయారని.. కాంగ్రెస్ పార్టీ వెంటిలేటర్‌పైకి వెళ్లిపోయిందని విమర్శించారు. అధికారాన్ని కోల్పోవడం కేసీఆర్‌కు స్పష్టంగా కనిపిస్తోందని.. అందుకే ఇష్టం వచ్చినట్టుగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. తెలంగాణలో అప్రజాస్వామిక, అహంకారపూరిత విధానాలు, అవినీతి, కుటుంబపాలన కారణంగా ప్రజలు కేసీఆర్‌ను అసహ్యించుకొనే పరిస్థితి నెలకొందని విమర్శించారు. మంగళవారం ఢిల్లీలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ తనను కలిసిన తర్వాత తరుణ్ ఛుగ్ మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో కేసీఆర్ పగటి కలలు కనేవారని, ఇప్పుడు కాంగ్రెస్ వాళ్లు అదే బాటలో నడుస్తున్నారని విమర్శించారు. తెలంగాణ అవినీతిని సీఎం కేసీఆర్ ఢిల్లీ, పంజాబ్ వరకు చేర్చారని ఆరోపించారు. కేసీఆర్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో బడ్జెట్ గురించి ఒక మాట మాట్లాడకుండా.. ప్రధాని మోదీని, బీజేపీని విమర్శించడం, అవాస్తవ ఆరోపణలు చేయడంపైనే దృష్టి పెట్టారని తరుణ్ ఛుగ్ విమర్శించారు. తెలంగాణలో బీజేపీ బలోపేతం కోసం మరో విడత ప్రజాసంగ్రామ యాత్ర నిర్వహించనున్నామని.. ప్రజాగోస-బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా 11 వేల చిన్న చిన్న సభలు నిర్వహిస్తామని చెప్పారు.


మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న మంత్రి హరీశ్ రావు దంపతులు


నేటికీ కట్టెల పైనే వంట!

ఆహార తయారీకి ఇంకా కలప, పంట వ్యర్థాలపైనే ఆధారపడుతున్న ప్రజలు

- ప్రపంచవ్యాప్తంగా సంప్రదాయ ఇంధనాన్నే వాడుతున్న 28 కోట్ల కుటుంబాలు
- గ్యాస్, రవాణా ధరల పెరుగుదలతో మళ్లీ కలప వైపు మళ్లుతున్న భారత పల్లెలు
- ఫలితంగా వాయు కాలుష్యంతో ఏటా సంభవిస్తున్న లక్షలాది మరణాలు

సాక్షి, ప్రత్యేక ప్రతినిధి, హైదరాబాద్

ప్రపంచవ్యాప్తంగా విచ్చలవిడిగా కర్బన ఉద్గారాల విడుదల కారణంగా రోజురోజుకూ భూతాపం పెరిగి అధిక ఉష్ణోగ్రతలకు దారితీస్తోంది. వాతావరణ మార్పుల వల్ల ఎన్నో కష్టనష్టాలు ఎదురవుతున్నప్పటికీ ప్రజల ఆలోచనా తీరు మాత్రం మారడంలేదు. అధిక కర్బన ఉద్గారాల విడుదల కారకాల్లో ఒకటైన వంట చెరకు వినియోగం నేటికీ యథేచ్ఛగా కొనసాగుతోంది. ఎల్పీజీ, సోలార్, విద్యుత్ వాడకం ఆశించిన స్థాయిలో పెరగకపోగా పాతకాలం తరహాలో కట్టెలు, పంట వ్యర్థాలు, పిడకల వినియోగం ఇంకా కొనసాగుతోంది. తద్వారా అడవుల నరికివేత కూడా ఎక్కువవుతోంది. దేశంలో ఇంకా దాదాపు 44 శాతం మంది అడవుల నుంచి కలప, పంటల వ్యర్థాలు, పిడకలను వినియోగించి ఆహారం తయారు చేసుకుంటున్నారు. ఇటుకల తయారీకి కూడా కలప, పంటల వ్యర్థాలు వినియోగిస్తున్నారు. చిన్నచిన్న పరిశ్రమలు సైతం కట్టెలనే వాడుతున్నాయి. చివరకు బయోమాస్ విద్యుత్ ఉత్పత్తి సంస్థలు సైతం పంట వ్యర్థాలు కాకుండా ఏకంగా అటవీ కలపను వినియోగిస్తున్నాయి. మరోవైపు కలపతో బొగ్గు తయారీ కూడా చేస్తున్నారు. ఫలితంగా వెలువడుతున్న వాయు కాలుష్యంతో ఏటా లక్షలాది మంది మరణిస్తున్నారు. ప్రపంచంలో ఈ తరహా మరణాలు చైనా తరువాత భారత్‌లోనే ఎక్కువని అంతర్జాతీయ సంస్థలు వెల్లడిస్తున్నాయి.





కలప కాలడం వల్ల వచ్చే..

కలప, పంట వ్యర్థాలను కాల్చడం వల్ల వెలువడుతున్న వాయు కాలుష్యం వల్ల దేశంలో ఏటా 3.3 లక్షల మంది మరణిస్తున్నారని 'లాన్సెట్ కౌంట్‌డౌన్ ఆన్ హెల్త్ అండ్ క్లైమేట్ చేంజ్'అధ్యయనం వెల్లడించింది. అదే చైనాలో 3.8 లక్షల మంది, యూరప్‌లో 1.17 లక్షల మంది, యూఎస్‌లో 32 వేల మంది మరణిస్తున్నారని వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా సుమారు దాదాపు 28 కోట్ల మంది ఇంకా కలప, పంట వ్యర్థాలను వినియోగించి ఆహారాన్ని తయారు చేసుకుంటున్నారని సమాచారం. వంట చెరకు కాలుష్యం వల్ల ప్రపంచవ్యాప్తంగా సుమారు 23 లక్షల మంది మరణిస్తున్నారని పలు అంతర్జాతీయ సంస్థలు తమ సర్వేల్లో పేర్కొంటున్నాయి. ఎల్పీజీ వినియోగిస్తున్న వారిలోనూ 12 శాతం మంది రెండో ఇంధనంగా ఈ కలపను వినియోగిస్తున్నారని గణాంకాలు పేర్కొంటున్నాయి.

ఎల్పీజీ వినియోగం పెరిగినా..

దేశంలో దశాబ్దకాలంగా ఇళ్లలో ఎల్పీజీ వినియోగం పెరిగినట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. దేశవ్యాప్తంగా సుమారు 30.5 కోట్ల ఎల్పీజీ గృహ వినియోగదారులున్నట్లు ఆయిల్ కంపెనీలు చెబుతున్నాయి. 2012లో రూ. 410 ఉన్న 14.5 కేజీల సిలిండర్ ధర ప్రస్తుతం రూ. 1,100కు చేరుకోవడంతో వినియోగదారుల సంఖ్య పడిపోతోందని డీలర్లు చెబుతున్నారు. ప్రధానమంత్రి ఉజ్వల్ యోజన కింద ఉచితంగా దాదాపు 8 కోట్ల గ్యాస్ కనెక్షన్లు ఇచ్చినా సిలిండర్ ధరలు మోయలేని భారంగా మారిన నేపథ్యంలో చాలావరకు రీఫిల్లింగ్‌కు రావడం లేదని పేర్కొంటున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనే ఈ సంఖ్య అధికంగా ఉన్నట్లు సమాచారం. మండల కేంద్రాల్లోనూ సిలిండర్ల పంపిణీ కేంద్రాలు తగిన స్థాయిలో అందుబాటులో లేకపోవడం, దూర ప్రాంతాల నుంచి సిలిండర్లను తెచ్చుకోవాల్సి రావడం వల్ల సిలిండర్ ధరతోపాటు రవాణా చార్జీలు కూడా తడిసిమోపెడవుతున్నాయి. సిలిండర్ అయిపోయిన వెంటనే రీఫిల్ దొరుకుతుందన్న గ్యారంటీ గ్రామీణ ప్రాంతాల్లో లేకపోవడం వల్ల కలపతో ఆహార తయారీకి మొగ్గుతున్నారు. స్నానాలకు అవసరమైన వేడినీటి కోసం కలపనే వినియోగిస్తున్నారు. పట్టణాల్లో ఎల్పీజీ వినియోగం దాదాపు 88.6 శాతం ఉంటే గ్రామీణ ప్రాంతాల్లో అది 42 శాతం మాత్రమే ఉన్నట్లు తాజా గణాంకాలు వెల్లడిస్తున్నాయి. అంటే గ్రామీణ ప్రాంతాల్లోని గృహిణులు ఇంకా అడవుల నుంచి తెచ్చిన కలప, పంట పొలాల్లోని వ్యర్థాలు, పిడకలను వాడుతున్నారు.



బొగ్గు డిమాండ్‌ను తగ్గించాలి...

చెట్లను కొట్టేయడం వల్ల కర్బన ఉద్గారాలు పెరుగుతాయి. కొట్టేసిన చెట్టును బొగ్గుగా మార్చడానికి విద్యుత్ లేదా ఇతర రూపాల్లో ఇంధనం అవసరమవుతుంది. మళ్లీ బొగ్గును కాల్చినా అది కూడా కాలుష్యమే. ఈ రకంగా మూడు దశల్లోనూ కాలుష్యం ఉంటుంది. నల్లగొండ జిల్లాలో ఈ తరహా కలప కాల్చివేత ఎక్కువగా జరుగుతోంది. ఇదొక పాత విధానమైనా ఇంకా ఎందుకు అనుసరిస్తున్నారో అర్థం కావడం లేదు. ఈ బొగ్గును అధికంగా చిన్న తరహా పరిశ్రమలు, ఇటుక బట్టీలు, హోటల్స్, దాబాల వంటి వాటిలో వాడుతున్నారు. వీటికి బొగ్గు సరఫరా పెంచితే ఇలాంటి బొగ్గు ఉపయోగించరు. అసలు బొగ్గే వద్దనుకుంటే సబ్సిడీపై విద్యుత్ ఇవ్వాలి. బాయిలర్ వంటివి ఎలక్ట్రిక్‌పై నడిచేవి అందుబాటులోకి తేవాలి. ముందుగా ఈ రకమైన బొగ్గుకు ఉన్న డిమాండ్‌ను తగ్గించాలి. చెట్లు కొట్టేయకుండా చట్టాన్ని తీసుకురావాలి.పచ్చదనానికి నష్టం వాటిల్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. దీనికి సంబంధించిన డిమాండ్, సప్లయ్‌ను తగ్గించడం ద్వారా అనుకున్న ప్రయోజనాలు పొందొచ్చు. ప్రస్తుతానికైతే చెట్లకు, పర్యావరణానికి నష్టం కలగజేసే వాటిపై ప్రభుత్వపరంగా ఎలాంటి నియంత్రణలు, పర్యవేక్షణలు లేవు.

– డాక్టర్ దొంతి నర్సింహారెడ్డి,
పర్యావరణవేత్త, పాలసీ అనలిస్ట్

బండకు టాటా.. కట్టెల వేట

గ్యాస్ ధర భరించలేక.. కట్టెలతో వంట



రామన్నపేట: గ్యాస్ ధర భారీగా పెరిగిపోవడంతో పల్లెల్లో కట్టెలపొయ్యిలపై వంట మొదలైంది.. పొయ్యిల నుంచి వెలువడే పొగ ఆరోగ్యానికి హానికరంగా మారింది. గ్యాస్ ధర అమాంతం రూ.1,100 దాటడంతో గ్రామీణులు కట్టెల పొయ్యిల వాడకం మొదలుపెట్టారు. యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం జనంపల్లి గ్రామంలో మంగళవారం కొందరు మహిళలు అడవి నుంచి తలపై కట్టెలమోపులు తీసుకొస్తుండడం కనిపించింది. వారిని వాకబు చేయగా గ్యాస్ ధర పెరగడంతో వంట చేయడానికి అడవి నుంచి కట్టెలను తీసుకొస్తున్నట్లు వాపోయారు. వారిలో కొందరు స్థానికులు కాగా.. మరికొందరు సంచార జాతులున్నారు.

మీరెంత.. మీ లెక్కెంత?

హాథ్ సే హాథ్ జోడో యాత్రలో బీజేపీ నేతలపై రేవంత్ ఫైర్

- తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం కలే...
- భద్రాద్రి రామయ్యకు ఇచ్చిన మాటనూ కేసీఆర్ తప్పారు


ఆమెర్ద గ్రామ సమీపంలోని కూలీలతో కలిసి వరి నాట్లు వేస్తున్న టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: 'బోడిగుండు మీద బొచ్చు మొలిచేది లేదు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చేది లేదు'అని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఘాటైన వ్యాఖ్యలు చేశారు. 'తెలంగాణలో మీరెంత ? మీ పార్టీ ఎంత? మీ బిచాణా ఎంత.. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పని అయిపోయిందని పదే పదే అంటున్నారు.. ఈ సభకు వచ్చిన జనాలను వీడియో తీసి ఆక్కడున్న గుండుకు.. ఆపైన ఉన్న బండకు పంపాలి'అని ఎద్దేవా చేశారు. హాథ్‌సే హాథ్ జోడోయాత్రలో భాగంగా మంగళవారం ఆయన భద్రాచలంలో పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ భాషలు, కులాలు, మతాల మధ్య చిచ్చు పెడుతూ పాలన సాగిస్తున్నారని విమర్శించారు. రాష్ట్రం ఏర్పడిన తొమ్మిదేళ్లలో కేసీఆర్ 10 బడ్జెట్లు ప్రవేశపెట్టారని, రూ.23 లక్షల కోట్లు ఖర్చుచేశారని, అయితే ఏ గ్రామంలోనూ ప్రజలకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు రాలేదని, రైతులకు రుణమాఫీ కాలేదని రేవంత్ అన్నారు. ఆఖరికి రాముడి గుడికి ఇస్తానన్న రూ.వంద కోట్లు కూడా ఇవ్వకుండా స్వామివారినే మోసం చేశారని, దేవుడికిచ్చిన మాట తప్పినోడు ఇక ప్రజలకు ఏం చేస్తారని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షల ఆర్థిక సాయం, రైతులకు రూ. 2 లక్షల రుణమాఫీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లిస్తామని హామీ ఇచ్చారు.

బీజేపీ, బీఆర్ఎస్‌లతో విసిగిపోయిన ప్రజలు

సీఎల్పీ నేత భట్టి విక్రమార్క మాట్లాడుతూ ప్రస్తుత బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాల పాలనతో ప్రజలు విసిగిపోయారని 'ఇక చాలు, మీ వల్ల కాదు, రాబోయే ఎన్నికల్లో మా ఓటు కాంగ్రెస్‌కే'అనే భావనలో ఉన్నారన్నారు. తాము అధికారంలోకి రాగానే వరంగల్ డిక్లరేషన్ అమలు చేస్తామన్నారు. సీనియర్ నేత వి.హనుమంతరావు మాట్లాడుతూ కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ తెలంగాణ ఇవ్వకుంటే కేసీఆర్ పరిస్థితి 'నాంపల్లి దర్గా దగ్గరా అల్లాకే నామ్‌పే దేదే బాబా'అన్నట్టుగా ఉండేదని విమర్శించారు. జీఎస్టీ కారణంగా పెద్ద పెద్ద కార్లు ఉన్నోళ్లు కూడా హోటల్‌కి వెళ్లకుండా బండి దగ్గర టిఫిన్లు చేయాల్సిన పరిస్థితి దాపురించిందన్నారు. అంతకుముందు అశ్వాపురం మండలంలో పర్యటించిన రేవంత్‌రెడ్డి.. రైతులు, సీతమ్మ సాగర్ ప్రాజెక్ట్ భూ నిర్వాసితులతో ముఖాముఖి నిర్వహించారు. ఆమెర్ద గ్రామ సమీపంలోని పొలంలో కూలీలతో కలిసి నాట్లు వేశారు.


మంగళవారం రాజ్‌భవన్‌లో అభయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో గిరిజన పాఠశాలల విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేస్తున్న గవర్నర్ తమిళిసై సౌందరరాజన్

నిజాలను చూపిస్తే... దాడులా? : ఎమ్మెల్సీ కవిత



సాక్షి, హైదరాబాద్: ప్రధాని నరేంద్ర మోదీ అనుసరిస్తున్న ప్రభుత్వ విధానాలను, ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టేవారిపై దర్యాప్తు సంస్థలను ప్రయోగించడం పరిపాటిగా మారిందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. బీబీసీ కార్యాలయాలపై ఐటీ శాఖ దాడులు చేయడాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు ట్విట్టర్ వేదికగా కవిత స్పందించారు. 'ఒక వ్యాపార సంస్థపై వచ్చిన ఆరోపణలపై దర్యాప్తు చేయడాన్ని కేంద్ర ప్రభుత్వం వ్యతిరేకిస్తోంది. కానీ అదే ప్రభుత్వం నిజాన్ని చూపించే ప్రయత్నం చేసిన బీబీసీపై దర్యాప్తు సంస్థలను ఉసిగొల్పింది. ఎందుకు ?'అని ప్రశ్నించారు. వాస్తవాలను చూపించే మీడియా గొంతును మోదీ ప్రభుత్వం నొక్కుతున్న విషయాన్ని బీఆర్ఎస్ పార్టీ ఎప్పటి నుంచో చెబుతూనే ఉందని పేర్కొన్నారు.

ఉచిత విద్యుత్‌ను ఆపే ప్రసక్తే లేదు: జగదీశ్‌రెడ్డి



సూర్యాపేట: కేంద్ర ప్రభుత్వం ఎన్ని అవాంతరాలు సృష్టించినా ఉచిత విద్యుత్‌ను ఆపే ప్రసక్తే లేదని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి మరోమారు స్పష్టం చేశారు. రాయితీ విద్యుత్ చార్జీలను డిస్కంలకు ముందుగానే చెల్లించాలనే కేంద్ర ప్రభుత్వ నూతన విద్యుత్ విధానంపై స్పందించిన మంత్రి మంగళవారం సూర్యాపేటలో విలేకరులతో మాట్లాడారు. పేదలకు అందించే రాయితీ విద్యుత్‌పై కేంద్రం కుట్రలు పన్నడం దుర్మార్గమని మండిపడ్డారు. విద్యుత్ రంగాన్ని ప్రైవేట్‌పరం చేయడం కోసమే కేంద్రం ఎత్తులు వేస్తోందని విమర్శించారు. కాంగ్రెస్‌లో ఉండి బీజేపీ గెలుస్తుందని, బీజేపీలో ఉండి కాంగ్రెస్ గెలుస్తుందంటారని కాబట్టి కోమటిరెడ్డి బ్రదర్స్ మాటల్ని పట్టించుకోనవసరం లేదని మంత్రి చెప్పారు.

జాగా ఉంటే నిధులు.. లేదంటే స్థలం..!

▶ మొదటి పేజీ తరువాయి

అసైన్డ్ భూములను వినియోగించుకోవాలని భావిస్తున్నారు.

సొంత స్థలాలు లేని వారి కోసం...

సొంత స్థలాలు ఉన్నవారు ఇల్లు నిర్మించుకునేందుకు రూ.3 లక్షల ఆర్థిక సాయం చేయాలని ప్రభుత్వం నిర్ణయించి బడ్జెట్‌లోనూ రూ.12 వేల కోట్ల నిధులు కేటాయించింది. తద్వారా నాలుగు లక్షల మందికి ప్రయోజనం చేకూరుతుందని పేర్కొంది. అయితే కేవలం సొంత జాగా ఉన్నవారికే ఇస్తే జాగా లేని వారి నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతాయనే వాదన తాజాగా తెరపైకి వచ్చింది. దీంతో సొంత స్థలాలు లేనివారి వివరాలు ప్రభుత్వం సేకరిస్తోంది. అలా స్థలాలు ఇవ్వాల్సి వస్తే ఎంతమంది లబ్ధిదారులుంటారు? ఒక్కొక్కరికి 60 గజాల నుంచి 80 గజాల వరకు అందించాలంటే ఎంత భూమి అవసరమవుతుంది? సరిపడా ప్రభుత్వ భూమి ఉందా? లేని పక్షంలో ఎంతభూమిని సమీకరించాల్సి వస్తుంది? వినియోగంలో లేని అసైన్డ్ భూములను వాడుకునే వీలుందా?.. తదితర అంశాలపై వివరాలను వచ్చే సోమవారం నాటికి అందజేయాల్సిందిగా తాజాగా అధికారులకు ఆదేశాలు అందినట్టు తెలిసింది. ఈ వివరాలు అందిన తరువాత తుది నిర్ణయం తీసుకుని భారీ స్థాయిలో ఒకే దఫాలో ఇళ్ల స్థలాలు పంపిణీ చేసే అవకాశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు సమాచారం.

క్లుప్తంగా...

దేశం గర్వించదగ్గ ఆధ్యాత్మికవేత్త సంత్ సేవాలాల్

జయంతి సందర్భంగా కేసీఆర్ నివాళి



సాక్షి, హైదరాబాద్: బంజారాలు, లంబాడాల ఆరాధ్యదైవం, సంత్ సేవాలాల్ మహారాజ్ గొప్ప సంఘ సేవకులు, దేశం గర్వించదగ్గ ఆధ్యాత్మికవేత్తని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు అన్నారు. సంత్ సేవాలాల్ మహారాజ్ 284 వ జయంతి సందర్భంగా కేసీఆర్ ఘనంగా నివాళులర్పించారు. లంబాడా, బంజారా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. 3 శతాబ్దాల కింద సేవాలాల్ మహారాజ్ నడయాడిన బంజారాహిల్స్ నేలమీద సంత్ మహారాజ్ పేరుతో నిర్మించిన భవన్‌లో రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా జయంతి ఉత్సవాలను నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు.

దళితబంధు.. బీఆర్ఎస్ కార్యకర్తలకు విందు

ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్



జన్నారం (ఖానాపూర్): తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళితబంధు పథకం బీఆర్ఎస్ కార్యకర్తలకు విందుగా మారిందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆరోపించారు. మంగళవారం బీఎస్పీ రాజ్యాధికార యాత్రలో భాగంగా మంచిర్యాల జిల్లా జన్నారం మండలం ధర్మారం, కామన్‌పల్లి, ఇందన్‌పల్లి, జన్నారం గ్రామాల్లో పర్యటించారు. జన్నారంలో ప్రవీణ్ మీడియాతో మాట్లాడారు. దళితబంధు పథకం ప్రకటనకే పరిమితమైందని విమర్శించారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజనులతోపాటు గిరిజనేతరులు కూడా అటవీ హక్కు పత్రాలు అందజేయాలని డిమాండ్ చేశారు. టైగర్‌జోన్ పేరుతో అడవిలో ఉన్న గిరిజనులు, గిరిజన గ్రామాలను తరలించడం సరికాదన్నారు. ఎస్సీ కార్పొరేషన్ రుణాలు అందించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. సర్పంచ్‌ల ఆత్మహత్యలకు కారణమవుతున్న ఈ ప్రభుత్వాన్ని సాగనంపాలని ప్రవీణ్ పిలుపునిచ్చారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు రమేశ్, ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి రాథోడ్ బన్సీలాల్ తదితరులు పాల్గొన్నారు.

అధికారంలోకి వచ్చిన వెంటనే ఇళ్లు కట్టిస్తా: షర్మిల



లింగాలఘణపురం: 'రాజశేఖరరెడ్డి బిడ్డను మాట ఇస్తున్న ఆశీర్వదించండి.. వైఎస్సార్‌టీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి ఒక్కరికి పట్టాలిచ్చి ఇళ్లు కట్టిస్తా' అని వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు షర్మిల హామీనిచ్చారు. ప్రజాప్రస్థానం యాత్రలో భాగంగా మంగళవారం జనగామ జిల్లా లింగాలఘణపురం మండలంలోని నెల్లుట్ల నుంచి 236వ రోజు పాదయాత్ర ప్రారంభించారు. అనంతరం జనగామ–సూర్యాపేట రోడ్డులో ఉన్న గుడిసెవాసుల వద్దకు వెళ్లి వారితో కొద్దిసేపు మాట్లాడారు. తాను ముఖ్యమంత్రి అయిన వెంటనే ఇదే భూమిలో పట్టాలిచ్చి ఇళ్లు కట్టిస్తానని, అంతవరకు ఖాళీ చేయవద్దని వారితో చెప్పారు. నీళ్లు, విద్యుత్ సౌకర్యం లేదని గుడిసెవాసులు మొరపెట్టుకోగా వెంటనే రూ.15 లక్షలతో సోలార్ విద్యుత్‌కు ఏర్పాటు చేయాలని పార్టీ యంత్రాంగాన్ని ఆదేశించారు.

'ధరణి'పై అసలు సమస్యలేంటి: నవీన్ మిత్తల్

సాక్షి, యాదాద్రి: ధరణి పోర్టల్ మాడ్యూల్స్‌లో ఎదురవుతున్న ఇబ్బందులపై రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, భూపరిపాలనా శాఖ కమిషనర్ నవీన్ మిత్తల్ మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ధరణిపై చేపట్టనున్న అధ్యయనంలో భాగంగా మొదట జిల్లాలో సమావేశం నిర్వహించారు. ప్రజల సమస్యలను సరళీకృతం చేయడానికి చేపట్టాల్సిన చర్యలపై అధికారుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ధరణిలో సాంకేతిక మార్పులు చేర్పుల గురించి చర్చించారు. ప్రధానంగా భూదాన్, వక్ఫ్, దేవాదాయ, అటవీభూముల సమస్యలను వివరించారు. ధరణి పోర్టల్‌లో సమస్యలను కలెక్టర్, తహసీల్దార్ల ద్వారా పరిష్కరించేందుకు అవకాశం కల్పించాలని అధికారులు కోరారు. ఈ మేరకు 14 అంశాలతో కూడిన నోట్‌ను రెవెన్యూ అధికారులు మిట్టల్‌కు అందజేశారు. సమావేశంలో కలెక్టర్ పమేలా సత్పతి తదితరులు పాల్గొన్నారు.



జాగ్రత్తగా చేయని ఆలోచనల కంటే మీకు మరేదీ ఎక్కువ హాని కలిగించలేదు.

– బౌద్ధ ధర్మం

సాక్షి

బుధవారం, ఫిబ్రవరి, 15

నెడుమారన్ దుమారం


శ్రీలంకలో స్వతంత్ర తమిళ రాజ్యస్థాపన లక్ష్యంగా పోరాడి మరణించిన లిబరేషన్ టైగర్స్ ఆఫ్ తమిళ ఈలం(ఎల్టీటీఈ) చీఫ్ ప్రభాకరన్ చాన్నాళ్ల తర్వాత వార్తల్లోకెక్కారు. ఆయన బతికేవున్నాడని, త్వరలో జనం ముందుకొస్తాడని తమిళ జాతీయోద్యమ నేత నెడుమారన్ సోమవారం చేసిన ప్రకటన సహజంగానే సంచలనంగా మారింది. ఆయన ప్రకటనలోని నిజానిజాల గురించి కన్నా, ఆ ప్రకటన చేయటం వెనకున్న ఉద్దేశాలపైనే తమిళనాడులో ప్రధానంగా చర్చ జరుగుతోంది. శ్రీలంక తమిళుల కడగండ్లపై ఇప్పటికీ తమిళనాట సానుభూతి ఉంది. అక్కడ తమిళులకు ఏం జరిగినా తమిళనాడులో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతాయి. శ్రీలంకలో ఎల్టీటీఈని నామరూపాల్లేకుండా చేసి పద్నాలుగేళ్లవుతోంది. అంతర్యుద్ధం ముగిశాక తమిళుల అభ్యున్నతికి అన్ని చర్యలూ తీసుకుంటామని, తమిళులు అధికంగా ఉండే ఉత్తర, తూర్పు ప్రావిన్సులకు స్వతంత్ర ప్రతిపత్తి ఇస్తామని అప్పట్లో చేసిన వాగ్దానాలను లంక సర్కారు ఈనాటికీ నెరవేర్చలేదు. తమ సమస్యలపై శాంతియుతంగా నిరసన వ్యక్తం చేసినా లంక సైన్యం విరుచుకుపడుతోంది. ఈ పరిస్థితుల్లో నెడుమారన్ చేసిన ప్రకటన అక్కడి సాధారణ తమిళులకు ఎంతో కొంత ఊరటనిస్తుంది. సౌకర్యవంతమైన జీవితాలను వదులుకుని తమ కోసం, తమ విముక్తి కోసం పోరాడటానికి అంకితమై ఆ క్రమంలో ప్రాణాలు కోల్పోయినవారిని వీరులుగా ఆరాధించటం, వారి జ్ఞాపకాలను పదిలపరుచుకోవటం, స్మరించుకోవటం అన్నిచోట్లా కనబడుతుంది. పాలక వ్యవస్థకు తిరుగుబాటు నేతలపై ఎలాంటి అభిప్రాయాలున్నా సాధారణ ప్రజానీకం దృష్టిలో వారు ఎప్పటికీ వీరులే. అలాగే దీనికి సమాంతరంగా వారి మరణాన్ని విశ్వసించని ధోరణి కూడా కనబడుతుంది. తిరుగుబాటుదార్లపై ఉండే గాఢమైన ప్రేమాభిమానాలే ఇందుకు కారణం కావొచ్చు. చరిత్రలోకి తరచి చూస్తే ఇలాంటి ఉదాహరణలెన్నో కనబడతాయి. ఆజాద్ హింద్ ఫౌజ్ వ్యవస్థాపకుడు నేతాజీ సుభాస్ చంద్రబోస్ 1945 ఆగస్టు 18న ఫార్మోజా(ఇప్పటి తైవాన్)లో జరిగిన విమాన ప్రమాదంలో మరణించినట్టు చెప్పినా అందుకు సంబంధించిన స్పష్టమైన ఆధారాలు దొరకలేదు. అందుకే కావొచ్చు... ఆయన పేరు మార్చుకుని అజ్ఞాతవాసం గడుపుతున్నారంటూ చాన్నాళ్లు వదంతులు ప్రచారంలో ఉండేవి.

శ్రీలంక తమిళుల్లో ప్రభాకరన్‌పై ఇప్పటికీ ఆరాధనాభావం బలంగా ఉందన్నది కాదనలేని సత్యం. ఇప్పటికీ లంక తమిళులను ద్వితీయ శ్రేణి పౌరులుగానే పరిగణిస్తున్న అక్కడి ప్రభుత్వ విధానాలు ఇందుకు దోహదపడుతున్నాయి. ఎల్టీటీఈ దూకుడు, దాని సిద్ధాంతాలూ, విధానాలనూ ఇతర సంస్థలు తీవ్రంగా విమర్శించేవి. అవి అంతిమంగా తమిళ జాతికి కీడు కలిగిస్తాయన్నది వారి ప్రధాన విమర్శ. తమిళ ఈలం కోసమే పోరాడే ఇతర సంస్థల నేతల్ని ఎల్టీటీఈ మట్టుబెట్టిన తీరు అత్యంత దారుణమైనది. 1991లో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీని, 1993లో అప్పటి శ్రీలంక అధ్యక్షుడు ప్రేమదాసనూ, అనేకమంది ఇతర నేతలనూ, సైనికాధికారులనూ మానవబాంబులతో దాడిచేసి హతమార్చిన చరిత్ర ఎల్టీటీఈది. ఉత్తర శ్రీలంకలోని ముల్లైతీవు ప్రాంతంలోని ఒక రహస్య స్థావరంలో తలదాచుకున్న ప్రభాకరన్‌నూ, ఆయన అనుచరులనూ సుదీర్ఘంగా సాగిన పోరాటంలో అంతమొందించామని 2009 మే 18న లంక సైన్యం ప్రకటించింది. అదే నెల 24న ఎల్టీటీఈ అంతర్జాతీయ వ్యవహారాల చీఫ్ సెల్వరాస పద్మనాథన్ కూడా దీన్ని ధ్రువీకరించారు. నిజానికి ప్రభాకరన్ సజీవంగా ఉన్నారంటూ నెడుమారన్ ప్రకటించటం ఇది మొదటిసారేమీ కాదు. 2018లో ఆయన ఈ తరహా ప్రకటనే చేశారు. సైనిక వలయాన్ని ఛేదించి ఆయన తప్పించుకున్నట్టు తన దగ్గర విశ్వసనీయ సమాచారం ఉన్నదని నెడుమారన్ అప్పట్లో చెప్పారు. మళ్లీ అయిదేళ్ల తర్వాత ఎలాంటి ఆధారాలూ చూపకుండా మరోసారి ఆమాటే చెప్పటం సందేహాలకు తావిస్తోంది. తమిళనాడులో కాంగ్రెస్ హవా నడుస్తున్నప్పుడు కామరాజ్ అనుచరుడిగా ఓ వెలుగు వెలిగిన నెడుమారన్ ఆ తర్వాత రాజకీయాలకు దూరమై శ్రీలంక తమిళుల హక్కుల కోసం పోరాడే నేతగా గుర్తింపు పొందారు. కన్నడ నటుడు రాజ్‌కుమార్‌ను వీరప్పన్ అపహరించినప్పుడు ఆయన విడుదలకు సంప్రదింపులు జరిపిన కీలక వ్యక్తుల్లో నెడుమారన్ ఒకరు. వర్తమాన తమిళ రాజకీయాల్లో శ్రీలంక తమిళుల అవస్థలు ప్రస్తావనకు రాకపోవటం, కేంద్రంపై ఒత్తిడి తేవాల్సిన రాజకీయ పక్షాలు నిర్లిప్తంగా ఉండటం జీర్ణించుకోలేకే నెడుమారన్ ఈ సంచలన ప్రకటన చేశారన్న అభిప్రాయం చాలామందిలో ఉంది.

ఒకప్పుడు ఎల్టీటీఈ బూచి చూపి సింహళ జాతిని ఏకం చేసిన రాజపక్సే సోదరులు నిరుడు ఉవ్వెత్తున ఎగిసిన ప్రజోద్యమంలో అధికారాన్ని కోల్పోయినప్పటి నుంచీ మళ్లీ సింహళీయుల్లో మద్దతు సంపాదించేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రభాకరన్ గురించిన వదంతిని ప్రచారంలో పెడితే భయభ్రాంతులైన జనం మళ్లీ తమవైపు చూస్తారన్నదే వారి ఆశ అంటున్నారు. అందులో నెడుమారన్ అమాయకంగా చిక్కుకున్నారా, లేక రాష్ట్ర రాజకీయాల్లో తనకు ప్రాసంగిత పెరగటానికి తోడ్పడుతుందన్న భావనతో ఉద్దేశపూర్వకంగా ఈ మాటన్నారా అన్న సందేహమూ ఉంది. ఏదేమైనా లంక యుద్ధ నేరాలపై విచారణ జరిపి నేరగాళ్లను శిక్షించటం, దుర్భర జీవితం గడుపుతున్న తమిళుల సమస్యల పరిష్కారానికి కృషి చేయటం తక్షణావసరమని శ్రీలంక ప్రభుత్వం గుర్తించాలి. ఆ విషయంలో మన దేశంతో సహా ప్రపంచ దేశాలన్నీ ఒత్తిడి తీసుకురావాలి. నెడుమారన్ ప్రకటన ఇందుకు దోహదపడితే మంచిదే.

ఈ అధ్యక్షుడు ఓ వైరుధ్యాల పుట్ట

కామెంట్



కరణ్ థాపర్

ఇటీవల మరణించిన పాక్ అధ్యక్షుడు పర్వేజ్ ముషారఫ్‌లోని వైరుధ్యాలను తేల్చడానికి చరిత్రకారులు గింజుకోవచ్చు. రెండుసార్లు పాకిస్తాన్‌లో అత్యవసర పరిస్థితిని ప్రకటించిన ఈ సైనిక నియంత అదే సమయంలో పత్రికా స్వేచ్ఛను అనుమతించారు. మితవాద ముస్లిం అయిన ముషారఫ్, లష్కర్–ఎ–తోయిబాకు అతిపెద్ద మద్దతుదారునని చెప్పేవారు. కార్గిల్ యుద్ధ నిర్మాత అయిన సైనిక అధినేతగా ఉంటూనే, కశ్మీర్ సమస్యకు పరిష్కారం విషయంలో పాక్ చరిత్రలో ఎన్నడూ లేనంత చేరువకు రాగలిగారు. ఇవి నిజంగానే చికాకు పెట్టే వైరుధ్యాలే మరి.

జనరల్ పర్వేజ్ ముషారఫ్ ఒక వైరుధ్యాల పుట్ట. ఈ వైరుధ్యాల్లో కొన్ని సంతోషకరమైనవి. కొన్ని ఇబ్బందికరమైనవి. కానీ ఆయన మాత్రం వాటికి మించిన వ్యక్తిత్వంతో ఉండేవారు. ఆయన దుస్తులు ఎంత నీటుగా ఉండేవంటే అందరినీ అవి ఆకర్షించేవి. అలాగే ఆయన పదాలతో ఆడుకునేవారు. 2002 అధ్యక్ష 'ఎన్నికల్లో' ఆయన 98 శాతం ఆధిక్యత సాధించినప్పుడు 'బిజినెస్ స్టాండర్డ్' పత్రిక అభినందించింది. దానికి ఆయన చెప్పిన సమాధానం ఆ పత్రిక రిపోర్టర్‌ను నివ్వెరపర్చింది. ''మీరు వ్యంగ్యంగా చెప్పినట్లయితే, నేను మాట్లాడేది ఏమీ ఉండదు. మీరు నిజాయితీగా ఉన్నట్లయితే, మీకు థాంక్స్ చెబుతాను.''

పాకిస్తాన్ ఆర్మీ జనరల్‌గా, ఆ తర్వాత పాక్ అధ్యక్షుడిగా వ్యవహరించిన ముషారఫ్ లోని వైరుధ్యాలను తేల్చిచెప్పడానికి చరిత్రకారులు గింజుకోవచ్చు. రెండుసార్లు పాకిస్తాన్‌లో అత్యవసర పరిస్థితిని ప్రకటించిన ఈ సైనిక నియంత అదే సమయంలో పత్రికా స్వేచ్ఛను అనుమతించారు. అలాగే ఇబ్బందికరమైన ఇంటర్వ్యూలను కూడా అంగీకరించడానికి సిద్ధంగా ఉండేవారు. ఒక గ్లాసెడు విస్కీతో ఖుషీ చేసుకుంటారని పేరొందిన ఈ మితవాద ముస్లిం తాను మిలిటెంట్ సంస్థ అయిన 'లష్కర్–ఎ–తోయిబా'కు అతిపెద్ద మద్దతుదారును అని చెప్పేవారు. కార్గిల్ యుద్ధ నిర్మాత అయిన సైనిక అధిపతిగా ఉంటూనే, కశ్మీర్ సమస్యకు పరిష్కారం కోసం పాక్ చరిత్రలో ఎన్నడూ లేనంత సామీప్యతకు ఆయన చేరుకున్నారు. ఈ దురాక్రమణదారు చేసిన రక్తపాత రహిత తిరుగుబాటును జనం ఆమోదించి స్వాగతించారు. కానీ అదే జనం దృష్టిలో హేయమైన అధ్యక్షుడిగా మారిపోయి, అభిశంసనను తప్పించడానికి ఆయనతో బలవంతంగా రాజీనామా చేయించాల్సి వచ్చింది. ఇవి నిజంగానే చికాకు పెట్టే వైరుధ్యాలే మరి.

మరో రెండు ఆహ్లాదకరమైన విషయాలను పంచుకోనివ్వండి.

నేను జనరల్ ముషారఫ్‌ను 2000 సంవత్సరం ఫిబ్రవరిలో మొదటిసారి కలిశాను. ఇండియన్ ఎయిర్ లైన్స్ విమానం హైజాక్ అయిన కొంతకాలం తర్వాత మా సమావేశం జరిగింది. అది ఒక భారతీయ జర్నలిస్టుకు ఆయన ఇచ్చిన తొలి ఇంటర్వ్యూ. పైగా దాన్ని దూరదర్శన్‌లో ప్రసారం చేస్తారు కనుక నేను ప్రత్యేకించి దూకుడుగా ఉండాలని నిర్ణయించుకున్నాను.



నేను పాకిస్తాన్ జనరల్‌ను నియంత అని పిలిచాను. తన నిజాయితీ, విశ్వసనీయత పూర్తిగా అనుమానించదగినవని ఆయనతో చెప్పాను. ఆయన మామూలుగా నవ్వేశారు. అయితే ఆయన ఏ మాత్రం కలవరపడే వ్యక్తి కాదని గుర్తించడానికి నాకు ఎంతో సమయం పట్టలేదు. వాణిజ్య ప్రకటనలకు విరామం ఏర్పడిన సమయంలో, మా బంధం కొనసాగడానికి వీలుగా ఆయనతో చిన్న సంభాషణ చేయాల్సిన అవసరముందని భావించాను. దానికోసం ఆయన ధరించిన 'టై' గురించి ప్రశంసించాను. తర్వాత ఇంటర్వ్యూ తిరిగి ప్రారంభమైంది.

అర్ధగంట తర్వాత ఇంటర్వ్యూ ముగిశాక, ఆ ఇంటర్వ్యూకు సహకరించిన సిబ్బందికి జనరల్ టీ, స్నాక్స్ ఆతిథ్యం ఇచ్చారు. కెమెరామన్‌కు ఆయన సిగరెట్ ఆఫర్ చేశారు. సౌండ్ రికార్డిస్టు భుజంపై తన చేయి వేశారు. అలాగే ఎలక్ట్రీషియన్ జోక్‌కు ఫకాలున నవ్వారు. నిమిషాల్లోనే ఆయన వాతావరణాన్ని స్నేహపూర్వకంగా మార్చేశారు. ఆ కాసేపట్లోనే నాతోటి సహచరులు ఆయన పట్ల ఆత్మీయతను పెంచుకుంటున్నట్లు గ్రహించాను.

మేము వీడ్కోలు చెబుతుండగా, జనరల్ ముషారఫ్ తన టైని విప్పి, నాకు అందించారు. ''దీన్ని మీరు ధరించాలని కోరుకుంటున్నాను. దయచేసి దీన్ని మీకు ఇవ్వనివ్వండి'' అన్నారు.

''సర్, సర్, సర్'', నేను నత్తులు పలికాను. ''నేను చేసింది ఒక అమాయకపు వ్యాఖ్య. అంతకుమించి నేను మరేమీ సూచించలేదు'' అన్నాను. ''నాకు తెలుసు'', అంటూ ఆయన సమాధానమిచ్చారు. ''ఇది మీ పట్ల నా సఖ్యతకు సంకేతం మాత్రమే'' అన్నారు.

''మీకు కృతజ్ఞతలు'' అని నేను కదిలిపోయాను. తర్వాత, టైకి ఉన్న బంగారు పిన్నును, ఆయన చొక్కాకు వేలాడుతున్న బంగారు గొలుసును చూస్తూ నవ్వుతూ చెప్పాను. ''నేను గోల్డ్ చెయిన్ గురించి ప్రశంసించి ఉండాల్సింది. అప్పుడు బహుశా దాన్ని కూడా మీరు నాకు ఇచ్చి ఉండేవారు.''

అప్పుడు జనరల్ గట్టిగా నవ్వారు. ''హా. ఔర్ అగర్ ఆప్ కో జూతీ పసంద్ ఆయీ హోతీ తో వో భీ మిల్ జాతీ (అవును. ఒకవేళ మీకు బూట్లు ఇష్టమైతే అవి కూడా దొరికేవి)'' అంటూ హాస్యమాడారు.

తదుపరి సంవత్సరాల్లో నేను జనరల్‌ను చాలాసార్లు ఇంటర్వ్యూ చేశాను. ఇస్లామాబాద్‌లోనే కాదు, లండన్, దుబాయిల్లో కూడా ఇంటర్వ్యూ చేశాను. వీటిల్లో 2009లో చేసిన ఇంటర్వ్యూ నాకు బాగా గుర్తుంది. పదవీ విరమణ చేశాక, తన అధ్యక్షత గురించి, ప్రత్యేకించి కశ్మీర్‌పై తెర వెనుక జరిగిన చర్చల గురించి, జనరల్ నిజాయితీగా మాట్లాడడానికి ఇష్టపడతారా అని నేను ప్రశ్న రాసి పంపించాను. ''డియర్ కరణ్'' అంటూ ఆయన నాకు ఈమెయిల్లో సమాధానమిచ్చారు. ''ఇప్పుడు నేను ఇంటర్నెట్ వాడకం నేర్చుకుంటున్నాను. నా సాంకేతిక పరాక్రమపు మొదటి లబ్ధిదారు మీరే.''

అది నిజమే అని నేను కచ్చితంగా చెప్పలేను. అది అడగడానికి సమయం దొరకలేదు. కానీ జవాబివ్వడంలో అదొక మంచి ముఖస్తుతి విధానం. ఆ ఈమెయిల్ జవాబును నేను ఫ్రేము కట్టించాను. అది ఇప్పుడు నా స్టడీ రూములో వేలాడుతోంది.

తర్వాత కొన్ని వారాలకు లండన్‌లో ఆయనతో మరో ఇంటర్వ్యూకు అవకాశం ఏర్పడింది. అప్పుడు పాక్ జనరల్ ఓపెన్ నెక్ షర్టుతో పౌడర్ బ్లూ జాకెట్ ధరించి ఉన్నారు. రివీయెరా హోటల్లో సెలవులు గడపడానికి వచ్చిన హాలీవుడ్ నటుడిలా కనిపించారు. సూటు, టైతో కావాలనే అతిగా డ్రెస్ చేసుకున్నట్టు నాకు అనిపించింది.

''మీరు బో టైని ఎందుకు కట్టుకోలేదు?'' అని ఆయన అడిగారు. ''టై ఎలా కట్టుకోవాలో నాకు మీరు నేర్పుతారని అనుకున్నాను.''

అధికారం కోల్పోయి, చట్టం ముందు పలాయితుడుగా ఉన్నప్పుడు కూడా జనరల్ తన హాస్య ప్రవృత్తిని కోల్పోలేదు.

ఆయన చనిపోయిన వార్త రాగానే ఎక్కువగా ఆయన రాజకీయాలపై దృష్టి పడింది. అందుకే ఆయన వ్యక్తిత్వంలో ఇబ్బందికరమైన వైరుధ్యాలు కనిపించాయి. అవి నిజం కూడా. అదే సమయంలో ఆయనలోని ఆహ్లాదకరమైన విషయాలను కూడా మర్చిపోకూడదు. అవి కూడా సత్యంలో భాగమే.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

విశ్వ భాష



ఆకాశం కింద, అత్యంత అందమైన భాష ప్రేమ. ప్రేమికుల దినోత్సవ శుభాకాంక్షలు.

– వీంగాస్, పాకిస్తాన్ యాక్టివిస్ట్

తొలి పరిచయం



'కన్నత్తిల్ ముత్తమిట్టాల్' (బుగ్గ మీద చిన్నముద్దు; తెలుగులో 'అమృత') సినిమా విడుదలై 21 ఏళ్లయింది. నేపథ్య గాయనిగా 21 ఏళ్లయింది.

– చిన్మయి శ్రీపాద, గాయని

మరిన్ని నడపాలి



ఢిల్లీ చాలా దూరం! ఆరు నెలలుగా రోడ్లన్నీ బంద్ కావడంతో, ఢిల్లీ–లేహ్ (లద్దాఖ్) విమాన చార్జీలు వారం నుంచీ రూ.33,000 పైబడి ఉంటున్నాయి. లేహ్‌కు రావడం కంటే లండన్ పోవడం చవక. తిరిగి రావాలనుకునే విద్యార్థులు, రోగుల పరిస్థితి ఆలోచించండి. ఇంకొన్ని విమానాలు నడపడం అంత కష్టమేమీ కాదు.

– సోనమ్ వాంగ్‌చుక్, విద్యా సంస్కర్త

సాగడమే జీవితం



పరిస్థితులు మారిపోతాయి. స్నేహితులు వదిలేస్తారు. గుర్తుంచుకోండి, మీరు వాటిని పట్టించుకోకుండా సాగిపోతారా లేక గతంలోనే ఉండిపోతారా అన్నదానితో నిమిత్తం లేకుండా జీవితం నడుస్తూ ఉంటుంది.

– హర్ష్ గోయెంకా, పారిశ్రామికవేత్త

జై నితిన్!



ఇండియా 2022 సంవత్సరంలో ప్రతి రోజూ 38 కిలో మీటర్ల హైవే నిర్మాణాలు చేసింది! ఇది ప్రపంచంలోనే అత్యధికం. ఇది అసాధారణ విజయం. మోదీ ప్రభుత్వంలో రోడ్డు రవాణా, హైవేల మంత్రి నితిన్ గడ్కరీ ప్రత్యేకమైనవారు.

– రాజ్‌దీప్ సర్దేశాయి, జర్నలిస్ట్


అపకారికి ఉపకారము



ఆర్మేనియాను ఒంటరి చేయడం, ఆర్మేనియన్లను ఆకలికి మాడ్చడం, చల్లటి వాతావరణానికి బలి చేయడం కోసం (రిపబ్లిక్ ఆఫ్) 'అర్ట్‌సాక్'ను దిగ్బంధించింది అజర్‌బైజాన్. దీనికి టర్కీ మద్దతిస్తోంది. అయినప్పటికీ టర్కీ భూకంప బాధితులకు ఆర్మేనియా సాయం పంపింది. స్పందనగా, ఆర్మేనియాలో జరిగిన 1915 నాటి నరమేధాన్ని గుర్తించినందుకు మెక్సికోను విమర్శిస్తోంది టర్కీ.

– ఉజయ్ బులూత్, టర్కీ యాక్టివిస్ట్

తగని దాడి




మోదీ ప్రభుత్వంలో పదేపదే మీడియా స్వేచ్ఛ మీద దాడి జరుగుతోంది. ఉన్న కొద్దిపాటి విమర్శనా గొంతుకలను కఠినంగా, కక్ష సాధింపుతో ఊపిరాడకుండా చేస్తున్నారు. ప్రతిపక్షాలు, మీడియా మీద దాడి చేయడానికి సంస్థలను ఉపయోగించుకుంటే ఏ ప్రజాస్వామ్యమూ మనుగడ సాగించలేదు. జనం దీన్ని ఎదుర్కొంటారు.

– మల్లికార్జున్ ఖర్గే, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు

వ్యక్తి కేంద్రిత బడ్జెట్ కావాలి

అభిప్రాయం



కూనంనేని సాంబశివరావు

స్వాతంత్ర్యం సాధించి 76 ఏళ్లు గడిచినప్పటికీ మూస బడ్జెట్ విధానం వల్ల దేశంలో దాదాపు 80 శాతం ప్రజల జీవితం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న విధంగా ఉంది. కాలం చెల్లిన బడ్జెట్ రూపొందించే విధానాన్ని మార్చి, వ్యక్తి కేంద్రంగా, అలాగే గ్రామం యూనిట్‌గా ఉండే కొత్త తరహా బడ్జెట్‌ను రూపొందించే క్రమానికి శ్రీకారం చుట్టవలసిన అవసరం ఉంది. బడ్జెట్ అంటే జమా, ఖర్చుల పట్టికగా; వార్షిక, ఆర్థిక ప్రకటనగా, నూతన ఆర్థిక సంవత్సరంలో ద్రవ్య వ్యయానికి పార్లమెంట్ ఆమోదం పొందే ప్రక్రియగానే చూడరాదు. 2022–23 బడ్జెట్ 39.5 లక్షల కోట్లు కాగా... ప్రస్తుత 2023–24 బడ్జెట్ రూ. 45 లక్షల కోట్లుగా ప్రవేశపెట్టి గతం కంటే బడ్జెట్ వ్యయం పెంచినట్లుగా కేంద్ర ఆర్థిక శాఖా మంత్రి నిర్మలా సీతారామన్ ఘనంగా పేర్కొన్నారు. 2022–23 ఆర్థిక సంవత్సరం జీడీపీ శాతం 9.2 శాతం ఉంటుందని గత బడ్జెట్ ప్రవేశపెట్టే సమయంలో పేర్కొన్నారు.



కానీ ఎకనమిక్ సర్వే ప్రకారం 2022–23 ఆర్థిక సంవత్సరంలో 7 శాతంగా అంచనా వేయడం జరిగింది. నూతన బడ్జెట్ ప్రవేశ పెట్టే సమయంలో 2023–24కు 6.5 శాతంగా జీడీపీ ఉంటుందని నిర్మలా సీతారామన్ ప్రకటన చేశారు. అంటే అనుకున్నదొకటయితే... జరుగుతున్నది మరొకటన్నమాట. నిజానికి ఈ జీడీపీ లెక్కింపూ తప్పుల తడకే. సామాన్యుల, సంపన్నుల ఆదాయాలు కలిపి లెక్కవేయడం వలన జీడీపీలో ఈ మాత్రం వృద్ధి కనిపిస్తున్నది. నిజానికి సామాన్యుల ఆదాయంలో మార్పు ఏమీ లేదు. అసమానతలు అలాగే ఉన్నాయి. అందువలన అంకెలపై ఆధారపడిన బడ్జెట్ కాకుండా వ్యక్తి కేంద్రంగా బడ్జెట్ తయారుచేసి శాచ్యురేషన్ స్థాయికి ఆయా పథకాలను తీసుకొని వెళ్ళగలిగితే... ఒక నిర్దిష్ట కాలపరిధిలో పూర్తి సమానత్వం కాకపోయినా పేదరికం నుంచి దేశంగాని, ఆయా రాష్ట్రాలు గాని బయటపడే అవకాశం ఉంది.

దేశంలో అందరూ అభివృద్ధి చెందాలంటే జీరో ఆధారిత బడ్జెట్, వ్యక్తి కేంద్రిత బడ్జెట్‌ను ప్రవేశపెట్టాలి. జీరో ఆధార బడ్జెట్‌ను గ్రామ యూనిట్‌గా, వ్యక్తి అవసరాలకు అనుగుణంగా తయారు చేయవచ్చునని అనేక మంది ఆర్థికవేత్తలు సూచిస్తున్నారు. సెక్టార్ల పరంగా కేటాయింపులు జరుపుతూనే సమాజంలోని ప్రతీ ఆఖరి వ్యక్తినీ పరిగణనలోకి తీసుకునే విధంగా గత బడ్జెట్‌లతో సంబంధం లేకుండా ప్రస్తుత వాస్తవ పరిస్థితులపై ఆధారపడి కొత్తగా జీరో పాయింట్ నుంచి తయారు చేసేది జీరో బడ్జెట్. ఈ జీరో బడ్జెట్‌లోనే నేరుగా నగదు పంపిణీ లాంటి పథకాలను అనుసరించవలసిన అవసరం ఉంటుంది. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ లాంటి అనేక మంది ఆర్థిక వేత్తలు కూడా పలు పర్యాయాలు ప్రస్తావన చేసిన విధంగా... ప్రతీ పేదవాడికీ నగదు రూపంలో ఆర్థిక సహాయం అందితే పారదర్శకంగా, అవినీతి రహితంగా ప్రతీ రూపాయీ అర్హుడికి చేరుతుంది. ఆ విధంగా కొనుగోలు శక్తి పెరగడమే కాకుండా అసమానతలు కూడా కాలక్రమంలో తగ్గించబడతాయి.

ఈ సందర్భంగా బడ్జెట్‌కి అవసరమైన నిధుల సమీకరణ అనే సమస్య ఉత్పన్నమవుతుంది. ఈ సమస్య నుంచి బయటపడాలంటే తప్పనిసరిగా సంపదపైన కనీసం 2 శాతం నుంచి 4 శాతం పన్నును విధించవలసిన అవసరం ఉన్నది. అలాగే కార్పొరేట్ ట్యాక్స్‌ను కార్పొరేట్లకు అనుకూలంగా తగ్గించడం వలన అసమానతలు మరింత పెరుగుతాయి. ఈ క్రమంలో శతసహస్ర కోటీశ్వర్ల దాతృత్వం చేయవలసిన అవసరం కూడా ఉన్నది. ఇటీవల దావోస్‌లో జరిగిన ఆన్‌లైన్ వరల్డ్ ఎకనమిక్ ఫోరం సమావేశానికి తమ వద్ద పోగుపడిన సంపదపై పన్ను వేయాలంటూ 102 మంది శత కోటీశ్వరులు లేఖ రాయడం విశేషం. అలాగే వారెన్ బఫెట్, బిల్ గేట్స్ లాంటి వారు తమ సంపదలో సగానికి పైగా ఇప్పటికే తమ మాతృదేశానికి వితరణ చేయడం జరిగింది. భారతదేశంలో టాటాలు గత వందేళ్లలో దాదాపు 102 బిలియన్ డాలర్లనూ, ప్రేమ్‌జీ 21 బిలియన్ డాలర్లనూ సమాజ శ్రేయస్సుకు వితరణ చేశారు. పై విధంగా సంపన్నుల వితరణ, అధిక సంపద పన్ను, పేదలకు నేరుగా నగదు సహాయం అందించే పథకాలు లాంటివి ఉంటే... తప్పనిసరిగా దేశం బాగుపడుతుంది.

వ్యాసకర్త సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, మాజీ శాసన సభ్యులు

అది వక్రీకరణే!

ఆర్‌ఎస్‌ఎస్ సర్ సంఘ్ చాలక్ మోహన్ భాగవత్ ఇటీవల సంత్ రవిదాస్ జయంతి సందర్భంగా ముంబయిలో జరిగిన ఓ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. మరాఠీ ప్రసంగం ఆద్యంతం సంస్కరణ – సమరసతను దృష్టిలో పెట్టుకొని కొనసాగింది. ప్రతి అంశాన్నీ ఏదో ఒక పద్ధతిలో విపరీతం చేయటం, పెడర్థాలు తీయటం దేశంలో ఓ బౌద్ధికపరమైన యుద్ధమని చెప్పాలి. అదే క్రమంలో మోహన్ భాగవత్ ప్రసంగాన్ని వక్రీకరించి మరోసారి హిందూ అనుకూల వాతావరణం, హిందూ సమాజ ఐక్యతను దెబ్బతీసే విధంగా వ్యతిరేక శక్తులు చెలరేగిపోయాయి. కులాలను సృష్టించింది దేవుడు కాదు, పండితులే అనీ, పూజారులు అనీ అన్నట్లు పత్రికల్లో పతాక శీర్షికలు వచ్చాయి. అనువాద సమస్య వల్లనో, అవసరార్థం వల్లనో వివాదం చేసే ప్రయత్నం మొదలైనది. కోడిగుడ్డు మీద ఈకలు పీకే చందంగా ఎవరి వ్యాఖ్యానాలు వారు చేయటం మొదలెట్టారు. అసలు వారి ప్రసంగంలో ఏం చెప్పారో ఒకసారి గమనిద్దాం. 'భగవంతుడు సర్వ వ్యాపి... భగవంతుడు సత్య రూపుడు... సత్యమే భగవంతుడు. అందరిలో, అన్నింటిలో ఆయన ఉన్నప్పుడు ఒకటి తక్కువా ఒకటి ఎక్కువ అని ఎలా చెప్పగలం? అలానే పుట్టుక వలన వచ్చే జాతి (కులం) ఒకటి ఎక్కువ ఒకటి తక్కువ అని ఎలా చెప్తాము?? సంత్ రవిదాస్‌ను ఆయన కుటుంబ సభ్యులే వెనక్కిలాగారు, కానీ ఆయన సత్య మార్గాన్నే ఎంచుకున్నారు. సత్యాన్ని గురించి శోధించారు. ఆయనకు ఈశ్వర దర్శనం అయింది. అప్పుడు ఆయన చెప్పారు 'సత్యమే శివం' అనీ... పుట్టుక కారణంగా ఒకరు ఎక్కువ ఒకరు తక్కువ అనేది శాస్త్ర ప్రమాణం ఎవరైతే మాట్లాడు తున్నారో వారు సత్యాన్ని సరిగా అర్థం చేసుకోలేకపోవచ్చు లేదా సత్యాన్ని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తుండవచ్చు లేదా వాళ్ళు సత్యాన్ని అర్థం చేసుకోవడంలో తికమక పడి ఉండవచ్చు. మన ధర్మం ఎప్పుడూ సమాజ అసమానతలు బోధించలేదు. ఈ విషయాన్ని సమాజానికి తెలియ చెప్పాలి. మన ధర్మం మనకి ముఖ్యంగా 3 విషయాలు ఎలా ఆచరణాత్మకంగా ఉండాలో బోధించింది. 1. సత్యం 2. ధర్మా చరణ 3. కర్తవ్యం.'



సంత్ రవిదాస్ స్మారకోపన్యాసం క్లుప్తంగా పై విధంగా ఉంది. మోహన్ భాగవత్ చెప్పిన మాటల్లో నిందాపూర్వకమో, విమర్శ ధోరణియో మనకు కన్పించదు. సమాజ సంఘటనకు కావలసిన సమన్వయ మార్గాన్ని రవిదాస్ బోధనల ద్వారా ఆయన సూచించారు. కులాల పుట్టుకకు కారణాలు చెప్పటం ఆయన ఉద్దేశంలో లేదు. ఎక్కడా చెప్పలేదు. ఎక్కడా ఊహా అపోహలకు దారి తీసే ప్రసంగం కాదు. కుల ప్రసక్తి లేని సమరసతా యుక్త సమాజ నిర్మాణం ఆర్‌ఎస్‌ఎస్ ధ్యేయం. శక్తిమంతం అవుతున్న హిందూత్వమే ప్రపంచ శాంతికి బాటలు వేసే విశ్వ మానవ ధర్మం. అతలాకుతలం అవుతున్న మానవ విలువలకూ, విశాల భావాలకూ హిందూత్వమే పునాది. హిందూత్వం ద్వేషాన్ని ప్రేరేపించదు. హిందువులు 'సర్వేభవంతు సుఖినః' అనే ప్రార్థిస్తారు తప్పా ఎక్కడా 'హిందూ సుఖినో భవంతు' అని ప్రార్థించరు. అనవసర వివాదాలకు హిందూ త్వాన్నీ, ఆర్‌ఎస్‌ఎస్‌నూ కేంద్ర బిందువు చేయాలనుకుంటే అది మేధాపరమైన మూర్ఖత్వం అవుతుంది తప్ప మరొకటి కాదు. కావున ప్రసంగ సారాంశాన్ని అర్థం చేసుకొని ప్రతి ఒక్కరం సామాజిక దురాచారాల్ని దూరం చేసేందుకు ప్రయత్నిద్దాం.

– సాకి, సమరసతా సాహితీ వేదిక

మొబైల్ : 99493 94688

నీతులు చెప్పే వృద్ధ హంస

శ్రీకృష్ణుని అనుమతితో యుధిష్ఠిరుడు రాజసూయ యాగం తలపెట్టి పెద్దయెత్తున చేస్తున్నాడు. ఆహ్వానం అందుకొని ఎందరో రాజులు వచ్చి ఉన్నారు. వాళ్లలో శిశుపాలుడు కూడా ఉన్నాడు. ధర్మరాజు అడుగుతాడు భీష్ముణ్ణి... ఇందరిలో ఎవరికి ముందు అర్ఘ్యమిచ్చి గౌరవించాలి అని. ఆ గౌరవానికి అర్హుడు కృష్ణుడు ఒక్కడే అంటాడు భీష్ముడు. ఇది శిశుపాలుడికి రుచించదు. కృష్ణునకు గౌరవమివ్వటాన్ని వ్యతిరేకిస్తాడు.



జ్యోతిర్మయం

భీష్ముడు అతణ్ణి గట్టిగా మందలిస్తాడు. అప్పుడు శిశుపాలుడు భీష్ముణ్ణి వ్యక్తిగతంగా దూషిస్తూ ఒక కథ చెప్తాడు. ఆ కథ మహాభారతం సభా పర్వం ద్వితీయాశ్వాసంలో ఉంది.

పూర్వం సముద్రం ఒడ్డున ఒక వృద్ధ హంస ఉండేది. అక్కడి పక్షులకు అది ఎప్పుడూ ధర్మం గురించి చెబుతూ, అధర్మం వైపు వెళ్ళవద్దని హెచ్చరిస్తూ ఉండేది. వృద్ధ హంస మాటలు ఉన్నట్లుగా, చేతలు ఉండేవి కావు. ఈ సత్యం గ్రహించలేని పక్షులు దాని మాటలు నమ్మి గౌరవిస్తూ ఉండేవి. సముద్రం మీదకు వెళ్లినప్పుడల్లా అవి వృద్ధ హంసకు రుచికరమైన ఆహారం తెచ్చి ఇచ్చేవి. ఏ మాత్రం శంక లేకుండా తమ గుడ్లను వృద్ధ హంస చుట్టుపక్కలే వదిలిపెట్టి తాము సముద్రం మీదకు వేటకు వెళ్లేవి. దుష్ట చింతనగల వృద్ధ హంస తెలివిగా ఆ గుడ్లను తినివేసేది. తమ గుడ్లు దినదినం తగ్గిపోతుండటం గమనించిన ఒక పక్షికి అనుమానం వచ్చింది. ఓ రోజు... చాటున ఉండి వృద్ధ హంస చేసే నీచ కృత్యాన్ని చూసి అనుకొన్నది – 'ఈ వృద్ధ హంస ఇతరులకు నీతులు చెప్పుంది. కానీ తను మాత్రం పాటించదు' అని. ఇక ఊరుకొని లాభం లేదనుకొని మిగతా పక్షులన్నింటికీ వృద్ధ హంస అసలు నైజం చాటి చెప్పింది. వెంటనే పక్షులన్నీ చేరి వృద్ధహంస పైబడి దానిని హతమార్చాయి.

ఈ కథ చెప్పి శిశుపాలుడు భీష్ముణ్ణి ఆ వృద్ధ హంసతో పోలుస్తాడు. భీష్ముడు అలాంటివాడు కాదనీ, ఆ పోలిక సరైనది కాదనీ అక్కడి వారిలో చాలామందికి తెలుసు. శిశుపాలుడు ఆ విధంగా భీష్ముణ్ణీ, శ్రీకృష్ణుణ్ణీ పరుష వచనాలతో నిందించటం ఆపడు. శిశుపాలుడు అట్లా నూరు తప్పులు చేసేదాకా ఓపిక పట్టి, తరువాత అతడి తలను శ్రీకృష్ణుడు తన చక్రంతో తురుముతాడు.

వృద్ధ హంస కథ వల్ల మనకు తెలియదగ్గ నీతి ఏమిటి? ఈ కాలం ఆ కాలం అని కాకుండా, ఏ కాలంలో అయినా ధర్మోపన్యాసాలు చేస్తూ జీవించేవారు కొద్దిమంది ఉంటారు. వారు పైకి హంసలా కనిపిస్తూ లోపల కొంగ బుద్ధితో ఉంటారు. అలాంటి వారి మాటలు నమ్మి మోసపోగూడదు. వారి అసలు గుణం ఏమిటో వారు చేసే పనులను బట్టి తెలుసుకోవాలి.

– దీవి సుబ్బారావు

గ్రహం అనుగ్రహం

శ్రీ శుభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, తిథి: బ.దశమి రా.12.55 వరకు, తదుపరి ఏకాదశి, నక్షత్రం: జ్యేష్ఠ రా.8.37 వరకు, తదుపరి మూల, వర్జ్యం: తె.4.11 నుండి 5.52 వరకు (తెల్లవారితే గురువారం), దుర్ముహూర్తం: ప.11.51 నుండి 12.35 వరకు, అమృతఘడియలు: ప.12.10 నుండి 1.40 వరకు; **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు, **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **సూర్యోదయం:** 6.32, **సూర్యాస్తమయం:** 5.57.

క్లుప్తంగా...

త్రీఫేజ్ విద్యుత్ సరఫరా ఎలా జరుగుతోంది?

- టీఎస్ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు ఆరా



రఘునాథపల్లి సబ్‌స్టేషన్‌ను తనిఖీ చేస్తున్న సీఎండీ గోపాల్‌రావు

సాక్షి ఎఫెక్ట్

రఘునాథపల్లి: వ్యవసాయ మోటార్లకు త్రీఫేజ్ విద్యుత్ సరఫరా ఎలా జరుగుతుందో తెలుసుకునేందుకు టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు జనగామ జిల్లా రఘునాథపల్లి సబ్ డివిజన్ సెక్షన్ ఆఫీస్, ఈఆర్వో కార్యాలయం, 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. త్రీఫేజ్ కరెంట్ సరఫరా అస్తవ్యస్తంగా ఉండటంతో పొలాలకు నీరు పెట్టేందుకు రైతులు రాత్రివేళ పడుతున్న ఇబ్బందులపై 'సాక్షి'ప్రధాన సంచికలో మంగళవారం 'చేను తడవాలంటే జాగారమే'శీర్షికన ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. వ్యవసాయానికి త్రీఫేజ్ సరఫరా ఎలా జరుగుతుంది, ఏమైనా ఇబ్బందులున్నాయా.. 33/11 పవర్ ట్రాన్స్‌ఫార్మర్ల తీరు తెన్నులు అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలన, వర్క్ కేటాయింపు రిజిస్టర్‌లను తనిఖీ చేశారు. వినియోగదారులకు, రైతులకు ఎలాంటి ఆటంకం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని సూచించారు. అధికారులు, ఉద్యోగులు హెడ్‌క్వార్టర్‌లో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఆయన వెంట సూపరింటెండెంట్ ఇంజనీర్ వేణుమాధవ్, డీఈ ఆపరేషన్ ఎంఎల్ఎస్ రెడ్డి, డీఈ ఐటీ అనిల్ కుమార్, ఏడీఈ మనోహర్‌రెడ్డి, ఎస్ఏవో జయరాజ్, ఏఏవో హన్మంత్‌నాయక్, ఏఈ రాహుల్ తదితరులున్నారు.

వైరా బీఆర్ఎస్ నేతల వేరుకుంపటి

రాజీనామా చేసి పొంగులేటికి సంఘీభావం



బీఆర్ఎస్‌కు రాజీనామా ప్రకటిస్తున్న పట్టణ అధ్యక్షుడు రాజశేఖర్, పక్కన కౌన్సిలర్లు

వైరా: ఖమ్మం జిల్లా వైరాలో బీఆర్ఎస్ నేతలు పలువురు పార్టీకి రాజీనామా చేశారు. పార్టీ వైరా పట్టణ అధ్యక్షుడు దార్న రాజశేఖర్‌తో పాటు పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు మంగళవారం రాజీనామా ప్రకటించడమే కాక.. మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెంట నడుస్తామని స్పష్టం చేశారు. వైరా 7, 8, 20వ వార్డుల కౌన్సిలర్లు పణితి ఉష, కన్నెగంటి సునీత, గుగులోత్ లక్ష్మీబాయి, పట్టణ అధ్యక్షుడు దార్న రాజశేఖర్‌తో పాటు గండగలపాడు గ్రామ శాఖ అధ్యక్షుడు షేక్ సైదులు తదితరులు రాజీనామా చేసిన వారిలో ఉన్నారు. కాగా, వైరాలో పొంగులేటి ఆధ్వర్యాన బుధవారం ఆత్మీయ సమ్మేళనం జరగనున్న నేపథ్యంలో బీఆర్ఎస్ నాయకులు రాజీనామా చేయడం గమనార్హం.

బీజేపీ నేతలను మాదిగ వాడలకు రానీయొద్దు

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ పిలుపు



కోదాడ అర్బన్: 'మాదిగలను అడుగడుగునా మోసం చేస్తున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి రాజకీయ పతనం తప్పదని, బీజేపీ నేతలను మాదిగ వాడలకు రానీయొద్దని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. మాదిగ బిడ్డలంతా ఏకతాటిపై ఉండి బీజేపీపై యుద్ధం చేయాలన్నారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కోదాడలోని ఎంఎస్ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన ఎమ్మెస్పీ, ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ వాటి అనుబంధ సంఘాల అత్యవసర జాతీయ కార్యవర్గ సమావేశం ఎమ్మెస్పీ రాష్ట్ర అధ్యక్షుడు తీగల ప్రదీప్‌గౌడ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాట్లాడుతూ దేశంలో సంపూర్ణ మెజారిటీతో అధికారం కలిగి ఉండి ఎన్నో బిల్లులను రాజ్యాంగ సవరణల ద్వారా పార్లమెంట్‌లో ఆమోదింపజేసుకుంటున్న బీజేపీ ఒక్క ఎస్సీ వర్గీకరణ విషయంలో మాత్రమే నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. ఎస్సీ వర్గీకరణ చేయకుండా బీజేపీ నేతలు ఏ ముఖం పెట్టుకుని మాదిగల ఓట్లు అడగటానికి వస్తారని ప్రశ్నించారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు నాగరాజు మాదిగ, ఎమ్మెస్పీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు విశ్వనాథ్ మాదిగ, ఎమ్మార్పీఎస్ తెలంగాణ అధ్యక్షుడు గోవిందు నరేశ్‌మాదిగ, ఎమ్మార్పీఎస్ ఏపీ అధ్యక్షుడు సురేశ్‌మాదిగ, ఎమ్మార్పీఎస్ జాతీయ అధికార ప్రతినిధి భిక్షపతిమాదిగ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ మస్తుగుంది..



వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ ఎదుట పండ్లు, కూరగాయలతో బొమ్మ

కార్పొరేట్ మాల్‌ను తలపించేలా వెజ్, నాన్‌వెజ్ మార్కెట్

ఖమ్మం వీడీవోస్ కాలనీలో సకల హంగులతో నిర్మితమైన సమీకృత వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ కార్పొరేట్ మాల్స్‌ను తలపిస్తున్నాయి. వెజ్, నాన్‌వెజ్ మార్కెట్లను వేర్వేరుగా ఏర్పాటు చేయగా.. వాటి ఆవరణలో ఏర్పాటుచేసిన బొమ్మలు చూపు తిప్పుకోనివ్వడం లేదు. కూరగాయలు అమ్మే మహిళా రైతు, పండ్ల బుట్ట, అరటి గెలలు తదితర బొమ్మలు కనువిందు చేస్తున్నాయి. ఈమేరకు వీటి ఫొటోలను ట్విట్టర్‌లో షేర్ చేసిన పురపాలక, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్.. రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌తో పాటు ఖమ్మం మేయర్ నీరజ, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్‌ను అభినందించారు. రాష్ట్రంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ ఇంటిగ్రేటెడ్ మార్కెట్లను ఎలా నిర్మిస్తోందో చెప్పడానికి ఖమ్మం మార్కెట్ నమూనాగా నిలుస్తోందని పేర్కొన్నారు.

– స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఖమ్మం / ఖమ్మం మయూరిసెంటర్



కుట్టు శిక్షణతో మహిళల జీవితాల్లో వెలుగులు: ఎర్రబెల్లి

జనగామ: కుట్టుశిక్షణ మహిళల జీవితాల్లో వెలుగు నింపుతుందని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. జనగామ జిల్లా పాలకుర్తిలో పైలట్ ప్రాజెక్టు కింద ఏర్పాటు చేసిన కుట్టుశిక్షణ శిబిరాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. రాష్ట్రంలో మహిళా సాధికారత లక్ష్యంగా ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ, స్త్రీనిధి సహకారంతో పాలకుర్తి నియోజకవర్గంలో రూ.5 కోట్లకు పైగా నిధులతో 3 వేల మంది మహిళలకు ఉచితంగా కుట్టుమిషన్ శిక్షణ ఇప్పిస్తున్నట్లు వెల్లడించారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ఉపాధి, ఉద్యోగావకాశాలపై కూడా భరోసా కల్పిస్తామని ఎర్రబెల్లి హామీ ఇచ్చారు. వరంగల్‌లోని టెక్స్‌టైల్ పార్క్‌లో ఉద్యోగ అవకాశాలు చాలా ఉన్నాయని, ఇంటివద్ద నుంచి కూడా పని చేసుకునే అవకాశాలు చూపిస్తామన్నారు. శిక్షణకు గైర్హాజరైన మహిళలకు మంత్రి నేరుగా ఫోన్ చేసి మాట్లాడారు. శిక్షణకు ప్రతి మహిళ వచ్చి, ప్రస్తుత ట్రెండ్ ప్రకారం తర్ఫీదు పొంది, ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలో గ్రామాల వారీగా ప్రజల హెల్త్ ప్రొఫైల్‌ని రెడీ చేస్తున్నామని, ఇందులో భాగంగా ప్రయోగాత్మకంగా పైలెట్ ప్రాజెక్టు కింద ములుగులో చేపట్టి విజయవంతం చేశామని ఎర్రబెల్లి పేర్కొన్నారు.

ప్రత్యామ్నాయమా.. ఒంటరిపోరా!

బీఆర్ఎస్ కలిసిరాని పక్షంలో కార్యాచరణపై లెఫ్ట్ సమాలోచన

- బీజేపీ వ్యతిరేక శక్తులతో కలిసి పనిచేస్తామంటున్న వామపక్షాలు
- కుదరకపోతే మరిన్ని సీట్లలో ఒంటరిగా పోటీ చేసే యోచన
- మఖ్దూం భవన్‌లో పొత్తులు, ప్రజా పోరాటాలపై నేతల కీలక భేటీ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో బీఆర్ఎస్‌తో సీపీఐ, సీపీఎంల పొత్తు వ్యవహారం గందరగోళంగా మారింది. మునుగోడు ఉప ఎన్నికల సందర్భంగా ప్రదర్శించిన ఐక్యత ఇప్పుడు మూడు పార్టీల మధ్య కనిపించడం లేదు. ఈ నేపథ్యంలోనే.. బీఆర్ఎస్ కలిసిరాని పక్షంలో ప్రత్యామ్నాయ మార్గాల అన్వేషణ, కుదరని పక్షంలో ఒంటరిగా పోటీ దిశగా వామపక్షాలు సమాలోచన చేస్తున్నాయి. వాస్తవానికి రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లోనూ తమ మధ్య పొత్తు ఉంటుందని మునుగోడు ఎన్నికల సందర్భంగా పలుమార్లు కొందరు నాయకులు ప్రకటించినా, ఇప్పుడు దానిపై స్పష్టత కరువైంది. పైగా వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో లెఫ్ట్ పార్టీలకు పొత్తులో భాగంగా సీట్లు కేటాయించేది లేదనీ, కేవలం ఎమ్మెల్సీ స్థానాలు ఇచ్చి సరి పెడతామని కొందరు బీఆర్ఎస్ నేతలు చేస్తున్న తాజా ప్రచారంపై కామ్రేడ్లు మండిపడుతున్నారు. 'మాది రాజకీయ పార్టీ. ప్రజా క్షేత్రంలో పోరాడిన చరిత్ర మాది. దేశంలో గతంలో మూడు రాష్ట్రాల్లో అధికారంలో ఉన్నాం. ఇప్పుడు కేరళలో అధికారంలో ఉన్నాం. జాతీయ స్థాయిలో కీలకమైన పార్టీలుగా ఉన్నాం. అలాంటి పార్టీలు ఎమ్మెల్సీ, రాజ్యసభ వంటి నామినేటెడ్ పోస్టుల వరకే పరిమితం కాబోవు. ఎలాంటి పరిస్థితుల్లోనైనా వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తాం. పొత్తు ఉన్నా లేకున్నా బరిలో ఉంటాం..'అని లెఫ్ట్‌కు చెందిన ఒక కీలకనేత వ్యాఖ్యానించడంతో పొత్తులు రసకందాయంలో పడ్డాయి.

పొత్తులపై హాట్‌హాట్ చర్చ

రాష్ట్రంలో బీజేపీకి అడ్డుకట్ట వేసేందుకు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో గౌరవప్రదమైన స్థానాలు ఇస్తే బీఆర్ఎస్‌తో కలిసి పోటీ చేయాలని లెఫ్ట్ పార్టీలు భావిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పొత్తులు, ప్రజాసమస్యలపై పోరాటాలు వంటి అంశాలపై సీపీఐ, సీపీఎం పార్టీలకు చెందిన సీనియర్ నేతలు మంగళవారం సీపీఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూం భవన్‌లో సమావేశమయ్యారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తో పాటు ఆ పార్టీకి చెందిన పశ్య పద్మ, చాడా వెంకటరెడ్డి తదితరులు.. సీపీఎం నుంచి రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, జూలకంటి రంగారెడ్డి, పోతినేని సుదర్శన్, జాన్ వెస్లీ, చెరుపల్లి సీతారాములు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొత్తులపై హాట్‌హాట్‌గా చర్చ జరిగింది. 'మేం చెరో 10 స్థానాల్లో పోటీ చేయాలని భావిస్తున్నాం. ఆ మేరకు బీఆర్ఎస్‌కు ప్రతిపాదించే ఆలోచనలో ఉన్నాం. ఆ పార్టీతో జరిగే చర్చల్లో అటుఇటుగా పొత్తుకు సిద్ధం అవుతాం. ఒకవేళ బీఆర్ఎస్ మాకు గౌరవప్రదమైన స్థానాలు ఇవ్వకపోతే ఇతర ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషిస్తాం. బీజేపీకి అడ్డుకట్ట వేసే మరో పార్టీతో పొత్తు పెట్టుకునే విషయాన్ని పరిశీలిస్తాం. కుదరకపోతే ఒంటరిగానైనా పోటీ చేస్తాం. అప్పుడు అవసరమైతే చెరో 20 స్థానాల్లోనూ పోటీ చేసి తీరతాం'అని ఆ చర్చల్లో పాల్గొన్న ఒక నేత స్పష్టం చేశారు. మరోవైపు రాబోయే ఎన్నికల్లో పరస్పర ఐక్యత ప్రదర్శించాలని రెండు పార్టీలు స్పష్టమైన అవగాహనకు వచ్చాయి. ఎక్కడా ఒకరిపై మరో పార్టీ పోటీకి పెట్టకుండా ఉండాలని నిర్ణయించాయి. కాగా బీఆర్ఎస్, కామ్రేడ్ల మధ్య సాగుతున్న ఈ వ్యవహారాన్ని కాంగ్రెస్ పార్టీ ఆసక్తిగా పరిశీలిస్తోంది.

ప్రజా సమస్యలపై పోరాటాలు

రాష్ట్రంలో ప్రజా సమస్యలపై కలిసి పనిచేయా లని కూడా సీపీఐ, సీపీఎంలు నిర్ణయించాయి. ఈ మేరకు మార్చి నెలలో ప్రజా పోరాటాలు నిర్వహించనున్నాయి. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చేలా ఒత్తిడి తేనున్నాయి. డబుల్ బెడ్‌రూం ఇళ్లు, దళితులకు మూడెకరాల భూమి పంపిణీ సహా పలు అంశాలపై ఐక్య పోరాటాలు నిర్వహించాలని నిర్ణయించాయి.

పొత్తుల్లేవ్.. అవగాహనే!

▶ మొదటి పేజీ తరువాయి

119 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేయాలని భావిస్తున్నట్టు తెలిసింది. ఈ క్రమంలో సీపీఎం, సీపీఐలకు పెద్దల సభలైన శాసన మండలి, రాజ్యసభ పదవులు ఇచ్చే ఆలోచన చేస్తున్నట్టు సమాచారం. అసెంబ్లీ ఎన్నికల్లో కలిసి పనిచేయాలని సూత్రప్రాయంగా అవగాహన కుదిరిందని.. పోటీ, పొత్తులు, సీట్లు తదితరాలపై స్పష్టతకు కొంత సమయం పడుతుందని బీఆర్ఎస్ వర్గాలు చెప్తున్నాయి.

పనితీరు.. సర్వేలు.. నివేదికలు

ప్రధాన పార్టీలతోపాటు చిన్నాచితకా పార్టీలు కూడా పాదయాత్రలు, సభలు, సమావేశాల పేరిట హడావుడి చేస్తుండటంతో.. రాష్ట్రంలో నియోజకవర్గాల వారీగా రాజకీయ పరిస్థితులను సీఎం కేసీఆర్ ఎప్పటికప్పుడు మదింపు చేస్తున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేల పనితీరుపై ఇప్పటికే పలు సంస్థల సర్వేలతోపాటు నిఘా వర్గాల నివేదికలు కూడా తెప్పించుకుని పరిశీలిస్తున్నారు. ఆయా నియోజకవర్గాల్లో విపక్ష నేతల బలాబలాలను అంచనా వేస్తున్నారు. సిట్టింగ్‌లకే పార్టీ టికెట్లు ఇస్తామని కేసీఆర్ పలు సందర్భాల్లో ప్రకటించినా.. గెలుపు గుర్రాలకే టికెట్లు దక్కుతాయని సంకేతాలు ఇస్తున్నారు. 40కిపైగా నియోజకవర్గాల్లో సిట్టింగ్ ఎమ్మెల్యేలతోపాటు బలమైన నేతలు కూడా ఉండటంతో ఎవరికి టికెట్ దక్కుతుందనే అంశంపై స్థానిక కేడర్‌లో ఉత్కంఠ నెలకొంది. ఆయా చోట్ల టికెట్ల కేటాయింపు పార్టీ అధిష్టానానికి కూడా కత్తిమీద సాములా మారే పరిస్థితి కనిపిస్తోందని అంటున్నారు. కొందరు ఎంపీలు, ఎమ్మెల్సీలు కూడా అసెంబ్లీ టికెట్ ఆశిస్తుండటంతో.. అవసరమైన చోట వారికి పోటీ అవకాశం దక్కనున్నట్టు వివరిస్తున్నాయి. అరడజను నియోజకవర్గాల్లో కొత్తవారికి టికెట్ కట్టబెట్టే అవకాశం ఉన్నట్టు పేర్కొంటున్నాయి.

ఓటర్ల జాబితా వడపోతపై దృష్టి

పార్టీలో క్షేత్రస్థాయిలో ప్రతి వంద మంది ఓటర్లకు ఒకరు చొప్పున ఇన్‌చార్జీలను నియమించి, ఆ జాబితాలను పార్టీ కార్యాలయంలో అందజేయాలని సీఎం కేసీఆర్ నాలుగు నెలల క్రితమే ఆదేశించారు. ఈ ప్రక్రియ ముందుకు సాగని నేపథ్యంలో త్వరలో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించి ఇన్‌చార్జీల నియామకానికి గడువు విధించే అవకాశం ఉందని చెప్తున్నారు. పార్టీ ఆదేశాల మేరకు కొందరు ఎమ్మెల్యేలు ఓటర్ల జాబితా వడపోతపై దృష్టి సారించారు. కొత్తగా నమోదైన ఓటర్లు, యువత, ఓటరు జాబితాలో పేరుండి ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్నవారి వివరాలను పోలింగ్ బూత్‌ల వారీగా సిద్ధం చేస్తున్నారు. గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల నాటి పలు అంశాలను దృష్టిలో పెట్టుకుని.. పట్టణ ప్రాంతాల్లో కొత్తగా నమోదైన ఓటర్ల వివరాలను సేకరిస్తున్నారు.

సేంద్రియ సాగు 'డబుల్'

- కేంద్ర వ్యవసాయ శాఖ వెల్లడి



సాక్షి, హైదరాబాద్: ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెరుగుతోంది. పురుగు మందులు, ఎరువులతో పండించిన ఆహార పదార్థాలు, కూరగాయలు విషపూరితంగా మారడంతో వినియోగదారులు సేంద్రియ ఆహార పదార్థాలను ఎంచుకుంటున్నారు. దీంతో రాష్ట్రంలో ఏడాదికేడాదికి సేంద్రియ వ్యవసాయ పంటల సాగు పెరుగుతోంది. మూడేళ్లలో రెట్టింపునకు మించి సేంద్రీయ వ్యవసాయ పంటల సాగు పెరిగినట్లు కేంద్ర వ్యవసాయశాఖ వెల్లడించింది. 2019-20 ఏడాదిలో రాష్ట్రంలో 56,355 ఎకరాల్లో సేంద్రియ పంటలను సాగు చేయగా, అప్పుడు 2,294 మెట్రిక్ టన్నులు ఉత్పత్తి అయ్యాయి. 2020-21లో తగ్గి 51,662 ఎకరాల్లో సాగవగా , 20,665 మెట్రిక్ టన్నుల సేంద్రియ పంటలు ఉత్పత్తి అయ్యాయి. ఇక 2021-22లో ఆర్గానిక్ పంటలు 1.32 లక్షల ఎకరాల్లో సాగవగా. 3,871 మెట్రిక్ టన్నులు ఉత్పత్తి అయింది.

దేశంలో తెలంగాణ 12వ స్థానం...

వివిధ రాష్ట్రాలతో పోలిస్తే సేంద్రీయ సాగులో తెలంగాణ 12వ స్థానంలో ఉందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. 2020-21లో 95 లక్షల ఎకరాల్లో ఆర్గానిక్ పంటల సాగు విస్తీర్ణం జరగ్గా, అప్పుడు 34.68 లక్షల మెట్రిక్ టన్నుల సేంద్రీయ ఆహార పదార్థాలు ఉత్పత్తి అయ్యాయి. ఇక 2021-22లో సేంద్రియ పంటల సాగు పెరిగింది. ఆ ఏడాది 1.47 కోట్ల ఎకరాల్లో ఆర్గానిక్ పంటల సాగు జరగ్గా, 34.10 లక్షల మెట్రిక్ టన్నుల సేంద్రియ పంట ఉత్పత్తి జరిగింది. కాగా, దేశంలో అత్యధికంగా ఆర్గానిక్ పంటలు సాగు చేసే రాష్ట్రాల్లో మధ్యప్రదేశ్ అగ్రస్థానంలో ఉంది. మహారాష్ట్ర రెండో స్థానంలో నిలిచింది. మూడో స్థానంలో గుజరాత్ , నాల్గవ స్థానంలో రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం 6.32 లక్షల ఎకరాలతో ఐదో స్థానంలో సేంద్రీయసాగు చేస్తున్నట్లు కేంద్ర వ్యవసాయశాఖ వెల్లడించింది.

క్వింటాకు 40 కేజీలు దోపిడీ

- ఎలక్ట్రానిక్ కాంటాలతో మోసం
- దళారులతో రైతుల వాగ్వాదం
- మోసాన్ని ఒప్పుకున్న దళారులు
- నష్టపరిహారానికి అంగీకారం



పత్తి కాంటాల్లో మోసానికి పాల్పడిన దళారులను నిలదీస్తున్న రైతులు

ములుగు రూరల్: ఎలక్ట్రానిక్ కాంటాల్లో మోసం చేసి క్వింటాకు 40 కేజీలు అదనంగా తూకం వేసిన దళారులను రైతులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. రైతులు గట్టిగా నిలదీయడంతో చేసిన మోసాన్ని ఒప్పుకుని నష్టపరిహారానికి అంగీకరించారు. ఈ ఘటన ములుగు జిల్లా అంకన్నగూడెంలో మంగళవారం చోటు చేసుకుంది. ఖమ్మం జిల్లా తల్లాడ మండలం బలంపేటకు చెందిన సత్యంశెట్టి కోటేశ్వర్, పాలెపు పుల్లారావు సోమవారం పత్తి వ్యాపారం కోసం గ్రామానికి చేరుకున్నారు. గ్రామానికి చెందిన ఈక సదయ్య, ఈక సారయ్య, ఈక లక్ష్మీనారాయణలు పత్తి అమ్మకానికి పెట్టారు. హమాలీలు కాంటా వేశారు. తూకంలో అనుమానం వచ్చిన రైతులు వేరే కాంటాతో తూకం వేయాలని డిమాండ్ చేశారు. మరో కాంటాతో వేస్తే భారీగా తేడా రావడంతో టాటా గూడ్స్ వాహనంలో ఎక్కించిన పత్తిని మొత్తం కిందికి దించేశారు. దళారులు ఎలక్ట్రానిక్ కాంటాలో 100 కిలోల పత్తికిగానూ 40 కిలోల తూకం తక్కువ సరిచేశారు. దీంతో ఆగ్రహానికి గురైన రైతులు గతంలో గ్రామంలో ఇప్పటివరకు 5 టాటా గూడ్స్ వాహనాల పత్తి కొనుగోలు చేశారని, వాహనానికి నాలుగు క్వింటాల చొప్పున నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

అధిక ధరను ఆశగా చూపి

ప్రస్తుతం మార్కెట్ ధర రూ.7,455 ఉన్నప్పటికీ క్వింటాకు రూ.8వేలతో కొనుగోలు చేస్తామని రైతులకు ఆశ చూపి దళారులు మోసానికి పాల్పడ్డారు. వెంట తెచ్చుకున్న కాంటాలో తూకాన్ని ముందస్తుగా సెట్ చేసి రైతుల కళ్లుకప్పి మోసం చేసేందుకు సిద్ధమయ్యారు. రైతులు గమనించడంతో తప్పును ఒప్పుకున్నారు. గతంలో గ్రామంలో కొనుగోలు చేసిన పత్తి రైతులకు సైతం పరిహారం ఇచ్చేందుకు దళారులు ఒప్పుకున్నట్లు సమాచారం.

జట్టీ కట్టి.. 5 కి.మీ. మోసుకొచ్చి..

రహదారి సౌకర్యం లేక వెళ్లని అంబులెన్స్.. గర్భిణిని మోసుకొచ్చిన ఆదివాసీలు



చర్ల: ఆదివాసీ పల్లెల్లో కనీస సౌకర్యాల లేమికి ఈ ఘటనే సజీవ సాక్ష్యం. గ్రామం ఏర్పడి 30 ఏళ్లు కావస్తున్నా నేటికీ సరైన రహదారి సౌకర్యం లేకపోవడంతో మంగళవారం ఓ నిండు గర్భిణిని గ్రామస్తులు ఐదు కిలోమీటర్ల దూరం జట్టీ ద్వారా మోసుకొచ్చి అంబులెన్స్ ఎక్కించారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం రాళ్లాపురం గ్రామానికి చెందిన నూపా సిద్దు భార్య లిల్లీ నిండు గర్భిణి. మంగళవారం లిల్లీ ప్రసవ వేదన పడుతుండగా కొందరు యువకులు హుటాహుటిన మొబైల్ సిగ్నల్ వచ్చే ప్రాంతానికి వెళ్లి 108కు ఫోన్ చేశారు. అయితే ఆ గ్రామానికి వాహనం వచ్చేందుకు దారి లేదని, తిప్పాపురం వరకు వస్తే అక్కడి నుంచి ఆస్పత్రికి తరలిస్తామని 108 సిబ్బంది తెలిపారు. దీంతో చేసేదేమి లేక సిద్దు బంధువులు జట్టీ కట్టి ఆమెను అటవీ మార్గం గుండా తిప్పాపురం సమీపంలోని ప్రధాన రహదారి వరకు మోసుకొచ్చారు. అప్పటికే అక్కడికి చేరుకున్న అంబులెన్స్‌లో కొయ్యూరు వైద్యశాలకు తరలించారు. ఆస్పత్రిలో లిల్లీ ఆడబిడ్డకు జన్మనివ్వగా తల్లీ బిడ్డ క్షేమంగా ఉన్నారని వైద్యులు తెలిపారు.

సీబీఎస్ఈ జాతీయ సైన్స్ ఎగ్జిబిషన్‌లో

'పారమిత'కు ప్రథమ స్థానం

- ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌కు 'మల్టీ ఫంక్షనల్ ఎకో ఫ్రెండ్లీ ఆగ్రో మెషీన్'



కొత్తపల్లి(కరీంనగర్): న్యూఢిల్లీలోని లోటస్ వ్యాలీ స్కూల్‌లో సీబీఎస్ఈ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన నేషనల్ సైన్స్ ఎగ్జిబిషన్ 2022-23లో కరీంనగర్‌లోని పారమిత హెరిటేజ్ స్కూల్ 9వ తరగతి విద్యార్థిని శుభశ్రీ సాహు ప్రదర్శించిన 'మల్టీ ఫంక్షనల్ ఎకో ఫ్రెండ్లీ ఆగ్రో మెషీన్'కు ప్రథమస్థానం లభించింది. పర్యావరణ అంశంలో ఉత్తమప్రాజెక్టుగా ఎంపికైందని ఆ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఇ.ప్రసాదరావు ఆనందం వ్యక్తం చేశారు. గైడ్ టీచర్ లలిత్ మోహన్ సాహు పర్యవేక్షణలో రైతుల ప్రయోజనం కోసం వినూత్నంగా రూపొందించిన ఈ మెషీన్ జనవరి 2024లో జరిగే ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌కు అర్హత సాధించడం తెలంగాణకే గర్వకారణమన్నారు. దేశవ్యాప్తంగా 35 వేదికల్లో నిర్వహించిన రౌండ్లలో విజేతలుగా నిలిచిన 552 జట్లు ఈ ప్రదర్శనలో పాల్గొన్నాయని తెలిపారు. సీబీఎస్ఈ డైరెక్టర్ అభిజిత్ సాహు, కార్యదర్శి అనురాగ్ త్రిపాఠి చేతుల మీదుగా శుభశ్రీ అవార్డు, మెరిట్ సర్టిఫికెట్, రూ.5 వేల నగదు అందుకున్నట్లు పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం అవకాశమిస్తే ఈ యంత్రాన్ని ప్రదర్శించనున్నట్లు పేర్కొంది.

క్లుప్తంగా...

మిషిగన్ వర్సిటీలో కాల్పులు.. ముగ్గురి దుర్మరణం

మిషిగన్: అమెరికాలోని మిషిగన్ స్టేట్ యూనివర్సిటీలో సోమవారం రాత్రి ఒక సాయుధుడు(43) జరిపిన కాల్పుల్లో ముగ్గురు చనిపోగా మరో ఐదుగురు గాయపడ్డారు. దుండగుడు సోమవారం రాత్రి 8 గంటల సమయంలో వర్సిటీలోని మూడు వేర్వేరు ప్రాంతాల్లో విద్యార్థులపైకి కాల్పులకు తెగబడ్డాడు. పోలీసులు గాలిస్తుండగా క్యాంపస్‌లోనే కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. క్షతగాత్రుల పరిస్థితి విషమంగా ఉందని చెబుతున్నారు. అతడి వివరాలను పోలీసులు వెల్లడించలేదు. నల్ల జాతీయుడైన అతడు విద్యార్థి కాదని, వర్సిటీతో సంబంధమూ లేదని పోలీసులు చెప్పారు. యూనివర్సిటీలో 50 వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. కాల్పుల ఘటన నేపథ్యంలో క్యాంపస్‌ను 48 గంటలపాటు మూసివేశారు.

సీబీఎస్ఈ 10, 12 పరీక్షల్లో చాట్‌జీపీటీపై నిషేధం

న్యూఢిల్లీ: 10, 12వ తరగతి బోర్డు పరీక్షల్లో కృత్రిమ మేధ(ఏఐ) ఆధారిత చాట్‌జీపీటీ వాడకాన్ని నిషేధిస్తున్నట్లు సెంట్రల్ బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్(సీబీఎస్ఈ) అధికారులు మంగళవారం ప్రకటించారు. ఈ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. మొబైల్ ఫోన్లు, చాట్‌జీపీటీ యాక్సెస్ ఉన్న పరికరాలు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించబోమని అధికారులు చెప్పారు. పరీక్షల్లో చాట్‌జీపీటీ ఉపయోగించడం అంటే అనైతిక పద్ధతులు అనుసరించినట్లేనని అన్నారు. సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్న వార్తలను నమ్మొద్దని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏఐ ఆధారంగా పనిచేసే చాట్‌జీపీటీ (చాట్ జనరేటివ్ ప్రి-ట్రెయిన్డ్ ట్రాన్స్‌ఫార్మర్) గత ఏడాది నవంబర్‌లో అందుబాటులోకి వచ్చిన సంగతి తెలిసిందే.

సివిల్స్ దరఖాస్తులు సమర్పించాక... ఉపసంహరణ కుదరదు

న్యూఢిల్లీ: సివిల్ సర్వీసులపై ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ తదితర పోస్టుల భర్తీ కోసం నిర్వహించే సివిల్ సర్వీసెస్ ఎగ్జామ్‌ల కోసం అభ్యర్థులు సమర్పించే దరఖాస్తులను ఇకపై ఉపసంహరించుకోవడం కుదరదని యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) స్పష్టంచేసింది. ప్రిలిమినరీ పరీక్ష కోసం దరఖాస్తు చేసుకున్న 10 లక్షల మందిలో దాదాపు సగం మందే ఎగ్జామ్ రాసిన నేపథ్యంలో దరఖాస్తును వెనక్కి తీసుకునే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు 2018లో ప్రకటించింది. అయితే ఈసారి పరీక్షల్లో అలాంటి అవకాశం లేదని తాజాగా విడుదలచేసిన నోటిఫికేషన్‌లో పేర్కొంది. ఈ ఏడాది సివిల్స్ ప్రిలిమినరీ మే 28న జరగనుంది.

'ఎయిరిండియా'కు 470 కొత్త విమానాలు

ఎయిర్‌బస్ నుంచి 250, బోయింగ్ నుంచి 220

విలువ రూ.6.4 లక్షల కోట్లు!
- 17 ఏళ్లలో సంస్థకు ఇవే తొలి ఆర్డర్లు
- మోదీ, బైడెన్, మేక్రాన్, రిషి హర్షం



న్యూఢిల్లీ/వాషింగ్టన్: టాటా గ్రూప్ సారథ్యంలోని ఎయిరిండియా సంస్థ దేశ విదేశాల్లో తన కార్యకలాపాలను మరింత విస్తరింపజేసేందుకు సన్నద్ధమవుతోంది. ఇందులో భాగంగా ఫ్రాన్స్‌కు చెందిన ఎయిర్‌బస్ నుంచి, అమెరికాలోని బోయింగ్ నుంచి మొత్తం 470 కొత్త విమానాలను కొనుగోలు చేయనుంది. ఈ మేరకు ఆయా సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుంది. కొత్త విమానాల కోసం ఎయిర్ ఇండియా ఆర్డర్ ఇవ్వడం గత 17 ఏళ్లలో ఇదే మొదటిసారి కావడం విశేషం. ఎయిర్ ఇండియాను కేంద్ర ప్రభుత్వం నుంచి టాటా గ్రూప్ కొనుగోలు చేసిన తర్వాత ఇచ్చిన తొలి ఆర్డర్ కూడా ఇదే. ''40 ఎయిర్‌బస్ ఏ350 విమానాలు, 20 బోయింగ్ 787 విమానాలు, 10 బోయింగ్ 777-9 విమానాలు, 210 ఎయిర్‌బస్ ఏ320/321 నియో విమానాలు, 190 బోయింగ్ 737 మ్యాక్స్ విమానాలు కొంటున్నాం'' అని ఎయిర్ ఇండియా మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. మొదటి విమానం ఈ ఏడాది ఆఖర్లో సర్వీసులో చేరుతుందని పేర్కొంది. 2025 జూలై నుంచి విమానాలు తమకు అందుతాయని తెలియజేసింది. లీజుకు తీసుకున్న 11 బీ777, 25 ఏ320 విమానాల డెలివరీ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైందని స్పష్టం చేసింది. రెండు ఒప్పందాల విలువ ఏకంగా 80 బిలియన్ డాలర్లు (రూ.6.4 లక్షల కోట్లు) అని అంచనా!

సుదీర్ఘ ప్రయాణాలకు వైడ్-బాడీ విమానాలు

ఎయిర్‌బస్ నుంచి 250 విమానాలను కొనడానికి లెటర్ ఆఫ్ ఇంటెంట్‌పై సంతకాలు చేశామని 'టాటా సన్స్' చైర్మన్ ఎన్.చంద్రశేఖరన్ మంగళవారం చెప్పారు. ఎయిర్‌బస్ నుంచి 210 నారో-బాడీ విమానాలు, 40 వైడ్-బాడీ విమానాలు కొంటున్నట్లు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ తదితరులు వర్చువల్‌గా పాల్గొన్న కార్యక్రమంలో చంద్రశేఖరన్ మాట్లాడారు. ఎక్కువ సమయం(అల్ట్రా-లాంగ్ హాల్) సాగే ప్రయాణాల కోసం వైడ్-బాడీ విమానాలు ఉపయోగించనున్నట్లు పేర్కొన్నారు. 16 గంటలకు పైగా ప్రయాణించే విమానాన్ని అల్ట్రా-లాంగ్ హాల్ ఫ్లైట్ అంటారు. భారత ప్రభుత్వ యాజమాన్యంలో పనిచేస్తున్న ఎయిరిండియాను 2022లో టాటా గ్రూప్ దక్కించుకోవడం తెలిసిందే. ఎయిర్ ఇండియా చివరిసారిగా 2005లో విమానాల కోసం ఆర్డర్ ఇచ్చింది. అప్పట్లో బోయింగ్ సంస్థ నుంచి 68, ఎయిర్‌బస్ నుంచి 43 విమానాలను కొనుగోలు చేసింది. 2005లో ఈ డీల్ విలువ 10.8 బిలియన్ డాలర్లు.

ఒప్పందాల పట్ల ప్రధాని మోదీ హర్షం

ఎయిర్‌బస్, బోయింగ్‌తో ఎయిరిండియా ఒప్పందాలపై మోదీ హర్షం వ్యక్తం చేశారు. ఇవి మైలు రాయి లాంటి ఒప్పందాలన్నారు. భారత్‌లో విమానయాన రంగం వృద్ధి పథంలో దూసుకుపోతోందని అన్నారు. 15 ఏళ్లలో 2,000కు పైగా విమానాలు అవసరమని చెప్పారు. మన పౌర విమానయాన రంగం దేశ అభివృద్ధిలో అంతర్భాగమని వ్యాఖ్యానించారు. దేశంలో గత ఎనిమిదేళ్లలో ఎయిర్‌పోర్టుల సంఖ్య 74 నుంచి 147కు చేరిందని గుర్తుచేశారు. 'ఉడాన్' పథకం కింద మారుమూల ప్రాంతాలను సైతం విమానాల ద్వారా అనుసంధానిస్తున్నామని పేర్కొన్నారు. విమానయాన రంగంలో భారత్ ప్రపంచంలో మూడో అతిపెద్ద మార్కెట్‌గా అవతరించబోతోందన్నారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రాన్ మాట్లాడుతూ ప్రపంచ దేశాలను ఏకతాటిపైకి తీసుకొచ్చి, ఉక్రెయిన్-రష్యా సమస్యను పరిష్కరించే సత్తా మోదీ నాయకత్వంలోని భారత్‌కుందని ప్రశంసించారు. భారత జి-20 సారథ్యం విజయవంతం కావడానికి సహకరిస్తున్నామని చెప్పారు. మరోవైపు అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌తో మోదీ మంగళవారం ఫోన్‌లో మాట్లాడారని ప్రధాని కార్యాలయం తెలిపింది. ఎయిరిండియా-బోయింగ్ ఒప్పందంతోపాటు పలు అంశాలపై నేతలు చర్చించుకున్నారని వెల్లడించింది.

చరిత్రాత్మక ఒప్పందం: జో బైడెన్

34 బిలియన్ డాలర్లతో బోయింగ్ నుంచి 220 విమానాల కొనుగోలుకు ఎయిరిండియా ఒప్పందాన్ని చరిత్రాత్మకంగా బైడెన్ అభివర్ణించారు. ''అవసరాన్ని బట్టి మరో 70 విమానాలు కొనేలా ఒప్పందం కుదిరింది. అలా మొత్తం ఒప్పందం విలువ 45.9 బిలియన్ డాలర్లు. ప్రధాని మోదీతో కలిసి పనిచేస్తున్నాం'' అన్నారు. వైట్‌హౌస్ ప్రకటన మేరకు బోయింగ్‌తో ఒప్పందంలో 50 బోయింగ్ 737మ్యాక్స్, 20 బోయింగ్ 787 ఫ్లైట్లు ఉన్నాయి. ఎయిరిండియా ఇచ్చిన ఆర్డర్ బోయింగ్ చరిత్రలో డాలర్ విలువలో మూడో అతిపెద్ద సేల్, విమానాల సంఖ్యలో రెండో అతి పెద్దది!

కీలక ఘట్టం: రిషి

లండన్: ఎయిరిండియాకు 250 కొత్త విమానాలు విక్రయించడానికి 'ఎయిర్‌బస్-రోల్స్ రాయిస్' ఒప్పందానికి రావడంపై బ్రిటన్ ప్రధాని రిషి సునాక్ హర్షం వెలిబుచ్చారు. బ్రిటన్ ఏరోస్పేస్ రంగంలో ఇదో కీలక ఘట్టమన్నారు. ''భారత్‌తో సంబంధాలను బలోపేతం చేసుకోవడానికి నిరంతరం కృషి చేస్తున్నాం. బ్రిటన్‌లో విమానయాన రంగ అభివృద్ధికి ఆకాశమే హద్దు అనేందుకు ఈ ఒప్పందమే తార్కాణం'' అన్నారు. ఈ ఒప్పందంతో బ్రిటన్లోని వేల్స్, డెర్బీషైర్‌లో కొత్త ఉద్యోగాలు వస్తాయని, ఎగుమతులకు, ఆర్థిక వ్యవస్థకు ప్రోత్సాహం లభిస్తుందని యూకే ప్రభుత్వం వెల్లడించింది. ఎయిరిండియా కొనుగోలు చేసే 250 విమానాల తయారీ ప్రక్రియ చాలావరకు యూకేలోనే పూర్తి కానున్నట్లు తెలియజేసింది.

బీబీసీపై ఐటీ సర్వే

ఢిల్లీ, ముంబై ఆఫీసుల్లో సోదాలు
- లాభాలను మళ్లించింది, నోటీసులకు స్పందించలేదు: అధికారులు
- తీవ్రంగా ఖండించిన విపక్షాలు
- కచ్చితంగా బెదిరింపు చర్యే: కాంగ్రెస్
- వేధింపుల్లో భాగమే: ఎడిటర్స్ గిల్డ్
- భారత్‌పై బీబీసీ విషం: బీజేపీ



ఢిల్లీలో ఐటీ సోదాలు జరిగిన బీబీసీ ఆఫీస్

న్యూఢిల్లీ: బీబీసీ-మోదీ డాక్యుమెంటరీ వివాదం కొత్త మలుపు తిరిగింది. పన్ను ఎగవేత ఆరోపణలపై దర్యాప్తులో భాగంగా ఢిల్లీ, ముంబైల్లోని బీబీసీ కార్యాలయాల్లో ఆదాయ పన్ను శాఖ మంగళవారం 'సర్వే' జరిపింది! ఇవి దాడులు కావని, బీబీసీ సబ్సిడరీ కంపెనీలకు చెందిన అంతర్జాతీయ పన్ను విధానాలు తదితరాలకు సంబంధించిన సర్వే మాత్రమేనని అధికార వర్గాలు పేర్కొన్నాయి. ''ఈ అవకతవకలపై బీబీసీకి గతంలోనే నోటీసులిచ్చినా బేఖాతరు చేసింది. పైగా భారీగా లాభాలను దారి మళ్లించింది'' అని ఆరోపించాయి. ఐటీ అధికారులు ఉదయం 11 గంటల సమయంలో ఢిల్లీలో కస్తూర్బా గాంధీ మార్గ్, ముంబైలోని శాంతాక్రుజ్ ప్రాంతంలో ఉన్న బీబీసీ కార్యాలయాలకు చేరుకున్నారు. సర్వే పూర్తయ్యేదాకా బీబీసీ సిబ్బందిని కార్యాలయ ఆవరణ వీడేందుకు అనుమతించలేదు. వారినుంచి సెల్ ఫోన్లు, లాప్‌టాప్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. అధికారులకు పూర్తిగా సహకరిస్తున్నట్టు అనంతరం బీబీసీ ట్వీట్ చేసింది. గుజరాత్‌లో గోద్రా అనంతర అల్లర్లకు అప్పట్లో రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న మోదీయే నేరుగా బాధ్యుడంటూ జనవరిలో బీబీసీ విడుదల చేసిన డాక్యుమెంటరీ పెను వివాదానికి దారి తీయడం, దాన్ని కేంద్రం నిషేధించడం తెలిసిందే.

మండిపడ్డ విపక్షాలు

బీబీసీ కార్యాలయాల్లో ఐటీ సర్వేలను కాంగ్రెస్ తీవ్రంగా ఖండించింది. మోదీ ప్రభుత్వం నిత్యం పత్రికా స్వేచ్ఛపై దాడి చేస్తోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే దుయ్యబట్టారు. ఇది కచ్చితంగా బెదిరింపు చర్యేనని పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ అన్నారు. వినాశకాలం దాపురించినప్పుడు ఇలాంటి విపరీత బుద్ధులే పుడతాయంటూ ధ్వజమెత్తారు. కేంద్రం తీరు నియంతృత్వానికి పరాకాష్ట అని సీపీఎం, ఆమ్ ఆద్మీ పార్టీ దుయ్యబట్టాయి. కేంద్ర దర్యాప్తు సంస్థలు 'ప్రేమికుల రోజు సర్వే'లకు దిగాయంటూ తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ మహువా మొయిత్రా ఎద్దేవా చేశారు. ''ఇదే ఊపులో ఐటీ, సెబీ, ఈడీ తదితరాలన్నీ కలసి కేంద్రానికి అత్యంత ప్రియుడైన మిస్టర్ ఎ సంస్థలపైనా ఇలాంటి సర్వేలు చేస్తే ఎలా ఉంటుంది!'' అని అదానీని ఉద్దేశించి ట్వీట్ చేశారు. బీబీసీ ఆఫీసుల్లో ఐటీ సర్వేలతో తీవ్రంగా ఆందోళన చెందుతున్నట్టు ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా పేర్కొంది. పాలక వర్గం పట్ల విమర్శనాత్మకంగా ఉండే మీడియా సంస్థలను వేధించే ధోరణికి ఇది కొనసాగింపని ఒక ప్రకటనలో విమర్శించింది.

నిశితంగా గమనిస్తున్నాం: బ్రిటన్

తాజా పరిణామాలు బ్రిటన్‌లోనూ ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ఈ సర్వేకు బీబీసీ డాక్యుమెంటరీతో సంబంధముందన్న భావన బ్రిటన్ ప్రభుత్వ వర్గాల్లో వ్యక్తమవుతోంది. అధికారికంగా స్పందించకపోయినా, పరిస్థితిని నిశితంగా గమనిస్తున్నట్టు అవి పేర్కొన్నాయి. ఇవి కచ్చితంగా కక్షసాధింపు ధోరణితో కూడిన వేధింపు చర్యలేనని లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ లీడింగ్ ఆథర్ డాక్టర్ ముకులికా బెనర్జీతో పాటు బ్రిటన్‌కు చెందిన మానవ హక్కుల సంస్థ సౌత్ ఏషియా సాలిడారిటీ గ్రూప్ కూడా విమర్శించింది. వీటిని తక్షణం ఆపాలని డిమాండ్ చేసింది. అయితే, వార్తా సంస్థ ముసుగులో సామ్రాజ్యవాదులతో చేతులు కలిపిన బీబీసీ భారత్‌లో కచ్చితంగా ఆర్థిక అవకతవకలకు పాల్పడిందని గ్లోబల్ హిందూ ఫెడరేషన్ చైర్‌పర్సన్ సతీశ్ శర్మ ఆరోపించారు.

బీబీసీ, కాంగ్రెస్ కుమ్మక్కు: బీజేపీ

మీడియా ముసుగులో భారత్‌పై బీబీసీ నిత్యం విషం కక్కుతోందని బీజేపీ ధ్వజమెత్తింది. దాన్ని అత్యంత అవినీతిమయమైన సంస్థగా అభివర్ణించింది. బీబీసీ తప్పుడు ప్రచారం, కాంగ్రెస్ అజెండా చెట్టాపట్టాలుగా సాగుతున్నాయని ఆరోపించింది. దర్యాప్తు సంస్థలను తమ పని చేసుకోనివ్వాలని పార్టీ జాతీయ అధికార ప్రతినిధి గౌరవ్ భాటియా అన్నారు. బీబీసీని నాటి కాంగ్రెస్ ప్రధాని ఇందిరాగాంధీ కూడా నిషేధించారని గుర్తు చేశారు. భారత రాజ్యాంగం పట్ల బీబీసీ వార్తా సంస్థకు ఏ మాత్రం గౌరవం లేదంటూ మండిపడ్డారు.

అమెరికా అధ్యక్ష రేసులో నిక్కీ హేలీ



వాషింగ్టన్: అమెరికాలో భారతీయ మూలాలున్న మహిళా నాయకురాలు, దక్షిణ కరోలినా మాజీ గవర్నర్, రిపబ్లికన్ నేత నిక్కీ హేలీ వచ్చే ఏడాది జరగబోయే అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ తరపున అధ్యక్ష అభ్యర్థిత్వానికి పోటీపడుతున్నారు. 51 ఏళ్ల నిక్కీ మంగళవారం ఒక వీడియో సందేశంలో ఈ ప్రకటన చేశారు. రిపబ్లికన్ పార్టీ తరపున అధ్యక్ష అభ్యర్థిత్వానికి సొంత పార్టీ నేత, మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను సవాల్ చేసిన తొలి వ్యక్తిగా నిలిచారు. 'ప్రెసిడెంట్ ఎన్నికల బరిలో అడుగుపెట్టా. దేశ ఆర్థిక వ్యవస్థను చక్కదిద్దడం, సరిహద్దు రక్షణ, దేశాన్ని మరింత శక్తివంతం చేయడం, సమున్నత స్థానంలో నిలపడం కోసం నవ్య నాయకత్వం సారథ్యం వహించాల్సిన సమయమొచ్చింది. వలస వచ్చిన భారత కుటుంబం నుంచి వచ్చిన కూతురుగా గర్వపడతాను. నలుపు కాదు. తెలుపు కాదు. నేనింకా భిన్నం' అని నిక్కీ వ్యాఖ్యానించారు. ట్రంప్ విధానాలను ఆయన హయాంలోనే తప్పుబట్టిన నిక్కీ.. ట్రంప్‌కు సరైన యువ ప్రత్యామ్నాయంగా తనను తాను అభివర్ణించుకున్నారు. ఫ్లోరిడా గవర్నర్ రాన్ డిశాంటిస్, దేశ మాజీ ఉపాధ్యక్షుడు మైక్ పెన్స్, మైక్ పాంపియో, టిమ్ స్కాట్ తదితర రిపబ్లికన్ నేతలూ పార్టీ అధ్యక్ష అభ్యర్థిత్వానికి పోటీపడే అవకాశముంది. బాబీ జిందాల్ (2016), ప్రస్తుత ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ (2020) తర్వాత అమెరికా అధ్యక్ష ఎన్నికల అభ్యర్థిత్వం కోసం పోటీపడిన మూడో భారతీయ అమెరికన్‌గా నిక్కీ నిలిచారు. రిపబ్లికన్ పార్టీ అధ్యక్ష అభ్యర్థి ఎన్నిక ప్రక్రియ 2024 జనవరిలో మొదలవుతుంది.

పంజాబ్ నుంచి వలసవచ్చి..

పంజాబ్‌లోని అమృత్‌సర్ నుంచి 1960ల్లో కెనడా వలస వచ్చిన సిక్కు దంపతులు అజిత్ సింగ్ రణ్‌ధావాలా, రాజ్ కౌర్ రణ్‌ధావాలాలకు జన్మించిన నిక్కీ పూర్తి పేరు నిమ్రతా నిక్కీ రణ్‌ధావాలా. వారి కుటుంబం కెనడాకు అక్కడి నుంచి అమెరికా వెళ్లింది. 2011 జనవరిలో 39 ఏళ్లకే గవర్నర్ పదవి చేపట్టి అమెరికాలో ఆ పదవి చేపట్టిన అత్యంత పిన్న వయస్కురాలిగా నిక్కీ చరిత్ర సృష్టించారు. దక్షిణ కరోలినా తొలి మహిళా గవర్నర్‌గా, రెండు సార్లు ఆమె బాధ్యతలు కొనసాగించి రికార్డు నెలకొల్పారు. దాదాపు రెండేళ్లపాటు ఐరాసలో అమెరికా రాయబారిగా ఉన్నారు.

అదానీపై దాచేదేమీ లేదు

భయపడాల్సిన పనీ లేదు: అమిత్ షా

అగర్తల (త్రిపుర): పారిశ్రామికవేత్త గౌతమ్ అదానీ ఆస్తులకు సంబంధించి హిండెన్‌బర్గ్ నివేదిక రాజకీయంగా ప్రకంపనలు సృష్టిస్తున్న నేపథ్యంలో దీనిపై కేంద్ర హోం మంత్రి అమిత్‌షా తొలిసారిగా పెదవి విప్పారు. అదానీ అంశంలో తాము భయపడుతున్నది కానీ, దాస్తున్నది కానీ ఏమీ లేదన్నారు. అయితే ఈ వ్యవహారం సుప్రీంకోర్టు పరిధిలో ఉండడంతో కేంద్ర మంత్రిగా తానిప్పుడేమీ మాట్లాడకూడదని మంగళవారం ఏఎన్ఐ వార్తా సంస్థ ఇంటర్వ్యూలో అన్నారు. బీజేపీ ఆశ్రిత పెట్టుబడిదారీ విధానాన్ని ప్రోత్సహిస్తోందన్న కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపణల్ని కొట్టిపారేశారు. కాంగ్రెస్ హయాంలోనే రూ.12 లక్షల కోట్ల కుంభకోణాలు జరిగాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం వ్యవస్థలను గుప్పిట్లో పెట్టుకుందని ఎవరైనా భావిస్తే కోర్టులను ఆశ్రయించాలన్నారు. విపక్షాలు ఉద్దేశపూర్వకంగా గందరగోళం సృష్టిస్తున్నాయంటూ ధ్వజమెత్తారు. మోదీపై కుట్రలు జరిగిన ప్రతీసారి ఆయన మరింత బలం పుంజుకుని ప్రజాదరణ పొందుతున్నారన్నారు

మరి భయమెందుకు?: కాంగ్రెస్

అదానీ ఉదంతంలో దాయటానికేమీ లేకుంటే కేంద్రం ఎందుకు భయపడుతోందని, జేసీసీ విచారణకు ఆదేశించకుండా ఎందుకు పారిపోతోందని కాంగ్రెస్ నేత జైరాం రమేశ్ ప్రశ్నించారు. ఈ అవకతవకలు కేంద్రాన్నే వేలెత్తి చూపుతున్నాయని తమిళనాడు సీఎం స్టాలిన్ అన్నారు.

హత్యచేసి ఫ్రిజ్‌లో దాచేసి..

ప్రేమికుల దినోత్సవం రోజే ఢిల్లీలో వెలుగుచూసిన దారుణం



న్యూఢిల్లీ: తనను ప్రేమించి మరో యువతిని ఎందుకు పెళ్లాడుతున్నావని నిలదీసినందుకు ప్రాణంతీశాడో దుర్మార్గుడు. చంపేసి ఊళ్లోని తన ధాబాలో ఉన్న రిఫ్రిజిరేటర్‌లో దాచాడు! రెండు, మూడు రోజుల క్రితం జరిగిన ఈ హత్యోదంతం ప్రేమికుల దినోత్సవం (ఫిబ్రవరి 14) రోజే వెలుగు చూడటం గమనార్హం. ఢిల్లీ పోలీసులు మంగళవారం వెల్లడించిన వివరాల ప్రకారం నైరుతి ఢిల్లీలోని మిత్రోన్ గ్రామానికి చెందిన సాహిల్ గెహ్లాట్ గత కొన్ని సంవత్సరాలుగా నిక్కీ యాదవ్ అనే యువతితో సహజీవనంలో ఉన్నాడు. 2018 జనవరిలో ఒక కోచింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో వీరికి పరిచయం ఏర్పడి అది ప్రేమకు, తర్వాత సహజీవనానికి దారితీసింది. అప్పటి నుంచి సొంతూళ్లలో ఇంట్లో వాళ్లకు తెలీకుండా ఢిల్లీలో సహజీవనం చేస్తున్నారు. అయితే ఇటీవల గెహ్లాట్ తల్లిదండ్రులు అతడికి వేరే అమ్మాయితో వివాహం నిశ్చయించారు. విషయం తెల్సుకున్న నిక్కీ అతడిని నిలదీసింది. మరొకరిని పెళ్లాడితే వేరే కేసులో ఇరికిస్తానని బెదిరించింది. వీరిద్దరినీ ఫిబ్రవరి 9వ తేదీ రాత్రి గెహ్లాట్ కారులో గొడవ జరిగింది. దీంతో కోపోద్రిక్తుడైన గెహ్లాట్ కారులో మొబైల్ ఫోన్ డేటా కేబుల్‌తో అమ్మాయిని గొంతు నులిమి చంపేసి తన ధాబాలోని రిఫ్రిజిరేటర్‌లో దాచి అదే రోజు వేరే అమ్మాయిని వివాహం చేసుకున్నాడు. నిందితుడు గెహ్లాట్‌ను ఢిల్లీ దగ్గర్లోని కయిర్ గ్రామంలో అరెస్ట్‌చేశామని పోలీస్ స్పెషల్ కమిషనర్ చెప్పారు. పోలీసుల దర్యాప్తులో నిందితుడు తన నేరాన్ని అంగీకరించాడు.

ఏరో షోలో అమెరికా బాంబర్ జెట్ బీ1బీ



బెంగళూరు: బెంగళూరులో ఏరో ఇండియా ప్రదర్శన సందర్భంగా గగనతలంలో ప్రత్యేక అతిథి వచ్చి చక్కర్లు కొట్టింది. అమెరికాకు చెందిన అత్యాధునిక యుద్ధ విమానం బీ-1బీ లాన్సర్ బాంబర్ జెట్ మంగళవారం బెంగళూరు శివారులోని యెలహంక ఎయిర్‌బేస్ వినువీధులో వీక్షకులకు కనువిందు చేసింది. అమెరికా సుదూర గగనతల లక్ష్యాలను ఛేదించడంలో వాయుసేనకు వెన్నుముకగా నిలుస్తున్నందుకు గుర్తుగా దీనిని 'ది బోన్' అని పిలుస్తారు. 'ఇరు దేశాల వైమానిక దళాల అద్భుత అంతర్గత సంయుక్త నిర్వహణ వ్యవస్థకు బీ-1బీ బాంబర్ సానుకూలతను మరింత పెంచింది' అని అమెరికా ఎయిర్‌ఫోర్స్ మేజర్ జనరల్ జూలియన్ చీటర్ వ్యాఖ్యానించారు. 'భారత్, అమెరికా రక్షణ భాగస్వామ్యం మరింతగా బలోపేతమవుతోంది. సంయుక్తంగా పనిచేస్తే రెండు దేశాల సైన్యాలు ఇంకా శక్తివంతమవుతాయి' అని ఢిల్లీలో అమెరికా ఎంబసీలో ఆ దేశ రియర్ అడ్మిరల్ మైఖేల్ బేకర్ అన్నారు. కాగా, సోమవారం అమెరికా ఐదోతరం సూపర్‌సోనిక్ ఎఫ్-35ఏ యుద్ధ విమానం ఈ వైమానిక ప్రదర్శనలో పాలుపంచుకున్న విషయం విదితమే. ఎఫ్35ఏ భారత్‌లో ల్యాండ్ అవడం ఇదే తొలిసారికావడం విశేషం. బీ-1బీ బాంబర్ మాత్రం 2021 ఫిబ్రవరిలోనూ ఎయిర్‌షోలో పాల్గొంది.

పుల్వామా అమర జవాన్లకు ప్రధాని నివాళులు

న్యూఢిల్లీ: పుల్వామా ఉగ్రదాడిలో అమరులైన సీఆర్‌పీఎఫ్ జవాన్లకు ప్రధాని మోదీ మంగళవారం నివాళులర్పించారు. 'వారి అత్యున్నత త్యాగాన్ని ఎప్పటికీ మరువలేం. వారి ధైర్య సాహసాలు అభివృద్ధి చెందిన, బలమైన దేశాన్ని నిర్మించడానికి మనల్ని ప్రేరేపిస్తాయి' అంటూ ట్వీట్ చేశారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా కూడా పుల్వామా అమరులకు నివాళులర్పించారు. జమ్మూకశ్మీర్‌లోని పుల్వామాలో 2019 ఫిబ్రవరి 14వ తేదీన సీఆర్‌పీఎఫ్ కాన్వాయ్‌పై ఉగ్రవాదులు జరిపిన ఆత్మాహుతి దాడిలో 40 మంది జవాన్లు నేలకొరిగారు. ప్రతిగా భారత వైమానిక దళం పాకిస్తాన్‌లో బాలాకోట్‌లో ఉన్న ఉగ్ర శిబిరాలను ధ్వంసం చేయడం తెలిసిందే.

బీజేపీకి రూ.614 కోట్లు..కాంగ్రెస్‌కు రూ.94 కోట్లు

2021-22లో పార్టీలకందిన విరాళాలను వెల్లడించిన ఏడీఆర్

న్యూఢిల్లీ: 2021-22లో బీజేపీకి రూ.614 కోట్లు, కాంగ్రెస్‌కు రూ.95 కోట్లు విరాళాల రూపంలో అందాయి. అసోసియేషన్ ఫర్ డెమోక్రాటిక్ రిఫామ్స్ (ఏడీఆర్) నివేదిక ఈ మేరకు వెల్లడించింది. 2020-21తో పోలిస్తే పార్టీలు అందుకున్న విరాళాల మొత్తం 31.50% మేర పెరిగిందని వివరించింది. ఇదే సమయంలో బీజేపీ విరాళాల్లో రూ.28.71%, కాంగ్రెస్ విరాళాల్లో 28.09% పెరుగుదల కనిపించిందని పేర్కొంది.

బాల్యం శిథిలం

తుర్కియే, సిరియాలో 70 లక్షలకు పైగా పిల్లలపై ప్రభావం • యునిసెఫ్ అంచనాలు

అమ్మ పొత్తిళ్లలో హాయిగా పడుకోవాల్సిన అభం శుభం తెలియని పసికందులు అందరినీ కోల్పోయి అనాథలుగా మారుతున్నారు. ఎందుకీ విపత్తు ముంచుకొచ్చిందో తెలీక నిలువ నీడ లేక ఎందుకు రోడ్లపైకొచ్చామో అర్థం కాక బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. తుర్కియే, సిరియాల్లో సంభవించిన భారీ భూకంపం ఎందరో చిన్నారుల్ని అనాథల్ని చేసింది. వీరిలో చాలా మంది రోజుల పసికందులే. ఇప్పటికే అంతర్యుద్ధంతో అల్లాడిపోతున్న సిరియాలో భూకంపం పిల్లల నెత్తిన పిడుగుపాటులా మారింది. ప్రకృతి వైపరీత్యాలు, అధికార కాంక్షతో మానవులు చేస్తున్న యుద్ధాలు చిన్నారులకు ఎలా శాపంగా మారుతున్నాయి..?

\- సాక్షి, నేషనల్ డెస్క్



తుర్కియే భూకంపంలో శిథిలాల మధ్యే ఒక పసిపాప భూమ్మీదకొచ్చింది. బిడ్డకి జన్మనిచ్చిన ఆ తల్లి ప్రాణాలు కోల్పోవడంతో పుడుతూనే అనాథగా మారింది. అయా (అరబిక్ భాషలో మిరాకిల్) అని పేరు పెట్టి ప్రస్తుతానికి ఆస్పత్రి సిబ్బందే ఆ బిడ్డ ఆలనా పాలనా చూస్తున్నారు. ఈ రెండు దేశాల్లో సహాయ కార్యక్రమాలు కొనసాగిస్తూ ఉంటే ఎక్కువగా పిల్లలే శిథిలాల కింద నుంచి ప్రాణాలతో బయటకి వస్తున్నారు. 10 రోజుల నుంచి 14 ఏళ్ల వయసున్న వారి వరకూ ప్రతీ రోజూ ఎందరో పిల్లలు ప్రాణాలతో బయటకి వస్తున్నారు. వారంతా తల్లిదండ్రులు, బంధువుల్ని కోల్పోయి అనాథలుగా మారడం ఆందోళన కలిగిస్తోంది. ఈ చిన్నారులకు అండగా యునిసెఫ్ బృందం తుర్కియే చేరుకుంది. తుర్కియేలో 10 ప్రావిన్స్‌లలో 46 లక్షల మంది చిన్నారులపై ప్రభావం పడిందని యూనిసెఫ్ అధికార ప్రతినిధి జేమ్స్ ఎల్డర్ చెప్పారు.

సిరియాలో బాలల దురవస్థ

పన్నెండేళ్లుగా అంతర్యుద్ధంతో అతలాకుతలమవుతున్న సిరియాలో ఇప్పటికే చిన్నారులు దారుణమైన పరిస్థితుల్ని ఎదుర్కొంటున్నారు. యుద్ధ వాతావరణంలో గత పదేళ్లలో సిరియాలో 50 లక్షల మంది జన్మిస్తే వారిలో మూడో వంతు మంది మానసిక సమస్యలతో నలిగిపోతున్నారు. బాంబు దాడుల్లో ఇప్పటికే 13 వేల మంది మరణించారు. పులి మీద పుట్రలా ఈ భూకంపం ఎంత విలయాన్ని సృష్టించిందంటే 25 లక్షల మంది పిల్లల జీవితాలను అల్లకల్లోలం చేసినట్టుగా యూనిసెఫ్ అంచనా వేస్తోంది. ఇంతమందికి సరైన దారి చూపడం సవాలుగా మారనుంది.

బలిపీఠంపై బాలలు (సగటున ఏడాదికి)	
అనాథలు	17.5 కోట్లు
నిరక్షరాస్యులు	10.4 కోట్లు
శరణార్థులు	3.6 కోట్లు
బాల కార్మికులు	20 కోట్లు
యుద్ధవాతావరణంలో ఉన్న పిల్లలు	44.9 కోట్లు

పిల్లల భవిష్యత్తుకి చేయాల్సింది ఇదే.!

ప్రపంచవ్యాప్తంగా చిన్నారుల విద్య, సంక్షేమం కోసం కృషి చేసే ఐక్యరాజ్యసమితి సంస్థ యునిసెఫ్ ప్రకృతి వైపరీత్యాలు, యుద్ధాలు జరిగే ప్రాంతాలు, కరువు, పేదరికం ఎదుర్కొనే దేశాల్లో పిల్లలకి భద్రమైన భవిష్యత్ కోసం కొన్ని మార్గదర్శకాలు నిర్దేశించింది...
- ప్రభుత్వాలు యూనివర్సల్ క్యాష్ బెనిఫిట్ స్కీమ్‌లతో పిల్లలకు ప్రతి నెలా ఆదాయం వచ్చేలా చూడాలి.
- శరణార్థులు సహా అవసరంలో ఉన్న పిల్లలందరికీ సామాజిక సాయం అందేలా చర్యలు చేపట్టాలి.
- ప్రకృతి వైపరీత్యాల ముప్పున్న ప్రాంతాలతో పాటు , ఇతర ఘర్షణాత్మక ప్రాంతాల్లో సంక్షేమ వ్యయాన్ని వీలైనంత వరకు పరిరక్షించాలి.
- పిల్లల చదువులకి ఎలాంటి ఇబ్బంది లేకుండా వారు బడి బాట పట్టేలా చర్యలు తీసుకోవాలి.
- మాత శిశు సంరక్షణ, పోషకాహారం అందించడం.
- బాధిత కుటుంబాలకు మూడు పూటలా కడుపు నిండేలా నిత్యావసరాలపై ధరల నియంత్రణ ప్రవేశపెట్టాలి.

చిన్నారులపై పడే ప్రభావాలు
- ప్రపంచవ్యాప్తంగా ప్రకృ తి విపత్తులతో ప్రభావానికి లోనయ్యే పిల్లల సంఖ్య సగటున ఏడాదికి 17.5 కోట్లుగా ఉంటోందని యునెస్కో గణాంకాలు చెబుతున్నాయి.
- ప్రకృతి వైపరీత్యాలు, యుద్ధాలతో ఒంటరైన పిల్లలు ఎన్నో శారీరక, మానసిక సమస్యలు ఎదుర్కొంటారు. కుటుంబానికి దూరంగా ఉండడం వల్ల వారిలో పెరుగుదల ఆరోగ్యంగా ఉండదు. ఇలా ఆరోగ్యపరమైన సమస్యలు ఎదుర్కొంటున్న వారు పుట్టకొకరు చెట్టుకొకరుగా మారిన పిల్లల్లో 18% వరకు ఉంటారు.
- 50% మంది పిల్లలు మానసిక సమస్యల్ని ఎదుర్కొంటున్నారు. భూకంపం వంటి ముప్పులు సంభవించినప్పుడు గంటల తరబడి శిథిలాల మధ్య ఉండిపోవడం వల్ల ఏర్పడ్డ భయాందోళనలు వారిని చాలా కాలం వెంటాడుతాయి.
- సమాజంలో ఛీత్కారాలు దోపిడీ, దూషణలు, హింస ఎదుర్కొంటారు. బాలికలకు ట్రాఫికింగ్ ముప్పు!
- తుఫాన్లు, వరదలు, భూకంపాల వల్ల ప్రపంచవ్యాప్తంగా 20 కోట్ల పిల్లలు బాల కార్మికులుగా మారుతున్నారు.
- 2021లో ప్రకృతి వైపరీత్యాలు, ఉక్రెయిన్ వంటి యుద్ధాల కారణంగా 3.7 కోట్ల మంది పిల్లలు చెట్టుకొకరు పుట్టకొకరుగా మారారు.

న్యూజిలాండ్‌లో వరద విలయం



గేబ్రియెల్ తుపాను, భారీ వర్షాల ధాటికి న్యూజిలాండ్‌లోని నేపియర్ సిటీలో ఉధృతంగా ప్రవహిస్తున్న టుకేకురి నది. తుపాను సంబంధ ఘటనల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయి, రోడ్లు పాడై లక్ష మందికిపైగా జనం తిప్పలుపడుతున్నారు. దీంతో ఆ దేశం ఎమర్జెన్సీ ప్రకటించింది.

సాక్షి
కరీంనగర్
బుధవారం । 15 । ఫిబ్రవరి । 2023



పాత పద్ధతిలోనే ప్రాక్టికల్స్

ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు బుధవారం నుంచి పకడ్బందీగా నిర్వహించేందుకు విద్యాశాఖ అధికారులు సర్వం సిద్ధం చేశారు. - 8లో ▸



పుల్వామా అమరులకు నివాళి

పుల్వామా అమరులకు నగరంలో ఘన నివాళి అర్పించారు. విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో నివాళి అర్పించారు.

గరిష్టం/కనిష్టం
32.0/14.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమశాతం తక్కువగా నమోదు అవుతుంది. పగటిపూట ఎండగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రాష్ట్రంలో రెండో సుందర నగరంగా కరీంనగర్

- మంత్రి గంగుల కమలాకర్



మాట్లాడుతున్న మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్‌సిటీ: రాష్ట్రంలో రెండో సుందర నగరంగా కరీంనగర్ రూపుదిద్దుకుంటోందని.. స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దాలన్న సంకల్పంతో ముందుకు సాగుతున్నామని రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. కరీంనగర్‌లో అభివృద్ధి పనులపై కలెక్టరేట్‌లో అధికారులు, ప్రజాప్రతినిధులతో మంత్రి మంగళవారం సమీక్ష నిర్వహించారు. పనుల తీరుపై ఆరా తీశారు. ప్రధానంగా నగరంలోని రోడ్లు, ట్రాఫిక్, ఐలాండ్‌పై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం మాట్లాడుతూ.. తెలంగాణ చౌక్, వన్ టౌన్ పోలీస్‌స్టేషన్ వద్ద ఐలాండ్‌ల కోసం తవ్వి అలాగే వదిలేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. త్వరగా పనులు పూర్తి చేయాలని.. లేదంటే టెండర్ రద్దు చేసే ఆలోచన చేయాలని అధికారులకు సూచించారు. నగరంలో వన్ టౌన్ పోలీస్ స్టేషన్, తెలంగాణ చౌక్, బొమ్మకల్ జంక్షన్‌తోపాటు 13 కూడళ్ల పనులు వెంటనే ప్రారంభించి మార్చి 31లోగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గతంలో తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు నగరంలో కేవలం 40 ఫీట్ల రోడ్లతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తేవని.. అప్పటి కలెక్టర్ స్మితా సబర్వాల్ సహకారంతో 100 ఫీట్లకు విస్తరించామని గుర్తు చేశారు. తన ఆహ్వానం మేరకు ఈ నెల 16వ తేదీన స్మితా సబర్వాల్ కరీంనగర్‌లో పర్యటించి మానేర్ రివర్ ఫ్రంట్, కేసీఆర్ రెస్ట్ హౌస్, కేబుల్ బ్రిడ్జి, రోడ్లతోపాటు నగరంలో జరిగిన అభివృద్ధిని పరిశీలిస్తారని చెప్పారు. సమావేశంలో కలెక్టర్ ఆర్వీ కర్ణన్, అడిషనల్ కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్, మేయర్ సునీల్ రావు, డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణి, మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డవేణి మధు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్ పాల్గొన్నారు.

నేటి నుంచి ఫిజికల్ టెస్టులు

కరీంనగర్‌క్రైం: ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాల ఎంపికకు ప్రిలిమినరీ పరీక్షలో హైకోర్టు తీర్పుతో 7 మార్కులు కలపడం ద్వారా అర్హత సాధించిన అదనపు అభ్యర్థులకు బుధవారం నుంచి 21 వరకు కరీంనగర్‌లోని సీటీసీలో ఫిజికల్ టెస్టులు నిర్వహించనున్నట్లు సీపీ ఎల్.సుబ్బారాయుడు తెలిపారు. పురుషులు 4,862, మహిళలు 1,958, వేరే కేటగిరీలకు చెందినవారు 42 మొత్తం 6,862 మంది అదనపు అభ్యర్థులు ఉన్నారు. ఆర్ఎఫ్ఐడీ రిస్ట్ బ్యాండ్, జాకెట్లను ఉపయోగించి పరుగు పరీక్ష నిర్వహించనున్నారు. శారీరక సామర్థ్య పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు తొలుత ధ్రువపత్రాల పరిశీలన, రిజిస్ట్రేషన్, బయోమెట్రిక్, రిస్ట్ బ్యాండ్ ట్యాగింగ్, ఆర్ఎఫ్ఎఐడీ బిబ్ జాకెట్‌లను ధరింపజేయడం జరుగుతుందని సీపీ పేర్కొన్నారు. పరుగు పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు ఎత్తు, కొలతలు తీసుకుంటామని, నిర్ణీత ప్రమాణాలకు అనుగుణంగా ఎత్తు కలిగిఉన్నవారికి లాంగ్ జంప్, షాట్‌పుట్ విభాగాల్లో పరీక్షలు నిర్వహిస్తామని వివరించారు. సెల్‌ఫోన్‌లు లోనికి అనుమతించబడవని, ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా జరుగుతుందని తెలిపారు.

'కొండ'ంత ఆశలు..!

నేడు కొండగట్టుకు సీఎం కేసీఆర్

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: కొండగట్టు.. ఉమ్మడి జిల్లాలోనే కాదు.. రెండు తెలుగు రాష్ట్రాల్లో ప్రతిష్టాత్మకమైన చారిత్రక పుణ్యక్షేత్రం. ఉద్యమ సమయం నుంచి సీఎం కేసీఆర్ ఈ ఆలయం అభివృద్ధికి అనేక హామీలిచ్చారు. తాజాగా ఆలయం మాస్టర్‌ప్లాన్ కోసం రూ.100 కోట్లు కేటాయించారు. అంతేకాకుండా ఆలయం మాస్టర్ ప్లాన్‌ను రూపొందించేందుకు స్వయంగా కొండగట్టుకు వస్తున్నారు. సీఎం వెంట యాదాద్రికి డిజైన్లు అందించిన ఆనంద్‌సాయి కూడా వస్తున్నట్లు సమాచారం. వందల ఏళ్ల చరిత్ర ఉన్న ఈ పుణ్యక్షేత్రానికి రామాయణ కాలం నుంచి ప్రత్యేక చరిత్ర ఉంది. ఇంతటి వారసత్వ సంపదను కాపాడుకునేందుకు ఎట్టకేలకు ప్రభుత్వం మాస్టర్‌ప్లాన్ రూపొందిస్తున్న వేళ.. భక్తులంతా కొండంత ఆశలతో అనేక డిమాండ్లు వినిపిస్తున్నారు. సీఎం పర్యటన సందర్భంగా కొండగట్టుపై 'సాక్షి' స్పెషల్ ఫోకస్..!





పునాదుల్లోనే ఆగిపోయిన మాల విరమణ మండపం పనులు



గతంలో నిర్మించిన గదులు

సీఎం కేసీఆర్ షెడ్యూల్ ఇదీ..

జగిత్యాల:

- సీఎం కేసీఆర్ బుధవారం ఉదయం 9గంటలకు హైదరాబాద్‌లోని ప్రగతి భవన్ నుంచి బయలు దేరుతారు.
- నేరుగా బేగంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడినుంచి హెలిక్యాప్టర్‌లో జగిత్యాలకు బయలుదేరుతారు.
- ఉదయం 9.45 గంటలకు కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి సన్నిధికి చేరుకుంటారు.
- స్వామివారిని దర్శించుకున్న అనంతరం ఆలయ అధికారులతో సమావేశం నిర్వహిస్తారు.
- ఆలయ అభివృద్ధికి కేటాయించిన రూ.100 కోట్లు వెచ్చించి చేపట్టే ప్రగతి పనులపై సమీక్షిస్తారు.
- మధ్యాహ్నం ఒంటి గంటకు తిరిగి హైదరాబాద్‌కు హెలిక్యాప్టర్‌లో వెళ్తారు.
- మధ్యాహ్నం 1.40గంటలకు ప్రగతి భవన్ చేరుకుంటారు.



సీతమ్మ కన్నీటి ధారలు



కల్యాణకట్ట దుస్థితి

చారిత్రక ఆస్తి పరిరక్షణ

కొండపై అనేక చారిత్రక ఆనవాళ్లు ఉన్నాయి. రామాయణకాలంలో లక్ష్మణుడిని కాపాడేందుకు సంజీవనని హనుమంతుడు ఎత్తుకుపోతున్న క్రమంలో ఆ గుట్ట నుంచి చిన్న ముక్క విరిగిపడిందని, అదే ప్రస్తుత కొండగట్టు అన్నది భక్తుల విశ్వాసం. 300 ఏళ్ల క్రితం ఆవులకాపరి స్వామివారికి చిన్న ఆలయాన్ని నిర్మించగా.. 160 ఏళ్ల కింద క్రిష్టారావు దేశ్‌ముఖ్ ప్రస్తుత ఆలయాన్ని నిర్మించారని చరిత్ర చెబుతోంది. ఇక్కడ హనుమంతుడికి ద్వారపాలకుడిగా భేతాళుడు ఉండటం విశేషం. గుట్టపై భేతాళ స్వామి ఆలయం, సీతమ్మ కన్నీటిగుంటలు, మునుల గుహ, జలబుగ్గ, శ్రీరాముల ఆలయం, కొండలరాయుడి కోట, మెట్ల దారి తదితరాలను పరిరక్షించి, అభివృద్ధి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని భక్తులు కోరుతున్నారు.

- ఇటీవల రూ.100 కోట్లు ప్రకటించిన ముఖ్యమంత్రి
- మౌలిక సదుపాయాలు, మాస్టర్‌ప్లాన్‌పై సమీక్ష
- ఆసుపత్రి, ఫైర్‌స్టేషన్, పీహెచ్‌సీ కావాలంటున్న భక్తులు
- హరిత హోటళ్లు, ఆన్‌లైన్ బుకింగ్‌లకు డిమాండ్
- రైల్వేస్టేషన్‌- కొండ మీదకు రవాణా మెరుగవ్వాలని కోరిక
- మానసిక చికిత్సాలయం ఉండాలంటున్న ఆరాధకులు
- 108 అడుగుల భారీ విగ్రహం ప్రతిష్ఠాపన?



ప్రసాదం తయారు చేసే కేంద్రం వెనుక అధ్వానంగా పరిసరాలు

అభివృద్ధి చేయాల్సినవి ఇవే..

- భేతాళ ఆలయం చెత్తాచెదారంతో నిండి పారిశుధ్య సమస్య ఎదుర్కొంటోంది.
- మండువేసవిలోనూ ఎండని సీతమ్మవారి కన్నీటి గుంటలకు ప్రచారం కల్పించాలి.
- కొండగట్టుపై శ్రీరాముని ఆలయం ఉన్న విషయం చాలామందికి తెలియదు.
- వందల ఏళ్ల క్రితం తపస్సు చేసుకున్న 'మునులగుహ'కు కాలిబాట కూడా లేదు.
- కొండగట్టు ఘాట్ ప్రాంతం నుంచి కిందికి వెళ్లే క్రమంలో జలబుగ్గ అనే నీటి ప్రవాహం కనిపించకుండా పోయింది.
- ఒకప్పుడు బల్మూరి వంశానికి చెందిన కొండలరాయుడి కోట, గుట్టకు మరింత ప్రచారం కల్పించాలి.
- గుట్ట మీద 108 అడుగుల భారీ ఆంజనేయుడి విగ్రహం ఏర్పాటును సీఎం ప్రకటిస్తారని అంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

మాస్టర్‌ప్లాన్‌లో వీటిని చేర్చాలి

- ప్రత్యేక బస్టాండ్ ఏర్పాటు. సమీపంలోని రైల్వేస్టేషన్‌తో కనెక్టివిటీ కల్పించాలి. భక్తుల వాహనాలకు పార్కింగ్ సమస్య తీర్చాలి.
- కొండగట్టులో మానసిక వ్యాధులు నయమవుతాయని నమ్మకం. అందుకే ఇక్కడ మానసిక చికిత్సాలయం ఏర్పాటు చేయాలి.
- కొండగట్టు పుణ్యక్షేత్రం దర్శనం, గదులు ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునే సదుపాయం కల్పించాలి. ఏటీఎం, నెట్‌వర్క్ టవర్లను ఏర్పాటు చేయాలి. భక్తులకు తాగునీటి కొరత తీర్చాలి. హరితతోపాటు ప్రైవేటు హోటళ్ల ఏర్పాటు చేసి ఆతిథ్యరంగాన్ని ప్రోత్సహించాలి.
- కొండగట్టుపై జరిగే అగ్నిప్రమాదాల నివారణకు ఫైర్‌స్టేషన్, శాంతి భద్రతల నియంత్రణకు ప్రత్యేక పోలీస్‌స్టేషన్లు అవసరం.
- స్థానికంగా ఆసుపత్రి లేదా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలి. 2018లో ఇక్కడ ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురైనపుడు ఆసుపత్రి లేని లోటు స్పష్టంగా కనిపించింది.
- లక్షలాది మంది హనుమాన్ దీక్షాపరుల మాల విరమణకు ప్రత్యేక మండపం కావాలి.
- తలనీలాలు సమర్పించే కల్యాణకట్టపై గద్దెలు, నీటి సౌకర్యం ఏర్పాటు చేయాలి.
- కొండపై నిత్యం 100 మందికి, మంగళ, శనివారాల్లో 200 మంది భక్తులకు భోజనం పెడుతున్నారు. ఈ సామర్థ్యాన్ని 1000 మందికి పెంచాలి.
- మెట్లదారి, కోనేరు, డ్రైనేజీలు అధ్వానంగా మారాయి. వెంటనే మరమ్మతులు చేయాలి.

భక్తుల సమస్యలు తీర్చండి



కొండగట్టు ఆలయానికి ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు రూ.100 కోట్లు ఇవ్వడం గొప్ప విషయం. పార్కింగ్, గదులు, తాగునీరు సమస్యలను తీర్చి, ఆలయ పరిసరాలను మరింత అభివృద్ధి చేయాలి.
– ఆరోహి, భక్తురాలు హైదరాబాద్

అభివృద్ధి కోసమే నిధులు

కొండగట్టు ఆలయానికి రూ.100 కోట్లతో మాస్టర్‌ప్లాన్ రూపొందించడం సంతోషం. ఇక ఆలయ అభివృద్ధి వేగం అందుకుంటుంది. పరిసరాలు మెరుగుపడి, స్థానికంగా మరింత మందికి ఉపాధి అవకాశాలు అందివస్తాయి.
– బద్దం తిరుపతిరెడ్డి, సర్పంచ్ ముత్యంపేట

చరిత్రాత్మక నిర్ణయం



రూ.100 కోట్లతో కొండగట్టుకు మాస్టర్ ప్లాన్ రూపకల్పన చరిత్రాత్మక నిర్ణయం. ఈ నిర్ణయంతో ఆలయ చరిత్రలో కేసీఆర్ చిరస్థాయిగా నిలిచిపోతారు. పుణ్యక్షేత్రానికి జాతీయస్థాయిలో ప్రచారం కల్పించడం, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెంచడం, పర్యాటకంగా మరో యాదాద్రిలా మార్చాలన్న పట్టుదలతో సీఎం మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నారు.
– సుంకె రవి శంకర్, ఎమ్మెల్యే చొప్పదండి

కుటుంబ పాలన అంతం బీజేపీతోనే సాధ్యం

- పార్టీ రాష్ట్ర నాయకురాలు జీవిత రాజశేఖర్



సమావేశంలో మాట్లాడుతున్న జీవిత

గంగాధర: రాష్ట్రంలో సాగుతున్న కేసీఆర్ కుటుంబ పాలనను అంతం చేయడం బీజేపీతోనే సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర నాయకురాలు, సినీ నటి జీవిత-రాజశేఖర్ పేర్కొన్నారు. ప్రజాగోస బీజేపీ భరోసా యాత్రలో భాగంగా గంగాధర మండలంలోని మధురానగర్ చౌరస్తాలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాబోయే రోజుల్లో కేసీఆర్‌ను గద్దె దించడానికి కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. అందుకోసమే బీజేపీ భరోసా యాత్ర నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మాజీ మంత్రి సుద్దాల దేవయ్య, రాంగోపాల్‌రెడ్డి, రాజేశ్, పెరుక శ్రావణ్‌కుమార్, వైద రామానుజమ్, దూలం కళ్యాణ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ హఠావో... తెలంగాణ బచావో..

కరీంనగర్‌టౌన్: తెలంగాణ ఉద్యమ సాధన కోసం కేసీఆర్ ఆధ్వర్యంలో ఏర్పాటైన టీఆర్ఎస్ పార్టీ నేడు తెలంగాణ అమరవీరుల త్యాగాలను, ఉద్యమ ఆకాంక్షలను విస్మరించి స్వార్థ రాజకీయాల కోసమే బీఆర్ఎస్‌గా ఆవిర్భవించిందని, టీఆర్ఎస్‌తో తెలంగాణ రాష్ట్రాన్ని ఉద్ధరించనోళ్లు.. బీఆర్ఎస్‌తో దేశాన్ని ఉద్ధరిస్తామనడం... అప్ కీ బార్ కిసాన్ సర్కార్ అని ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందని బీజేపీ నాయకురాలు, సెన్సార్ బోర్డు మెంబర్ జీవిత రాజశేఖర్ విమర్శించారు. బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం కరీంనగర్ జిల్లా రేకుర్తిలో శక్తి కేంద్ర ఇన్‌చార్జి జాడి బాల్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన శక్తి కేంద్ర స్ట్రీట్ కార్నర్ సమావేశాలకు హాజరై మాట్లాడారు. బీఆర్ఎస్ హఠావో.. తెలంగాణ బచావో నినాదాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకుపోవాలని కోరారు.

కేసీఆర్ కుటుంబమే బంగారమైంది

జమ్మికుంట: మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా చేశాడని, కేసీఆర్ కుటుంబం బంగారమైంది తప్పితే ప్రజలకు చేసింది ఏమీ లేదని బీజేపీ నాయకురాలు జీవితరాజశేఖర్ విమర్శించారు. మంగళవారం రాత్రి జమ్మికుంటలోని గాంధీ చౌక్, మడిపల్లి గ్రామంలో బీజేపీ భరోసా, స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌కు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మహిళా గవర్నర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కౌశిక్‌రెడ్డికి పదవులు కట్టబెట్టి, హుజూరాబాద్ ప్రజలను మోసం చేయాలని చూస్తున్నాడని అన్నారు.

16న జిల్లాస్థాయి చదరంగ పోటీలు

కరీంనగర్‌స్పోర్ట్స్: సీఎం కేసీఆర్ పుట్టిన రోజును పురస్కరించుకొని ఈ నెల 16న జిల్లాస్థాయి చదరంగం పోటీలను కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు డీవైఎస్‌ఓ కీర్తి రాజవీరు తెలిపారు. ఆసక్తి గల బాలబాలికలు, మహిళలు స్టేడియంలో ఉదయం 10 గంటలకు రిపోర్ట్ చేయాలన్నారు. జిల్లాస్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచిన బాలబాలికలు, మహిళలను ఈ నెల 17న హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో జరిగే పోటీలకు పంపించనున్నట్లు పేర్కొన్నారు.

క్లుప్తంగా

ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డికి సన్మానం



కౌశిక్‌రెడ్డిని సత్కరిస్తున్న కౌన్సిలర్లు

హుజూరాబాద్‌: శాసనమండలి విప్‌గా నియమితులైన ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డిని మంగళవారం హైదరాబాద్‌లో ఎస్సీ కార్పొరేషన్‌ చైర్మన్‌ బండ శ్రీనివాస్‌, మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ గందె రాధిక, పలువురు బీఆర్‌ఎస్‌ నాయకులు అభినందనలు తెలిపారు. ఎస్సారెస్పీ మాజీ చైర్మన్‌ చొల్లేటి కిషన్‌రెడ్డి, నాగార్జున డెయిరీ చైర్మన్‌ పుల్లూరి ప్రభాకర్‌రావు, మున్సిపల్‌ మాజీ చైర్మన్‌ వడ్లూరి విజయకుమార్‌ పుష్పగుచ్ఛమిచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే హుజురాబాద్‌ మున్సిపల్‌ కౌన్సిలర్లు, తదితరులు గజమాలతో సత్కరించారు.

చైర్‌పర్సన్‌ మార్పునకు కౌన్సిలర్ల ప్రమాణం

ఇటీవల హుజూరాబాద్‌ మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ గందె రాధికపై అవిశ్వాస తీర్మానం ఇచ్చిన మెజార్టీ కౌన్సిలర్లు ప్రభుత్వ విప్‌ కౌశిక్‌రెడ్డిని కలిసేందుకు మూకుమ్మడిగా హైదరాబాద్‌ వెళ్లడం చర్చనీయాంశంగా మారింది. అంతకు ముందు చైర్‌పర్సన్‌ మార్పు జరిగే వరకు ఐక్యంగా ఉంటామని కట్ట మైసమ్మ ఆలయంలో కౌన్సిలర్లు ప్రమాణం చేసినట్లు తెలిసింది.

వావిలాల ఖాదీ ప్రతిష్టాన్‌ అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న వాణీదేవి

జమ్మికుంట(హుజూరాబాద్‌): వావిలాల ఖాదీ గ్రామోద్యోగ ప్రతిష్టాన్‌ అభివృద్ధికి కృషి చేస్తానని చైర్మన్‌, ఎమ్మెల్సీ వాణీదేవి అన్నారు. మంగళవారం మండలంలోని వావిలాల ఖాదీ గ్రామోద్యోగ ప్రతిష్టాన్‌లో కార్మికులతో సమావేశం నిర్వహించారు. అనంతరం జమ్మికుంటలో కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, దివంగత ప్రధాని పీవీ నర్సింహారావు ఆధ్వర్యంలో స్థాపించిన ఖాదీ గ్రామోద్యోగ ప్రతిష్టాన్‌ నిర్వహణ బాగుందని, సుమారు 1,200 మంది కార్మికులు జీవనోపాధి పొందుతున్నారని తెలిపారు. కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని పేర్కొన్నారు. కేరళ, కర్నాటక, తమిళనాడు, మహారాష్ట్రలో ఖాదీ ఉత్పత్తులు, స్టాల్స్‌ నిర్వహణపై పన్ను రాయితీ కల్పిస్తున్నాయని, ఈ విషయాన్ని సీఎం కేసీఆర్‌ దృష్టికి తీసుకెళ్లి పన్ను రాయితీ వచ్చేలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో దీ ప్రతిష్టాన్‌ కార్యదర్శి వొడితల కిషన్‌రావు, సుపరింటెండెంట్‌ శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

శంకరపట్నం(మానకొండూర్‌): మండలంలోని కేశవపట్నం గ్రామానికి చెందిన గూళ్ల అఖిల్‌ (19) హైదరాబాద్‌ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. పోలీసుల వివరాలు.. అఖిల్‌ ఓ వ్యక్తికి చెందిన ట్రాక్టర్‌పై లేబర్‌గా మూడు నెలల క్రితం పని చేశాడు. పలు కారణాలతో అఖిల్‌ను సదరు వ్యక్తి మందలించగా, జనవరి 22న పురుగుల మందు తాగాడు. కుటుంబసభ్యులు కరీంనగర్‌లోని ప్రైవేట్‌ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం మరుసటి రోజు హైదరాబాద్‌ ఆస్పత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి తండ్రి కుమార్‌ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చంద్రశేఖర్‌ పేర్కొన్నారు.

పాత పద్ధతిలోనే ప్రాక్టికల్స్‌

- నేటి నుంచి ఇంటర్‌ ప్రాక్టికల్స్‌
- జంబ్లింగ్‌ విధానం నుంచి ఈసారి మినహాయింపు

హాజరయ్యే విద్యార్థులు	12,813
ప్రయోగ పరీక్ష కేంద్రాల సంఖ్య	77
జనరల్‌ కేంద్రాలు	59
ఒకేషనల్‌ కేంద్రాలు	18



ప్రాక్టికల్‌ పరీక్షలో విద్యార్థులు (ఫైల్‌)

కరీంనగర్‌: జిల్లాలో బుధవారం నుంచి ఇంటర్మీడియట్‌ ప్రాక్టికల్‌ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు ఇంటర్‌ విద్యాశాఖాధికారులు సర్వం సిద్ధం చేశారు. ఈసారి జంబ్లింగ్‌ విధానం అమలు చేయడం లేదు. పాత పద్ధతిలో, విద్యార్థులు చదువుతున్న కళాశాలల్లోనే పరీక్షలు నిర్వహించనున్నారు.

మూడు విడతల్లో..

ఇంటర్‌ ప్రాక్టికల్‌ పరీక్షలు చాలా వరకు సొంత కళాశాలల్లోనే జరగనున్నాయి. మొదటి విడత పరీక్షలు ఈనెల 15 నుంచి 20, రెండో విడత 21 నుంచి 25, మూడో విడత 26 నుంచి మార్చి 2 వరకు జరుగుతాయి. జిల్లాలో మొత్తం 100 ప్రభుత్వ, మోడల్‌, కేజీబీవీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకుల, ప్రైవేట్‌ జూనియర్‌ కళాశాలలు ఉన్నాయి. పరీక్షలకు మొత్తం 12,813 మంది హాజరు కానున్నారు. జనరల్‌ కోర్సుల్లో (ఎంపీసీ, బైపీసీ) 9,557 మంది, 3,256 మంది ఒకేషనల్‌ విద్యార్థులు ఉన్నారు. పరీక్షల నిర్వహణకు జిల్లాలో 77 ప్రభుత్వ, ప్రైవేట్‌, గురుకుల జూనియర్‌ కళాశాలలను కేంద్రాలుగా ఎంపిక చేశారు. 59 కేంద్రాల్లో బైపీసీ, ఎంపీసీ, 18 కేంద్రాల్లో ఒకేషనల్‌ విద్యార్థులకు పరీక్షలు నిర్వహిస్తారు.

చదివిన కళాశాలలోనే..

జనరల్‌ విద్యార్థులకు వారు చదివిన కాలేజీల్లోనే పరీక్షలు జరగనుండగా, ఒకేషనల్‌ విద్యార్థులు 50 మంది కంటే తక్కువ సంఖ్యలో హాజరైతే, రెండు కళాశాలలకు చెందినవారికి ఒకే కాలేజీలో నిర్వహిస్తారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. పరీక్ష ప్రారంభానికి అరగంట ముందుగా ఎగ్జామినర్‌ ఇంటర్మీడియట్‌ బోర్డు వెబ్‌సైట్‌ నుంచి పరీక్ష పేపర్లు డౌన్‌లోడ్‌ చేయనున్నారు. పరీక్షల పర్యవేక్షణకు ఒక్కో కేంద్రంలో డిపార్ట్‌ మెంటల్‌ అధికారి, చీఫ్‌ సూపరింటెండెంట్‌ ఉంటారు.

తనిఖీ బృందాల నియామకం..

జిల్లా స్థాయిలో పరీక్షల నిర్వహణకు ఏర్పాటయ్యే హైపవర్‌ కమిటీకి కలెక్టర్‌ చైర్మన్‌గా, సభ్యులుగా సీపీ, మెంబర్‌ కన్వీనర్‌గా ఇంటర్‌ విద్యా శాఖ నోడల్‌ అధికారి వ్యవహరించనున్నారు. పరీక్షల పర్యవేక్షణకు ఏర్పాటయ్యే డెక్‌ బృందంలో జిల్లా నోడల్‌ అధికారి, ఇద్దరు ప్రభుత్వ జూనియర్‌ కళాశాలల ప్రిన్సిపాల్స్‌, సీనియర్‌ లెక్చరర్లు సభ్యులుగా ఉంటారు. కమిటీ కన్వీనర్‌గా డీఐఈవో రాజ్యలక్ష్మి, సభ్యులుగా జి.జగన్‌, మోహన్‌రెడ్డి, వి.ఆంజనేయరావు, సీహెచ్‌ శశిధర్‌ శర్మను ఏర్పాటు చేశారు.

ప్రతిభ ఆధారంగా మార్కులు

చదివిన కళాశాలలోనే ప్రాక్టికల్‌ పరీక్షలు నిర్వహిస్తుండడంతో ప్రైవేట్‌ కాలేజీలు తమ విద్యార్థులకు ఎక్కువ మార్కులు వేయించుకునే అవకాశం ఉందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఎగ్జామినర్లను ప్రైవేట్‌ యాజమాన్యాలు ప్రలోభాలకు గురిచేసి తమ విద్యార్థులకు ఎక్కువ మార్కులు వేయించుకున్న ఘటనలు గతంలో చోటు చేసుకున్నాయి. అయితే విద్యార్థుల ప్రతిభ ఆధారంగా ఎగ్జామినర్లు మార్కులు వేసేలా ఇంటర్‌ విద్యాశాఖ నిఘా పెంచనున్నట్లు తెలిసింది.

పారదర్శకంగా నిర్వహిస్తాం

జిల్లాలో ఇంటర్‌ ప్రాక్టికల్‌ పరీక్షలు పారదర్శకంగా కొనసాగేలా చర్యలు తీసుకుంటాం. విద్యార్థుల ప్రతిభ ఆధారంగా మార్కులు వేసేలా నిఘా ఉంచుతాం. పరీక్షా కేంద్రాల నిర్వాహకులకు, ఎగ్జామినర్లకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశాం. ఏమాత్రం అవకతవకలకు పాల్పడినా నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ప్రైవేట్‌ యాజమాన్యాలు హాల్‌ టికెట్లు ఇవ్వకుండా విద్యార్థులను వేధిస్తే ఇంటర్‌బోర్డు నిబంధనల మేరకు చర్యలు తప్పవు.
– రాజ్యలక్ష్మి, జిల్లా నోడల్‌ అధికారి, కరీంనగర్‌

ఠాణాల్లో రైటర్ల పాత్ర కీలకం

- కరీంనగర్‌ పోలీస్‌ కమిషనర్‌ ఎల్‌.సుబ్బారాయుడు



మాట్లాడుతున్న సీపీ సుబ్బారాయుడు

కరీంనగర్‌క్రైం: పోలీస్‌ స్టేషన్లకు చెందిన రికార్డుల నిర్వహణ, వివిధ రకాల కేసుల వివరాల నమోదులో రైటర్లు పాత్ర కీలకమైందని కరీంనగర్‌ పోలీస్‌ కమిషనర్‌ ఎల్‌.సుబ్బరాయుడు అన్నారు. మంగళవారం కమిషనరేట్‌ కేంద్రంలో వివిధ పోలీస్‌ స్టేషన్లు, సర్కిల్‌, ఏసీపీ కార్యాలయాలకు చెందిన రైటర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ, రైటర్లు ఎలాంటి సందేహాలకు తావివ్వకుండా కేసుల వివరాలు నమోదు చేయాలన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై శ్రద్ధాసక్తులతో అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. పెండింగ్‌ కేసులు పరిమిత సంఖ్యకన్నా తక్కువ ఉండేలా దర్యాప్తు చేసే అధికారులకు సహాయకులుగా వ్యవహరించాలని చెప్పారు. గుర్తింపు లభించేలా విధినిర్వహణ కొనసాగించాలన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం ద్వారానే ప్రజలకు మెరుగైన సేవలందించవచ్చని తెలిపారు. వివిధ రకాల పని విభాగాల ఏర్పాటుతో పోలీస్‌ స్టేషన్ల పనితీరు సులభతరంగా మారిందని వివరించారు. ప్రజలకు సేవచేసేందుకు లభించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్‌ డీసీపీ (పరిపాలన) జి.చంద్రమోహన్‌, ఏసీపీ కాశయ్య, ఇన్‌స్పెక్టర్‌ బి.సంతోష్‌కుమార్‌, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంతర్‌జిల్లా బైకుల దొంగ అరెస్ట్‌



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ తుల శ్రీనివాసరావు

కరీంనగర్‌క్రైం: అంతర్‌జిల్లా బైకుల దొంగను కరీంనగర్‌ త్రీటౌన్‌ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. సీఐ దామోదర్‌రెడ్డితో కలిసి ఏసీపీ తుల శ్రీనివాసరావు వివరాలు వెల్లడించారు. కరీంనగర్‌లోని హుస్సేనీపుర ప్రాంతానికి చెందిన మహ్మద్‌ అమీర్‌(34) ప్రస్తుతం జగిత్యాల జిల్లా కోరుట్లలో ఉంటున్నాడు. గతంలో పెయింటర్‌గా పని చేసేవాడు. జల్సాలకు అలవాటు పడి డబ్బు సరిపోక దొంగతనాలు మొదలుపెట్టాడు. ఆరు నెలలుగా కరీంనగర్‌, హనుమకొండ జిల్లాల్లో ఇళ్ల ముందు, ఆసుపత్రుల వద్ద తాళం వేయకుండా నిలిపి ఉన్న ద్విచక్రవాహనాలను చోరీ చేశాడు. ఇప్పటి వరకు 9 బైకులు దొంగతనం చేశాడు. కరీంనగర్‌ త్రీటౌన్‌ పోలీసుస్టేషన్‌లో పరిధిలో మూడు బైకులు చోరీ చేయగా, వాహనదారుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు మంగళవారం సుభాష్‌నగర్‌ ప్రాంతంలో వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో అమీర్‌తోపాటు మరో యువకుడు నంబర్‌లేని వాహనంపై అనుమానాస్పదంగా తిరగడాన్ని గుర్తించి విచారించగా బైక్‌లను చోరీ చేస్తున్నట్లు ఒప్పుకున్నాడు. అతడి నుంచి కరీంనగర్‌ పట్టణంలో చోరీ చేసిన 3, హనుమకొండ సుబేదారి రాణా పరిధిలో చోరీ చేసిన 6 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన మరో వ్యక్తి మైనర్‌ కావడంతో అతడికి నోటీస్‌ అందించి విచారిస్తున్నారు. అమీర్‌ను రిమాండ్‌ చేసినట్లు ఏసీపీ తెలిపారు. సమావేశంలో ఎస్సైలు శ్రీనివాసరావు, రవీందర్‌నాయుడు పాల్గొన్నారు.

జాగృతి వాలీబాల్‌ పోటీలకు జిల్లా జట్లు ఎంపిక

కరీంనగర్‌స్పోర్ట్స్‌: సీఎం కేసీఆర్‌ జన్మదినాన్ని పురస్కరించుకొని భారత జాగృతి ఆధ్వర్యంలో హైదరాబాదులోని ఎల్బీ స్టేడియంలో ఈనెల 15,16 తేదీల్లో నిర్వహించే రాష్ట్రస్థాయి వాలీబాల్‌ టోర్నమెంట్‌కు (కేసీఆర్‌ కప్‌–2023) ఉమ్మడి జిల్లా నుంచి వాలీబాల్‌ మహిళలు, పురుషుల టీంలను అసోసియేషన్‌ ఆధ్వర్యంలో ఎంపిక చేశారు. క్రీడాకారులకు యూనిఫాంలను జాగృతి జిల్లా అధ్యక్షుడు జాడి శ్రీనివాస్‌, రాష్ట్ర కార్యదర్శి బాలసంకుల అనంతరావు, అధికార ప్రతినిధి దొంతినేని లికేషరావులు స్పాన్సర్‌ చేశారు. ఎంపిక చేసిన క్రీడాకారులను మంగళవారం హైదరాబాదుకు పంపించారు. మహిళ టీంకు సతీష్‌, పురుషుల టీంకు ప్రతాపరెడ్డి, సంపత్‌ కోచ్‌లుగా వ్యవహరిస్తారు. కార్యక్రమంలో జిల్లా పీఆర్‌టీ గాలిపెల్లి రత్నాకర్‌, యూత్‌ విభాగం జిల్లా అధ్యక్షుడు విష్ణువర్ధన్‌, మహిళా విభాగం జిల్లా కోకన్వీనర్‌ కలకుంట్ల జలజ, వాలీబాల్‌ అసోసియేషన్‌ ఉమ్మడి జిల్లా కార్యదర్శి గిన్నే లక్ష్మణ్‌, సెక్రెటరీ హరీశ్‌ పాల్గొన్నారు.

పది విద్యార్థులకు అల్పాహారం

- ఒక్కో విద్యార్థికి రోజుకు రూ.15 విలువగల స్నాక్స్‌
- మొదటిసారి ప్రభుత్వం నుంచి నిధుల విడుదల

జిల్లాలో..

పాఠశాలలు	150
విద్యార్థులు	4,247
నిధులు	రూ.21.65 లక్షలు



ఒద్యారం హైస్కూల్‌లో విద్యార్థులకు బిస్కెట్‌ ప్యాకెట్స్‌ అందజేత(ఫైల్‌)

కరీంనగర్‌: పదో తరగతి పరీక్షల్లో మంచి ఫలితాల కోసం ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న విద్యార్థులకు అల్పాహారం అందించేందుకు ప్రభుత్వం మొదటిసారిగా నిధులు మంజూరు చేసింది. గతంలో విద్యార్థులు ఆకలితోనే ప్రత్యేక తరగతులకు హాజరయ్యేవారు. పట్టణాల్లోని ప్రభుత్వ స్కూళ్లలో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, రాజకీయ నాయకులు అల్పాహారం కోసం ముందుకు వచ్చేవారు. ప్రభుత్వ పక్షాన ప్రత్యేక నిధుల కేటాయింపులు లేక మెజార్టీ విద్యార్థులు ఆకలితోనే చదువులు కొనసాగించేవారు. ఎట్టకేలకు వీరి ఆకలి కష్టాలకు తెర పడింది. నిధులు విడుదల చేస్తూ ఆయా జిల్లాల డీఈవోలకు జారీ అయ్యాయి. ఈ నెల 15 నుంచి ఏప్రిల్‌ ఒకటో తేదీ వరకు (34 రోజులు) అల్పాహారం అందించనున్నారు.

4,247 మందికి లబ్ధి..

ఉత్తీర్ణతా శాతం పెంపే లక్ష్యంగా జిల్లాలో 150 ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. జనవరి ఒకటో తేదీ నుంచి యాక్షన్‌ ప్లాన్‌ అమలు చేస్తూ తరగతులు, రివిజన్‌ టెస్టులు పెట్టారు. ఉదయం 8.30 నుంచి 9.30 గంటల వరకు, సాయంత్రం 4.30– 5.30 గంటల వరకు తరగతులు నిర్వహిస్తున్నారు. కాగా ఐదారు కి.మీ దూరం నుంచి వచ్చే విద్యార్థులు ఉదయం వేళ ఏమీ తినకుండా వస్తున్నారు. వారు మధ్యాహ్న భోజనం వరకు వేచి ఉంటున్నారు. మధ్యాహ్నం తిన్న విద్యార్థులు సాయంత్రం 6.30 నుంచి 7 గంటల వరకు ఆహారం తీసుకునే పరిస్థితి లేదు. దీంతో వారిలో అలసట, నీరసం చేరి చదువుపై దృష్టి సారించలేకపోతున్నారు. దీనిని గుర్తించిన ప్రభుత్వం అల్పాహారం అందించాలని నిర్ణయించడం ఊరట కలిగించే అంశం.

ఒక్కో విద్యార్థికి..

గతేడాది ప్రత్యేక తరగతులకు కలెక్టర్ల చొరవతో అల్పాహారం అందించారు. ఈ సారి ప్రభుత్వమే నేరుగా నిధులు విడుదల చేసింది. ఒక్కో విద్యార్థికి నిత్యం రూ.15 చొప్పున ఖర్చు చేయనున్నారు. జిల్లా పరిధిలోని 150 ప్రభుత్వ స్కూళ్లలో పదో తరగతి విద్యార్థులు 4,247 మంది ఉన్నారు. వీరికి 34 రోజులకు గాను రూ.21.65 లక్షల నిధులు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. మధ్యాహ్న భోజనం నిర్వాహకులతో ఉదయం, సాయంత్రం అల్పాహారం అందేలా చర్యలు తీసుకోనున్నారు.

ఉత్తర్వులు వచ్చాయి

ప్రత్యేక తరగతులకు హాజరవుతున్న విద్యార్థులకు అల్పాహారం అందించాలని ఉత్తర్వులు వచ్చాయి. వచ్చిన నిధుల ప్రకారం విద్యార్థులు ఇష్టంగా తినే అల్పాహారాన్ని మధ్యాహ్న భోజన సిబ్బందితో సిద్ధం చేయిస్తాం. – సీహెచ్‌ జనార్దన్‌రావు, డీఈవో

బాలికను రక్షించిన షీ టీం పోలీసులు

కరీంనగర్‌క్రైం: గోదావరిఖని నుంచి వచ్చి కరీంనగర్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న బాలికను కరీంనగర్‌ షీ టీం పోలీసులు మంగళవారం తల్లికి అప్పగించారు. పోలీసుల వివరాలు.. బాలిక ఇంట్లో గొడవపడి కరీంనగర్‌కు వచ్చింది. నగరంలో అనుమానాస్పదంగా తిరుగుతుండగా షీ టీం పోలీసులు పట్టుకున్నారు. వివరాలు అడుగగా గోదావరిఖని అని చెప్పింది. షీ టీం సీఐ శ్రీనివాస్‌ చైల్డ్‌లైన్‌ వారితో కలిసి కౌన్సెలింగ్‌ నిర్వహించి బాలికను తల్లికి అప్పగించారు. షీ టీం ఏఎస్సై విజయమణి, హెడ్‌కానిస్టేబుల్‌ పరశురామ్‌, కానిస్టేబుల్స్‌ స్వప్న, శ్రీలేఖ, చైల్డ్‌ లైన్‌ టీం మెంబెర్స్‌ పుష్పలత, నరేంద్ర పాల్గొన్నారు.

కేబుల్‌ బ్రిడ్జి అప్రోచ్‌రోడ్డు పనులు పూర్తి చేయండి

- కలెక్టర్‌ ఆర్‌వీ కర్ణన్‌



కేబుల్‌ బ్రిడ్జి పనులను పరిశీలిస్తున్న కలెక్టర్‌ కర్ణన్‌

కరీంనగర్‌: కేబుల్‌ బ్రిడ్జి అప్రోచ్‌ రోడ్డు పనులను త్వరితగతిన పూర్తిచేయాలని కలెక్టర్‌ ఆర్‌వీ కర్ణన్‌ కాంట్రాక్టర్లు, ఇంజినీరింగ్‌ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆర్‌అండ్‌బీ అధికారులు, కాంట్రాక్టర్‌లతో కలసి కేబుల్‌ బ్రిడ్జి అప్రోచ్‌ రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ, రాత్రింబవళ్లు పనులు చేపట్టి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ డీఈ రవీందర్‌, ఏఈ రాజశేఖర్‌, అశోక్‌ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి 24 గంటల కరెంట్‌ ఇవ్వాలి



ధర్నా చేస్తున్న వైఎస్సార్‌టీపీ నాయకులు

కొత్తపల్లి(కరీంనగర్‌): అసెంబ్లీ సాక్షిగా రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రకటించిన విధంగా వ్యవసాయానికి 24 గంటల త్రీఫేజ్‌ కరెంట్‌ ఇచ్చి రైతులను ఆదుకోవాలని డిమాండ్‌ చేస్తూ మంగళవారం కరీంనగర్‌లోని విద్యుత్‌ భవన్‌ ఎదుట వైఎస్సార్‌టీపీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డా.నగేష్‌, జిల్లా అధ్యక్షుడు అక్కెనపల్లి కుమార్‌ మాట్లాడుతూ, అప్రకటిత విద్యుత్‌ కోతలతో పంటలు ఎండుతుంటే, 24 గంటలు ఇస్తున్నామంటూ రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు. వ్యవసాయానికి నాణ్యమైన కరెంట్‌ ఇచ్చేవరకు వైఎస్సార్‌టీపీ ఆందోళలు కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు వరాల శ్రీనివాస్‌, కె.వెంకటరమణారెడ్డి, రజితారెడ్డి, కవిత, రాజారెడ్డి, డా.శివరాం, ఆర్‌.శ్రీనివాస్‌, శేఖర్‌, సాదిక్‌బలాల, సునీల్‌, మల్లికార్జున్‌రెడ్డి, శ్రీనివాస్‌, ప్రశాంత్‌, శ్రావణ్‌, రాజేశ్వర్‌, భరత్‌రెడ్డి, రాజన్న, వెంకటేష్‌, సలీం, ఐలయ్య పాల్గొన్నారు.

అనుమతిలేని కోచింగ్‌ సెంటర్లపై చర్యలు తీసుకోవాలి



డీఈవోకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కరీంనగర్‌: జిల్లా కేంద్రంలోని కోచింగ్‌ సెంటర్‌లపై తక్షణమే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్‌ (యూఎస్‌ఎఫ్‌ఐ) ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారి జనార్దన్‌రావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు సంద గణేష్‌ మాట్లాడుతూ, ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్లను ఆసరా చేసుకొని కోచింగ్‌ సెంటర్ల యాజమాన్యాలు నిరుద్యోగుల నుంచి వేలాది రూపాయల ఫీజులు వసూలు చేస్తున్నాయని మండిపడ్డారు. పట్టణంలో ఎన్నింటికి అనుమతుందో, లేదో కూడా అధికారులకు తెలియని పరిస్థితి నెలకొందన్నారు. సెంటర్లపై విచారణ చేపట్టకపోవడంతో యాజమాన్యాలు ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నాయని పేర్కొన్నారు. కనీస వసతులైన తాగునీరు, మూత్రశాలలు, మరుగుదొడ్లు కూడా లేకుండా సెంటర్లను నడపడం ఏమిటని ప్రశ్నించారు. తక్షణమే అధికారులు స్పందించి అనుమతులు, వసతులు లేని కోచింగ్‌ సెంటర్లను మూసివేయాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో యూఎస్‌ఎఫ్‌ఐ నాయకులు తిరుపతి, రామ్‌, అర్జున్‌, విజయ్‌, శశిధర్‌ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టిజన్‌ కార్మికుల నిరసన



నిరసన తెలుపుతున్న ఆర్టిజన్‌ కార్మికులు

హుజూరాబాద్‌: సమస్యలు పరిష్కరించాలని పట్టణంలోని డివిజన్‌ విద్యుత్‌ ఆఫీస్‌ ఎదుట మంగళవారం ఆర్టిజన్‌ కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యుత్‌ సంస్థలో పనిచేసే ఉద్యోగులందరికీ ఒకే రకమైన రూల్స్‌ ఉండాలన్నారు. పర్సనల్‌ పే ను బేసిక్‌ పే లో కలపాలని, 50 శాతం పీఆర్‌సీ ఫిట్‌మెంట్‌ ఇవ్వాలన్నారు. ప్రతీ సబ్‌ స్టేషన్‌లో ముగ్గురు లేదా ఇద్దరు పనిచేస్తున్నారని, తక్షణమే నాల్గో ఆపరేటర్‌ను భర్తీ చేయాలని, ఆర్టిజన్లను రెగ్యులర్‌ చేస్తూ అర్హతలను బట్టి కన్వర్షన్‌ ఇవ్వాలన్నారు. ప్రతీ సబ్‌స్టేషన్‌లో వాచ్‌మెన్‌ను నియమించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డివిజన్‌ అధ్యక్షుడు తోంటి గట్టయ్య, ప్రధాన కార్యదర్శి కక్ర సమ్మిరెడ్డి, నాయకులు విక్రంరెడ్డి, శంకరయ్య, సదానందం, మహేందర్‌, సారంగపాణి, తిరుపతి, సౌమ్య, సరిత, సుధాకర్‌, మల్లయ్య, పూర్ణచందర్‌, రవీందర్‌ తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ కరాటే పోటీల్లో ప్రతిభ



ట్రోఫీ అందజేస్తున్న సినీ నటుడు సుమన్‌

కరీంనగర్‌స్పోర్ట్స్‌: విశాఖపట్నంలో ఈ నెల 9 నుంచి 12 వరకు జరిగిన అంతర్జాతీయ ఓపెన్‌ కరాటే చాంపియన్‌షిప్‌– 2023 పోటీల్లో జిల్లాకు చెందిన కరాటే ఫెడరేషన్‌ ఆఫ్‌ షోటోఖాన్‌ విద్యార్థులు ప్రతిభ కనబరిచి 29 పతకాలు సాధించినట్లు మాస్టర్‌ గౌరు రాజిరెడ్డి తెలిపారు. సీనియర్‌, జూనియర్‌ విభాగాల్లో 17 మంది విద్యార్థులు కటాస్‌, కుమిటీలో 16 గోల్డ్‌ మెడల్స్‌, సిల్వర్‌ మెడల్స్‌ 6, బ్రాంజ్‌ మెడల్స్‌ 7 సాధించినట్లు పేర్కొన్నారు. బ్లాక్‌బెల్ట్‌ సీనియర్స్‌ కుమిటీలో చిరంజీవి, కటాస్‌లో మాలతి గోల్డ్‌ మెడల్స్‌ సాధించి చాంపియన్‌లుగా నిలిచినట్లు వివరించారు. పతకాలు సాధించిన విద్యార్థులకు సినీ నటుడు సుమన్‌ ట్రోఫీలు అందజేశారు. ఈసందర్భంగా విద్యార్థులను జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి సుజయ్‌, ప్రిన్సిపల్‌ సీనియర్‌ సివిల్‌ జడ్జి అరుణ, నగర ఏసీపీ తుల శ్రీనివాసరావుతో పాటు పలువురు అభినందించారు.

సౌత్‌జోన్‌ ఇంటర్‌ పాలిటెక్నిక్‌ క్రీడా పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

మానకొండూరు: కోదాడలోని అనురాగ్‌ ఇంజినీరింగ్‌ కాలేజీలో ఈ నెల 9, 10వ తేదీల్లో జరిగిన రాష్ట్ర స్థాయి టేబుల్‌ టెన్నిస్‌ పోటీల్లో జ్యోతిష్మతి విద్యార్థులు సింధు, శ్రావ్య ప్రథమ బహుమతి సాధించారు. మార్చి 10, 11వ తేదీల్లో హైదరాబాదులోని వీఎన్‌ఆర్‌ విజ్ఞానజ్యోతి కళాశాలలో జరగబోయే సౌత్‌ జోన్‌ ఇంటర్‌ పాలిటెక్నిక్‌ గేమ్స్‌ అండ్‌ స్పోర్ట్స్‌ పోటీలకు ఎంపికయ్యారు. అలాగే బాలుర చదరంగంలో అభిరామ్‌ ద్వితీయ స్థానం బాలికల టేబుల్‌ టెన్నిస్‌ సింగిల్స్‌లో శ్రావ్య ద్వితీయ స్థానంలో నిలిచి బహుమతులు సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల చైర్మన్‌ జువ్వాడి సాగర్‌రావు, ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ కె.శ్రీనివాసరావు, పాలిటెక్నిక్‌ కళాశాల ఇన్‌చార్జి సిహెచ్‌.సృజన్‌రావు, ఫిజికల్‌ డైరెక్టర్‌ వెంకటేశ్వరరావు అభినందించారు. విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లో విజేతలుగా నిలవాలని పిలుపునిచ్చారు.

వాగులో హరిత బయో కంపెనీ ఉద్యోగి గల్లంతు

మానకొండూర్‌: తిమ్మాపూర్‌ మండలం పర్లపల్లి గ్రామంలోని హరిత బయో కంపెనీలో పనిచేస్తున్న కాట శ్రీనివాస్‌(40) మంగళవారం మానేరు వాగులో గల్లంతయ్యాడు. విధుల్లో భాగంగా కొత్తపల్లి సమీపంలోని మానేరులో గల కంపెనీ బావి మోటార్‌ మరమ్మతు కోసం వెళ్లాడు. ప్రమాదవశాత్తు వాగులో గల్లంతయ్యాడు. కాగా తోటి కార్మికులతో యాజమాన్యం తప్పుడు స్టేట్‌మెంట్‌ ఇప్పించి చేతులు దులుపుకోవాలని ప్రయత్నం చేస్తుందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేష్‌ ఆరోపించారు. శ్రీనివాస్‌ గల్లంతుపై సమగ్ర దర్యాప్తు చేయాలని బాధిత కుటుంబానికి రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియా కంపెనీ చెల్లించాలని డిమాండ్‌ చేశారు. 2012లో రక్షణ చర్యల కోసం గ్రామస్తులు కంపెనీపై దాడిచేశారని గుర్తు చేశారు. తర్వాత యాజమాన్యం తాత్కాలిక చర్యలు చేపట్టిందని తెలిపారు. ఇప్పటికీ కంపెనీ నుంచి దుర్వాసన, మురికినీరు ప్రవహిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. కంపెనీలో పనిచేస్తున్న కార్మికులందరికీ ఇన్సూరెన్స్‌, ఈఎస్‌ఐ, పీఎఫ్‌, సమగ్ర ఆరోగ్య వసతి సౌకర్యాలు, కంపెనీ ఆవరణలోనే ఒక డిస్పెన్సరీ ఏర్పాటు చేయాలన్నారు.

క్లుప్తంగా

కోడింగ్, ప్రోగ్రామింగ్‌లపై అవగాహన



విద్యార్థులతో కళాశాల ప్రిన్సిపాల్, లెక్చరర్లు

శాతవాహన యూనివర్సిటీ: ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ విభాగం, సామ్‌సంగ్ ఇన్నోవేషన్ క్యాంపస్ సంయుక్తంగా మంగళవారం కోడింగ్, ప్రోగ్రామింగ్‌లపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ టి.శ్రీలక్ష్మి మాట్లాడుతూ.. విద్యార్థులు అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్, కంప్యూటర్ విభాగాధిపతి టి.లావణ్య, జ్ఞానేందర్‌రెడ్డి, శ్రీధర్‌రావు, చక్రవర్తి, కల్పన, హరికృష్ణ, భానుప్రియ, సుప్రియ, సరిత, కిశోర్, రాజశేఖర్, సతీశ్, రజని, అధ్యాపకులు పాల్గొన్నారు.

తడి, పొడి వరి సాగుపై..



అవగాహన కల్పిస్తున్న కో–ఆర్డినేటర్ సాగరిక

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలోని ఎలబోతారం గ్రామంలో మంగళవారం కోర్ కార్బన్ ఎక్స్‌సొల్యూషన్స్, పద్మపాణి స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో రైతులకు తడి, పొడి వరి సాగుపై అవగాహన కల్పించారు. నీరు పెట్టడం, పంటను ఆరబెట్టడం ద్వారా 30 శాతం నీటి వినియోగం తగ్గుతుందని సంస్థ కో–ఆర్డినేటర్ సాగరిక తెలిపారు. తడి, పొడి విధానంలో సాగు చేసుకునే రైతులు పట్టాదారు పాసుపుస్తకంతో వచ్చి, సంప్రదించాలని సూచించారు. సర్పంచు కట్ల లక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు చల్లా రామక్క, ఉపసర్పంచు సుధాకర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు కట్ల గౌతంరెడ్డి, చల్లా లింగారెడ్డి, సతీశ్‌రెడ్డి, శేఖర్, నర్సింహారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

'ఎంఐఎం పార్టీవి బ్లాక్‌మెయిల్ రాజకీయాలు'

కొత్తపల్లి: ఎంఐఎం పార్టీ బ్లాక్‌మెయిల్ రాజకీయాలతో బీఆర్‌ఎస్ పార్టీకి ఎలాంటి నష్టం లేదని కొత్తపల్లి మున్సిపల్ కౌన్సిలర్ నజియా బాబా ఒక ప్రకటనలో అన్నారు. సమస్త ముస్లిం జాతికి తామే ప్రతినిధులమన్నట్లు మాట్లాడటం ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు గులాం అహ్మద్ అజ్ఞానాన్ని తెలియజేస్తోందని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో రాష్ట్రంలోని ముస్లింలను కన్న బిడ్డల్లా చూసుకుంటూ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. గులాం అహ్మద్ తన స్థాయిని మరిచి, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్‌పై చేసిన వ్యాఖ్యలను ఖండిస్తున్నామని అన్నారు. చిల్లర రాజకీయాలు పక్కన బెట్టి, ముస్లింలకు ఎంఐఎం ఏం చేసిందో చెప్పాలని సవాల్ విసిరారు.

నేడు లోక్‌సత్తా శ్రీనివాస్ సంస్మరణ సమావేశం

కరీంనగర్: లోక్‌సత్తా నాయకుడు, వినియోగదారుల హక్కుల కోసం నిరంతరం పరితపించిన నరెడ్ల శ్రీనివాస్ సంస్మరణ సమావేశం కరీంనగర్‌లోని ఫిలింభవన్‌లో బుధవారం సాయంత్రం 6 గంటలకు నిర్వహిస్తున్నట్లు కరీంనగర్ వినియోగదారుల వేదిక అధ్యక్షుడు ఆర్.వెంకటేశ్వర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీనివాస్ వినియోగదారుల మండలి తరఫున వందలాది కేసులు వేసి, హక్కుల పరిరక్షణకు కృషి చేశారని కొనియాడారు. భూ ఆక్రమణల వ్యవహారాన్ని బయటకు తీశారన్నారు. ఫేక్ డాక్టరేట్ పట్టాల బాగోతాన్ని బయటపెట్టారని, పాలకుల తప్పులను, ప్రభుత్వ పాలసీల్లోని లోపాలను ఎత్తిచూపారని పేర్కొన్నారు.

'శ్రీ చైతన్య'పై హత్య కేసు నమోదు చేయాలి



మాట్లాడుతున్న వంశీధర్‌రెడ్డి

కరీంనగర్: హైదరాబాద్‌లోని శ్రీ చైతన్య కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సర విద్యార్థిని నిమ్మల రమాదేవి ఆత్మహత్యకు కారకులైన కళాశాల యాజమాన్యంపై హత్య కేసు నమోదు చేయాలని ఏఐఎఫ్‌బీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గవ్వ వంశీధర్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కరీంనగర్‌లోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్కులు, ర్యాంకుల కోసం శ్రీ చైతన్య కళాశాల యాజమాన్యం విద్యార్థులను తీవ్ర ఒత్తిడికి గురిచేస్తోందని ఆరోపించారు. తమ లాభాలు తప్ప విద్యార్థుల సంక్షేమం పట్టించుకోవడం లేదన్నారు. మృతురాలి కుటుంబానికి న్యాయం చేసేంతవరకు ఏఐఎస్‌బీ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని పేర్కొన్నారు. నాయకులు రమేశ్‌యాదవ్, హరీశ్, వినయ్, విజయ్, వాసు తదితరులు పాల్గొన్నారు.

తగ్గని 'బుల్డోజర్' గ్యాంగ్



తీగలగుట్టపల్లిలో బుల్డోజర్ (ఫైల్), రేకుర్తిలో కూల్చిన ఇల్లు (ఫైల్)



అంబేడ్కర్ నగర్‌లో అక్రమ నిర్మాణం

- మరిన్ని చర్యలు ఉంటాయని బహిరంగ హెచ్చరికలు
- ఎప్పుడు ఏం జరుగుతుందోనని బాధితుల ఆందోళన
- నేతలు వెనకుంటే పట్టించుకోని బల్దియా అధికారులు
- నాయకులకు నచ్చకుంటే సక్రమ నిర్మాణాలూ నేలమట్టమే..

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: కరీంనగర్ స్మార్ట్ సిటీలో కొందరు ప్రజాప్రతినిధుల ఇష్టారాజ్యం సాగుతోంది. తమ అనుమతి లేకుండా ఇల్లు కడితే.. ఇక అంతే సంగతులు. బల్దియా నుంచి అన్ని అనుమతులు తీసుకున్నా సరే.. సదరు నేత వద్దకు వెళ్లి ఆమ్యామ్యాలు సమర్పించి ఆశీర్వాదం తీసుకోవాల్సిందే. లేకపోతే.. రాత్రికిరాత్రి బుల్డోజర్లు వచ్చి.. సదరు నిర్మాణాలను కూల్చివేస్తాయి. ఇలాంటి ఘటనలు ఇటీవల నగరంలో రెండు చోటుచేసుకున్నాయి. ఇవి రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపాయి. ఈ రెండు ఘటనలపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించారు. అయితే.. ఈ కేసుల్లో నిందితులను మాత్రం అరెస్టు చేయలేకపోయారు. నిందితులు ముందస్తుగానే అదృశ్యంలోకి వెళ్లిపోయి.. బెయిల్ తెచ్చుకుంటున్నారు. తాజాగా బాధితులకు బహిరంగంగా బహిరంగంగా వార్నింగులు ఇవ్వడంతో 'బుల్డోజరు గ్యాంగ్' మరోసారి తెరమీదకు వచ్చింది.

వాట్సాప్‌లో వార్నింగ్..

గతేడాది చివరలో తీగలగుట్టపల్లిలో నిర్మాణంలో ఉన్న ఓ ఇంటిని ఒక బుల్డోజర్ గ్యాంగ్ కూల్చింది. అంతకుముందు కరీంనగర్ శివారులోని రేకుర్తిలో నిర్మాణంలో ఉన్న మూడు ఇళ్లను ఓ ప్రజాప్రతినిధి కూలగొట్టించాడు. తనకు అడిగినంత డబ్బు చెల్లించలేదన్న అక్కసుతో రాత్రికి రాత్రి బుల్డోజర్లు వేసుకుని, భారీగా మనుషులను వెంట తీసుకెళ్లి మరీ.. సదరు మూడు ఇళ్లను నేలమట్టం చేయించాడన్నది ఆరోపణ. దీనిపై అప్పటి సీపీ సత్యనారాయణ, కలెక్టర్ కర్ణన్ తీవ్రంగా స్పందించారు. ఘటనాస్థలాన్ని పరిశీలించి, నిందితులను పట్టుకోవాలని ఆదేశించారు. కేసు నమోదు చేసి, తీరా విచారణకు రమ్మంటే.. అనారోగ్యం సాకుతో అదృశ్యమయ్యారు. ముందస్తు బెయిల్ వచ్చాక తాపీగా.. నగరంలో ప్రత్యక్షమయ్యారు. జరిగిన పరిణామాలను దృష్టిలో ఉంచుకున్న సదరు నేత తనపై ఫిర్యాదు చేసిన బాధితులపై కక్ష కట్టాడు. వారికి సంబంధించిన నిర్మాణాలను మరిన్ని కూల్చేస్తానని బహిరంగ వార్నింగ్‌లు ఇస్తున్నాడు. ఇటీవల నగరంలోని ఓ 'వాకర్స్ వాట్సాప్ గ్రూపు'లో ఏకంగా బాధితుల పేర్లను ఉటంకిస్తూ.. తీవ్ర హెచ్చరికలు జారీ చేశాడు. దీంతో బాధితులు ఎప్పుడు, ఏం జరుగుతుందోనని ఆందోళనలో మునిగిపోయారు.

నోటీసులతో సరి..

బుల్డోజర్ గ్యాంగ్ హెచ్చరికల విషయం అలా ఉంటే.. అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాల్సిన బల్దియా అధికారులు కొందరు నేతల వ్యవహారాల్లో పక్షపాతంతో వ్యవహరిస్తున్నారన్న విమర్శలు పెరిగిపోతున్నాయి. సామాన్యుల నిర్మాణాల్లో ఉల్లంఘనలు ఉంటే.. వెంటనే వాలిపోయే టాస్క్‌ఫోర్స్ సభ్యులు.. ఆక్రమణలు, అక్రమ నిర్మాణాల వెనక నేతలు ఉంటే మాత్రం అటు వైపే చూడకపోవడం గమనార్హం. సుభాష్‌నగర్ సమీపంలోని అంబేడ్కర్ నగర్‌లో ఓ నేత ఖాళీ భూమిని ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్న విషయాన్ని గత డిసెంబరులో 'సాక్షి' వెలుగులోకి తీసుకువచ్చింది. దీనిపై స్పందించిన టౌన్‌ప్లానింగ్ అధికారులు నోటీసులతో సరిపెట్టారు. అంతకుమించి ఎలాంటి చర్య తీసుకోలేదు. అదే ఇటీవల సంక్రాంతికి ముందు నగరంలో స్పెషల్ డ్రైవ్ చేపట్టి పలు అక్రమ నిర్మాణాలను కూల్చేసిన టాస్క్‌ఫోర్స్ అధికారులు ఈ నిర్మాణం జోలికి మాత్రం వెళ్లకపోవడం వారి ద్వంద్వవైఖరిని చాటిచెప్పింది.



వాకర్స్ గ్రూపులో పెట్టిన వార్నింగ్ పోస్టు

పౌష్టికాహారం తీసుకోండి.. పరిశుభ్రత పాటించండి

- అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

కరీంనగర్: మారుతినగర్ సెక్టార్ పరిధిలోని హౌజింగ్‌బోర్డు కాలనీ–4వ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ అభియాన్‌లో భాగంగా మంగళవారం 'పిల్లల పెరుగుదల పర్యవేక్షణ రోజు'పై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ హాజరై, మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలు పౌష్టికాహారం తీసుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. లోప పోషణతో బాధ పడుతున్న పిల్లల వివరాలు వారి తల్లులను అడిగి తెలుసుకున్నారు. మిల్లెట్ ఫుడ్, బాలామృతం ఇస్తున్నారా, ఎనీమియా ముక్తాలో భాగంగా హాజరైన మహిళల్లో హిమోగ్లోబిన్ శాతం ఎంత ఉందని ఆరా తీశారు. మహిళలు పాటించాల్సిన ఆరోగ్య సూత్రాలను తెలుసుకునేందుకు హెల్త్ డైరీ యాప్‌ను వీలైనంత ఎక్కువ మందితో డౌన్‌లోడ్ చేయించాలని అధికారులను ఆదేశించారు. డీఎంహెచ్‌వో జువేరియా మాట్లాడుతూ.. గర్భిణులు ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలు చేయించుకోవాలని, ప్రభుత్వం ఇచ్చే కేసీఆర్ కిట్ ఇతర సౌకర్యాలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో సీడీపీవో ఉమారాణి, సూపర్‌వైజర్ అరుణ, పోషణ్ అభియాన్ డీసీ నాగరాజు, సతీశ్, ఏఎన్‌ఎం, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

నగరంలో హాథ్ సే హాథ్ జోడో యాత్ర

కరీంనగర్‌టౌన్: కాంగ్రెస్ డబ్బా ఇళ్లిచ్చింది.. మేము డబుల్ బెడ్రూం ఇళ్లిస్తామని సీఎం కేసీఆర్ చెప్పి తొమ్మిదేళ్లవుతున్నా ఒక్కరికీ ఇవ్వలేదని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని కాంగ్రెస్ నగర శాఖ అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. నగరంలోని 22వ డివిజన్ సుభాష్‌నగర్‌లో మంగళవారం హాథ్ సే హాథ్ జోడో పాదయాత్ర నిర్వహించారు. గడపగడపకూ వెళ్తూ రాహుల్‌గాంధీ సందేశ కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. కాంగ్రెస్ హయాంలో ఇందిరాగాంధీ ఆవాస్ యోజన కింద పేదలకు ఇళ్లు నిర్మించి, ఇచ్చామన్నారు. డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామని చెప్పి, నగరంలో ఏ ఒక్కరికీ ఇవ్వకుండా మోసం చేసిన ఘనత బీఆర్‌ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందని ఎద్దేవా చేశారు. వృద్ధులు చాలా మంది ఆసరా పెన్షన్ రాక కార్పొరేటర్ల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని తెలిపారు. దండి రవీందర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పాదయాత్రలో నాయకులు గుండాటి శ్రీనివాస్ రెడ్డి, మామిడి సత్యనారాయణ రెడ్డి, లింగంపల్లి బాబు, శ్రవణ్ నాయక్, కుర్ర పోచయ్య, అరుణ్ కుమార్, షబానా, కవిత, నదీమ్, శారద, ముక్క భాస్కర్, నాగుల సతీశ్, అజ్మత్ తదితరులు పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న నరేందర్‌రెడ్డి

శివలింగ ప్రతిష్ఠాపన పూజలు

కొత్తపల్లి: రేకుర్తి ద్వారకానగర్‌లోని శ్రీఅపర్ణ సమేత శ్రీఅమృతేశ్వర మహాశివాలయంలో మహాశివలింగ ప్రతిష్ఠాపన ప్రత్యేక పూజలు మంగళవారం నుంచి ప్రారంభమయ్యాయి. వేద పండితుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు.



అక్రమ లేఅవుట్లలో బేస్‌మెంట్ల తొలగింపు

- ప్రభుత్వ భూ సర్వేకు అడిషనల్ కలెక్టర్ ఆదేశం

సాక్షి ఎఫెక్ట్

కొత్తపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో అక్రమంగా వెలసిన వెంచర్లపై పంచాయతీ అధికారులు చర్యలకు ఉపక్రమించారు. 'పల్లెల్లో అక్రమ లేఅవుట్ల దందా' శీర్షికన మంగళవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, జిల్లా పంచాయతీ అధికారి వీరబుచ్చయ్యలు స్పందించారు. ప్రభుత్వ అనుమతి లేని వెంచర్లలోని నిర్మాణాలను తొలగించాలని ఆదేశించారు. ఈ మేరకు ఎంపీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి నరేశ్‌లు మంగళవారం కమాన్‌పూర్ పంచాయతీ పరిధిలోని పలు వెంచర్ల వద్దకు వెళ్లి, బేస్‌మెంట్లను తొలగించారు. కాగా రియల్ ఎస్టేట్ వ్యాపారులు రెగ్యులరైజ్ చేసుకునేందుకు అవకాశం ఇవ్వాలని కోరడంతో కూల్చివేత పనులు తాత్కాలికంగా వాయిదా వేసినట్లు ఎంపీవో తెలిపారు. ఆసిఫ్‌నగర్, బద్దిపల్లి, ఎలగందుల, మల్కాపూర్ పంచాయతీల కార్యదర్శులు స్పందించలేదు. అనుమతుల్లేని వెంచర్లలో సర్వే నిర్వహించి, ప్రభుత్వ భూమిని గుర్తించాలని అడిషనల్ కలెక్టర్ ఆదేశించారు.



అక్రమ లేఅవుట్లలోని బేస్‌మెంట్లను తొలగిస్తున్న ఎంపీవో, జీపీ కార్యదర్శి

రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో పతకాలు



విద్యార్థులను అభినందిస్తున్న నరేందర్ రెడ్డి

కొత్తపల్లి: కరీంనగర్‌లోని బీఆర్ అంబేడ్కర్ స్టేడియంలో ఇటీవల జరిగిన సుడా చైర్మన్ కరాటే కప్ రాష్ట్రస్థాయి పోటీల్లో కొత్తపల్లి అల్ఫోర్స్ ఇ–టెక్నో స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారని విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి తెలిపారు. బంగారు, కాంస్య, రజత పతకాలు సాధించిన వారిని మంగళవారం ఆయన అభినందించారు. విద్యతోపాటు విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'సెయింట్ జార్జ్' విద్యార్థుల ప్రతిభ

కరీంనగర్‌లోని అంబేడ్కర్ స్టేడియంలో వరల్డ్ కరాటే, కిక్ బాక్సింగ్ యూనియన్ ఇటీవల నిర్వహించిన సపోర్ట్ వరల్డ్ కరాటే చాంపియన్‌షిప్‌లో కొత్తపల్లి సెయింట్ జార్జ్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల చైర్మన్ పోతిరెడ్డి ఫాతిమారెడ్డి తెలిపారు. బంగారు పతకాలు సాధించిన విద్యార్థులను మంగళవారం ఆయన అభినందించారు. ప్రిన్సిపాల్ వి.నిరంజన్, టీచర్లు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఫాతిమారెడ్డి

ఇంటర్ వర్సిటీస్ పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్: పంజాబ్ రాష్ట్రంలోని గురుకాశీ యూనివర్సిటీలో ఈ నెల 21 నుంచి 24 వరకు అంతర్ విశ్వవిద్యాలయాల పవర్ లిఫ్టింగ్ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీలకు కరీంనగర్‌లోని వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాలకు చెందిన విద్యార్థి నవీన్‌కుమార్ ఎంపికైనట్లు ఫిజికల్ డైరెక్టర్ పి.శ్రీనాథ్ రెడ్డి తెలిపారు. అతను ఇటీవల జరిగిన శాతవాహన వర్సిటీ స్థాయి పోటీల్లో రాణించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని కళాశాల కరస్పాండెంట్ ఆగంరావు, ప్రిన్సిపాల్ సీహెచ్.శ్రీనివాస్, బండి శ్రవణ్ కుమార్, బండి సంపత్ కుమార్, బి.రామేశ్వర్‌రావు, అధ్యాపకులు మంగళవారం అభినందించారు.



అభినందిస్తున్న కరస్పాండెంట్, ప్రిన్సిపాల్

ఇటుకబట్టీ కార్మికులకు వైద్య పరీక్షలు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలోని చెర్లభూత్కూర్ ఇటుకబట్టీ కార్మికులకు పద్మపాణి సొసైటీ లింక్ వర్కర్స్ సహకారంతో మంగళవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. చామనపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు ఇందు కార్మికులకు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. ఆరోగ్య రక్షణ, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచు దబ్బెట రమణారెడ్డి, సొసైటీ ప్రతినిధులు రమేశ్, రాజు, శోభారాణి, అనుజ్ఞ, హెల్త్ సూపర్‌వైజర్ బాలయ్య, శ్రీనివాస్‌రెడ్డి, ఏఎన్‌ఎం వసంత, రాజేశ్వరి, ఆశవర్కర్లు సునీత, రాజమణి తదితరులు పాల్గొన్నారు.



వైద్య శిబిరంలో డాక్టర్, సిబ్బంది

పుల్వామా అమర జవాన్లకు నివాళి

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలోని దుర్శేడ్ గ్రామంలో పుల్వామా అమర జవాన్లకు వైకే ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. వారి త్యాగాలు చిరస్మరణీయమని ఫౌండేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుర్ర హరీశ్‌గౌడ్, గ్రామ ఉపసర్పంచు సుంకిశాల సంపత్‌రావులు అన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ రాష్ట్ర పీఆర్‌వో యశ్వంత్, జిల్లా అధ్యక్షుడు శివ, ఉపాధ్యక్షుడు మల్లేశం, బ్లూకోల్ట్స్ పోలీసులు కనకయ్య, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్‌టౌన్: పుల్వామా దాడిలో అమరులైన వీర జవాన్లకు శ్రీరాజరాజేశ్వరి లైయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం భాగ్యనగర్‌లో నివాళులర్పించారు. ఈ సందర్భంగా సైన్యంలో చేరి, ఉద్యోగ విరమణ పొందిన నల్ల వంశీరెడ్డి, నందికొండ ప్రకాశ్ రెడ్డి, నోముల సాగర్ రెడ్డిలను సన్మానించారు. క్లబ్ అధ్యక్షుడు నరహరి లక్ష్మారెడ్డి, రాళ్లబండి శంకర్ ప్రసాద్ రెడ్డి, కర్ర విద్యాసాగర్ రెడ్డి, పిన్నింటి నారాయణరెడ్డి, చాడ కిషన్ రెడ్డి పాల్గొన్నారు.

కరీంనగర్: పుల్వామాలో ఉగ్రదాడిలో అమరులైన జవాన్లను స్మరించుకుంటూ ఏబీవీపీ శాతవాహన యూనివర్సిటీ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం జవాన్ల చిత్రపటాలకు నివాళి అర్పించారు. పరిషత్ స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ మల్యాల రాకేశ్ మాట్లాడుతూ.. శత్రు మూకలను దేశ సరిహద్దుల్లోకి రాకుండా ఎముకలు కొరికే చలిలో నిరంతరం పహారా కాస్తున్న ఆర్మీ జవాన్లు నిజమైన భరతమాత ముద్దుబిడ్డలని అన్నారు. వారిని స్ఫూర్తిగా తీసుకొని, సమాజంలో సమస్యలపై పోరాడాలని సూచించారు. యూనివర్సిటీ కార్యకర్తలు శశి, రమేశ్, చందు, రాజు, విష్ణు, వేణు, నితీష్, నందు, సాయి ప్రసాద్, నాగరాజు, రాకేశ్, సాయి తదితరులు పాల్గొన్నారు.




కొవ్వొత్తులతో నివాళి అర్పిస్తున్న యువకులు, నాయకులు, పోలీసులు



ర్యాలీ తీసిన ఏబీవీపీ నాయకులు, శాతవాహన యూనివర్సిటీ విద్యార్థులు

పవర్ కట్ ప్రాంతాలు



కొత్తపల్లి: స్మార్ట్‌సిటీ పనులు కొనసాగుతున్నందున బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు 11 కేవీ తెలంగాణ చౌక్, సంతోష్‌నగర్ ఫీడర్ల పరిధిలోని కశ్మీర్‌గడ్డ, శ్రీనగర్‌కాలనీ, ముకరంపుర, ఎంఆర్ గార్డెన్, గోదాంగడ్డ, సప్తగిరికాలనీ, భగత్‌నగర్, ఎస్‌బీఎస్ ఫంక్షన్‌హాల్, జ్యోతినగర్, లేబర్ అడ్డా, భాగ్యనగర్, శివ థియేటర్ వెనక ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–2 ఏడీఈ ఎం.సుధీర్‌కుమార్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

వ్యక్తిగత ప్రమాద బీమా కార్డులు అందజేత

కరీంనగర్ టౌన్: కరీంనగర్ డెంటింగ్ అండ్ పేయింటింగ్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం కోతిరాంపూర్‌లో డెంటింగ్ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి వ్యక్తిగత ప్రమాద బీమా కార్డులతోపాటు పోస్టు పేమెంట్ బ్యాంకు ఖాతాలు అందజేశారు. మొదటి విడతలో 52 మందికి అందించామని, మరో రెండు విడతల్లో కార్మికులందరూ కార్డులు తీసుకోవాలని సూచించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు డి.నిషీద్‌కుమార్, గౌరవ అధ్యక్షుడు ఎండీ.గౌస్‌ల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో కరీంనగర్ హెడ్ పోస్టాఫీస్ సీనియర్ మేనేజర్ రాజేశ్‌మూర్తి తదితరులు పాల్గొన్నారు.



బీమా కార్డులు అందిస్తున్న సంఘం బాధ్యులు

'బీబీసీ కార్యాలయంపై ఐటీ దాడులు సరికాదు'

విద్యానగర్: బీబీసీ కార్యాలయంపై ఐటీ దాడులు సరికాదని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ రాజమల్లయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశంలో కేంద్రం తొమ్మిదేళ్లుగా అప్రకటిత ఎమర్జెన్సీ అమలు చేస్తోందని ఆరోపించారు.

'అల్ఫోర్స్'లో ముందస్తు శివరాత్రి వేడుకలు

కొత్తపల్లి: కరీంనగర్‌లోని అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెన్‌నెక్స్‌లో ముందస్తు మహాశివరాత్రి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. పార్వతీపరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలకు విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి పూజలు చేశారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి, ఉత్సవాలను ప్రారంభించారు. మహాశివరాత్రి పర్వదినాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకొని, శివుని కటాక్షం పొందాలన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఎలబోతారంలో 'కంటి వెలుగు' ప్రారంభం

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలంలోని ఎలబోతారం గ్రామంలో మంగళవారం కంటి వెలుగు వైద్య శిబిరాన్ని సర్పంచు కట్ల లక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు చల్లా రామక్కలు ప్రారంభించారు. అనంతరం వైద్య సిబ్బంది 111 మందికి నేత్ర వైద్యపరీక్షలు నిర్వహించి, 36 మందికి రీడింగ్ కళ్లద్దాలు, 11 మందికి కాంటాక్ట్ అద్దాలు అవసరమని తేల్చారు. కార్యక్రమంలో ఉపసర్పంచు సుధాకర్ రెడ్డి, పీహెచ్‌సీ వైద్యులు అరుణ, పద్మ, ఇందు, విమల, సూపర్‌వైజర్ బాలయ్య తదితరులు పాల్గొన్నారు.



కంటి పరీక్ష చేస్తున్న వైద్య సిబ్బంది

క్లుప్తంగా...

'ఈనాడు' వ్యాజ్యాలు కొట్టివేత

- ప్రభుత్వ జీవోల అమలు నిలుపుదలకు ఏపీ హైకోర్టు నిరాకరణ
- ఏబీసీని నిరోధించాలన్న అభ్యర్థన కూడా తిరస్కృతి



సాక్షి, అమరావతి: విస్తృత సర్క్యులేషన్ కలిగిన ఏదైనా ఓ దినపత్రికను కొనుగోలు చేసేందుకు సచివాలయాలు, వలంటీర్లకు నెలకు రూ.200 ఆర్థిక సాయాన్ని అందచేస్తూ ఏపీ ప్రభుత్వం జారీ చేసిన జీవోల అమలును నిలిపివేయాలన్న 'ఈనాడు'అభ్యర్థనను ఆ రాష్ట్ర హైకోర్టు తోసిపుచ్చింది. వలంటీర్లు, సచివాలయాల ద్వారా జరిగే 'సాక్షి'దినపత్రిక కొనుగోళ్లను పరిగణనలోకి తీసుకోకుండా ఆడిట్ బ్యూరో సర్క్యులేషన్(ఏబీసీ)ను ఆదేశించాలన్న అభ్యర్థనను సైతం తోసిపుచ్చింది. ఈ మేరకు ఈనాడు దాఖలు చేసిన రెండు అనుబంధ వ్యాజ్యాలను కొట్టివేసింది. నిర్దిష్టంగా ఫలానా పత్రికను మాత్రమే కొనుగోలు చేయాలంటూ వలంటీర్లు, సచివాలయాలను ప్రభుత్వం ఆదేశిస్తున్నట్లుగా ఎలాంటి ఉత్తర్వులు జారీ కాలేదని ధర్మాసనం గుర్తు చేసింది. రూ.200 ఆర్థిక సాయాన్ని వలంటీర్లు, సచివాలయాలు 'సాక్షి'దినపత్రికను మాత్రమే కొనుగోలు చేయాలన్న లక్ష్యంతో ఇచ్చారా? లేదా? అన్న విషయాన్ని లోతైన విచారణ జరిపి తేలుస్తామని స్పష్టం చేసింది. ఎలాంటి ఆధారాలు లేకుండా 'ఈనాడు'చేస్తున్న ఆరోపణల ఆధారంగా 'సాక్షి'కొనుగోళ్లను పెంచుకునేందుకు ప్రభుత్వం రూ.200 ఆర్థిక సాయం చేస్తోందన్న ప్రాథమిక నిర్ణయానికి ఈ దశలో రాలేమని తేల్చి చెప్పింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, న్యాయమూర్తి జస్టిస్ నైనాల జయసూర్య ధర్మాసనం మంగళవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కేసులో ప్రస్తావించిన కీలకాంశాలను పరిగణలోకి తీసుకుంటే ఇది సాక్షి – ఈనాడు మధ్య వ్యాపార సంబంధిత వివాదమని ధర్మాసనం అభిప్రాయపడింది. సాధారణంగా ఇద్దరి మధ్య జరిగే ఇలాంటి వ్యాపార యుద్ధాల్లో న్యాయస్థానాలు మధ్యంతర ఉత్తర్వుల దశలో అరుదుగా మాత్రమే జోక్యం చేసుకుంటాయని వ్యాఖ్యానించింది.

సురక్షిత 'యాత్ర'

- పర్యాటకులు, భక్తుల భద్రతకు ఏపీలో 20 టూరిస్ట్ పోలీసు స్టేషన్లు
- వర్చువల్ విధానంలో ప్రారంభించిన ఏపీ ముఖ్యమంత్రి జగన్



సాక్షి, అమరావతి: ప్రజల భద్రతే లక్ష్యంగా పోలీసు వ్యవస్థలో పలు సంస్కరణలు తెస్తున్నట్లు ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. ఇప్పటికే గ్రామ, వార్డు సచివాలయాల స్థాయిలో మహిళా పోలీసు వ్యవస్థను అందుబాటులోకి తేవడంతోపాటు రాష్ట్రంలో జీరో ఎఫ్ఐఆర్ విధానాన్ని ప్రవేశపెట్టామన్నారు. సంస్కరణల్లో భాగంగా పర్యాటక, ఆధ్యాత్మిక ప్రాంతాల్లో పర్యాటకులు, యాత్రికుల భద్రత కోసం టూరిస్ట్ పోలీసు స్టేషన్లను తాజాగా అందు బాటులోకి తెస్తున్నట్లు ప్రకటించారు. ఏపీ వ్యాప్తంగా 20 ప్రాంతాల్లో టూరిస్ట్ పోలీసు స్టేషన్లను మంగళవారం తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి జగన్ వరుచ్యవల్ విధానంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్ ఇంకా ఏమన్నారంటే...

పర్యాటకులకు సౌకర్యాలు, భద్రత

పర్యాటక ప్రాంతాలు, ఆధ్యాత్మిక ప్రదేశాలను సందర్శించే వారి భద్రత కోసం ప్రత్యేకంగా 20 ప్రాంతాలను గుర్తించి కియోస్క్‌లు ఏర్పాటు చేశాం. అవి స్థానిక పోలీస్ స్టేషన్‌కు అనుబంధంగా 20 అదనపు పోలీస్ స్టేషన్లుగా పని చేస్తాయి. ప్రతి కియోస్క్‌లో ఆరుగురు సిబ్బంది రెండు షిఫ్టుల్లో విధులు నిర్వహిస్తారు. దీన్ని ఎస్ఐ లేదా ఏఎస్ఐ స్థాయి అధికారి పర్యవేక్షిస్తారు. ఆపదలో చిక్కుకునేవారు సంప్రదించేందుకు ప్రత్యేకంగా టెలిఫోన్ నంబరు డిస్‌ప్లే చేస్తారు. కియోస్క్‌లలో సిబ్బందికి ప్రత్యేక టెలిఫోన్ నెంబరు, రేడియో సెట్, ఫస్ట్ ఎయిడ్ బాక్స్, ఆ ప్రాంతానికి సంబంధించిన మ్యాపు, వాహనాల సదుపాయం కల్పించాం. పర్యాటకులు, యాత్రికులు నిర్భయంగా గడిపేలా భరోసా కల్పిస్తూ టూరిస్ట్ పోలీసు స్టేషన్లు పని చేస్తాయి. టూరిస్ట్ పోలీస్ స్టేషన్లలో విధులు నిర్వహించే సిబ్బందిలో సగం మంది మహిళలు ఉన్నారు. అక్కచెల్లెమ్మలు కియోస్క్‌లకు వెళ్లినప్పుడు మహిళా సిబ్బంది తోడుగా నిలబడతారు.

టూరిస్ట్ పోలీస్ స్టేషన్లు ఇలా..

విశాఖపట్నం జిల్లా:	ఆర్కే బీచ్
కాకినాడ జిల్లా:	కుక్కుటేశ్వర స్వామి దేవాలయం
తూర్పు గోదావరి జిల్లా:	పుష్కర ఘాట్
ఏలూరు జిల్లా:	ద్వారకా తిరుమల
కృష్ణా జిల్లా:	మోపిదేవి సుబ్రహ్మణ్యస్వామి దేవాలయం, మంగినపూడి బీచ్
ఎన్టీఆర్ జిల్లా:	విజయవాడ కనకదుర్గ ఆలయం, భవానీ ద్వీపం, పవిత్ర సంగమం ఘాట్
ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లా:	మైపాడు బీచ్, పెంచలకోన దేవాలయం
కర్నూలు జిల్లా:	మంత్రాలయం దేవాలయం
నంద్యాల జిల్లా:	మహానంది, ఆహోబిలం ఆలయం
అన్నమయ్య జిల్లా:	హార్సిలీ హిల్స్
వైఎస్సార్ జిల్లా:	గండికోట, ఒంటిమిట్ట దేవాలయం
శ్రీసత్యసాయి జిల్లా:	లేపాక్షి దేవాలయంలతో పాటు మరో రెండు పర్యాటక ప్రాంతాలు.

లింగమనేని రమేష్ నిలువునా ముంచాడు

- విద్యాసంస్థల విస్తరణకు భూములు అప్పగిస్తానని లింగమనేని సంప్రదించారు
- పలు దఫాలుగా ఆయనకు రూ.310 కోట్లు ఇచ్చాను
- ఇప్పటిదాకా భూములు రిజిస్ట్రేషన్ చేయలేదు.. నగదూ ఇవ్వడం లేదు
- శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ బీఎస్ రావు



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): తమ విద్యాసంస్థల విస్తరణకు అవసరమైన భూములు, భవనాలను ఇస్తానని చెప్పి లింగమనేని రమేష్ తన దగ్గర నుంచి రూ.310 కోట్లు తీసుకున్నారని శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ బీఎస్ రావు ఆరోపించారు. అయితే ఇంతవరకు భూములు, భవనాలు అప్పగించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. విజయవాడలోని ఒక హోటల్‌లో మంగళవారం తన న్యాయవాదులతో కలసి బీఎస్ రావు మీడియాతో మాట్లాడారు. 2012లో విద్యా సంస్థల విస్తరణకు తనకు 300 ఎకరాల భూములు అవసరమయ్యాయన్నారు. ఈ క్రమంలో వాటిని తాను ఇస్తానని లింగమనేని రమేష్ తనను సంప్రదించాడని చెప్పారు. ఈ క్రమంలో పలుమార్లు రూ.310 కోట్ల నగదును ఆయనకు ఇచ్చానని బీఎస్ రావు తెలిపారు. భూములు, భవనాలను సేకరించి ఇవ్వలేకపోతే తానిచ్చిన మొత్తం నగదును వడ్డీతో సహా చెల్లిస్తామని లింగమనేని 2013లో తనతో ఒప్పందం కుదుర్చుకున్నారన్నారు. అయితే ఇప్పటివరకు ఒక ఎకరం భూమి కూడా అప్పగించలేదని వాపోయారు. భూములు అప్పగించాలని తాను అనేక సార్లు అడిగితే 2015లో భూములను కొని.. రిజిస్ట్రేషన్ చేసి ఇస్తానని లింగమనేని తనతో ఎంవోయూ చేసుకున్నారని తెలిపారు. అది కూడా నేరవేర్చలేదన్నారు. తర్వాత జరిగిన మధ్యవర్తిత్వాలతో తనకు 15 చెక్కులను ఇచ్చారని.. వాటిని బ్యాంక్‌ల్లో జమ చేసినప్పుడు బ్యాంకులకు స్టాప్ పేమెంట్ అని లింగమనేని సమాచారం ఇచ్చారన్నారు. దీంతో బ్యాంకులు ఆ చెక్కులను తిరస్కరించాయని తెలిపారు.

హైదరాబాద్‌లో లింగమనేనిపై కేసు..

రమేష్ మోసం చేస్తున్నారని గ్రహించి హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్‌లో ఆయన గ్రూప్‌లపై క్రిమినల్ కేసు పెట్టామని బీఎస్ రావు చెప్పారు. దీంతో పోలీసులు లింగమనేని రమేష్, లింగమనేని రాజశేఖర్, లింగమనేని స్వర్ణకుమారి, లింగమనేని ప్రశాంతి, లింగమనేని సుమానా, కాకర్ల వినయ్‌లపై ఆరు ఎఫ్ఐఆర్‌లను నమోదు చేశారన్నారు. నాంపల్లి మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టు, హైదరాబాద్ మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టు, హైకోర్టుల్లో కూడా కేసులు వేశామని తెలిపారు. తనకు ఇచ్చిన చెక్కుల్లో 20 శాతం నగదును చెల్లించాల్సిందిగా రమేష్ గ్రూప్‌నకు కోర్టులు ఆదేశాలు జారీ చేశాయన్నారు. అయినా తనకు నగదు ఇవ్వలేదని బీఎస్ రావు ఆవేదన వ్యక్తం చేశారు. హైదరాబాద్ 6వ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్.. లింగమనేని రమేష్ గ్రూప్‌నకు చెందిన స్థిర, చరాస్తులను రెవెన్యూ యాక్టు కింద అటాచ్ చేసి తనకు ఇవ్వాల్సిందిగా ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్‌ను ఆదేశించినా స్పందన లేదన్నారు. లింగమనేని రమేష్ కంపెనీలపై చెన్నైలోని నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్‌లో ఐదు కేసులను దాఖలు చేశామని.. అవి పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. సుప్రీం కోర్టు కూడా 18 శాతం వడ్డీతో వాయిదాల వారీగా నగదు మొత్తం చెల్లించాలని ఆదేశాలు ఇచ్చినా రమేష్ పాటించడం లేదన్నారు.

బీఎస్ రావు ఆరోపణలు అవాస్తవం: లింగమనేని రమేష్

బీఎస్ రావు ఆరోపణలు పూర్తిగా అవాస్తవం.. నిరాధారం. చైతన్య విద్యా సంస్థల గ్రూప్‌నకు, మా గ్రూప్‌నకు మధ్య ఆర్థిక, వ్యాపార వివాదాలు ఉన్న మాట నిజమే. అయితే ఆయనను మోసం చేశామని బీఎస్ రావు ఆరోపించడం అవాస్తవం. ఈ అంశాలన్నీ కోర్టు పరిధిలో ఉన్నాయి. ఇప్పటివరకు ఏ న్యాయస్థానం మేము తప్పు చేసినట్లు తీర్పు ఇవ్వలేదు.

ఏబీవీపై చర్యలు తీసుకోండి

- రెండు స్టేజ్‌ల టైమ్‌స్కేల్ తగ్గించండి
- రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్రం ఆదేశం
- కుమారుడికి అడ్డగోలు ప్రయోజనం కలిగించేందుకే ఆ కాంట్రాక్టు
- సీనియర్ ఐపీఎస్ ఏబీ వెంకటేశ్వరరావు తీరుపై నిగ్గుతేల్చిన యూపీఎస్సీ



సాక్షి, అమరావతి: నిఘా పరికరాల కొనుగోలు వ్యవహారంలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన సీనియర్ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వర రావు (ఏబీవీ)పై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం.. ఏపీ ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఆయనకు రెండు స్టేజ్‌ల టైమ్‌స్కేల్ తగ్గించాలని తెలిపింది. 2024, మే 31వరకు ఇది అమలులో ఉంటుందని పేర్కొంది. ఏబీవీపై రెండు అభియోగాలు నిరూపితమయ్యాయని వెల్లడించింది. నిఘా పరికరాల కొనుగోలు వ్యవహారంలో నిబంధనలు ఉల్లంఘించిన ఏబీ వెంకటేశ్వరరావును సస్పెండ్ చేసిన ప్రభుత్వం ఆయనపై తదుపరి చర్యల కోసం యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ద్వారా కేంద్ర ప్రభుత్వానికి నివేదించింది. ఆయనపై మూడు అభియోగాల్లో ఒకటి పూర్తిగానూ మరొకటి పాక్షికంగానూ నిర్ధారణ అయ్యాయని యూపీఎస్సీ కేంద్ర హోంశాఖకు నివేదించింది. ఇజ్రాయెల్ కంపెనీ నుంచి నిఘా పరికరాల కొనుగోలు ద్వారా తన కుమారుడు చేతన్ సాయికృష్ణ భాగస్వామిగా ఉన్న కంపెనీకి ప్రయోజనం కలిగించేందుకు ఏబీవీ యత్నించారని.. అఖిల భారత సరీ్వసు నిబంధనలకు సైతం విరుద్ధంగా వ్యవహరించారని తెలిపింది. దాంతో ఆయనపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కేంద్ర హోంశాఖ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అఖిల భారత సర్వీసు నిబంధనలు–1969 ప్రకారం ఆయనపై తదుపరి చర్యలు తీసుకునే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందని స్పష్టంచేసింది.

కుమారుడికి అడ్డగోలు కాంట్రాక్టు కోసమే

టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏబీ వెంకటేశ్వరరావు నిబంధనలకు విరుద్ధంగా నిఘా పరికరాల కొనుగోలుకు సిద్ధపడ్డారని యూపీఎస్సీ నిర్ధారించింది. ఇజ్రాయెల్‌కు చెందిన ఇన్‌ఫ్లేమబుల్ లిమిటెడ్, ఆర్‌టీఎల్‌టీఏ కంపెనీల నుంచి ఏరోస్టాట్, యూఏవీ నిఘా పరికరాల కొనుగోలుకు ఏకపక్షంగా నిర్ణయించారు. తద్వారా భారత్‌లో ఆ కంపెనీ ప్రతినిధిగా ఉన్న ఆకాశం అడ్వాన్స్ సిస్టమ్స్‌కు అయాచిత లబ్ధికి ప్రయత్నించారు. మరోవైపు.. ఏబీవీ కుమారుడు చేతన్‌సాయి ఆకాశం అడ్వాన్స్ సిస్టమ్స్‌కు సీఈఓ కావడం గమనార్హం. తన ఉన్నతాధికారుల అనుమతిలేకుండా ఏబీవీ ఏకపక్షంగా వ్యవహరించారు. పరికరాల నాణ్యత, గ్యారంటీ, నిర్వహణ కాలం మొదలైన సాంకేతిక ప్రమాణాలను తగ్గించి మరీ ఆమోదించేశారు. విధి నిర్వహణలో ఉత్సుకతతోనే ఇలా చేశానన్న ఏబీ వెంకటేశ్వరరావు వాదనను యూపీఎస్సీ తిరస్కరించింది.

ఎన్ఈపీపై కేంద్ర వర్సిటీల ఆసక్తి

సాక్షి, హైదరాబాద్: జాతీయ విద్యా విధానం–2020 అమలుకు సంబంధించిన అంశంపై యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) చైర్మన్ ప్రొఫెసర్ జగదీశ్‌కుమార్ మంగళవారం 45 కేంద్ర విశ్వవిద్యాలయాల వైస్ చాన్స్‌లర్లతో ఆన్‌లైన్ వేదికగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వర్సిటీలు ఎన్ఈపీ అమలులో వారి అనుభవాలను, అవసరమైన సలహాలు, సూచనలు వెల్లడించాయి. సమీక్షలో వెల్లడైన ముఖ్యమైన అంశాలను యూజీసీ మీడియాకు వెల్లడించింది.

- కేంద్ర విశ్వవిద్యాలయాలన్నీ అకడమిక్ బ్యాంక్ ఆఫ్ క్రెడిట్స్ పోర్టల్‌లో నమోదు చేసి, విద్యార్థుల వివరాలను ఆన్‌బోర్డ్ చేస్తున్నాయి. అన్ని కేంద్ర వర్సిటీలూ యూజీ, పీజీ స్థాయిలో ఎగ్జిట్ పాలసీ, బహుళ ప్రవేశానికి సంబంధించిన మార్గదర్శకాలు రూపొందించాయి. అవసరమైన మార్పులకు శ్రీకారం చుట్టాయి. కఠినమైన అంశాలను తొలగించాయి.
- విద్యార్థుల్లో విలువలు, నైపుణ్యం, సమకాలీన అంశాలపై పట్టు పెంచేలా పాఠ్య ప్రణాళికలను రూపొందిస్తున్నట్లు పేర్కొన్నాయి. వృత్తి విద్యలో మరిన్ని కోర్సులు పెంచుతున్నాయి. ఫీల్డ్ అనుభవాన్ని పెంచేందుకు ప్రాధాన్యమిస్తున్నాయి. పరిశోధనకు అవకాశాలు కల్పిస్తున్నాయి. ఇంక్యుబేషన్, ఇన్నోవేషన్, ఆధునిక పరిశోధన కేంద్రాల స్థాపనపై దృష్టి పెడుతున్నాయి.
- క్రెడిట్స్ బదిలీ కోసం స్వీయ నిబంధనలు రూపొందించేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఏకీకృత పాఠ్యబోధన ప్రణాళిక వైపు అడుగులేస్తున్నాయి.

స్కూలు పిల్లలకు 'వనదర్శిని' అవగాహన

సాక్షి, హైదరాబాద్: అడవులు, పర్యావరణంపై వాటిని కాపాడాల్సిన ఆవశ్యకతను వనదర్శిని కార్యక్రమం ద్వారా స్కూల్ విద్యార్థులకు అటవీశాఖ అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. పాఠశాల స్థాయి విద్యార్థుల నుంచే పర్యావరణ ప్రాధాన్యత, అటవీ పరిరక్షణ ఆవశ్యకతను గురించి వివరిస్తున్నారు. ఇందులో భాగంగా అడవులను కాపాడాలన్న సంకల్పాన్ని పిల్లల్లో కల్పనకు వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పలు జిల్లాల్లో నిర్వహిస్తున్న వనదర్శిని కార్యక్రమానికి విద్యార్థుల నుంచి మంచి స్పందన వస్తోంది. స్కూలు విద్యార్థులను అడవుల్లోకి తీసుకెళ్లి అక్కడి వివిధ రకాల చెట్లు, ఔషధ మొక్కల గురించి అటవీ అధికారులు పరిచయం చేశారు. పట్టణ ప్రాంతాలకు సమీపంలో ఉండే అడవుల వల్ల ఉపయోగాలు, అడవులపై పెరుగుతున్న ఒత్తిడిని విద్యార్థులకు అర్థం అయ్యేలా వివరిస్తున్నారు. తాజాగా మేడ్చల్ జిల్లా అటవీశాఖ నేతృత్వంలో కీసర రిజర్వ్ ఫారెస్ట్‌లో వనదర్శిని కార్యక్రమాన్ని నిర్వహించారు. నాగారం జెడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులను కీసర అటవీ ప్రాంతానికి తీసుకెళ్లారు. ఎంపీ జోగినపల్లి సంతోష్‌కుమార్ దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తున్న కీసర ఎకో అర్బన్ పార్క్‌ను విద్యార్థులు సందర్శించి సేద తీరారు. విద్యార్థుల వనదర్శిని కార్యక్రమం వివరాలను ట్విట్టర్‌లో షేర్ చేసిన సంతోష్ ఆనందాన్ని వ్యక్తంచేశారు.

రిమ్స్‌లో ఎన్ఎంసీ బృందం తనిఖీ

- పీజీ సీట్ల కోసం పరిశీలన



రిమ్స్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న ఎన్ఎంసీ బృందం

ఆదిలాబాద్‌టౌన్: రాజీవ్ గాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (రిమ్స్)లో పీజీ సీట్ల కోసం అధికారులు ఇదివరకు దరఖాస్తు చేశారు. ఈ మేరకు నేషనల్ మెడికల్ కౌన్సిల్(ఎన్ఎంసీ) బృందం మంగళవారం తనిఖీ చేసింది. రిమ్స్‌లోని అన్ని వార్డులను పరిశీలించారు. రోగులకు అందుతున్న సేవల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇన్‌వార్డు, అవుట్ వార్డులో ఎంత మంది రోగులు వస్తున్నారు.. ఎన్ని బెడ్లు అందుబాటులో ఉన్నాయనే విషయాలపై ఆరా తీశారు. ఏయే శస్త్ర చికిత్సలు జరుగుతున్నాయి, వసతులు ఉన్నాయా లేదా అనే విషయాలపై క్షుణ్ణంగా పరిశీలించారు. అనాటమి, ఎస్పీఎం, జనరల్ మెడిసిన్, డెర్మటాలజీ, అనస్తీషియా విభాగం పీజీ సీట్ల కోసం ఏర్పాట్లను పరిశీలించారు. నివేదికను ఎన్ఎంసీకి అందజేయనున్నట్లు బృందం సభ్యులు పేర్కొన్నారు. ఈ రిపోర్టు ఆధారంగా పీజీ సీట్లు రిమ్స్‌కు మంజూరు కానున్నాయి. ప్రస్తుతం రిమ్స్‌లో గైనకాలజీ, ఆప్తమాలజీ, ఈఎన్‌టీ, ఆర్థోపెడిక్, జనరల్ సర్జన్ విభాగాలకు సంబంధించిన పీజీ సీట్లు అందుబాటులో ఉన్నాయి. కొత్త పీజీ సీట్లు వస్తే రోగులకు నాణ్యమైన వైద్యసేవలు సైతం అందనున్నాయి. ఈ బృందం వెంట రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, సూపరింటెండెంట్ అశోక్, డాక్టర్ తానాజీ తదితరులు ఉన్నారు.

నేడు రేడియో కిసాన్ దివస్

- ఉమ్మడి జిల్లాలోని 8మంది ఉత్తమ రైతులకు సన్మానం

ఎదులాపురం: పట్టణంలోని ఆకాశవాణి ఆదిలాబాద్ (100.2)లో బుధవారం రేడియో కిసాన్ దివస్ నిర్వహించనున్నట్లు కేంద్రం ముఖ్య కార్యక్రమాధికారి రామేశ్వర్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్న కార్యక్రమానికి కలెక్టర్ రాహుల్ రాజ్, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఎనిమిది మంది ఉత్తమ రైతులను సన్మానించనున్నట్లు పేర్కొన్నారు. రైతులు, ఎఫ్ఎం అభిమానులు అధిక పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఉత్తములు వీరే..

ఆదిలాబాద్ జిల్లా నుంచి పిట్ల ఈశ్వరి, మెస్రం జ్యోతిరాం, నిర్మల్ జిల్లా నుంచి మిన్కరాజ్ కిరణ్‌రెడ్డి, బూసి పెంటాజి, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా నుంచి బుద్దె లావణ్య, నైతం రఘు, మంచిర్యాల జిల్లా నుంచి నందుర్క సుగుణ, దాడి పెంటయ్య ఉత్తమ రైతులుగా ఎంపికయ్యారు.

పల్లె ప్రగతిలో ముఖరా(కె) ఆదర్శనీయం



ఇంకుడు గుంతను పరిశీలిస్తున్న డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్

ఇచ్చోడ: పల్లెప్రగతిలో ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం ముఖరా(కె) సాధించిన అభివృద్ధి అభినందనీయమని సెంట్రల్ వాటర్ కమిషన్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం ఆయన గ్రామాన్ని సందర్శించి మాట్లాడారు. పల్లె ప్రగతి ద్వారా గ్రామంలో వందశాతం పనులు అమలవుతున్నాయని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతీ గ్రామం ముఖరా(కె)ను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. కేంద్ర జలశక్తి శాఖ గ్రౌండ్ వాటర్ బోర్డు సభ్యులు దివాకర్ మహంతి, డీఆర్డీవో కిషన్, డీఎల్‌పీవో ధర్మారాణి, ఎంపీడీవో రాంప్రసాద్, సర్పంచ్ గాడ్గే మీనాక్షి, ఎంపీటీసీ సుభాష్ పాల్గొన్నారు.

'గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలి'



మాట్లాడుతున్న సీతారామయ్య

శ్రీరాంపూర్: హైకోర్టు ఆదేశాల మేరకు సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు వెంటనే నిర్వహించాలని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి వీ.సీతారా మయ్య యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన ఆర్కే 5 గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో కార్మికులనుద్దేశించి మాట్లాడారు. సింగరేణి యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలు జరకుండా కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. జేసీసీ మీటింగ్‌లు, స్ట్రక్చరల్ మీటింగ్‌లు జరగకుండా ఆగిపోయాయని, కార్మికుల సమస్యలు పెండింగ్‌లో పడ్డాయని తెలిపారు. సింగరేణిలో ఎన్నికలు నిర్వహిస్తే 11 డివిజన్లలో టీబీజీకేఎస్ ఓడిపోతుందని సీఎం కేసీఆర్ చేయించిన సర్వేలో వచ్చిందని, దీంతో యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చి ఎన్నికలు నిర్వహించకుండా ఆపుతున్నారని ఆరోపించారు. సింగరేణి ఎన్నికల ముందు కేసీఆర్ కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఎంపీ, ఎస్‌టీపీల పేరుతో కార్మికులు, సూపర్‌వైజర్లను అధికారులు వేధించడం మానుకోవాలని హెచ్చరించారు. యూనియన్ కేంద్ర కార్యదర్శి ముస్కె సమ్మయ్య, నాయకులు గునిగంటి నర్సింగరావు, నాయకులు శ్రీనివాస్, మేడగోని మల్లేశ్, సాంబయ్య, రెడ్డి రాములు, జడల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ క్రీడలు లేనట్లేనా..?

- కరోనా తరువాత ప్రారంభం కాని పోటీలు
- యూనివర్సిటీల క్రీడలకు మోక్షం.. ఎస్‌జీఎఫ్ క్రీడలకు ఎన్నడో?
- వచ్చేనెల నుంచి ప్రారంభం కానున్న పాఠశాల వార్షిక పరీక్షలు



కరీంనగర్‌స్పోర్ట్స్:పాఠశాల, కళాశాలస్థాయిలో విద్యార్థులను క్రీడల్లో ప్రోత్సహించాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌ను ఏటా ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు. 80కి పైగా క్రీడాంశాల్లో పాఠశాల, కళాశాలస్థాయిలో విద్యార్థులకు అండర్–14, 17, 19 విభాగాల్లో వేర్వేరుగా క్రీడాపోటీలు జరుగుతాయి. 2020–21 నుంచి 2021–22 ఏడాదిలో కారోనా కారణంగా పోటీలు నిర్వహించలేదు. ఈ ఏడాది అంటే.. 2022–23 విద్యాసంవత్సరంలో కరోనా ప్రభావం లేకపోయినా.. ఎస్‌జీఎఫ్ పోటీల షెడ్యూల్ విడుదల కాకపోవడంపై క్రీడాకారుల్లో సందిగ్ధం నెలకొంది. యూనివర్సిటీల క్రీడా పోటీలు చివరిదశకు చేరుకుంటున్న సమయంలో ఎస్‌జీఎఫ్ షెడ్యూలు విడుదల కాకపోవడంతో ఉంటాయా? ఉండవా? అన్న అనుమానం ఉంది.

- ఏటా ఆగస్టు, సెప్టెంబర్, నవంబర్‌లో జిల్లా స్థాయి, తరువాత ఉమ్మడి జిల్లాల క్రీడల సెలక్షన్స్ నిర్వహిస్తారు. విద్యాసంవత్సరం ప్రారంభంలోనే జిల్లాలోని పీఈటీలతో సమావేశం నిర్వహించి, ఎస్‌జీఎఫ్ క్రీడాపోటీలపై నిర్ణయం తీసుకుంటారు.
- అయితే ఈసారి జిల్లాలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ క్రీడలపై సందిగ్ధం ఏర్పడిందని వ్యాయామ ఉపాధ్యాయులు అంటున్నారు. ఎస్‌జీఎఫ్ కార్యదర్శుల ఎంపిక ప్రక్రియ జనవరి మాసంలో నిర్వహించడంతో ఈ ఏడాది క్రీడలకు చెక్‌పడినట్లుగా భావిస్తున్నారు.
- మూడేళ్లుగా ఎస్జీఎఫ్ పోటీలు నిర్వహించకపోవడంతో విద్యార్థులు ఎంతో నష్టపోయారు. క్రీడాకోటా కింద ఉద్యోగావకాశాలకు రెండు శాతం, ఉన్నత విద్యకు 0.5 శాతం రిజర్వేషన్ ఉన్న సంగతి తెలిసిందే.
- ఈ మూడేళ్లకాలంలో క్రీడా సర్టిఫికెట్లు లేకపోవడంతో తమ పిల్లలను చాలా వరకు నష్టపోయారని తల్లిదండ్రులు చెబుతున్నారు. కనీసం ఈ సంవత్సరమైన త్వరితగతిన పోటీలు నిర్వహించాలని కోరుతున్నారు.

నష్టపోకుండా చూడాలి



కరోనా నేపథ్యంలో రెండేళ్లపాటు క్రీడాపోటీలు నిర్వహించలేదు. 2022–23 సంవత్సరంలో ఆయా క్రీడా సంఘాలు తమ క్రీడాపోటీల షెడ్యూల్‌ను విడుదల చేసి జాతీయ పోటీలు సైతం ముగించుకున్నాయి. పాఠశాల, కళాశాలల జాతీయ క్రీడా సమాఖ్య కూడా రాష్ట్రాల క్రీడా షెడ్యూల్‌ను త్వరగా విడుదల చేయాలి.

– ఎండీ యూనిస్‌పాషా, పెటా సంఘం ప్రధాన కార్యదర్శి

నేరుగా ఎంపిక చేయాలి



వచ్చేనెల నుంచి పబ్లిక్ పరీక్షలు జరుగనున్న నేపథ్యంలో రాష్ట్రస్థాయిలో కేవలం ఎంపిక ప్రక్రియలు చేపట్టి పబ్లిక్ పరీక్షలు ముగిసిన అనంతరం విద్యార్థులు నష్టపోకుండా ఏప్రిల్‌లో జాతీయస్థాయి పోటీలు నిర్వహించాలి. పైచదువుల కోసం, ఉద్యోగాల కోసం క్రీడా సర్టిఫికెట్లు ఎంతగానో ఉపయోగపడుతాయి.

– కొమురోజు కృష్ణ, వ్యాయామ ఉపాధ్యాయుడు

త్రైమాసిక పన్నులు చెల్లించని వాహనాలపై కొరడా

- ఉమ్మడి కరీంనగర్ జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ చంద్రశేఖర్ గౌడ్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న చంద్రశేఖర్

మానకొండూరు: వాహనాలు త్రైమాసిక పన్నులు తక్షణమే పన్నులు చెల్లించాలని, లేనిపక్షంలో తనిఖీలలో పట్టుబడితే భారీ జరిమానా విధించడంతోపాటు వాహనాన్ని సీజ్ చేస్తామని డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్ హెచ్చరించారు. రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్ జ్యోతి బుద్ధప్రకాశ్ రాష్ట్ర స్థాయి రవాణా శాఖ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో డీటీసీ మాట్లాడారు. ఈ వార్షికాంతానికి ప్రభుత్వం నిర్దేశించిన ఆదాయ లక్ష్యాన్ని చేరుకుంటామని తెలిపారు. ఈ నెల 15 నుంచి స్పెషల్ డ్రైవ్ కొనసాగుతుందని చెప్పారు. ప్రభుత్వ భూమి లేని హుజూరాబాద్ కార్యాలయానికి త్వరలో కలెక్టర్‌ను సంప్రదించి భూమిని కేటాయించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో ఎంవీఐలు నాగలక్ష్మి, సిరాజుర్ రహమాన్, మసూద్ అలీ, డీటీఏలు కరుణాకర్, దినేష్ పాల్గొన్నారు.

108లో ఉద్యోగ అవకాశాలు

కరీంనగర్‌టౌన్: ఈఎంఆర్ఐ 108 సంస్థ కరీంనగర్ జిల్లాలో పైలట్, ఈఎంటీ ఉద్యోగాల కోసం ఆసక్తి గల వారు దరఖాస్తు చేసుకోవాలని ఎంప్లాయిమెంట్ అధికారి దేవేందర్‌రావు ఒక ప్రకటనలో సూచించారు. ఈనెల 16న ఉదయం 10 నుంచి 3 గంటల వరకు ఎస్సారార్ కళాశాల సమీపంలోని ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో నిర్వహించే ఇంటర్వ్యూలకు అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఒక జిరాక్స్ సెట్‌తో హాజరుకావాలని సూచించారు. పైలట్లు 23 నుంచి 35 సంవత్సరాలలోపు ఉండి పదో తరగతి పాసై లైట్ మోటార్ వెహికిల్ లైసెన్స్ బ్యాడ్జ్ కలిగి ఉండాలని తెలిపారు. ఈఎంటీ అభ్యర్థులు బీఎస్సీ, నర్సింగ్, జీఎన్ఎం, బీఫార్మసీ, డిఫార్మ, డీఎంఎల్‌టీ పూర్తి చేసి 30 సంవత్సరాల లోపు ఉండాలని సూచించారు.



సత్వీందర్ సింగ్

పంజాబ్‌లో'హనీమూన్‌బ్రైడ్స్' అనే మాట వినిపిస్తూ ఉంటుంది.
అంటే పెళ్లి చేసుకున్న ఎన్.ఆర్.ఐలు
కాపురానికి తీసుకెళ్ల మూణ్ణాళ్ల ముచ్చటగా
కాపురం చేసి ఆ తర్వాత పెళ్లికూతుళ్లను పుట్టింటికి తరిమేస్తారు.
సత్వీందర్ కౌర్ కూడా అలాంటి బాధితురాలే.
కాని ఆమె ఊరికే ఉండలేదు.
లూధియానాలో ఒక సంస్థ స్థాపించి
ఎన్ఆర్ఐ బాధిత మహిళలకు న్యాయం జరిగేలా చూసింది.
న్యాయం జరగాలంటే ఏం చేయాలో కూడా చెబుతోంది.

ఎన్.ఆర్.ఐ భర్తల మోసం చెల్లదు

పంజాబ్, హరియాణాలలో ఎన్.ఆర్.ఐ భర్తలు మోసం చేసిన భార్యల సంఖ్య ప్రస్తుతం ఎంత ఉంటుందో ఊహించండి.

32,000.

పెళ్లి చేసుకుని ఉద్యోగాలు విదేశాలలో తెచ్చుకుని మాయమైన ఎన్.ఆర్.ఐలు కొందరైతే విదేశాల్లో ఉంటూ ఇక్కడకు వచ్చి పెళ్లి చేసుకొని కొన్నాళ్లు కాపురం చేసి ఆ తర్వాత ఉడాయించిన వాళ్లు కొందరు. వీరి గురించి ఆరా తీస్తూ, ఎదురు చూస్తూ, వారిని శిక్షించాలని ప్రయత్నిస్తూ పోలీసుల చుట్టూ, కోర్టుల చుట్టూ తిరిగే ఈ వివాహితులను అక్కడ 'హనీమూన్ బ్రైడ్స్' అంటూ ఉంటారు. విషాదం ఏమంటే వీరి సగటు వయసు 22 నుంచి 65 వరకూ ఉండటం. ముప్పై ఏళ్ల క్రితం పెళ్లి చేసుకుని విదేశాలకు పారిపోయిన భర్తల కోసం ఎదురు చూస్తున్న మహిళలు ఇంకా అక్కడ ఉన్నారు. వారందరికీ ఒక ఓదార్పు లూధియానాలో 'అబ్ నహీ' సంస్థను నడుపుతున్న 41 ఏళ్ల సత్వీందర్ సింగ్.



బాధిత మహిళలతో సత్వీందర్ సింగ్

స్వయంగా బాధితురాలు

లూధియానాకు చెందిన సత్వీందర్ సింగ్ టీచర్‌గా పని చేసేది. టీచర్ సంబంధమే వస్తే 2009లో వివాహం చేసుకుంది. ఒక సంవత్సరం తర్వాత భర్త విదేశాలలో ఉద్యోగం వచ్చిందని జార్జియా వెళ్లాడు. అక్కడి నుంచి ఉక్రెయిన్ వెళ్లాడు. సత్వీందర్ అత్తారింటిలోనే ఉండిపోయింది. ఐదేళ్ల తర్వాత 2015లో తిరిగి వచ్చిన భర్త ఆమెను అత్తారింటి నుంచి ఒక అద్దె ఇంటికి మార్చి ఒక నెల ఉండి మళ్లీ ఉక్రెయిన్‌కు వెళ్లిపోయాడు. త్వరలో వచ్చి తీసుకెళతాను అనే దొంగ హామీ మీద. కాని ఎయిర్‌పోర్ట్‌కు చేరుకోవడంతోటే 'ఇక నీకూ నాకూ సంబంధం లేదు' అని ఫోన్ చేసి చెప్పేశాడు. సత్వీందర్ వెంటనే అత్తామామల దగ్గరకు వెళితే వాళ్లు ముఖాన తలుపులు వేసేశారు. ఒక సంవత్సరం పాటు చేష్టలుడిగి ఉండిపోయిన సత్వీందర్ ఆ నిద్ర నుంచి మేల్కొని న్యాయం కోసం గట్టిగా పట్టుబట్టింది. భర్త మీద, అత్త మామల మీద సెక్షన్ 406, 498ల కింద కేసు పెట్టింది. కోర్టులో మెయింటెనెన్స్ కేసు వేస్తే నెలకు 10 వేలు మంజూరయ్యాయి. 2018లో భర్త పాస్‌పోర్ట్ సీజ్ అయ్యేలా చూసింది. ఇవన్నీ చిన్న విజయాలు కావు.

తనలాంటి వారి కోసం

ఆ సమయంలో కోర్టు దగ్గర, పోలీస్ స్టేషన్ దగ్గర తన లాంటి వివాహితలు మరికొంత మంది కనిపించేవారు సత్వీందర్‌కు. 'ఇంతమంది ఉన్నారా... వీరందరి కోసం ఏదైనా చేయాలి' అని 'అబ్ నహీ' సంస్థ స్థాపించింది. చిన్న చిన్న సమావేశాలు పెట్టి ఇలాంటి బాధిత మహిళలను సమీకరించడం మొదలెట్టింది. ఈమె చేస్తున్న పని ఆ నోటా ఈ నోటా తెలిసి బాధితులు రావడం మొదలెట్టారు. అయితే ఇది అంత సులభం కాదు. పారిపోయిన కుర్రాళ్ల కుటుంబాలు ఈమె చేసే నిరసన కార్యక్రమాలకు, పెడుతున్న కేసులకు ఆగ్రహించేవి. శాపనార్థాలు పెట్టేవి. తన్నబోయేవి. అయినా సత్వీందర్ జంకకుండా తన పోరాటాన్ని కొనసాగించింది. ఎన్.ఆర్.ఐ సెల్స్ ద్వారా మహిళా కమిషన్ ద్వారా బాధితులకు మద్దతు దొరికేలా చేసేది. అంతేకాదు, జాతీయ గురుద్వారా కమిటీ ద్వారా విదేశాలలో ఉన్న గురుద్వారాలకు ఇలా పారిపోయిన వరుల వివరాలు తెలుపుతూ తాకీదులు అందేలా చేసింది. అంటే అక్కడ ఉన్న వారి గురించి కనీసం అక్కడ ఉన్న పంజాబీలకు తెలిసేలా చేయగలిగింది. కొందరు భర్తలు ఏ దేశాల్లో అయితే ఉద్యోగాలు చేస్తున్నారో అక్కడి లీగల్ సెల్స్‌కు అదే పనిగా ఈ మెయిల్స్ పంపి ఫిర్యాదు చేస్తుంది. విదేశాంగ శాఖకు పదే పదే వినతి చేయడం వల్ల ఆ శాఖ కూడా రంగంలో దిగి ఇలాంటి కేసులు నమోదైన భర్తల పాస్‌పోర్ట్‌ల వివరాలను సేకరించి అవసరమైతే సీజ్ చేసే చర్యలు చేస్తోంది.

ఇప్పటికి 700 మంది

సత్వీందర్ సింగ్ ఇప్పటికి 700 మంది వివాహితలకు ఏదో ఒక మేర న్యాయం అందేలా చేసింది. అలాగే భర్తలను విడిచిపెట్టి ఉడాయించిన భార్యల బాధితులైన 40 మంది భర్తలకు కూడా న్యాయం అందడానికి పోరాడుతూ ఉంది. 'భార్యను విడిచి వెళ్లిపోయిన భర్తల కేసుల్లో ఇరుపక్షాలను కూచోబెట్టి సమస్య కనుక్కుంటే చాలా కేసులు విడిపోయే దాకా వెళ్లకుండా ఆపొచ్చు. కొన్నింటిలో మాత్రం మోసగాళ్లు ఉంటారు. వారికి శిక్ష పడేలా చేయాలి.' అంటుంది సత్వీందర్. సోషల్ మీడియా ద్వారా ఫేస్‌బుక్ ద్వారా బాధితులను గుర్తించి వారికి సహాయం అందేలా చేయడానికి ప్రయత్నిస్తోందామె. 'మన పోలీసులు దేశంలో లేకుండా పోయిన వారంటే ఏమీ చేయలేము అన్నట్టు చూస్తుంటారు. కాని అలా విదేశాలకు పారిపోయిన వారికి తప్పకుండా శిక్ష పడుతుంది అనే విధంగా చర్యలు ఉంటే ఎన్.ఆర్.ఐల ఆగడాలు ఆగుతాయి' అంటుంది సత్వీందర్.

పంజాబ్, హరియాణాలలో అయితే సత్వీందర్ ఉంది. మిగిలిన రాష్ట్రాల్లో ఇలాంటి బాధితులు ఎందరు ఉన్నారో తెలియాల్సి ఉంది. వారి కోసం సత్వీందర్‌లాంటి వాళ్ల అవసరం తప్పక ఉంటుందని వేరే చెప్పాలా?



చిత్తా ఆరోగ్యరాణి,
ఫౌండర్, మదర్ థెరెస్సా ఫౌండేషన్,
పోరుమామిళ్ల, కడప జిల్లా

'అమ్మా!' అనే పిలుపును ఆస్వాదించని మహిళ ఉండదు.
ఆ పిలుపును ఎన్ని గొంతులతో వింటే అంత సంతోషం.
అందుకే అమ్మలేని పిల్లలకు అమ్మ అయ్యారామె.
వాళ్లకు అన్న... అక్క... అమ్మమ్మ... నానమ్మలనూ ఇచ్చారు.
అనాథలకు ఆశ్రయంతోపాటు అనుబంధాలనూ ఇస్తున్నారు.

అమ్మగా ఎదిగాను!

ఆరోగ్యరాణి సొంతూరు గుంటూరు జిల్లా, మేడికొండూరు మండలం, వరగాణి. ఆమె సేవకు కేంద్రం వైయస్సార్ కడప జిల్లా పోరుమామిళ్ల. గుంటూరు నుంచి కడపకు సాగిన సేవాప్రస్థానాన్ని ఆమె సాక్షితో పంచుకున్నారు.

"మా నాన్న ఆడపిల్లల చదువు కోసం చాలా గట్టిగా నిలబడ్డారు. అదే నేను ఈ రోజు బాలికల కోసం హోమ్ నడపడానికి మూలకారణం. ఆయన కొంతకాలం టీచర్‌గా ఉద్యోగం చేసి ఊరికి దూరంగా ఉండడం ఇష్టం లేక హైదరాబాద్ నుంచి వరగాణికి వచ్చేసి వ్యవసాయంలో స్థిరపడ్డారు. బంధువులు, ఊరి వాళ్లు 'ఆడపిల్లకు పెళ్లి చేయకుండా ఇంకా ఎంతకాలం చదువుకు పంపిస్తావ్' అని ఎంత ఒత్తిడి తెచ్చినా సరే ఆయన అవన్నీ పట్టించుకోకుండా నన్ను, మా మేనమామ కూతురిని కూడా బీఈడీ వరకు చదివించారు.

పోరుమామిళ్లకు పిలుపు!

టెన్త్ క్లాస్ వరకు నెల్లూరు సెయింట్ జోసెఫ్ స్కూల్‌లో చదివాను. నేను బీఈడీ పూర్తి చేసిన టైమ్‌లో మా స్కూల్ హెడ్‌మిస్ట్రెస్ పోరుమామిళ్లలో ఉన్నారు. తెలిసిన వాళ్ల ద్వారా నా గురించి వాకబు చేశారట. మాథ్స్ టీచర్ అవసరం ఉందని పిలిపించారు. అలా 1994లో పోరుమామిళ్లలోని 'అవర్ లేడీ ఆఫ్ ఫాతిమా' స్కూల్‌లో మాథ్స్ అసిస్టెంట్‌గా చేరాను, ఇప్పుడు అదే స్కూల్ హెడ్‌మిస్ట్రెస్‌ని. ఆ తర్వాత ఏడాది నాకు పెళ్లయింది. మా అత్తగారు కూడా ఇదే స్కూల్‌లో టీచర్‌గా చేశారట. ఆ సంగతి మా పెళ్లయిన తరవాత తెలిసింది. నాకు ఈ ఊరితో ఈ స్కూల్‌తో అనుబంధం నాకు తెలియక ముందు ఏనాడో ముడిపడి ఉందనిపిస్తుంది. ఇక హోమ్ స్థాపనకు దారి తీసిన పరిస్థితులు కూడా అలాంటివే. ముందస్తు ప్రణాళిక ఏమీ లేదు, అప్రయత్నంగా బాధ్యత తీసుకున్నాను.



హోమ్‌లో పిల్లలతో ఆరోగ్యరాణి

బాధ్యత ఇంటికి వచ్చింది!

మా బంధువుల్లో ఒక పెద్దాయన కలసపాడులో తన ఇంట్లోనే పద్దెనిమిది మంది అబ్బాయిలకు ఆశ్రయం ఇచ్చేవారు. ఆయనకు వయసు మీద పడిన తరవాత ఓ రోజు మా వారి దగ్గరకు వచ్చి "వీళ్లంతా బాగా చదువుకుంటున్నారు. నాకు శక్తి తగ్గిపోయింది. ఈ పిల్లలను వాళ్ల ఊళ్లకు పంపించేస్తే చదువు ఆగిపోతుంది. వీళ్ల జీవితాలు మీ చేతిలో పెడుతున్నాను. చేయగలిగింది చేయండి" అన్నారు. అలా మా ఇంటికి వచ్చిన పిల్లలందరికీ అమ్మనయ్యాను. అందరికీ వండి, నేను బాక్సు పెట్టుకుని స్కూల్‌కి వెళ్లేదాన్ని. వాళ్లలో కొంతమంది ఇప్పుడు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేస్తున్నారు. మా హోమ్‌కి వచ్చి ఆ రోజు భోజనం స్పాన్సర్ చేస్తుంటారు. ఇది ఇలా ఉంటే మా మామగారి పేరు మీద 2002 నుంచి సేవా కార్యక్రమాలు మొదలుపెట్టాం, ఆ తరవాత మదర్ థెరెస్సా ఫౌండేషన్ పెట్టి వరదలు, సునామీ వంటి విపత్తుల సమయంలో సహాయ కార్యక్రమాలు చేస్తుండేవాళ్లం. నాకు ఎక్కడికెళ్లినా చదువు లేకుండా చిన్న వయసులోనే పెళ్లితో ఇంటి బాధ్యతలు మోస్తున్న టీనేజ్ బాలికల మీద దృష్టి ఆగిపోయేది. అలాగే అమ్మానాన్నలు లేకపోవడంతో బంధువుల ఇళ్లలో ఇంటి పనులతో రోజులు వెళ్లదీస్తున్న బాలికలు కూడా. అప్పుడు మా నాన్న ఆడపిల్ల చదువు గురించి ఎంత గట్టిగా నిలబడ్డారో కళ్ల ముందు మెదిలేది. చాలామంది ఆడపిల్లలకు తమకోసం ఆలోచించేందుకు అమ్మానాన్నలు కూడా లేరు. ఒకవేళ తల్లి లేక తండ్రి మాత్రమే ఉన్నప్పటికీ ఆ ఇంటి ఆడపిల్ల పరిస్థితి దయనీయంగానే ఉంటుంది. అలాంటి బాలికల కోసం పనిచేయాలని గట్టిగా సంకల్పం చెప్పుకున్నాను. ఆడపిల్లల విషయంలో ఆశ్రయం, చదువుతోపాటు భద్రత కూడా చాలా ముఖ్యం. సరిగ్గా నిర్వహించగలనా అనే సందేహం పీడించింది. అప్పుడు మా వారు "భగవంతుడు అవకాశం ఇచ్చినప్పుడు సమాజానికి తిరిగి ఇవ్వాలి. అలా చేయకపోతే దేవుడికి ఏమని లెక్క చెప్పాలి? ధైర్యంగా మొదలు పెట్టు" అన్నారు. అలా 2012లో 30 మంది మా హోమ్‌కి వచ్చారు. ఈ పదేళ్లలో ఆ నంబరు 250కి దగ్గరైంది. కరోనా తరవాత కొత్త అడ్మిషన్‌లు తీసుకోలేదు. ఇప్పుడు 52 మంది ఉన్నారు.

అనుబంధాల నిలయం!

మా పిల్లల్లో ఇద్దరు ఎంబీయే చేశారు, బీటెక్ చేసి లండన్ వెళ్లారు, చాలామంది బీటెక్ చేస్తున్నారు. కొంతమంది టీచర్ ట్రైనింగ్‌లో ఉన్నారు. మా బాధ్యతగా సమాజానికి బాధ్యతగల పౌరులను ఇస్తున్నాం. నేను కన్న పిల్లల్లో అబ్బాయి ఎంబీయే. మా చారిటీ హాస్పిటల్ చూసుకుంటున్నాడు. అమ్మాయి సివిల్స్‌కి ప్రిపేరవుతోంది. హోమ్‌లో పిల్లలకు నేను అమ్మని, మా అబ్బాయి అన్న, అమ్మాయి అక్క. ఇక మా అమ్మని అమ్మమ్మ, అత్తమ్మని నానమ్మ అని పిలుస్తారు. హోమ్ అంటే ఆశ్రయం ఇచ్చి అన్నం పెట్టడమే కాదు, బంధాలతో అనుబంధాలను అల్లుకోవాలి. మరొకరి ఆశ్రయంలో ఉన్నామనే భావన కలగకూడదు. అందుకే అందరం ఇదే హోమ్‌లో ఉంటాం" అని చెప్పారు ఆరోగ్యరాణి.

– వాకా మంజులారెడ్డి
ఫొటోలు: పాలకొలను వెంకటరామిరెడ్డి, సాక్షి, బద్వేల్, కడపజిల్లా

అదర్‌సైడ్

వెండితెర బంగారం

రవీనా టాండన్ సుపరిచిత నటి.
అయితే చాలామందికి ఆమెలో తెలియని కోణం సామాజిక స్పృహ.
స్త్రీల హక్కులు, చైతన్యం, సాధికారతకు సంబంధించిన కార్యక్రమాల్లో రవీనా టాండన్ చురుగ్గా పాల్గొంటుంది.
జీ-20కి సంబంధించిన ఉమెన్స్ ఎంపర్‌మెంట్ వింగ్-డబ్ల్యూ20 డెలిగేట్‌గా రవీనాకు సామాజిక స్వరాన్ని మరోసారి వినిపించే అవకాశం లభించింది.

డైరెక్టర్ రవి టాండన్ కుమార్తెగా బాలీవుడ్‌లోకి అడుగు పెట్టిన రవీనా టాండన్ భిన్నమైన పాత్రలు చేసి తనను తాను నిరూపించుకుంది. నటిగా జాతీయ అవార్డ్‌తో పాటు ఎన్నో అవార్డ్‌లు అందుకుంది.



రవీనా టాండన్

'కాలం కంటే కాస్త ముందుగా ఆలోచించే వ్యక్తి'గా గుర్తింపు సంపాదించింది.

తన కెరీర్ పీక్‌లో ఉన్నప్పుడు 21 సంవత్సరాల వయసులో 'సింగిల్ మదర్'గా పదకొండు సంవత్సరాల పూజా, ఎనిమిది సంవత్సరాల చయ్యలను దత్తత తీసుకుంది. సింగిల్ మదర్‌గా పిల్లలను దత్తత తీసుకోవడం ఆ తరువాత ట్రెండ్‌గా మారింది.

మహారాష్ట్రలోని వసై నగరంలో కొందరి దుర్మార్గం వల్ల 30 మంది అమ్మాయిలు నిరాశ్రయులయ్యారు. అందరూ 'అయ్యో!' అనే సానుభూతికే పరిమితమైన ఆ కాలంలో రవీనా వారికి అండగా నిలబడింది.

తన ఇంట్లోనే 30 మందికి ఆశ్రయం కల్పించింది. ఆ తరువాత వసైలో సొంత ఖర్చులతో అనాథాశ్రమం కట్టించి అందులో వారికి ఆశ్రయం ఇచ్చింది. ఇక అప్పటి నుంచి సామాజికసేవా కార్యక్రమాల్లో విస్తృతంగా పాల్గొంటూనే ఉంది.

సినిమాల్లో తన నటన కంటే 30 మంది అమ్మాయిలకు ఆశ్రయం కల్పించిన విషయం గురించే రవీనాతో చాలామంది మాట్లాడుతుంటారు. ఆ సందర్భం నుంచి తాము ఎలా స్ఫూర్తి పొందిందీ చెబుతుంటారు.

మంచి పనికి లభించే గుర్తింపు అది!

స్త్రీల హక్కులు, చైతన్యం, సాధికారతకు సంబంధించి యూనిసెఫ్‌తో... క్రై, వైట్ రిబ్బన్ (సేఫ్ మదర్‌హుడ్), స్మైల్ ఫౌండేషన్... మొదలైన స్వచ్ఛందసంస్థలతో కలిసి పనిచేస్తోంది రవీనా. 'పెటా'తో పాటు హైజీన్ ఆఫ్ యంగ్ గర్ల్స్, మిషన్ సాహసి(ఆత్మరక్షణ)... మొదలైన కార్యక్రమాలకు అంబాసిడర్‌గా వ్యవహరించింది.

ఉమెన్ ఎంపవర్‌మెంట్ ఎంగేజ్‌మెంట్ వింగ్-జీ20 డెలిగేట్‌గా నియామకం అయిన రవీనా టాండన్....

'భారతీయ మహిళ ప్రతినిధిగా ఈ సదస్సులో పాల్గొనడం గౌరవంగా భావిస్తున్నాను. దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి ఎన్నో రంగాలకు చెందిన ఎంతో మంది మహిళలు విశేష కృషి చేశారు. సామాజిక, ఆర్థిక రంగాలలో మహిళల హక్కులు, అవకాశాల గురించి చర్చించడానికి ఇదొక మంచి అవకాశం' అంటోంది.

యూత్ పల్స్

కోవిడ్ లాక్‌డౌన్ సమయంలో ఊపందుకున్న 'మీమ్స్' ట్రెండ్ ఇప్పుడు 'మోర్ దేన్ ఏ ట్రెండ్'గా మారింది. పాకెట్ మనీ సంపాదించుకోవడానికి యూత్‌కు మార్గం అయింది...

మిత్రమా... ప్రతి మీమ్‌కు ఒక లెక్క ఉంది!



పాప్ కల్చర్ మూమెంట్ అనగానే యూత్‌కి సంబంధించి ఒక సినిమా రిలీజ్, క్రికెట్ ఆట, మ్యూజిక్ ప్రోగ్రామ్... ఇలా ఏవేవో గుర్తుకు వస్తాయి. అయితే మిలీనియల్స్‌కు మాత్రం మీమ్స్, వైరల్ వీడియోలే పాప్‌కల్చర్ మూమెంట్. కోవిడ్ లాక్‌డౌన్ సమయంలో మీమ్స్ ట్రెండ్ ఊపందుకుంది. టైమ్‌పాస్ కోసం చేసినా తమలోని ఒత్తిడి, అకారణ భయం, బోర్‌డమ్ దూరం కావడానికి మీమ్స్ ఉపకరించాయి.

మొన్నటివరకు ట్రెండ్‌గా ఉన్న మీమ్స్ ఇప్పుడు మోర్ దేన్ ఏ ట్రెండ్‌గా మారాయి. దీనికి కారణం సోషల్ మీడియా బ్రాండ్ మార్కెటింగ్‌లో 'మీమ్స్' భాగం కావడమే కాదు కీలకం కావడం.

'ఒక విషయాన్ని సీరియస్‌గా, బోధన చేస్తున్నట్లుగా కాకుండా సరదాగా చెబితే కస్టమర్‌లకు వేగంగా చేరువ అవుతుంది' అనే పబ్లిసిటీ సూత్రానికి మీమ్ అనేది నిలువెత్తు దర్పణంగా మారింది. బ్రాండ్‌ను ప్రమోట్ చేయడానికి మార్కెటింగ్ స్ట్రాటజీలో భాగం అయింది. 'హైంజ్' అనే అమెరికన్ ఫుడ్ ప్రాసెసింగ్ కంపెనీ యూత్ క్రియేటివిటీని ఉపయోగించి మీమ్స్‌ను బాగా వాడుకుంటోంది.

మీమ్స్‌లో ఉన్న ప్రత్యేకత ఏమిటంటే బ్రాండ్‌కు సంబంధించి ఓవర్ ప్రమోషన్ కనిపించదు. సహజంగా, సరదాగా ఉంటూనే బ్రాండ్ గురించి ఎలాంటి ఆడంబరం లేకుండా నిశ్శబ్దంగా ప్రచారం చేస్తాయి. ఎక్కువ సమయం తీసుకోకపోవడం మరో ప్రత్యేకత.

'మీమ్స్ అనేవి ఫ్యూచర్ ఆఫ్ సోషల్ మార్కెటింగ్. వీటిలో యూత్ కీలక పాత్ర పోషించనుంది. కాలం మారింది. చిన్న బ్రాండ్, పెద్ద బ్రాండ్ అనే తేడా లేకుండా ఇప్పుడు అన్ని బ్రాండ్లకు సోషల్ మార్కెటింగ్‌లో మీమ్స్ అనేవి తప్పనిసరి అవసరం' అంటున్నాడు మీమ్స్.కామ్ కో–ఫౌండర్ రజ్వన్.

మీమ్స్ అనేవి కేవలం సరదా కోసం మాత్రమే కాదని పాకెట్‌మనీ సంపాదించుకోవచ్చనే సత్యం బోధపడడం తో యూత్ ఇప్పుడు వాటిపై సీరియస్‌గా దృష్టి పెట్టింది. 'మీమ్ హిట్ కావడానికి గోల్డెన్ రూల్స్ ఏమిటి?' అంటూ వెదకడం ప్రారంభించింది. గోల్డెన్ రూల్స్‌లో ఒకటి...'అందరికీ నచ్చేలా ఉండాలి అని చేసే మీమ్స్ కంటే టార్గెట్ ఆడియెన్స్‌ను దృష్టిలో పెట్టుకొని చేసేవే బాగా క్లిక్ అవుతాయి' అనేది.

బెంగళూరుకు చెందిన ఎస్ఆర్.హారికకు మీమ్స్ అంటే ఇష్టం. తాను కూడా వాటిని చేయాలనుకుంటోంది. ఎలీన్ బ్రౌన్ అనే జర్నలిస్ట్ రాసిన 'ది మ్యాథ్స్ బిహైండ్ ది మీమ్స్' అనే వ్యాసాన్ని మిత్రులకు షేర్ చేయడం అంటే తనకు ఇష్టం. మీమ్స్ తయారీలో పట్టు సాధించడానికి ప్రయత్నిస్తున్న వారికి ఇష్టమైన వ్యాసాల్లో ఒకటి అంజలి వేణుగోపాలన్ రాసిన 'ది సైన్స్ బిహైండ్ మీమ్ మార్కెట్'

'ఒకరు ఒక మీమ్‌ను క్రియేట్ చేయడానికి కారణం ఏమిటి? అనే ప్రశ్నకు జవాబు మోటివేషనల్ అండ్ ఎమోషనల్ రెస్పాన్స్' అంటుంది ఎలీన్ బ్రౌన్. అయితే ఇప్పటి విషయానికి వస్తే మీమ్‌ను రూపొందించడంలో మోటివేషనల్, ఎమోషనల్ కంటే వినోదం, వ్యంగ్యం పాలే ఎక్కువ. దీన్ని దృష్టిలో పెట్టుకొనే కావచ్చు...'మీమ్ నిర్వచనం కాలంతోపాటు మారుతూ వస్తుంది' అంటుంటారు.

'మీమ్స్ అనేవి మన నిత్యజీవితంలో భాగం అయ్యాయి. పాత సినిమాల నుంచి కొత్త సినిమాల వరకు కొత్త న్యూస్ క్లిప్‌ల నుంచి పాత న్యూస్ క్లిప్‌ల వరకు ఏదైనా మీమ్ చేయవచ్చు. అయితే దాన్ని ఎలా హిట్ చేస్తాం అనేదే ముఖ్యం. యువతరం ఈ విద్యలో ఆరితేరింది' అంటున్నారు మీమ్ మార్కెటింగ్ ఏజెన్సీ 'యంగ్‌గన్' ఫౌండర్ సాక్ష్యమ్ జాదవ్.

'మీమ్'ల రూపకల్పనలో ఎన్నో వెబ్‌సైట్లు యూత్‌కు ఉపయోగపడుతున్నాయి. అందులో ఒకటి... సూపర్‌మీమ్. మీమ్‌కు అవసరమైన కంటెంట్ ఇస్తే ఈ ఏఐ ఆధారిత వెబ్‌సైట్ మనకు అవసరమైన మీమ్ తయారు చేసి ఇస్తుంది. టెక్ట్స్‌ను మీమ్‌గా కన్వర్ట్ చేయడమే కాదు మీమ్ సెర్చ్ ఇంజిన్‌గా కూడా ఉపయోగపడుతుంది.

పాకెట్‌మనీ కంటే కాస్త ఎక్కువే!

మీమ్స్‌కు డిమాండ్ ఏర్పడడానికి కారణం సంప్రదాయ అడ్వర్‌టైజింగ్‌లతో పోల్చితే తక్కువ ఖర్చు కావడం. క్రియేటర్‌లలో వైట్-కాలర్ ఎంప్లాయీస్ కంటే హైస్కూల్, కాలేజీ స్టూడెంట్స్ ఎక్కువమంది ఉండడం! తమ క్రియేటివ్ టాలెంట్‌తో తల్లిదండ్రులపై ఆధారపడకుండా పాకెట్ మనీ, కొన్ని సందర్భాలలో అంతకంటే ఎక్కువ సంపాదించుకోగలుగుతున్నారు. మీమ్ క్రియేటింగ్ అండ్ నెట్‌వర్కింగ్ ప్లాట్‌ఫామ్‌మీమ్ చాట్' 1,50,000 క్రియేటర్స్‌కు ఒక్కో మీమ్‌కు 20 నుంచి 30 రూపాయల వరకు చెల్లిస్తుంది. అయితే ప్లాట్‌ఫామ్‌ను బట్టి ఈ రెమ్యునరేషన్ మారుతూ ఉండవచ్చు.

ఇంటిప్

కిటికీ... క్లీనింగ్



గాలి, వెలుతురు కోసం కిటికీలను రోజంతా తెరిచి ఉంచడం సాధారణమే. అందుకే, కిటికీలను ప్రతిరోజూ తుడవడం మంచిది. తెరిచిన కిటికీలు గాలిలో వచ్చే దుమ్ముతోపాటు పుప్పొడిని, వాటిని ఆశ్రయించే బాక్టీరియాని పట్టుకుని ఉంటాయి. ఇలా పర్యావరణ అలెర్జీల కారణంగా ఉబ్బసం సమస్యలు ఉత్పన్నం అవుతాయి. కిటికీలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా శ్వాసకోశ సమస్యలను తగ్గించుకోవచ్చు.

తడిబట్టతో కనీసం రెండు రోజులకోసారి తుడవడం వల్ల కిటికీలు శుభ్రంగా ఉండడంతో పాటు ఆరోగ్యం కూడా బాగుంటుంది.

బ్యూటిప్

టేబుల్ స్పూను తేనె, పండిన అవకాడో గుజ్జు, టేబుల్ స్పూను పచ్చిపాలు, టేబుల్ స్పూన్ ఓట్స్‌ను మిక్సీజార్‌లో వేసి మెత్తని పేస్టులా గ్రైండ్ చేయాలి. ఈ పేస్టును పదిహేను నిమిషాలు నానబెట్టి తరువాత ముఖానికి అప్లై చేసి పదినిమిషాలు ఆరనివ్వాలి. తరువాత సాధారణ నీళ్లతో కడిగేయాలి. వారానికి రెండు సార్లు ఈ ప్యాక్ వేయడం వల్ల చర్మానికి కావాల్సిన తేమ అంది పొడిబారకుండా ఉంటుంది. ప్యాక్‌లో ఉన్న విటమిన్ ఈ, ఫ్యాటీ యాసిడ్‌లు ముఖచర్మానికి పోషణ అందిస్తాయి. ఈ ప్యాక్ వేసుకోవడం కుదరని వాళ్లు అవకాడో ఆయిల్‌ను ముఖానికి రాసి మర్దనా చేసుకుంటే ముఖచర్మం పొడిబారకుండా ఉంటుంది.





సెమీఫైనల్లో హైదరాబాద్ ఎఫ్‌సీ

ఈ సీజన్ ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్)లో డిఫెండింగ్ చాంపియన్ హైదరాబాద్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) జట్టుకు లీగ్ దశలో రెండో స్థానంతోపాటు సెమీఫైనల్ బెర్త్ కూడా ఖరారైంది. హైదరాబాద్‌లో జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ ఎఫ్‌సీ 1–0తో ఏటీకే మోహన్ బగాన్ జట్టుపై నెగ్గింది. ఆట 86వ నిమిషంలో ఒగ్‌బెచె గోల్ చేసి హైదరాబాద్‌ను గెలిపించాడు. 18 మ్యాచ్‌లు ఆడిన హైదరాబాద్ 39 పాయింట్లతో రెండో స్థానంలో ఉంది.

రెండో టెస్టు కోసం టీమిండియాలో శ్రేయస్

భారత క్రికెటర్ శ్రేయస్ అయ్యర్ వెన్ను నొప్పి గాయం నుంచి పూర్తిగా కోలుకున్నాడు. బీసీసీఐ వైద్య బృందం నిర్వహించిన ఫిట్‌నెస్ పరీక్షలో శ్రేయస్ పాస్ అయ్యాడని బీసీసీఐ కార్యదర్శి జై షా తెలిపారు. దాంతో శుక్రవారం నుంచి న్యూఢిల్లీలో ఆస్ట్రేలియాతో జరిగే రెండో టెస్టు కోసం అతను భారత బృందంతో కలుస్తాడు. గత డిసెంబర్‌లో బంగ్లాదేశ్‌తో చివరిసారి టెస్టుల్లో శ్రేయస్ అయ్యర్ బరిలోకి దిగాడు.



మరో విజయమే లక్ష్యంగా...

నేడు వెస్టిండీస్‌తో భారత్ పోరు

సాయంత్రం గం. 6:30 నుంచి 'స్టార్ స్పోర్ట్స్'లో ప్రత్యక్ష ప్రసారం



12 ఇప్పటి వరకు భారత్, వెస్టిండీస్ జట్ల మధ్య 20 అంతర్జాతీయ టి20 మ్యాచ్‌లు జరిగాయి. భారత్ 12 మ్యాచ్‌ల్లో, వెస్టిండీస్ 8 మ్యాచ్‌ల్లో గెలుపొందాయి. ఇక టి20 ప్రపంచకప్ చరిత్రలో రెండు జట్లు రెండుసార్లు తలపడగా...ఇరు జట్లకు ఒక్కో మ్యాచ్‌లో విజయం దక్కింది.

కేప్‌టౌన్: టి20 ప్రపంచకప్‌లో శుభారంభం చేసిన భారత మహిళల జట్టు వరుసగా మరో విజయంపై దృష్టి సారించింది. బుధవారం గ్రూప్ 'బి'లో జరిగే లీగ్ మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ సేన... వెస్టిండీస్‌తో తలపడుతుంది. మరోవైపు ఇంగ్లండ్ చేతిలో ఓడిన కరీబియన్ అమ్మాయిలు బోణీ కొట్టేందుకు చూస్తున్నారు. చిరకాల ప్రత్యర్థి పాక్ ఎదురైన గత మ్యాచ్‌లో భారత జట్టు ఆరంభంలో తడబడినా... తర్వాత పుంజుకుంది. డాషింగ్ బ్యాటర్ స్మృతి మంధాన గాయంతో అందుబాటులో లేకపోయినా... లక్ష్యఛేదనలో భారత్ ఆడిన తీరు బాగుంది. ఇప్పుడైతే స్టార్ ఓపెనర్ స్మృతి తుది జట్టులోకి రావడంతో బ్యాటింగ్ దళం మరింత పటిష్టమైంది. గత జనవరిలో జరిగిన ముక్కోణపు సిరీస్‌లో భారత జట్టు వెస్టిండీస్‌తో తలపడిన రెండుసార్లు విజయం సాధించింది. ఓపెనింగ్‌లో షఫాలీ వర్మ, వన్‌డౌన్ బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ ఫామ్‌లో ఉండటంతో భారత టాపార్డర్‌కు ఏ ఢోకా లేదు. మిడిలార్డర్‌లో కెప్టెన్ హర్మన్‌ప్రీత్, రిచా ఘోష్‌లు కూడా బ్యాట్ ఝుళిపించగలరు. దీంతో భారీస్కోర్లు సాధించే సత్తా మన జట్టుకుంది. బౌలింగ్‌లో రేణుక సింగ్ తన పదును చూపాల్సి ఉంది. పాక్‌తో పోరులో తొలి పది ఓవర్ల పాటు బౌలర్లు చక్కగానే కట్టడి చేశారు. కానీ తర్వాతి 10 ఓవర్లే కట్టుదిట్టంగా వేయలేకపోయారు. ఈ మ్యాచ్‌లో అలాంటి తడబాటుకు అవకాశమివ్వకుండా రాణిస్తే భారత్‌కు వరుస విజయం కష్టమేం కాదు. మరోవైపు విండీస్ జట్టు వరుస వైఫల్యాలతో సతమతమవుతోంది. వరుసగా 14 మ్యాచ్‌ల్లో హేలీ మాథ్యూస్ సేన గెలుపొందలేకపోయింది. ఇందులో ఒక మ్యాచ్ 'టై'కాగా... 13 మ్యాచ్‌ల్లో ఓటమి పాలవడం జట్టును కుంగదీస్తోంది. మెగా ఈవెంట్‌లో ముందంజ వేయాలంటే కరీబియన్ జట్టుకు ప్రతీ మ్యాచ్ కీలకంగా మారింది. తొలి లీగ్ మ్యాచ్‌లో విండీస్ ఏడు వికెట్లతో ఇంగ్లండ్ చేతిలో ఓడింది.

అజహర్ ఆట ముగిసింది!

హెచ్‌సీఏ పర్యవేక్షణకు ఏకసభ్య కమిటీ • రిటైర్డ్ జడ్జి ఎల్.నాగేశ్వరరావును నియమించిన సుప్రీంకోర్టు

సాక్షి, న్యూఢిల్లీ: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అధ్యక్షుడిగా మొహమ్మద్ అజహరుద్దీన్ ఎట్టకేలకు తప్పుకోనున్నాడు. గత ఏడాది సెప్టెంబర్ 26నే పదవీ కాలం ముగిసినా, తనతో పాటే ఎన్నికైన అపెక్స్ కమిటీ సభ్యులను పక్కన పెట్టి మరీ అజహర్ హెచ్‌సీఏను నడిపిస్తూ వచ్చాడు. ఇప్పుడు ఆ అధికారాన్ని సుప్రీంకోర్టు తొలగించింది. ఇకపై హెచ్‌సీఏ రోజువారీ కార్యకలాపాల పర్యవేక్షణ, త్వరలోనే ఎన్నికల నిర్వహణకు కొత్తగా ఏకసభ్య కమిటీని ఎంపిక చేసింది. ఇందు కోసం సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఎల్.నాగేశ్వరరావును సుప్రీంకోర్టు నియమించింది. దీంతో ఇప్పటి వరకు నలుగురు సభ్యులుగా ఉన్న పర్యవేక్షక కమిటీ కూడా రద్దయింది. ఇందులో మాజీ న్యాయమూర్తి నిసార్ అహ్మద్ కక్రూ, డీజీపీ అంజనీ కుమార్‌లతోపాటు మాజీ క్రికెటర్లు వంకా ప్రతాప్, వెంకటపతిరాజు ఉన్నారు. పేరుకే ఈ కమిటీ ఉన్నా... అన్నీ తానై అజహర్ వ్యవహరిస్తున్నాడని, సమయం ముగిసిపోయినా ఎన్నికలు నిర్వహించడం లేదని ప్రత్యర్థి వర్గం చెబుతూ వచ్చింది. ఇకపై 'అన్ని రకాల సంతకాల అధికారం' కూడా తాజాగా నియమించిన నాగేశ్వరరావుకే కట్టబెడుతున్నట్లు సుప్రీం ఉత్తర్వుల్లో ఉంది. దాంతో హెచ్‌సీఏ నుంచి అజహర్ బయటకు వెళ్లడం ఖాయమైంది.



హెచ్‌సీఏపై చార్మినార్ క్రికెట్ క్లబ్ వేసిన పిటిషన్ విచారణ సందర్భంగా సుప్రీం ఈ ఆదేశాలు జారీ చేసింది. దీనిని మంగళవారం జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, మనోజ్ మిశ్రా, జస్టిస్ అరవింద కుమార్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. ఎన్నికలు పెండింగ్‌లో ఉన్నందున ప్రతిష్టంభన తొలగించాలని, నిష్పక్షపాతంగా ఎన్నికల ప్రక్రియ జరగాలని ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు ధర్మాసనం స్పష్టం చేసింది. ఎన్నికల నిర్వహణకు జస్టిస్ ఎల్.నాగేశ్వరరావును నియమించాలని ప్రతివాదుల తరఫు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ దవే కోర్టుకు సూచించారు. 'ప్రతిష్టంభనకు ముగింపు పలికి, నిష్పక్షపాతంగా ఎన్నికల ప్రక్రియ సాగాలని భావిస్తున్నాం. ఈ గందరగోళానికి తెర పడాలంటే సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఎల్.నాగేశ్వరరావు ఏకసభ్య నాయకత్వం తగినదని అభిప్రాయపడుతున్నాం' అని ధర్మాసనం పేర్కొంది. 'జస్టిస్ ఎల్.నాగేశ్వరరావు హైదరాబాద్‌కు చెందిన వారు. ఎలక్టోరల్ సమస్యలు పరిష్కరించగలరు' అని తెలిపింది. జస్టిస్ ఎల్.నాగేశ్వరరావుకు అన్ని విధాలా సహకరించాలని హైదరాబాద్ క్రికెట్ సంఘాన్ని ఆదేశించింది. పూర్తి ఖర్చులు హెచ్‌సీఏనే భరించాలని కోర్టు నుంచి ఇతరత్రా ఆదేశాలు అవసరమైతే జస్టిస్ ఎల్.నాగేశ్వరరావు ధర్మాసనం దృష్టికి తీసుకురావచ్చని ఆదేశాల్లో పేర్కొంది. హెచ్‌సీఏలోని ఇతర పరిపాలనా వ్యవహారాలకు సంబంధించిన అంశాలపై తదుపరి విచారణను మార్చి 2కు వాయిదా వేసింది.



భారత సీనియర్ క్రికెటర్ చతేశ్వర్ పుజారా తన భార్య పూజతో కలిసి మంగళవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీని మర్యాదపూర్వకంగా కలిశాడు. భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య శుక్రవారం న్యూఢిల్లీలో రెండో టెస్టు మొదలవుతుంది. పుజారా కెరీర్‌లో ఇది 100వ టెస్టు కానుంది.

భారత్ శుభారంభం



సింధు

దుబాయ్: ఆసియా మిక్స్‌డ్ టీమ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత జట్టు శుభారంభం చేసింది. మంగళవారం గ్రూప్ 'బి' తొలి లీగ్ మ్యాచ్‌లో భారత్ 5–0తో కజకిస్తాన్‌పై ఘనవిజయం సాధించింది. తొలి మ్యాచ్‌లో ఇషాన్–తనీషా ద్వయం 21–5, 21–11తో మక్సుత్–నర్గీజా జోడీపై నెగ్గింది. రెండో మ్యాచ్‌లో ప్రణయ్ 21–9, 21–11తో పనారిన్‌ను ఓడించాడు. మూడో మ్యాచ్‌లో సింధు 21–4, 21–12తో కామిలాపై నెగ్గడంతో భారత విజయం ఖరారైంది. తర్వాతి మ్యాచ్‌ల్లో గరగ కృష్ణ ప్రసాద్–విష్ణువర్ధన్ గౌడ్ 21–10, 21–6 తో కుల్మతోవ్–నియాజోవ్‌లను ఓడించగా.. పుల్లెల గాయత్రి –ట్రిసా జాలీ 21–5, 21–7తో నర్గీజా–ఐషా జుమ్‌బేక్‌లపై విజయం సాధించారు.

తొలి పోరులో ముంబైతో గుజరాత్ ఢీ

డబ్ల్యూపీఎల్ షెడ్యూల్ విడుదల

ముంబై: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) ప్రారంభ సీజన్‌కు సర్వం సిద్ధమైంది. ఐదు ఫ్రాంచైజీ జట్ల మధ్య వచ్చే నెల 4 నుంచి అమ్మాయిల మెరుపులు మొదలవుతాయి. దీనికి సంబంధించిన మొత్తం 22 మ్యాచ్‌ల పూర్తి షెడ్యూల్‌ను మంగళవారం విడుదల చేశారు. డీవై పాటిల్ స్టేడియంలో మార్చి 4న జరిగే తొలి మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్‌తో గుజరాత్ జెయింట్స్ తలపడుతుంది. ఫైనల్ 26న జరుగుతుంది. ఈ సీజన్‌లో నాలుగు రోజులు రెండేసి మ్యాచ్‌లు జరుగుతాయి. తొలి మ్యాచ్ మధ్యాహ్నం 3.30 గంటలకు, రెండో మ్యాచ్ రాత్రి 7.30 గంటలకు మొదలవుతాయి. మొత్తం 22 మ్యాచ్‌ల్లో 11 చొప్పున బ్రబౌర్న్ స్టేడియం, డీవై పాటిల్ స్టేడియాల్లో నిర్వహిస్తారు.

హైదరాబాద్‌లో ప్రైమ్ వాలీబాల్ లీగ్ సందడి



మాదాపూర్: వాలీబాల్ ప్రేమికులకు ఉత్కంఠతోపాటు ఉల్లాసాన్ని నింపేందుకు ప్రైమ్ వాలీబాల్ లీగ్ (పీవీఎల్) రెండో సీజన్‌లో హైదరాబాద్ అంచె మ్యాచ్‌లకు గచ్చిబౌలి ఇండోర్ స్టేడియం సిద్ధమైంది. నేటి నుంచి హైదరాబాద్ అంచె మ్యాచ్‌లు మొదలుకానున్నాయి. ఈనెల 21 వరకు హైదరాబాద్‌లో మ్యాచ్‌లు జరుగుతాయి. నేటి మ్యాచ్‌లో కొచ్చి బ్లూ స్పైకర్స్‌తో హైదరాబాద్ బ్లాక్ హాక్స్ జట్టు తలపడుతుంది. బెంగళూరులో తొలి అంచె మ్యాచ్‌లు ఈనెల 4 నుంచి 12 వరకు జరిగాయి.

పారిస్ ఒలింపిక్స్‌కు ఆకాశ్‌దీప్, ప్రియాంక అర్హత



రాంచీ: జాతీయ ఓపెన్ రేస్ వాకింగ్ చాంపియన్‌షిప్‌లో పురుషుల 20 కిలోమీటర్ల విభాగంలో పంజాబ్‌కు చెందిన ఆకాశ్‌దీప్ సింగ్... మహిళల 20 కిలోమీటర్ల విభాగంలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన ప్రియాంక గోస్వామి విజేతలుగా నిలిచారు. ఈ ఏడాది ఆగస్టులో బుడాపెస్ట్‌లో జరిగే ప్రపంచ అథ్లెటిక్స్ పోటీలకు... వచ్చే ఏడాది పారిస్ ఒలింపిక్స్ క్రీడలకు అర్హత సాధించారు. ఆకాశ్‌దీప్ 20 కిలోమీటర్ల దూరాన్ని 1 గంట 19 నిమిషాల 55 సెకన్లలో పూర్తి చేసి కొత్త జాతీయ రికార్డు సృష్టించాడు. ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్, పారిస్ ఒలింపిక్స్ అర్హత ప్రమాణ సమయాన్ని (1గం:20ని:10 సెకన్లు) అధిగమించాడు. ప్రియాంక 1 గంట 28 నిమిషాల 50 సెకన్లలో లక్ష్యానికి చేరి ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్, పారిస్ ఒలింపిక్స్ అర్హత ప్రమాణ సమయాన్ని (1గం:29ని:20 సెకన్లు) అధిగమించింది.

విండీస్‌దే టెస్టు సిరీస్

బులవాయో: జింబాబ్వే పర్యటనలో వెస్టిండీస్ జట్టు రెండు టెస్టుల సిరీస్‌ను 1–0తో కైవసం చేసుకుంది. మంగళవారం ముగిసిన ఆఖరి టెస్టులో కరీబియన్ జట్టు ఇన్నింగ్స్ 5 పరుగుల తేడాతో జయభేరి మోగించింది. ఓవర్‌నైట్ స్కోరు 290/8తో మూడో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన వెస్టిండీస్ కేవలం 2 పరుగులే జతచేసి 292 వద్ద ఆలౌటైంది. విండీస్‌కు 177 పరుగుల ఆధిక్యం లభించింది. తర్వాత రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన జింబాబ్వే 47.3 ఓవర్లలో 173 పరుగులకే కుప్పకూలింది. కెప్టెన్ క్రెయిగ్ ఇర్విన్ (72; 4 ఫోర్లు), ఓపెనర్ ఇన్నోసెంట్ కైయా (43; 7 ఫోర్లు) రాణించారు. మిగతా 9 మంది క్రీజులో నిలిచేందుకే ఆపసోపాలు పడ్డారు. తొలి ఇన్నింగ్స్‌లో 7 వికెట్లు తీసిన గుడకేశ్ మోతీ రెండో ఇన్నింగ్స్‌లోనూ 6 వికెట్లు పడగొట్టాడు. ఇక్కడే జరిగిన తొలి టెస్టు 'డ్రా'గా ముగిసింది.



మోతీ

సినిమా



• చంద్రబోస్, స్పీల్‌బర్గ్, కీరవాణి

ఆస్కార్ సంబరాలు ఆరంభం

ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవానికి దాదాపు నెల రోజులు ఉంది. ఈలోపు ఎప్పటిలానే ఆస్కార్ నామినేషన్ దక్కించుకున్నవారికి 'లంచ్ మీట్' ఏర్పాటు చేసింది అవార్డ్ కమిటీ. ఈ విందుకి సంగీతదర్శకుడు ఎంఎం కీరవాణి, రచయిత చంద్రబోస్ హాజరయ్యారు. 95వ ఆస్కార్ అవార్డ్స్‌లో 'బెస్ట్ ఒరిజినల్ సాంగ్' విభాగంలో 'ఆర్ఆర్ఆర్'లోని 'నాటు నాటు' పాటకు ఆస్కార్ నామినేషన్ దక్కిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అవార్డు కమిటీ నుంచి విందు కార్యక్రమానికి ఆహ్వానం అందగా ఈ ఇద్దరూ వెళ్లారు. ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా రాజమౌళి దర్శకత్వంలో డీవీవీ దానయ్య 'ఆర్ఆర్ఆర్'ని నిర్మించారు. ఇక 'లంచ్ మీట్' విషయానికొస్తే..

అమెరికాలోని కాలిఫోర్నియాలో గల ది బెవర్లీ హిల్టన్ బాల్ రూమ్‌లో విందు కార్యక్రమం జరిగింది. ఈ విందులో దాదాపు 200మంది పాల్గొన్నారని సమాచారం. అక్కడ దర్శకుడు స్టీవెన్ స్పీల్‌బర్గ్‌ను కలిశారు కీరవాణి, చంద్రబోస్. ఆ ఫోటోలను చంద్రబోస్ సోషల్ మీడియాలో షేర్ చేశారు.

హుందాగా ఉందాం: జానెట్ యాంగ్

గత ఏడాది జరిగిన ఆస్కార్ అవార్డుల వేడుకకు ఓ హోస్ట్‌గా వ్యవహరించిన క్రిస్ రాక్ ఆ వేదికపై నటుడు విల్ స్మిత్ భార్య జాన్ పింకెట్ హెయిర్ స్టయిల్ గురించి కామెడీగా మాట్లాడారు. అది నచ్చక విల్ స్మిత్ అతన్ని చెంపదెబ్బ కొట్టిన విషయం గుర్తుండే ఉంటుంది. ప్రపంచం మొత్తం చూస్తున్న వేడుకలో విల్ స్మిత్ ఇలా చేయడం సరికాదని అవార్డు కమిటీ భావించింది. ఇదే విషయం గురించి తాజాగా 'లంచ్ మీట్'లో అకాడమీ చైర్మన్ జానెట్ యాంగ్ మాట్లాడుతూ – ''ఇలాంటి ఘటనలు పునరావృతం కాకూడదు. గత ఏడాది ఆస్కార్ వేడుకలో జరిగిన ఘటన (క్రిస్‌ని విల్ చెంప చెళ్లుమనిపించడం) సరైనది కాదు. అందరం బాధ్యతా యుతంగా వ్యవహరించాలి. ఇలాంటి ఘటనలను ఆస్కార్ కమిటీ ఉపేక్షించదు'' అన్నారు.



• జోనాథన్ మేజర్స్

'ఆర్ఆర్ఆర్'ని ఆస్వాదించా!

ఈ నెల 17న ఇంగ్లిష్, హిందీ, తెలుగు, తమిళ భాషల్లో విడుదల కానున్న 'యాంట్–మ్యాన్ మరియు ది వాస్ప్: క్వాంటుమేనియా'లో సూపర్ విలన్ కాంగ్ ది కాంకరర్ పాత్ర చేసిన జోనాథన్ మేజర్స్ 'ఆర్ఆర్ఆర్' గురించి మాట్లాడుతూ– ''నేను భారతీయ చిత్రానికి అభిమానిని. 'ఆర్ఆర్ఆర్'ని చాలాసార్లు చూశాను. మూడు గంటల ఈ సినిమాని ఆస్వాదించాను. ఇద్దరు నటులను (ఎన్టీఆర్, రామ్‌చరణ్) తెరపై చూడటం నాకు చాలా నచ్చింది. మరిన్ని ఇండియన్ సినిమాలు చూడాలనుకుంటున్నాను'' అన్నారు.

జైసల్మేర్ టు మంగళూరు



• రజనీకాంత్

మంగళూరుకు షిఫ్ట్ అయ్యారు జైలర్. రజనీకాంత్ హీరోగా నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'జైలర్'. శివరాజ్‌కుమార్, మోహన్‌లాల్, జాకీ ష్రాఫ్, సునీల్, రమ్యకృష్ణ, తమన్నా కీలక పాత్రలు పోషిస్తున్న చిత్రం ఇది. ఇటీవల ఈ సినిమా షూటింగ్ రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో జరిగింది. ఈ షెడ్యూల్‌లో రజనీ, మోహన్‌లాల్, జాకీ ష్రాఫ్‌ల కాంబినేషన్‌లో కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. ఇప్పుడు 'జైలర్' షూటింగ్ మంగళూరులో జరుగుతోంది. రజనీ, శివరాజ్‌కుమార్‌లపై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఈ చిత్రం నెక్ట్స్ షెడ్యూల్‌ను చెన్నైలో ప్లాన్ చేశారట.

పోలీసాఫీసర్...



• లక్ష్మీ మంచు

మంచు మోహన్‌బాబు, మంచు లక్ష్మీప్రసన్న కలిసి నటించిన తొలి చిత్రం 'అగ్ని నక్షత్రం'. వంశీకృష్ణ మళ్ల దర్శకత్వంలో లక్ష్మీ ప్రసన్న పిక్చర్స్, మంచు ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై మంచు మోహన్‌బాబు, మంచు లక్ష్మీప్రసన్న నిర్మించారు. మంగళవారం ఈ సినిమా గ్లింప్స్‌ని హీరో రానా రిలీజ్ చేసి, చిత్ర యూనిట్‌కి అభినందనలు తెలిపారు. ఈ చిత్రంలో లక్ష్మీప్రసన్న పోలీసాఫీసర్ పాత్ర చేశారు. ''వైవిధ్యమైన కథాంశంతో రూపొందిన చిత్రం 'అగ్ని నక్షత్రం'. రానా విడుదల చేసిన గ్లింప్స్‌కి ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వస్తోంది. త్వరలో సినిమా రిలీజ్ డేట్ ప్రకటిస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: అచ్చు రాజామణి, కెమెరా: గోకుల్ భారతి.

ధైర్యం కోల్పోకూడదు



• రేణూ దేశాయ్

కొన్నేళ్లుగా గుండె సంబంధిత అనారోగ్యంతో బాధపడుతున్నట్లు వెల్లడించారు నటి–దర్శకురాలు రేణూ దేశాయ్. తన అనారోగ్యం గురించి రేణు ఓ పోస్ట్‌ను సోషల్ మీడియాలో షేర్ చేశారు. ''నా అనారోగ్య సమస్యల గురించి నా సన్నిహితులకు తెలుసు. కానీ ఇప్పుడు నేనే అందరికీ చెప్పాలనుకున్నాను. ఎందుకంటే నాలాగే వివిధ రకాల అనారోగ్య సమస్యలతో ఇబ్బందిపడుతున్న వారు ధైర్యంగా ఉండాలని చెప్పడం కోసం ... వారిలో జీవితం పట్ల సానుకూలమైన ఆలోచనలను రేకెత్తించడం కోసం. మనం ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నా మనలోని ధైర్యాన్ని, జీవితం పట్ల ఆశను కోల్పోకూడదు. ఎందుకంటే మన కోసం ఎన్నో స్వీట్ సర్‌ప్రైజెస్‌ను కాలం ప్లాన్ చేసి ఉండొచ్చు'' అన్నారు రేణు. ప్రస్తుతం చికిత్స చేయించుకుంటున్నానని, త్వరలోనే కోలుకుని ఆరోగ్యకరమైన జీవితాన్ని గడుపుతూ, సినిమా షూటింగ్స్‌లో పాల్గొంటాననే నమ్మకం ఉందని రేణుదేశాయ్ పేర్కొన్నారు.

ప్రత్యేక పూజలు



• పూజలు నిర్వహిస్తున్న సమంత

తమిళనాడులోని దిండిక్కల్ జిల్లాలో గల పళని సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు సమంత. కొంతకాలంగా మయోసైటిస్ (కండరాలకు సంబంధించిన వ్యాధి...)తో సమంత బాధపడుతున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ వ్యాధి నుంచి కోలుకునేందుకు సమంత వైద్య చికిత్స తీసుకుంటున్నారు. కాగా, అనారోగ్యం నుంచి వీలైనంత త్వరగా కోలుకోవాలని కోరుతూ, పళని సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో సమంత పూజలు చేశారు. అలాగే ఈ ఆలయ దర్శనానికి సమంత దాదాపు 600 మెట్లు ఎక్కి వెళ్లారని, ప్రతి మెట్టుపై ఓ కర్పూరాన్ని వెలిగించారని తెలుస్తోంది. దీనికి సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇక సినిమాల విషయానికి వస్తే... సమంత నటించిన 'శాకుంతలం' ఏప్రిల్ 14న రిలీజ్ కానుంది. శివ నిర్వాణ దర్శకత్వంలో 'ఖుషి'లో హీరోయిన్‌గా, హిందీ వెబ్ సిరీస్ 'సిటాడెల్'లో నటిస్తున్నారు సమంత.

జీవితగా...



• రాధిక

రక్షిత్ అట్లూరి హీరోగా, సంకీర్తనా విపిన్ హీరోయిన్‌గా నటించిన చిత్రం 'ఆపరేషన్ రావణ్'. వెంకట సత్య దర్శకత్వంలో ధ్యాన్ అట్లూరి నిర్మించిన ఈ సినిమా నిర్మాణానంతర పనులు జరుపుకుంటోంది. ఈ చిత్రంలో జీవిత పాత్ర చేస్తున్న రాధికా శరత్‌కుమార్ లుక్‌ని విడుదల చేశారు. ''స్వాతిముత్యం, స్వాతి కిరణం' లాంటి ప్రజాదరణ పొందిన చిత్రాల తర్వాత 'ఆపరేషన్ రావణ్'లో నటనకి ప్రాధాన్యం ఉన్న జీవిత పాత్ర చేశాను. తెలుగుతో పాటు తమిళంలో ఏక కాలంలో విడుదల కానున్న ఈ చిత్రంలో నటించడం సంతోషంగా ఉంది'' అన్నారు రాధిక.

అందువల్లే ఆ హీరోలు క్లిక్ అవుతున్నారు - నిర్మాత బన్నీ వాసు



• బన్నీ వాసు, కిరణ్ అబ్బవరం, కశ్మీర

''ఇండస్ట్రీలో బ్యాక్‌గ్రౌండ్ ఉన్నా లేకున్నా కష్టపడాలి. అల్లు అర్జున్, నాని, కిరణ్ అబ్బవరం, నిఖిల్‌లకు సినిమా అంటే తపన.. అందువల్లే వారు క్లిక్ అవుతున్నారు. సినిమా కోసం నిద్ర పోకుండా బాగా కష్టపడతారు'' అని నిర్మాత 'బన్నీ' వాసు అన్నారు. కిరణ్ అబ్బవరం, కశ్మీర జంటగా మురళి కిషోర్ అబ్బూరు దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వినరో భాగ్యము విష్ణు కథ'. అల్లు అరవింద్ సమర్పణలో 'బన్నీ' వాసు నిర్మించిన ఈ సినిమా ఈ నెల 18న విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో 'బన్నీ' వాసు మాట్లాడుతూ– ''వినరో భాగ్యము విష్ణు కథ'లో వినోదం, ప్రేమ, థ్రిల్లింగ్.. ఇలా అన్ని వాణిజ్య అంశాలున్నాయి. ఈ చిత్రంలో సిగరెట్, మందు తాగే సీన్లు లేవు.. ఇలాంటి సినిమా చేసినందుకు గర్వంగా ఉంది. ఈ చిత్రంతో కిరణ్ అబ్బవరం కెరీర్ మరో మెట్టు పైకి ఎక్కుతుంది'' అన్నారు. ''ఈ సినిమా రషెస్ చూశాక అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుందనే మా నమ్మకం రెట్టింపు అయ్యింది. నా కెరీర్‌లో గుర్తు పెట్టుకునే చిత్రం అవుతుంది'' అన్నారు కిరణ్ అబ్బవరం.

వేసవిలో సామజవరగమన



• శ్రీవిష్ణు

శ్రీవిష్ణు, రెబా మోనికా జాన్ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న తాజా చిత్రం 'సామజవరగమన'. రామ్ అబ్బరాజు డైరెక్టర్. అనిల్ సుంకర సమర్పణలో ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్, హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండా నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి 'సామజవరగమన' అనే టైటిల్ ప్రకటించి, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ''ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న చిత్రం ఇది. షూటింగ్ చివరి దశలో ఉంది. ఈ ఏడాది వేసవిలో మా సినిమాని విడుదల చేస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సహనిర్మాత: బాలాజీ గుత్తా, సంగీతం: గోపీ సుందర్, కెమెరా: రాంరెడ్డి.

కష్టపడితే ఆదరణ లభిస్తుంది - శర్వానంద్



• శ్రీకాంత్, మౌర్య సిద్ధవరం, శర్వానంద్

''మేము (నటీనటులు) ప్యాషన్‌తో, నమ్మకంతో, ఆశతో సినిమా చేస్తాం. కష్టపడి మంచి సినిమా చేస్తే ప్రేక్షకాదరణ లభిస్తుందని నేను నమ్ముతా. మంచి కథతో రూపొందిన 'హ్యాష్ ట్యాగ్ మెన్ టూ' పెద్ద సక్సెస్ కావాలి'' అని హీరో శర్వానంద్ అన్నారు. నరేష్ అగస్త్య, బ్రహ్మాజీ, హర్ష, సుదర్శన్, మౌర్య సిద్ధవరం, రియా సుమన్, ప్రియాంకా శర్మ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'హ్యాష్ ట్యాగ్ మెన్ టూ'. శ్రీకాంత్ జి. రెడ్డి దర్శకత్వంలో మౌర్య సిద్ధవరం నిర్మించారు. ఈ సినిమా టీజర్‌ను శర్వానంద్ రిలీజ్ చేసి, మాట్లాడుతూ– ''నేను, మౌర్య 'రణరంగం' సినిమాలో నటించాం. 'హ్యాష్ ట్యాగ్ మెన్ టూ' కథ నచ్చి, నిర్మించానని మౌర్య చెప్పినప్పుడు హ్యాపీగా అనిపించింది'' అన్నారు. ''నన్ను, కథని నమ్మి ఈ సినిమా నిర్మించిన మౌర్యకి థ్యాంక్స్'' అన్నారు శ్రీకాంత్ జి. రెడ్డి. ''పురుషుల బాధలను చూపించే చిత్రమిది. మహిళలకూ నచ్చు తుంది'' అన్నారు బ్రహ్మాజీ. ''యంగ్ టీమ్‌తో మంచి సినిమా చేశాను'' అన్నారు మౌర్య సిద్ధవరం.

వెళ్లిపోయే.. వెళ్లిపోయే...



• దివ్య, క్రిష్, ఆర్యన్ గౌర

ఆర్యన్ గౌర, మిస్తీ చక్రవర్తి హీరో హీరోయిన్లుగా దివ్యా భావన దర్శకత్వంలో కట్టా చందన నిర్మించిన ఫీల్ గుడ్ లవ్ స్టోరీ ఫిల్మ్ 'ఓ సాథియా'. త్వరలోనే ఈ సినిమా విడుదల కానుంది. ప్రేమికుల రోజు సందర్భంగా ఈ సినిమాలోని బ్రేకప్ సాంగ్ 'వెళ్లిపోయే పాపా వెళ్లిపోయే..'ను దర్శకుడు క్రిష్ విడుదల చేసి, సినిమా సక్సెస్ కావాలని ఆకాంక్షించారు. మ్యూజిక్ డైరెక్టర్ వినోద్‌కుమార్ (విన్ను) స్వరపరచిన ఈ పాటకు భాస్కరభట్ల సాహిత్యం అందించగా, రాహుల్ సిప్లిగంజ్ పాడారు. బాబా భాస్కర్ కొరియోగ్రఫీ చేశారు.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	600	61,032
నిఫ్టీ ▲	159	17,930

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (సోమవారం రాత్రి 11.30 గంటలకు)		
నాస్‌డాక్	11,845	▽ 47
డోజోన్స్	34,006	▽ 240
ఎఫ్‌టీఎస్ఈ 100	7,954	▲ 6
డాక్స్	15,381	▽ 17
హాంగ్‌సెంగ్	3,293	▲ 9
నికాయ్	27,603	▲ 175


•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై		
బంగారం (24 క్యారెట్)	57,018	▽ 1
బంగారం (22 క్యారెట్)	56,790	▽ 42
వెండి (కేజీ)	65,842	▽ 529

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	80.93	84.61
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	86.82	91.33
€	యూరో	ఒకటి	98.66	103.50
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	50.00	75.00
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	55.29	60.12
S$	సింగపూర్ డాలర్	ఒకటి	60.09	64.62
SAR	సౌదీ రియాల్	ఒకటిన్నర	21.07	22.75
UAE D	యూఏఈ దిర్హామ్	ఒకటిన్నర	21.63	23.43
¥	చైనా యువాన్	ఒకటిన్నర	11.02	13.10



టోకు ధరల ఊరట!

జనవరి ద్రవ్యోల్బణం 4.73% ● రెండేళ్ల కనిష్టం ● ఫుడ్ బాస్కెట్ భారమే!

తయారీ: తయారీ ఉత్పత్తులకు సంబంధించి ధరల స్పీడ్ జనవరిలో 2.99 శాతంగా నమోదయ్యింది. డిసెంబర్ 2022లో ఈ రేటు 3.37 శాతం.

ఇంధనం, విద్యుత్: నెలల వారీగా ఈ రేటు 18.09 శాతం నుంచి 15.15 శాతానికి తగ్గింది.

ఫుడ్ బాస్కెట్: ఈ విభాగంలో రేటు జనవరిలో 2.38 శాతంగా ఉంది. 2022 డిసెంబర్‌లో ఈ రేటు 1.25 శాతం క్షీణత (మైనస్)లో ఉంది. పప్పు దినుసుల ధర స్పీడ్ 2.41 శాతంగా ఉంటే, కూరగాయల ధరలు మాత్రం 26.48 శాతం తగ్గాయి.

న్యూఢిల్లీ: టోకు ధరల సూచీ (డబ్ల్యూపీఐ) ఆధారిత ద్రవ్యోల్బణం 2023 జనవరిలో 4.73 శాతంగా (2022 ఇదే నెలతో ధరతో పోల్చి) నమోదయ్యింది. గడచిన రెండు సంవత్సరాల్లో ఇంత తక్కువ స్థాయి టోకు ధరల స్పీడ్ నమోదుకావడం ఇదే తొలిసారి. సూచీలో మెజారిటీ వెయిటేజ్ కలిగిన తయారీ, ఇంధనం, విద్యుత్ ధరలు తగ్గినా, ఫుడ్ ఆర్టికల్స్ బాస్కెట్ మాత్రం పెరిగింది. టోకు ధరల సూచీ వరుసగా ఎనిమిది నెలల నుంచి తగ్గుతూనే వస్తుండడం సానుకూల అంశమైనా, ఆహార ధరల తీవ్రతపై జాగరూకత వహించాల్సిన అవసరం ఉందని నిపుణులు హెచ్చరించారు. 10 నెలల అప్‌ట్రెండ్ తర్వాత నవంబర్, డిసెంబర్‌లో ఆర్‌బీఐకి కేంద్రం నిర్దేశిస్తున్న 6 శాతం లోపు ఉన్న రిటైల్ ద్రవ్యోల్బణం జనవరిలో మళ్లీ 6.52 శాతం పైబడిన విషయాన్ని ఈ సందర్భంగా వారు ప్రస్తావిస్తున్నారు. ఈ సూచీలో ఒక్క ఫుడ్ బాస్కెట్ ధరల స్పీడ్ 5.94 శాతంగా ఉంది. రెపోపై ఆర్‌బీఐ నిర్ణయానికి రిటైల్ ద్రవ్యోల్బణమే ప్రాతిపదిక అయిన సంగతి తెలిసిందే. ఉక్రెయిన్‌పై రష్యా దాడి, క్రూడ్ ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణం తీవ్రత నేపథ్యంలో దీర్ఘకాలంగా 4 శాతంగా ఉన్న రెపో రేటు, మే 4వ తేదీన మొదటిసారి 0.40 శాతం పెరిగింది. జూన్ 8, ఆగస్టు 5, సెప్టెంబర్ 30 తేదీల్లో అరశాతం చొప్పున పెరుగుతూ, 5.9 శాతానికి చేరింది. డిసెంబర్ 7న ఈ రేటు పెంపు 0.35 శాతం ఎగసి 6.25 శాతాన్ని తాకింది. ఈ నెల మొదట్లో మరో పావు శాతం పెరిగి, 6.50 శాతానికి చేరింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

15-2-2023	
విశాఖ	440-00
చిత్తూరు	458-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	414-00
విజయవాడ	414-00
14-2-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	386-00
వరంగల్	388-00

అదానీ గ్రూప్ కంపెనీల ఆడిటింగ్

- అకౌంటెన్సీ సంస్థ గ్రాంట్ థార్న్‌టన్ నియామకం
- ఇన్వెస్టర్ల భరోసాకు ప్రయత్నాలు

న్యూఢిల్లీ: అమెరికన్ షార్ట్‌సెల్లర్ హిండెన్‌బర్గ్ రీసెర్చ్ ఆరోపణలతో చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో ఇన్వెస్టర్లు, నియంత్రణ సంస్థలకు భరోసా కల్పించే చర్యలపై అదానీ గ్రూప్ మరింతగా దృష్టి పెడుతోంది. ఇందులో భాగంగా కొన్ని గ్రూప్ కంపెనీల ఖాతాలను స్వతంత్ర సంస్థతో ఆడిట్ చేయించాలని నిర్ణయించింది. దీని కోసం అకౌంటెన్సీ సంస్థ గ్రాంట్ థార్న్‌టన్‌ను నియమించుకుంది. తాము ఏమీ దాచడం లేదని, చట్టాలన్నింటినీ పాటిస్తున్నామని నియంత్రణ సంస్థలకు తెలియజేయడమే ఈ ఆడిట్ ప్రధాన ఉద్దేశమని సంబంధిత వర్గాలు తెలిపాయి.



ఆర్థిక సంస్థలపై ప్రభావం నిల్: ఎస్అండ్‌పీ

అదానీ గ్రూప్ సంక్షోభ ప్రభావాలు ఇతర ఆర్థిక సంస్థలపై భారీగా ఉండబోవని ఎస్అండ్‌పీ గ్లోబల్ రేటింగ్ ఒక నివేదికలో విశ్లేషించింది.

లాభాల్లోకి అదానీ ఎంటర్‌ప్రైజెస్

క్యూ3లో రూ. 820 కోట్లు

న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ డైవర్సిఫైడ్ దిగ్గజం అదానీ ఎంటర్‌ప్రైజెస్ మూడో త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన అక్టోబర్-డిసెంబర్(క్యూ3)లో నష్టాలను వీడి లాభాల్లోకి ప్రవేశించింది. రూ. 820 కోట్ల నికర లాభం ఆర్జించింది. గతేడాది(2021-22) ఇదే కాలంలో రూ. 12 కోట్ల నికర నష్టం ప్రకటించింది. మొత్తం ఆదాయం సైతం 42 శాతం జంప్‌చేసి రూ. 26,612 కోట్లను అధిగమించింది. అయితే మొత్తం వ్యయాలు 37 శాతం పెరిగి రూ. 26,171 కోట్లను దాటాయి. కంపెనీకి ప్రధానమైన ఇంటిగ్రేటెడ్ రీసోర్స్ మేనేజ్‌మెంట్ విభాగం పన్నుకుముందు లాభం 370 శాతం దూసుకెళ్లి రూ. 669 కోట్లను తాకింది. ఈ బాటలో మైనింగ్, న్యూఎనర్జీ లాభాలు 3 రెట్లు ఎగసినట్లు కంపెనీ పేర్కొంది.

ఫలితాల నేపథ్యంలో అదానీ ఎంటర్‌ప్రైజెస్ షేరు ఎన్ఎస్ఈలో 2 శాతం బలపడి రూ. 1,750 వద్ద ముగిసింది.



groupm

ప్రకటనలపై వ్యయాలు 15 శాతం అప్

- 2023లో రూ. 1.46 లక్షల కోట్లు
- గ్రూప్‌ఎం అంచనాలు



ప్రశాంత్ కుమార్, సీఈఓ (దక్షిణాసియా), గ్రూప్‌ఎం

ముంబై: దేశీయంగా ఈ ఏడాది ప్రకటనలపై వ్యయాలు 15.5% పెరిగి రూ. 1.46 లక్షల కోట్లకు చేరనున్నాయి. 2021తో పోలిస్తే 2022లో పరిశ్రమ 15.7 శాతం వృద్ధి చెందిందని అంచనాలు నెలకొన్నాయి. మీడియా ఏజెన్సీ గ్రూప్‌ఎం ఈ అంచనాలను వెలువరించింది. అత్యంత వేగంగా ఎదుగుతున్న టాప్ 10 మార్కెట్లలో భారత్ కూడా ఒకటిగా ఉండనుందని, అడ్వర్టైజింగ్‌పై వెచ్చించే వ్యయాల విషయంలో ప్రపంచంలోనే ఎనిమిదో స్థానంలో ఉంటుందని గ్రూప్‌ఎం వివరించింది. స్థూల ఆర్థిక అస్థిరతలు, అంతర్జాతీయ పరిణామాలు గత మూడేళ్లుగా ప్రకటనకర్తల వ్యాపారాలు, అడ్వర్టైజింగ్ వ్యయాలపై ప్రభావం చూపాయని సంస్థ సీఈఓ (దక్షిణాసియా) ప్రశాంత్ కుమార్ పేర్కొన్నారు. 2023లో ప్రకటనల వ్యయాలకు టెలికం, బ్యాంకింగ్, ఆర్థిక సేవలు.. బీమా, రిటైల్, ఫిన్‌టెక్, గేమింగ్, ట్రావెల్, పర్యాటకం మొదలైన విభాగాల నుంచి ఊతం లభిస్తుందని గ్రూప్‌ఎం బిజినెస్ ఇంటెలిజెన్స్ హెడ్ పర్వీన్ షేక్ చెప్పారు. ఈ ఏడాది గ్రామీణ ఎకానమీ కూడా పుంజుకోగలదన్నారు. టాప్ మెట్రోలను దాటి ఇతర ప్రాంతాలకూ 5జీ సేవలు విస్తరిస్తుండటం, స్మార్ట్‌ఫోన్లు చౌకగా లభిస్తుండటం తదితర అంశాలూ ప్రకటనకర్తలు అడ్వర్టైజింగ్‌పై మరింతగా వెచ్చించేందుకు దోహదపడగలవన్నారు.

డిజిటల్‌దే పైచేయి..

గ్రూప్‌ఎం అంచనాల ప్రకారం మొత్తం ప్రకటన వ్యయాల్లో సింహభాగం వాటా డిజిటల్ మీడియాదే ఉండనుంది. అత్యంత వేగంగా 20 శాతం వృద్ధితో ఏకంగా 56 శాతానికి చేరనుంది. టీవీ మాధ్యమం వాటా మాత్రం స్వల్పంగా 31 శాతం నుంచి 30 శాతానికి తగ్గనుంది. ప్రింట్ మాధ్యమంలో ప్రకటనలపై వ్యయాలు మరింతగా తగ్గి 11 శాతం (2022లో) నుంచి ఈ ఏడాది 10 శాతానికి పరిమితం కానున్నాయి. విలువపరంగా మాత్రం ప్రింట్‌లో ప్రకటనలు రూ. 13,519 కోట్ల నుంచి రూ. 14,520 కోట్లకు పెరగనున్నాయి.

బోయింగ్ విమానానికి టాటా 'ఫిన్' డెలివరీ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: హైదరాబాద్ ప్లాంటులో తయారు చేసిన తొలి 'వర్టికల్ ఫిన్' భాగాన్ని అమెరికాలోని బోయింగ్ విమానాల తయారీ కేంద్రానికి పంపించినట్లు టాటా బోయింగ్ ఏరోస్పేస్ లిమిటెడ్ (టీబీఏ) వెల్లడించింది. దీన్ని అమెరికాలోని వాషింగ్టన్‌లో ఉన్న బోయింగ్ ప్లాంటుకు డెలివరీ చేస్తారు. అక్కడ బోయింగ్ 737 విమానానికి అమరుస్తారు. నిట్టనిలువుగా ఉండే వర్టికల్ ఫిన్ భాగాన్ని విమానానికి స్థిరత్వాన్నిచ్చేలా ఎయిర్‌క్రాఫ్ట్ తోకపై ఏర్పాటు చేస్తారు. టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్, బోయింగ్ కలిసి టీబీఏను జాయింట్ వెంచర్ సంస్థగా ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. సంక్లిష్టమైన వర్టికల్ ఫిన్ భాగాల తయారీ కోసం టీబీఏ గతేడాదే కొత్త లైన్‌ను ప్రారంభించింది. 14,000 చ.మీ. విస్తీర్ణంలోని టీబీఏ ప్లాంటులో బోయింగ్ ఏహెచ్-64 అపాచీ హెలికాప్టర్లకు కావాల్సిన ఏరో-స్ట్రక్చర్స్ మొదలైన వాటిని తయారు చేస్తున్నారు.



సెన్సెక్స్ లాభం 600 పాయింట్లు

- ప్రపంచ మార్కెట్ల సానుకూలతలు
- ర్యాలీకి అధిక వెయిటేజీ షేర్ల దన్ను
- రెండు రోజుల నష్టాలకు చెక్
- 17,900 పైకి నిఫ్టీ



ముంబై: స్టాక్ మార్కెట్ రెండు రోజుల నష్టాలకు మంగళవారం బ్రేక్ పడింది. బ్యాంకింగ్, ఐటీ, ఫైనాన్స్ షేర్లకు డిమాండ్ నెలకొంది. అధిక వెయిటేజీ రిలయన్స్(2.35%), ఐటీసీ(2.30%) షేర్లు రాణించి సూచీల ర్యాలీకి దన్నుగా నిలిచాయి. ప్రపంచ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందాయి. విదేశీ ఇన్వెస్టర్లు మూడోరోజూ కొనుగోళ్లకే మొగ్గుచూపారు. అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు దిగివచ్చాయి. ఈ అంశాలు దేశీయ మార్కెట్ సెంటిమెంట్‌ను బలపరిచాయి. ఉదయం స్వల్ప లాభాలతో మొదలైన సూచీలు ఆరంభంలో కాస్త తడబడ్డాయి. ఆపై వెంటనే తేరుకొని మార్కెట్ ముగిసే వరకు ఎలాంటి తడబాటు లేకుండా స్థిరమైన ర్యాలీ చేశాయి. ఫలితంగా సెన్సెక్స్ 600 పాయింట్లు పెరిగి 61,032 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో 671 పాయింట్లు బలపడి 61,103 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకింది. నిఫ్టీ 159 పాయింట్లు బలపడి 17,930 వద్ద నిలిచింది. ఒక దశలో 185 పాయింట్లు దూసుకెళ్లి 17,956 వద్ద గరిష్టాన్ని అందుకుంది. విస్తృత స్థాయి మార్కెట్లో అమ్మకాల ఒత్తిడి కొనసాగింది. ఆటో, ఫార్మా, రియల్టీ, మీడియా షేర్లు నష్టాలను చవిచూశాయి.

జాబ్ పాయింట్

డీఎంహెచ్‌వో రంగారెడ్డి జిల్లాలో 49 మెడికల్ ఆఫీసర్ పోస్టులు

రంగారెడ్డి జిల్లా వైద్యారోగ్య అధికారి కార్యాలయం.. జాతీయ ఆరోగ్య మిషన్ కింద ఒప్పంద ప్రాతిపదికన మెడికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 49
» **అర్హత:** ఎంబీబీఎస్ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 18 నుంచి 44 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.52,000 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** ఎంబీబీఎస్ మార్కులు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.దరఖాస్తును రంగారెడ్డి జిల్లా వైద్యారోగ్య అధికారి కార్యాలయానికి వ్యక్తిగతంగా లేదా పోస్టు ద్వారా చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 15.02.2023.
» **వెబ్‌సైట్:** rangareddy.telangana.gov.in

గుంటూరు జిల్లా కారాగార వైద్యశాలలో వివిధ ఉద్యోగాలు

గుంటూరు జిల్లా కారాగార వైద్యశాలలో ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. » **మొత్తం పోస్టుల సంఖ్య:** 3
» **పోస్టుల వివరాలు:** ఫార్మసిస్ట్ గ్రేడ్ 2-1, ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్ 2-1, మేల్ నర్సింగ్ ఆర్డర్లీ-1.
» **అర్హత:** పదో తరగతి,డీఫార్మసీ, బీఫార్మసీ, డీఎంఎల్‌టీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి. **వయసు:** 18 నుంచి 42 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.17,500(ఎంఎన్‌వో ఖాళీలకు రూ.12,000)చెల్లిస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును సూపరింటెండెంట్ కార్యాలయం, జిల్లా జైలు, గుంటూరు చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 16.02.2023.
» **వెబ్‌సైట్:** guntur.ap.gov.in

సూర్యాపేట జిల్లాలో మెడికల్ ఆఫీసర్ పోస్టులు

సూర్యాపేట జిల్లా వైద్యారోగ్య అధికారి కార్యాలయం జాతీయ ఆరోగ్య మిషన్ కింద ఒప్పంద ప్రాతిపదికన మెడికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.» **మొత్తం పోస్టుల సంఖ్య:** 05
» **అర్హత:** బీహెచ్ఎంఎస్,బీఏఎంఎస్ ఉత్తీర్ణులై ఉండాలి. **వేతనం:** నెలకు రూ.35,000 చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** డిగ్రీ మార్కులు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జిల్లా వైద్యారోగ్య అధికారి కార్యాలయం చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 20.02.2023.
» **వెబ్‌సైట్:** suryapet.telangana.gov.in

మెరుగైన ఇంజనీరింగ్‌కు మార్గం.. బిట్‌శాట్

» బిట్స్ క్యాంపస్‌ల్లో బీఈ, బీఫార్మ్, ఎమ్మెస్సీల్లో ప్రవేశాలకు బిట్‌శాట్
» 2023 విద్యాసంవత్సరానికి దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం
» రెండు సెషన్లలో బిట్‌శాట్-2023

దేశంలో నాణ్యమైన ఇంజనీరింగ్ విద్యను అందించడంలో బిర్లా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్(బిట్స్) క్యాంపస్‌లకు మంచి పేరుంది. వీటిలో ఇంటిగ్రేటెడ్ ఫస్ట్ డిగ్రీ ప్రోగ్రామ్‌ల పేరిట బీఈ, బీఫార్మ్, ఎమ్మెస్సీ కోర్సుల్లో ప్రవేశానికి ఏటా బిట్‌శాట్ నిర్వహిస్తున్నారు. ఇందులో సాధించిన స్కోర్ ఆధారంగా బిట్స్ క్యాంపస్‌ల్లో ప్రవేశం లభిస్తుంది. 2023-24 ప్రవేశాలకు సంబంధించి బిట్‌శాట్-2023 దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో.. బిట్‌శాట్‌తో ప్రవేశం లభించే కోర్సులు, ప్రవేశ పరీక్ష ప్యాట్రన్, బెస్ట్ స్కోర్‌కు మార్గాలు..

దేశంలో ఇంజనీరింగ్ విద్యను అందించే ప్రసిద్ధ ఇన్‌స్టిట్యూట్‌ల్లో బిట్స్ ముందు వరుసలో నిలుస్తుంది. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎమినెన్స్, డీమ్డ్ యూనివర్సిటీ హోదా కలిగిన ఈ విద్యాసంస్థలో బీఈ, బీఫార్మ్, ఎమ్మెస్సీ వంటి కోర్సులు పూర్తి చేసుకుంటే.. ఉజ్వల కెరీర్ అవకాశాలు అందుకోవచ్చు. అందుకే వీటిల్లో ప్రవేశానికి నిర్వహించే బిట్‌శాట్‌కు పోటీ కూడా ఎక్కువగానే ఉంటోంది.



బిట్‌శాట్-2023

అర్హతలు

- బిట్‌శాట్‌కు దరఖాస్తు చేసుకునేందుకు 10+2/ఇంటర్మీడియెట్ ఎంపీసీ/బైపీసీ గ్రూప్ సబ్జెక్టులలో ఒక్కో సబ్జెక్ట్‌లో 60 శాతం మార్కులతో.. మొత్తం గ్రూప్ సబ్జెక్ట్‌లలో కలిపి సగటున 75 శాతం మార్కులు సాధించాలి.
- 10+2/ఇంటర్మీడియెట్ 2022లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు, 2023లో ద్వితీయ సంవత్సరం పరీక్షలకు హాజరయ్యే వారు కూడా బిట్‌శాట్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఇంటిగ్రేటెడ్ ఫస్ట్ డిగ్రీ

- బిట్స్ నిర్వహించే బిట్‌శాట్‌లో స్కోర్ ఆధారంగా.. ఈ ఇన్‌స్టిట్యూట్‌కు దేశ వ్యాప్తంగా ఉన్న మూడు క్యాంపస్‌లు(పిలానీ, గోవా, హైదరాబాద్)ల్లో ఇంటిగ్రేటెడ్ ఫస్ట్ డిగ్రీ కోర్సులుగా పేర్కొనే బీఈ, బీఫార్మ్, ఎమ్మెస్సీల్లో ప్రవేశం కల్పిస్తారు.
- పిలానీ క్యాంపస్‌లో..కెమికల్, సివిల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, మెకానికల్, మాన్యుఫ్యాక్చరింగ్ ఇంజనీరింగ్ బ్రాంచ్‌లు అందుబాటులో ఉన్నాయి.
- గోవా క్యాంపస్‌లో.. కెమికల్, సీఎస్ఈ, ఈసీఈ, ఈఈఈ, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, మెకానికల్ బ్రాంచ్‌లు ఉన్నాయి.
- హైదరాబాద్ క్యాంపస్‌లో.. కెమికల్, సివిల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, మెకానికల్ బ్రాంచ్‌లు అందుబాటులో ఉన్నాయి.
- వీటితోపాటు బీఫార్మ్, ఎమ్మెస్సీ కోర్సుల్లో కూడా బిట్స్ క్యాంపస్‌లు ప్రవేశం కల్పిస్తున్నాయి.

నాలుగు విభాగాలు..130 మార్కులు

- బిట్‌శాట్ పరీక్ష పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో నాలుగు విభాగాల్లో మూడు గంటల వ్యవధిలో జరుగుతుంది.
- పార్ట్-1లో ఫిజిక్స్-30, పార్ట్-2లో కెమిస్ట్రీ-30, పార్ట్-3లో ఎ)ఇంగ్లిష్ ప్రొఫిషియన్సీ 10, బి)లాజికల్ రీజనింగ్ 20, పార్ట్-4లో మ్యాథమెటిక్స్/బయాలజీలో 40 ప్రశ్నలు ఉంటాయి. ఇలా మొత్తం 130 ప్రశ్నలకు పరీక్ష జరుగుతుంది.
- నాలుగో విభాగంలో పేర్కొన్న మ్యాథమెటిక్స్ లేదా బయాలజీ సబ్జెక్టుల్లో బీఫార్మసీ విద్యార్థులు ఏదో ఒక సబ్జెక్టును ఎంపిక చేసుకోవచ్చు.
- బీఈ కోర్సుల అభ్యర్థులు మాత్రం తప్పనిసరిగా మ్యాథమెటిక్స్ సబ్జెక్టుతోనే పరీక్ష రాయాల్సి ఉంటుంది.
- పరీక్ష వ్యవధి మూడు గంటలు. ఒక్కో ప్రశ్నకు మూడు మార్కులు చొప్పున మొత్తం 130 ప్రశ్నలతో 390 మార్కులకు పరీక్ష జరుగుతుంది. నెగెటివ్ మార్కింగ్ విధానం కూడా ఉంది. ప్రతి తప్పు సమాధానానికి ఒక మార్కును తగ్గిస్తారు.

అదనంగా 12 ప్రశ్నలు

బిట్‌శాట్‌లో మరో ప్రత్యేకత.. పరీక్షకు కేటాయించిన మూడు గంటల వ్యవధిలో అన్ని ప్రశ్నలను పూర్తిచేసిన అభ్యర్థులకు..అదనంగా మరో 12 ప్రశ్నలకు సమాధానం ఇచ్చే అవకాశం కల్పిస్తారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్ లేదా బయాలజీ, లాజికల్ రీజనింగ్ నుంచి మూడు ప్రశ్నలు చొప్పున ఇస్తారు.

రెండు సెషన్లు

బిట్‌శాట్‌ను రెండు దశలుగా(సెషన్లు)నిర్వహిస్తారు. అభ్యర్థులు రెండు సెషన్లకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఫలితంగా విద్యార్థులకు ఏ సెషన్‌లో మంచి స్కోర్ వస్తుందో..దాన్ని మెరిట్ జాబితా రూపకల్పనలో పరిగణనలోకి తీసుకుంటారు. ఇలా రెండు సెషన్లకు హాజరవ్వాలనుకునే అభ్యర్థులు కచ్చితంగా తొలి సెషన్‌కు దరఖాస్తు చేసుకోవాల్సిందే.

మెరిట్ జాబితా ఇలా

మెరిట్ జాబితా రూపకల్పనలో బిట్‌శాట్‌లో పొందిన స్కోర్‌ను.. అభ్యర్థులు దరఖాస్తు సమయంలో పేర్కొన్న క్యాంపస్ ప్రాథమ్యాలను, ఇంజనీరింగ్ బ్రాంచ్ ప్రాథమ్యాలను పరిగణనలోకి తీసుకుంటారు. దానికి అనుగుణంగా సీట్ల కేటాయింపు చేస్తారు.

బోర్డ్ టాపర్స్‌కు నేరుగా ప్రవేశం

బిట్స్ ప్రవేశాల పరంగా మరో ప్రత్యేకత.. ఆయా రాష్ట్రాల బోర్డ్‌ల పరిధిలో ఇంటర్మీడియెట్, తత్సమాన కోర్సుల్లో స్టేట్ టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులకు బిట్‌శాట్‌కు హాజరు నుంచి మినహాయింపు లభిస్తుంది. ఈ బోర్డ్ టాపర్స్ నేరుగా ఇంటిగ్రేటెడ్ ఫస్ట్ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశం పొందే వీలుంది. ఈ విధానానికి కూడా విద్యార్థుల నుంచి ఎంతో ఆదరణ లభిస్తోంది.

బోధన విధానం

బిట్స్ క్యాంపస్‌లలో అడ్మిషన్ పొందిన విద్యార్థులకు కోర్సు కాల వ్యవధిలో విస్తృత నైపుణ్యాలు అందుకునే అవకాశం లభిస్తుంది. ఆయా కోర్సులకు సంబంధించి బిట్స్ ప్రత్యేక కరిక్యులంను రూపొందించింది. విద్యార్థుల్లో ప్రాక్టికల్ అప్రోచ్ పెరిగే విధంగా దీన్ని సిద్ధం చేశారు. బీఈ కోర్సుల్లో చేరిన విద్యార్థులు.. కోర్సు వ్యవధిలో రెండుసార్లు ప్రాక్టీస్ స్కూల్-1,ప్రాక్టీస్ స్కూల్-2 పేరుతో.. పరిశ్రమల్లో రీసెర్చ్ కార్యకలాపాల్లో పాల్గొనాల్సి ఉంటుంది.

మైనర్ ప్రోగ్రామ్స్

కోర్ సబ్జెక్ట్‌లే కాకుండా.. విద్యార్థులకు ఇతర అంశాల్లోనూ అవగాహన కల్పించే విధంగా మైనర్ ప్రోగ్రామ్స్ విధానాన్ని బిట్స్ అమలు చేస్తోంది. ఫైనాన్స్, అకౌంటింగ్, లిటరేచర్, హ్యుమానిటీస్ వంటి పలు సబ్జెక్ట్‌లు అందుబాటులో ఉన్నాయి. వీటిని పూర్తిచేసిన అభ్యర్థులకు సర్టిఫికెట్ ఇవ్వడం మరో విశేషం.

300కు పైగా స్కోర్

బిట్‌శాట్ ద్వారా దేశంలోని మూడు బిట్స్ క్యాంపస్‌లలో మూడు వేల సీట్లు అందుబాటులో ఉన్నాయి. వీటిలో ప్రవేశానికి ఏటా దాదాపు 60 వేల మంది పోటీ పడుతున్నట్లు సమాచారం. దీంతో..పరీక్షలో 300కు పైగా మార్కులు సాధిస్తేనే తుది విజేతల జాబితాలో నిలిచే అవకాశం ఉంటుంది.

ఇతర ఇన్‌స్టిట్యూట్‌లు

బిట్‌శాట్ స్కోర్ ఆధారంగా దేశంలోని పలు ప్రైవేటు యూనివర్సిటీలు, ఇన్‌స్టిట్యూట్‌లు కూడా బీటెక్‌లో ప్రవేశం కల్పిస్తున్నాయి. ఇప్పటికే ఎస్ఐటీ యూనివర్సిటీ, బిట్స్‌తో ఒప్పందం చేసుకుంది. ఇది కాకుండా దాదాపు వంద వరకు ప్రముఖ ప్రైవేటు ఇన్‌స్టిట్యూట్‌లు తమ ప్రవేశ ప్రక్రియకు బిట్‌శాట్ స్కోర్‌ను ప్రామాణికంగా తీసుకుంటున్నాయి.

బెస్ట్ స్కోర్‌కు మార్గాలు

జాతీయ స్థాయిలో వేల సంఖ్యలో విద్యార్థులు పోటీ పడే బిట్‌శాట్‌లో బెస్ట్ స్కోర్ సాధించేందుకు దృష్టి సారించాల్సిన అంశాలు..

బేసిక్ కాన్సెప్ట్స్..ఫస్ట్

- బిట్‌శాట్ అభ్యర్థులు తొలుత బేసిక్ కాన్సెప్ట్‌లపై పూర్తి అవగాహన పెంచుకోవాలి. ఈ పరీక్ష కూడా జేఈఈ స్థాయి క్లిష్టతతో ఉంటోంది. ప్రశ్నలన్నీ దాదాపుగా అప్లికేషన్ ఓరియెంటేషన్‌తో ఉంటున్నాయి. దీంతో అభ్యర్థులు ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథమెటిక్స్ బేసిక్స్‌పై పూర్తిస్థాయి అవగాహన పెంచుకోవాలి. జేఈఈ ప్రిపరేషన్‌తో అనుసంధానం చేసుకుంటూ.. చదవడం వల్ల ఒకే సమయంలో రెండు పరీక్షలకు ప్రిపరేషన్ సాగించొచ్చు. బేసిక్స్‌పై పట్టు సాధించడంతోపాటు విద్యార్థులు నిర్దిష్టంగా కొన్ని వ్యూహాలు అనుసరిస్తే.. బిట్‌శాట్‌లో మెరుగైన ప్రతిభ కనబరిచే అవకాశముంది.
- ప్రతి సబ్జెక్ట్‌లోనూ ముఖ్యమైన ఫార్ములాలు, కాన్సెప్ట్‌లకు షార్ట్‌కట్ మెథడ్స్‌తో సొంత నోట్స్ రూపొందించుకోవాలి. ఇది రివిజన్ సమయంలో ఎంతో అనుకూలంగా ఉంటుంది.
- కెమిస్ట్రీలో ముఖ్యంగా ఆర్గానిక్ కెమిస్ట్రీలో కెమికల్ రియాక్షన్స్‌ను ఒక జాబితాగా రూపొందించుకోవాలి.
- ఫిజిక్స్‌లో.. వర్క్ అండ్ ఎనర్జీ, న్యూటన్స్ లా, కరెంట్ ఎలక్ట్రిసిటీ, హీట్ అండ్ థర్మోడైనమిక్స్, మ్యాగ్నటిజం అండ్ మ్యాగ్నటిక్ ఎఫెక్ట్ ఆఫ్ కరెంట్, ఎలక్ట్రిక్ కరెంట్ యూనిట్లలో ముఖ్య అంశాలతో నోట్స్ రూపొందించుకోవాలి.
- మ్యాథమెటిక్స్‌లో.. హైపర్‌బోలా, పారాబోలా, రెక్టాంగులర్ పారాబోలా, ట్రిగ్నోమెట్రీ, వెక్టార్స్, 3-డి, ఇంటెగ్రల్ కాలిక్యులస్ అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి.

పార్ట్-3కి ప్రత్యేకంగా

- ఇతర ఇంజనీరింగ్ ఎంట్రెన్స్ టెస్ట్‌లతో పోలిస్తే.. బిట్‌శాట్ ప్రత్యేకం పార్ట్-3 అని చెప్పొచ్చు. ఈ విభాగంలో ఇంగ్లిష్ ప్రొఫిషియన్సీ, లాజికల్ రీజనింగ్ అంశాల నుంచి ప్రశ్నలు ఉంటాయి. కేవలం అభ్యర్థుల్లోని సబ్జెక్ట్ నైపుణ్యాలను పరీక్షించడమే కాకుండా.. లాంగ్వేజ్, తులనాత్మక పరిశీలన సామర్థ్యాన్ని పరీక్షించేందుకు ఈ విభాగాన్ని పొందుపర్చారు. పదో తరగతి స్థాయిలో ఇంగ్లిష్ గ్రామర్, వొకాబ్యులరీపై పట్టుంటే.. 25 ప్రశ్నలకు సులువుగా సమాధానం ఇవ్వొచ్చు.

బిట్‌శాట్-2023 ముఖ్య సమాచారం

సెషన్ 1 ముఖ్య తేదీలు

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: ఏప్రిల్ 9, 2023
- టెస్ట్ సెంటర్ కేటాయింపు: ఏప్రిల్ 26, 2023
- టెస్ట్ తేదీ, స్లాట్ బుకింగ్ సదుపాయం: ఏప్రిల్ 27- మే 8, 2023
- హాల్‌టికెట్ డౌన్‌లోడ్ సదుపాయం: మే 10 నుంచి పరీక్ష తేదీ వరకు
- బిట్‌శాట్-2023 సెషన్-1 పరీక్ష తేదీలు: మే 21 -మే 26, 2023

సెషన్ 2 ముఖ్య తేదీలు

- బిట్‌శాట్-2023 సెషన్-2 దరఖాస్తు తేదీ: మే 22 - జూన్ 12, 2023
- బిట్‌శాట్-2023 సెషన్-2 పరీక్ష తేదీలు: జూన్ 18 - జూన్ 22, 2023
- అడ్మిషన్ జాబితా ప్రకటన: జూలై 1, 2023
- తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు: బిట్స్ పిలానీ-హైదరాబాద్ క్యాంపస్, హైదరాబాద్, రాజమండ్రి, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం.
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: https://www.bitsadmission.com/fdmain.aspx

నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

- 2,201 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు
- ప్రైవేటుతో మిలాఖత్ అయితే చర్యలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం నుంచి ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేశారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఇంటర్ విద్య కమిషనర్ నవీన్ మిట్టల్ అన్ని జిల్లాల అధికారులను ఆదేశించారు. గతంలో మాదిరి ప్రైవేటు కాలేజీలతో లావాదేవీలు జరిపితే సహించేది లేదని ఆయన హెచ్చరించారు. రాష్ట్ర ప్రధాన కార్యాలయం ఎప్పటికప్పుడు పరీక్షలపై సమాచారం తెప్పించుకుంటుందని, విద్యార్థులు కూడా సమస్య ఉంటే తక్షణమే తెలియ జేసేలా కంట్రోల్ రూంను ఏర్పాటు చేశామని మిట్టల్ తెలిపారు. కేవలం విద్యార్థులకుకలిగే అసౌకర్యాలను అప్పటికప్పుడే పరిష్కరించేందుకు అన్ని జిల్లాల్లో యంత్రాంగం పని చేస్తుందని స్పష్టం చేశారు.

ప్రాక్టికల్స్‌కు 3,65,931 విద్యార్థులు

రాష్ట్ర వ్యాప్తంగా 3,65,931 మంది ఇంటర్ ప్రాక్టికల్స్‌కు హాజరవుతున్నారు. వీరిలో 94,573 మంది ఒకేషనల్ పరీక్షకు హాజరవుతున్నారు. మొత్తం 2,201 ప్రాక్టికల్ పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రాక్టికల్ పరీక్షలను జంబ్లింగ్ విధానంలో నిర్వహించాలని గత కొన్నేళ్లుగా డిమాండ్ వస్తోంది. కానీ ఈ ఏడాది వరకూ విద్యార్థి చదివే కాలేజీల్లోనే నిర్వహిస్తున్నట్టు అధికారులు తెలిపారు. జంబ్లింగ్ లేకపోవడం వల్ల ప్రైవేటు కాలేజీలు ప్రాక్టికల్స్ నిర్వహించకుండా, ఇన్విజిలేటర్లను ప్రభావితం చేసి, ఎక్కువ మార్కులు వేయించుకుంటున్నారనే ఫిర్యాదులొస్తున్నాయి. ఈ ఏడాది ఇలాంటి వాటికి ఆస్కారం ఇవ్వకూడదని ఇంటర్‌బోర్డ్ స్పష్టమైన ఆదేశాలిచ్చింది. ఇన్విజిలేటర్ల ఎంపికలోనూ ట్రాక్ రికార్డును పరిశీలించి మరీ ఎంపిక చేసినట్టు అధికారులు చెబుతున్నారు.

ప్రత్యేక కంట్రోల్ రూం ఏర్పాటు



విద్యార్థులను ఏ కాలేజీ అయినా ఇబ్బంది పెడితే కఠిన చర్యలు తీసుకుంటాం. ఏ సమస్య తలెత్తినా విద్యార్థులు హైదరాబాద్‌లోని ఇంటర్ బోర్డ్‌లోని కంట్రోల్ రూంకు ఫోన్ చేయొచ్చు. తక్షణమే స్పందిస్తాం. విద్యార్థులు, కాలేజీ ప్రిన్సిపాళ్ల సందేహాలను నివృత్తిచేసేందుకు ఈ కంట్రోల్ రూంను వాడుకోవచ్చు. 040 –24600110 ఫోన్‌నెంబర్‌తో పాటు, helpdesk&ie@telangana. gov. inను సంప్రదిస్తే సమస్యను తక్షణమే పరిష్కరిస్తాం.

– జయప్రదాభాయ్ (కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్, ఇంటర్ బోర్డ్)

పద్మవ్యూహంలో నాటో!

బెడిసికొడుతున్న రష్యాను నిలువరించాలన్న ఆరాటం → ఉక్రెయిన్‌కు ఆయుధ సాయం విషయంలో సభ్య దేశాల మధ్య విభేదాలు → ఇప్పటికే యుద్ధ ట్యాంకుల పంపిణీపై అమెరికా, జర్మనీ కీచులాట → తాజాగా ఉక్రెయిన్‌కు ఇస్తే యుద్ధం విస్తృతం అవుతుందని నాటో అనుమానం →



దొడ్డ శ్రీనివాస్‌రెడ్డి

ఉక్రెయిన్ యుద్ధం విషయంలో నాటో దేశాల మధ్య మనస్పర్థలు తలెత్తుతున్నాయా? ఉక్రెయిన్ మరో అఫ్గానిస్తాన్‌గా మారుతుందేమోననే అనుమానాలు నాటో కూటమిలో కలుగుతున్నాయా? ప్రస్తుతం రష్యా, ఉక్రెయిన్ మధ్య జరుగుతున్న సంప్రదాయక యుద్ధం ముదిరి నాటో దేశాలు కూడా ప్రభావితమై భీకర యుద్ధంగా మారుతుందా? ఉక్రెయిన్ పద్మవ్యూహంలో పీకల దాకా చిక్కుకుపోయామనే సందేహం నాటో దేశాల అధినేతల్లో మొదలవుతోందా? ఇటీవల జరిగిన పరిణామాలను పరిశీలిస్తే ఈ అనుమానాలు తలెత్తుతున్నాయి. రష్యాను నిలువరించేందుకు ఉక్రెయిన్‌కు యుద్ధ ట్యాంకులు సరఫరా చేసే విషయంలో నాటో కూటమిలో చెలరేగిన పొరపొచ్చాలను గమనిస్తే కూటమి మధ్య స్నేహ సంబంధాలు సజావుగా సాగడం లేదని అర్థం అవుతోంది. ఉక్రెయిన్‌కు సాయం అందించడంలో తామంతా ఒక్కతాటిపై ఉన్నట్లు పైకి చెబుతున్నా నాటో దేశాధినేతల మధ్య అనేక అంశాలపై విభేదాలు ఉన్నట్లు బయటపడింది.

ఒత్తిడికి తలొగ్గిన అగ్రరాజ్యం...

నాటో కూటమిలో విభేదాలు తలెత్తే పరిస్థితులను గమనించి అమెరికా తలొగ్గక తప్పలేదు. ఉక్రెయిన్ బెటాలియన్‌కు సరిపడా 31 అబ్రహం ట్యాంకులను పంపడానికి అమెరికా అధ్యక్షుడు బైడెన్ అయిష్టంగానే అంగీకరించారు. ఆ వెంటనే జర్మనీ సహా ఇతర యూరప్ దేశాలన్నీ తమ వద్ద ఉన్న లెపర్డ్–2 ట్యాంకులను ఉక్రెయిన్‌కు పంపుతున్నట్లు ప్రకటించాయి. నాటో కూటమిలో చీలికలు తప్పవని ఎదురుచూసిన రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు నిరాశే ఎదురయ్యింది. ఇప్పుడు జరుగుతోంది రష్యా–ఉక్రెయిన్ యుద్ధం కాదని... అమెరికా తెరవెనుక ఉండి నిర్వహిస్తున్న యుద్ధమని అమెరికాలోని రష్యా దౌత్యవేత్త అనతోలి టానోల్ వ్యాఖ్యానించారు.

యుద్ధవిమానాల కోసం ఉక్రెయిన్ పట్టు

సుదీర్ఘ చర్చలు, మంతనాల తర్వాత ఉక్రెయిన్‌కు ట్యాంకులు సరఫరా చేయడానికి నాటో కూటమి అంగీకరించిందో లేదో ఇప్పుడు తమకు యుద్ధవిమానాలు కూడా కావాలని ఉక్రెయిన్ సరికొత్త డిమాండ్‌ను తెరపైకి తెచ్చింది. భూతలంపై ఉన్న తమ సైనిక బలగాల రక్షణకు గగనతలంలో యుద్ధ విమానాల అవసరం ఉందని ఉక్రెయిన్ అధినేతలు నాటోను కోరుతున్నారు. నాలుగో తరానికి చెందిన ఎఫ్16, యూరోఫైటర్స్, టోర్నడో, ఫ్రెంచ్ రఫేల్ యుద్ధవిమానాల అవసరాన్ని ఉక్రెయిన్ అధినేతలు బహిరంగంగానే చెబుతున్నారు. రష్యా దగ్గర నాలుగోతరం యుద్ధవిమానాలు 772 ఉంటే తమ దగ్గర సోవియెట్ యూనియన్ నాటి పాతబడిన 69 విమానాలే ఉన్నాయని... వాటితో రష్యాను నిలువరించడం కష్టమని ఉక్రెయిన్ రక్షణ శాఖ సలహాదారు యూరి సక్ చెబుతున్నారు. ట్యాంకుల పంపిణీపై అంగీకారానికి రావాడానికి తల బొప్పికట్టి ఇప్పుడిప్పుడే ఊపిరి పీల్చుకుంటున్న నాటో దేశాలు ఈ కొత్త డిమాండ్‌తో బిత్తరపోయాయి. ఎఫ్16 విమానాలను ఉక్రెయిన్‌కు కేటాయిస్తున్నారా అని ఓ విలేఖరి అడిగినప్పుడు అమెరికా అధ్యక్షుడు బైడెన్ 'నో'అని ఒకమాటలో కొట్టిపారేశారు. ఇది అర్థంపర్థంలేని డిమాండ్ అని జర్మనీ చాన్స్‌లర్ ఒలాఫ్ స్కోల్జ్ స్పష్టం చేశారు. అయితే ఈ యుద్ధవిమానాల కోసం ఉక్రెయిన్ చేసిన వినతిపట్ల కొన్ని నాటో దేశాలు సానుకూలంగా స్పందించాయి. ఎఫ్16 యుద్ధవిమానాల కోసం ఉక్రెయిన్ అధికారికంగా కోరితే సానుకూలంగా పరిశీలిస్తామని నెదర్లాండ్ విదేశాంగ మంత్రి హొప్కి హోక్‌స్ట్రా అన్నారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మెక్రాన్ కూడా తమ దేశ యుద్ధవిమానాలను ఉక్రెయిన్‌కు పంపడానికి సిద్ధమన్నారు. లిథువేనియా అధ్యక్షుడు గిటినస్ న్యూసెథా కూడా సానుకూలంగా స్పందించారు. అయితే యుద్ధ విమానాల అంశం నాటో కూటమిలో మరోసారి విభేదాలకు దారితీయవచ్చని దౌత్యవేత్తలు అనుమానిస్తున్నారు.



అబ్రహం ట్యాంకు



లెపర్డ్–2

అసలు భయం ఇదీ..

రష్యా దురాక్రమణకు వ్యతిరేకంగా ఉక్రెయిన్‌కు అండగా నిలిచిన నాటో కూటమిలో ఆయా దేశాలు అందిస్తున్న సాయంపై అంతర్మథనం జరుగుతోంది. ఏడాదిపాటు రష్యా లాంటి అతిశక్తివంతమైన దేశాన్ని నిలువరించగలిగిన ఉక్రెయిన్... ఇప్పుడు ఆత్మవిశ్వాసంతో మరింత దూకుడుగా వెళ్లి యుద్ధాన్ని రష్యా భూభాగంలోకి తీసుకువెళుతుందేమోనన్న అనుమానాలు కూటమి దేశాల్లో మొదలయ్యాయి. రష్యా ఆక్రమించుకున్న క్రిమియా వంటి భూభాగాన్ని తిరిగి స్వాధీనం చేసుకోవాలని ఉక్రెయిన్ ఉవ్విళ్లూరుతున్న విషయం ఆ దేశ నాయకుల ప్రకటనల్లో అర్థమవుతోంది. నాటో అందిస్తున్న ఆయుధ సంపత్తితో ఉక్రెయిన్ కనుక ఇలాంటి దుస్సాహసం చేస్తే అది యుద్ధం విస్తృతరూపం దాల్చడానికి దారితీస్తుందని అమెరికా, జర్మనీ వంటి దేశాలు భయపడుతున్నాయి. తామిచ్చే సాయం రష్యా దురాక్రమణలను అడ్డుకోవడానికి ఉక్రెయిన్ ఉపయోగించుకోవాలని, ఇది శ్రుతి మించితే యుద్ధం తమ సరిహద్దుల వరకూ వచ్చే ప్రమాదం ఉందని నాటో దేశాలు ముఖ్యంగా రష్యా సరిహద్దుగా ఉన్న యూరప్ దేశాలు ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి. ఇప్పటికే ఉక్రెయిన్‌కు అందిస్తున్న సాయంపై ఆయా దేశాల ప్రజల్లో కొంత అసహనానికి దారి తీస్తుందని సర్వేలు చెబుతున్నాయి. మరోవైపు ఉక్రెయిన్ కనుక తమ భూభాగాలను టార్గెట్ చేయడానికి ఉపయోగపడే యుద్ధవిమానాలు, క్షిపణి ప్రయోగ యంత్రాల వంటివి అందిస్తే నాటో హద్దు మీరుతున్నట్లుగా భావించాల్సి వస్తుందని పుతిన్ సహా రష్యా నేతలు హెచ్చరిస్తున్నారు. తమ పట్టణాలపై దాడి చేసే ఆయుధ సంపత్తిని నాటో గనక ఉక్రెయిన్‌కు అందిస్తే తీవ్ర రూపంలో ప్రతిఘటిస్తామని... దీనివల్ల యుద్ధం స్వరూపం మారే ప్రమాదం ఉందని రష్యా దౌత్యాధికారి గావ్‌రిలోవ్ హెచ్చరించారు.

ట్యాంకులపై గొడవ

ఉక్రెయిన్ కోరిన యుద్ధ ట్యాంకులు అందించడంపై వారాల తరబడి సాగిన మంతనాలు ఎట్టకేలకు ఓ కొలిక్కి వచ్చి నాటో దేశాల మధ్య అంగీకారం కుదిరింది. ఉక్రెయిన్‌కు సమీపాన ఉన్న యూరప్ దేశాలు ట్యాంకులు సరఫరా చేయాలని అమెరికా కోరుకుంది. అక్కడి భూఉపరితల పరిస్థితులకు ఐరోపా ట్యాంకులు సరితూగుతాయి కాబట్టి అయా దేశాలే ట్యాంకులు పంపిణీ చేయాలని అమెరికా వాదించింది. కానీ యూరప్‌లోని నాటో దేశాలు ముఖ్యంగా జర్మనీ అందుకు అంగీకరించలేదు. నాటో కూటమి సభ్యుల మధ్య అధికారికంగా జరిగిన అనేక సమావేశాలు ఎలాంటి నిర్ణయం తీసుకోలేకపోయాయి. అమెరికా ముందుగా ట్యాంకులు పంపేందుకు ఒప్పుకుంటేనే తాము కూడా సిద్ధమవుతామని జర్మనీ తేగేసి చెప్పింది. అమెరికా తన దగ్గరున్న అధునాతన అబ్రహం ట్యాంకులను ఉక్రెయిన్‌కు అందజేయడానికి అంగీకరిస్తేనే తాము లెపర్డ్–2 ట్యాంకులు ఇవ్వడానికి ఒప్పుకుంటామని జర్మనీ చాన్స్‌లర్ ఒలాఫ్ స్కోల్జ్ పట్టుబట్టారు. అమెరికా భాగస్వామ్యం లేకుండా తాము ట్యాంకులు పంపితే రష్యా తన ఆగ్రహాన్ని తమపై గురిపెడుతుందన్న భయాన్ని ఆయన వ్యక్తం చేశారు. ఈ అంశంపై అమెరికా అధ్యక్షుడు బైడెన్ తెరవెనుక చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. యూరప్‌లోని నాటో దేశాలు స్పెయిన్, పోలాండ్, ఫిన్‌లాండ్, నార్వే తమ వద్ద ఉన్న లెపర్డ్–2 ట్యాంకులను పంపడానికి సిద్ధంగా ఉన్నా జర్మనీ అనుమతి లేకుండా వాటిని ఇతర దేశాలకు పంపకూడదన్న ఒప్పందాన్ని అనుసరించి ముందడుగు వేయలేని పరిస్థితి. అబ్రహం ట్యాంకులు అత్యాధునికమైనవని, వాటిని ఉపయోగించడం కష్టసాధ్యమని, వాటి తయారీకి అనేక నెలలు పడుతుందని, రిపేర్లు చేయడం ఉక్రెయిన్‌కు సాధ్యం కాదని అమెరికా అధినేతలు బహిరంగంగా వాదిస్తూ వచ్చారు. పెంటగాన్ అధికారి కాలిన్ హెబ్ కాల్, అమెరికా జాతీయ భద్రతా దళ ప్రతినిధి జాన్ కిర్బీ ఈ వాదనలు ముందుకు తెచ్చారు. అయినా కూడా జర్మనీ ససేమిరా అంది.

సైబర్ టిప్స్‌లో నా..టు హిట్టు!

సైబర్ నేరాలపై అవగాహన కోసం పాటను పేరడీగా వాడుతున్న పోలీసులు

సాక్షి, హైదరాబాద్: సైబర్ నేరాలపై అవగాహన కల్పించేందుకు పోలీసులు ఇటీవల కాలంలో ప్రముఖ హీరోల డైలాగ్స్, సినిమాల్లోని పంచ్ డైలాగులను వాడటం పరిపాటిగా మారింది. అదే ట్రెండ్ కొనసాగిస్తూ ఇప్పుడు జనంలోకి బాగా వెళ్లిన పాటలను సైతం వాడుతున్నారు. ఇదే కోవలో ఆర్ఆర్ఆర్ సినిమాలోని పాట 'నాటు..నాటు'ను పేరడీ చేస్తూ సైబర్ నేర నియంత్రణకు ఢిల్లీ పోలీసులు వాడారు. 'సే న–టు...షేరింగ్ ఓటీపీ, సే న–టు...షేరింగ్ క్రెడిట్ కార్డ్ డీటెయిల్స్, సే న–టు..క్లికింగ్ ఆన్ సస్పీషియస్ లింక్స్' పోస్టును సైబర్‌దోస్త్ అనే ట్విట్టర్ అకౌంట్‌లో పోస్టు చేశారు. దీన్ని ఏడు రోజుల్లోనే 42 వేల మంది చూశారు. అదేవిధంగా.. రాజస్తాన్ పోలీసులు సైతం ఈ పాటను 'సే..నో..టు..నో..టు..నో..టు.. డ్రింకింగ్ వైల్ డ్రైవింగ్' అని మార్చారు. జైపూర్ పోలీసుల అధికారిక ట్విట్టర్ ఖాతాలో పెట్టిన ఈ పోస్టును ఇప్పటి వరకు 33 వేల మంది చూశారు.

వ్యవసాయ వర్సిటీలో కౌన్సెలింగ్ వాయిదా

ఈనెల 21, 22 తేదీల్లో కౌన్సెలింగ్

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బుధ, గురువారాల్లో నిర్వహించాల్సిన వెటర్నరీ, అగ్రికల్చర్, హార్టికల్చర్ కోర్సుల(బైపీసీ స్ట్రీం) ప్రవేశాల చివరి కౌన్సెలింగ్ వాయిదా పడింది. ఈ మేరకు వర్సిటీ రిజిస్ట్రార్ సుధీర్‌కుమార్ వెల్లడించారు. కౌన్సెలింగ్‌ను తిరిగి ఈ నెల 21,22 తేదీల్లో నిర్వహిస్తామని తెలిపారు.

మధ్యలో కాలేజీ మారడం కుదరదు

అధ్యాపకులకు జేఎన్టీయూహెచ్ అడ్డుకట్ట

సాక్షి, హైదరాబాద్: సెమిస్టర్ మధ్యలో, విద్యా సంవత్సరం పూర్తవ్వకుండా అధ్యాపకులు ఒక కాలేజీ నుంచి వేరొక కళాశాలకు మారడాన్ని జవహర్‌లాల్ సాంకేతిక విశ్వవిద్యాలయం నిషేధించింది. ఇలా చేస్తే బ్లాక్‌లిస్ట్‌లో పెడతామని హెచ్చరించింది. జేఎన్టీయూ అనుబంధ కాలేజీల్లో సెమిస్టర్ పూర్తయ్యేవరకు అధ్యాపకులు ఒకే కళాశాలలో కొనసాగాలని సూచించింది. ఈ మేరకు జేఎన్టీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ హుస్సేన్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. అధ్యాపకులు కాలేజీ నుంచి మరో కళాశాలకు మారాలనుకుంటే 2 నెలల ముందుగా నోటీసు ఇవ్వాలని...వర్సిటీకి సమాచారమివ్వాలని అందులో పేర్కొన్నారు. తరచుగా మారే ఫ్యాకల్టీని బ్లాక్‌లిస్ట్‌లో పెడతామని స్పష్టం చేశారు. దీనిపై ఉద్యోగుల అసోసియేషన్ నేత సంతోష్ కుమార్ స్పందిస్తూ.. ముందుగా ఉద్యోగుల నెలవారీ జీతాల చెల్లింపుపైనా జేఎన్టీయూ దృష్టి సారించాలని కోరారు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G., Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.